# ఆరె జానపద గాథలు



డా. పేర్వారం జగన్నాథం



# ఆరె జానపద గాథలు

సంగ్రహణ – అనుసృజన

డాక్టర్ పేర్వారం జగన్నాథం

ప్రొఫెసర్–తెలుగు శాఖ

కాకతీయ విశ్వవిద్యాలయం

వరంగల్లు – ఆం. ప్ర.

ప్రచురణ

ఆరె జానపద వాఙ్మయ పరిశోధక మండలి

వరంగల్లు

ముఖపత్ర రచన : శ్రీ శీలా వీర్రాజు

ముఖపత్రం మీది ఛాయాచిత్రం :

డా॥ పేర్వారం జగన్నాథం

దూదాటి ఉపేందర్

పేర్వారం శ్రీనాథ్ (నిలుచున్నవారు)

398.21

A.C.No. 96147

C18087

వెల : రు. 40/-

(సభ్యులకు రు. 20/- మాత్రమే)

ప్రతులకు :

పేర్వారం అమృతాబాయి

1/705/5-1-C, మిథిలానగర్

హనుమకొండ - వరంగల్లు జిల్లా

ఆంధ్రప్రదేశ్

# AARE JANAPADA GATHALU

(A Collection of Folk Tales)

Compilator & Transcreator

Dr. PERVARAM JAGANNADHAM
Professor of Telugu
Kakatiya University, Warangal - A. P.

Publishers

**Aare Janapada Vangmaya Parishodhaka Mandali**
WARANGAL

**1986**

Publication No. 1

Copies: 1000

First Edition:

Akshaya Vyasa Poornima
D/ 21-7-1986

@ Author

Price: Rs. 40/-
(Rs. 20/- For Members only)

Printed at:

Lakshmi Printing Press
Chowrastha - Hanamkonda

Cover Printed at:

Print Crafts
Kachiguda - Hyderabad

# అంకితం

నా-యనమ్మ

స్వర్గీయ

## పేర్వారం బుచ్చమ్మ

పాదపద్మములపై

భక్తితో

సమర్పితం

## నాయనమ్మా!

నాది అత్యాశే అనుకో లేక దురాశే అనుకో. అంతకన్న అజ్ఞానమంటే బాగుంటుందేమో. నేను ఎప్పుడూ నీవు చనిపోకూడదని కోరుకునేవాణ్ణి. నీవు చనిపోతావని ఊహించడం కూడ నాకు కష్టంగానే ఉండేది. నా కళ్ల ముందటే కొందరు ముసలివాళ్లు చనిపోతుంటేచూసి మా నాయనమ్మకూడ ఇట్లాగే చనిపోతే ఎట్లాగని కుమిలి కుమిలి ఏడ్చేవాణ్ణి. ఒకొక్కప్పుడు నీవు చనిపోతావేమోనన్న దిగులుపుట్టి దుప్పటి కప్పుకొని రాత్రంతా వెక్కివెక్కి ఏడుస్తూ ముడుచుకొని పడుకునేవాణ్ణి. ఐనా కాలం ఎత్తిన కరవాలానికి నీవు బలికాక తప్పలేదు. ఇక్కడ నేను హాయిగా నీవు లేకుండానే ఆనందంగా జీవిస్తున్నాను. నిన్ను జ్ఞాపకం చేసుకోవడానికైనా ఇప్పుడు నాకు తీరికలేదు.

—నీ మనుమడు



పేర్వారం జుచ్చమ్మ

# ప్రకాశకీయం

సుమారు వేయి సంవత్సరాల క్రితం మరాఠీనుండి విడివడిన ఆరెభాష నేటికీ తెలంగాణంలో సజీవంగా ఉన్నది. ప్రాచీన మరాఠీ భాషా స్వరూపాన్ని తెలుసుకోవాలంటే ఆరెభాషను అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఆధునిక మరాఠీ నుండి లుప్తమైపోయిన పదాలు కొన్ని ఈనాడు కేవలం ఆరెభాషలోనే కనిపిస్తాయంటే అత్యుక్తికాదు.

ఆరె భాషలో నేటికీ పాటలూ కథలూ ఎన్నో వ్యాప్తిలో ఉన్నాయి. వీటిని చాలావరకు ఇక్కడి గొంధళీలూ ఆరెవాళ్ల ఇంటి ఆడుబిడ్డలూ మౌఖిక రూపంలో భద్రపరుస్తున్నారు. ఇవి ఆంధ్ర మహారాష్ట్ర ప్రజల సౌభ్రాతృత్వాన్నీ సహజీవన సౌందర్యాన్నీ ప్రదర్శిస్తున్నాయి. భారతదేశ జాతీయ సమైక్యత కివి నిలువుటద్దంగా భాసిస్తున్నాయి. వీటిని సేకరించి భద్రపరచి భావితరాల కందివ్వవలసిన బాధ్యత నేటితరంపై ఉన్నది. ఆధునిక నాగరకతా ప్రభావంవల్ల నేడీ జానపద సాహిత్యం క్రమంగా ప్రజల నాలుకలనుండి వైదొలగిపోతున్నది. ఇది పూర్తిగా కనుమరుగై పోకముందే ఈ మౌఖిక సాహిత్యాన్ని భద్రపరచుకొని దానిలో నిక్షిప్తమైఉన్న సాంస్కృతిక సంపదను వెలికి తీయవలసిన బాధ్యత పరిశోధకులపై ఉన్నది. అట్టి గురుతర బాధ్యతను గుర్తించి మేము ''ఆరె జానపద వాఙ్మయ పరిశోధక మండలి''ని ఇటీవల స్థాపించినాము. ఈ రంగంలో మొట్టమొదటిసారిగా పరిశోధన సలిపి డాక్టొరేటుపట్టం పొందినవారు ప్రొఫెసర్ పేర్వారం జగన్నాథంగారు. వారు ఆంధ్ర దేశమంతా తిరిగి సేకరించిన జానపద కథల్నీ పాటల్నీ విడివిడిగా ప్రస్తుతం ప్రచురిస్తున్నాము. తోటి బంధుమిత్రుల సహాయ సహకారాలు మాకు సంపూర్ణంగాలభిస్తే వారు ''ఆరె జానపద సాహిత్యం''గూర్చి ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంతగ్రంథాన్ని కూడ అతి త్వరలో ప్రచురింపవలెనని సంకల్పించినాము. అంతేకాక ఆరె జానపద సాహిత్యాన్ని గూర్చి, భాషావిశేషాల్ని గూర్చి పరిశోధనాత్మకమైన గ్రంథాల్ని మునుముందు ప్రకటింప దలచినాము. ఆరెభాషా నిఘంటువునుకూడ తయారు

చేయించాలని మా సంకల్పం. మా ఈ ఆశయాల్ని కార్యరూపంలో పెట్ట డంకోసం బంధుమిత్రుల సహాయ సహకారాల్ని అర్థించడానికి ఈ క్రింది సభ్యులతో కూడిన ఒక ప్రచురణ సంఘాన్నికూడ ఏర్పాటుచేసినాము-

1) శ్రీ దుంపాల సోమనర్సోజి
2) శ్రీ లింగంపల్లి బాలకిషన్‌రావు
3) శ్రీ చెల్లన్నగారి కృష్ణాజిరావు
4) శ్రీ బాసిరి సాంబశివరావు
5) డా॥ సింధె రామనర్సయ్య
6) శ్రీ బామండ్లపల్లి వీరన్న
7) డా॥ మోత్గాల రాజేశ్వరరావు
8) శ్రీ పేర్వారం సోమనాథం
9) శ్రీ మోఘె సత్తయ్య
10) శ్రీ సురావు నాగేశ్వరరావు
11) శ్రీ అంగరిక రాజన్న (సంయోజకుడు)

సాహితీవేత్తలూ జానపద సాహిత్య విద్వాంసులూ పరిశోధకులూ ఆరె భాషాభిమానులూ మా ఈ కృషిని ఆదరిస్తారని ఆశిస్తున్నాము. తమ అమూల్యమైన అభిప్రాయాలతో ఈ గ్రంధాన్ని అలంకరించి అలరించిన డా॥ అక్కిరాజు రమాపతిరావు (మంజుశ్రీ)గారికీ మా కృతజ్ఞతాభివందనములు. ఈ గ్రంథముద్రణకోసం భూరి విరాళమిచ్చి మమ్మల్ని ప్రోత్సహించిన ఆత్మీయులు- శ్రీ పి. ఎస్. ఎస్. రాజు (మేనేజింగ్ డైరెక్టరు, రాయల్ హేచరీస్, అమీర్‌పేట, హైదరాబాదు)గారు. వారి ఔదార్యానికి మా కైమోడ్పులు. దీన్ని మా సంస్థ తరఫున ప్రచురించడానికి అనుమతించిన డా॥ పేర్వారం జగన్నాథంగారికి ధన్యవాదములు. పుస్తకాన్ని అందంగా అచ్చువేసి మన కానందాన్ని పంచిపెట్టిన లక్ష్మి ప్రింటింగ్ ప్రెస్సు-హనుమకొండ యాజమాన్యానికీ దాని సిబ్బందికీ మా కృతజ్ఞతలు.

—అంగరిక రాజన్న

హుజూరాబాదు.

సంయోజకుడు ప్రచురణల విభాగం

ఆరె జానపద వాఙ్మయ పరిశోధక మండలి

వరంగల్లు.

# PUBLISHER'S NOTE

Aare language which emerged from Marathi nearly a thousand years ago is still in vogue in Telangana. It is essential to study Aare dialect to learn of the linguistic subtleties of Marathi, since Aare preserves even now some of the words which are no longer current in the present day Marathi.

There are several songs and tales in Aare language popular in various parts of Telangana. They are orally preserved by Aare household women and Gondhalies. They reflect the culture of fraternity and coexisterce of Telugu and Maharastra people and simbolise the best form of national integration of Indians. It is the duty of the present generation to preserve the rich folklore of Aare for the benefit of coming generations. The researchers of today have the responsibility to highlight the rich cultural heritage of the Aare folklore before it is completely eroded by the influence of so called modern civilization. Recognizing this great responsibility we have established "Aare Janapada Vangmaya Parishodhaka Mandali". Prof. Pervaram Jagannadham is the first scholar to research in this field and obtain a doctorate. As our first venture, we have now published the folk tales and songs collected by the learned professor from the different parts of the Andhra Pradesh With the active cooperation of friends and lovers we also hope to publish very soon Prof. Jagannadham's doctoral thesis on "Aare Folk Literature" submitted to Osmania University. Besides, we plan to publish in future many books of research value on Aare Folk Literature and language. We are keen on prepairing a Dictionary of Aare Language as well. To muster cooperation for

this project we have constituted a " Publication Committee" with the following –

1) **Sri D. Soma Narsoji**
2) **Sri L. Bala Kishan Rao**
3) **Sri Ch. Krishnaji Rao**
4) **Sri B. Sambasiva Rao**
5) **Dr. S. Ramnarsaiah**
6) **Sri B. Veeranna**
7) **Sri M. Rajeswara Rao**
8) **Sri P. Somanadham**
9) **Sri M. Sattaiah**
10) **Sri S. Nageswara Rao**
11) **Sri A. Rajanna (Conveaor)**

We hope that literary men, scholars of folk literature, researchers and lovers of Aare language will lend their substantial cooperation to this project. We thank Dr. A, Ramapathi Rao (Manju Sri) for giving us his valuable opinion. We are deeply beholden to Sri P. S. N. Raju (Managing Director, Royal Hatcheries, Ameerpet, Hyderabad) for his magnanimous financial support and encouragement for publication of this book. We are thankful to Prof. Pervaram Jagannadham for his consent to publish this book on behelf of our Society. Our thanks are also due to the management and staff of Lakshmi Printing Press, Hanamkonda for printing this book neatly.

Huzurabad.

— **Angarika Rajanna**
*Convenor*
"Publication Committee"
Aare Janapada Vangmaya Parishodhaka Mandali.
Warangal.

# కథకాని కథ

'ఆరె జానపద సాహిత్యంపై తెలుగు ప్రభావం అన్న విషయంపై నేను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డాక్టొరేటు పట్టంకోసం పరిశోధన చేసే నిమిత్తం ఈ కథల్ని సేకరించినాను ఇవి మొత్తం 15 కథలు వీటిలో 12 జానపదుల కాల్పనిక జగత్తునుండి ఉద్భవించిన పుక్కిటి పురాణాలవంటివి కాగా మిగతా 3 కథలు మహాభారత ఇతి వృత్తానికి సంబంధించినవి ఆరె వాళ్లకు సంబంధించిన ఆరెమరాటీలకథ' సుప్రసిద్ధమే కనుక దాన్ని నేనిం దులో కూర్చలేదు ఈ పరిశోధనకు అవకాశం కలిపించిన తెలుగుశాఖ ఉస్మానియా విశ్వవిద్యాలయం వారికీ ప్రత్యేకంగా గురువర్యులు ఆచార్య బి రామరాజు గారికీ నా కృతజ్ఞతాభివందనములు

మరాఠీ మాట్లాడే ఒకరకం జాతిజనులు ఆంధ్రదేశమంతటా చిర కాలంనుండి నివసిస్తున్నారు వీళ్లను ఆ యా ప్రాంతాల్లో ఆరె, ఆరెకాపు ఆరె మరాటీ, మరాటీ, ఆర్యక్షత్రియ వంటి వివిధ నామాలతో పిలుస్తున్నారు. ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క పేరుకు ఎక్కువ ప్రాచుర్యం కనిపి స్తున్నది ఆయుధోపజీవులై వివాహాది శుభకార్యాల్లో క్షత్రియోచితమైన ఆచార వ్యవహారాలను పాటిస్తూండడంవల్ల ఆర్యక్షత్రియులుగానూ సంభా వింపబడుతున్నారు. ఆర్య' శబ్దమే ఆరె' గా మారిందని పండితులేకాక వైఘంటికులందరూ అభిప్రాయపడుతున్నారు వీళ్లు మాట్లాడేది ఆరెభాష దీన్ని ఆరెమరాటీ అని కూడ వ్యవహరిస్తారు ఈ భాషకు లిపి లేదు: కెవలం కౌటుంబిక వ్యవహారాలను తెలుపుకునే మౌఖిక భాషగానే ఉంటున్నది ఆరె పదాన్నేకాక,-ఆరెభాషనూ తన కావ్యాల్లో ప్రయోగించిన మొట్టమొదటి తెలుగుకవి పాల్కురికి-సోమనాథుడు వృషాధిప శతకంలో ఆరెభాషలో ఒక పద్యం రాయడమేకాక-పండితారాధ్య-చరిత్ర- పర్వత ప్రకరణంలోను కొన్ని-ద్విపదలు రచించినాడు - అందువల్ల పాల్కురికి- సోమనాథునికన్న ముందే అంటే-కాకతీయుల కాలంనుంచే ఆంధ్రదేశానికి మహారాష్ట్రిల

వలసలు ప్రారంభమైనట్లు ఊహింపవచ్చు. చరిత్రకారులుకూడ ఈ అభి ప్రాయాన్నే వెలిబుచ్చుతున్నారు. ఐనా శాతవాహనుల కాలంనుంచే ఆంధ్ర మహారాష్ట్రుల సంబంధాలు విడదీయరానివిగా కనిపిస్తున్నాయి. శాతవాహనులు ఆంధ్రులా? లేక మహారాష్ట్రులా? అన్న అనుమానం ఇంకా పూర్తిగా తొలగి పోలేదు. పంచద్రావిడులలో ఆంధ్రులతోపాటు మహారాష్ట్రులనుకూడ చేరు స్తున్నారు. ఎందరో మహారాష్ట్రులు తెలుగు దేశంలో స్థిరపడి తెలుగువారై పోయి తెలుగు భాషా సాహిత్యాలకు ఎనలేని సేవ చేసినారు - చేస్తున్నారు.

ఈనాడు ఆంధ్రదేశంలో స్థిరపడిన ఆరెవాళ్లంతా మహారాష్ట్రం నుండి ఒకే కాలంలోగానీ, ఒకే కారణంచేతగానీ, ఒకే మార్గంద్వారాగానీ వచ్చినవారుకాదని వాళ్ల భాషా సాహిత్యాలవల్లనూ ఆచారవ్యవహారాలవల్లనూ విదితమవుతున్నది. తెలంగాణా జిల్లాలలో నివసించే ఆరెవాళ్లు మిగతా ప్రాంతాలవారికన్న అతి ప్రాచీనులుగా కనిపిస్తున్నారు. వీళ్లు కాకతీయుల కాలంలో. వరంగల్లు పరిసర ప్రాంతాలకు వలసవచ్చినట్లు కనిపిస్తున్నది. ఆరె వాళ్లగూర్చి మొట్టమొదటిసారిగా తన కావ్యాల్లో వర్ణించిన పాల్కురికి సోమనాథుని జన్మస్థలం వరంగల్లుకు సమీపమందున్న పాలకుర్తి గ్రామం. దీని పరిసర గ్రామాల్లో ఆరెవాళ్లు అధిక సంఖ్యలో నివసిస్తున్నారు. ఈ ప్రాంతంలోని ఆరెవాళ్లకు యజ్ఞోపవీతం లేదు. ఐనా శాకాహారులు వీళ్లకు వ్యవసాయమే ముఖ్య వృత్తి. పల్లెసీమలే వాసస్థానములు. సాధారణంగా వీళ్లంతా వీరశైవులు. చాలామంది లింగధారులు. వైష్ణవమతానుయాయులు చాలా కొద్ది సంఖ్యలో కనిపిస్తారు. వీళ్ల ఇంటిపేర్లు కొన్ని మహారాష్ట్రం లోని మరాఠా క్షత్రియ నామాలతో కలుస్తున్నాయి. మరికొన్ని మరాఠా వంశ నామాలే అయినా తెలుగుదనం సంతరించుకొని తెలుగు పదాలుగా భాసిస్తున్నాయి. కాగా మరికొన్ని అచ్చమైన తెలుగు పదాలే. గోత్రనామాలు చాలా మందికి తెలియవు. ఎవరైనా చెప్పగలిగితే అది చెట్టు పేరువంటిదో లేక పిట్టపేరు వంటిదో అయి ఉంటుంది. కొందరి ఇంటిపేర్లు మరికొందరికి గోత్రనామాలుగా కనిపిస్తున్నాయి. నేడు వీళ్లు పాటించే కొన్ని ఆచార వ్యవ హారాలు-మహారాష్ట్రంలో ఒకప్పుడు ఆదిమ సమాజాల్లో వ్యాప్తిలో ఉన్నట్లు

భావించడానికి వీలున్నది నేడు వీళ్ల మాట్లాడే భాషలో క్రీ.శ. 10 లేక 1 వ శతాబ్దాలనాటి మరాఠీ భాషా పదాలు నిక్షిప్తమై ఉన్నట్లు ప్రొఫెసర్ ఎస్.ఆర్ కులకర్ణి (రిటైర్డు మరాఠీ శాఖాధ్యక్షులు- ఉస్మానియా విశ్వవిద్యాలయం) నిరూపిస్తున్నారు. ఈ పదాలు చాలావరకు ఆధునిక మరాఠీ భాష నుండి లుప్తమైపోయినాయి. ప్రొఫెసర్ పి. జి. లాలే, ప్రొఫెసర్ వి. ధి. కులకర్ణి, డా॥ అరవింద కోర్హావంటి మరాఠీ పండితులు కూడా ఆరె భాషను జ్ఞానేశ్వరునికన్న పూర్వపుదిగా అభిప్రాయపడుతున్నారు. అంటే జ్ఞానేశ్వరునికన్న ముందే ఈ ఆరెవాళ్లు తెలంగాణాకు వలసవచ్చి శాశ్వతంగా స్థిరపడినారని ఊహించవచ్చు.

ఇన్ని శతాబ్దాలు గడిచినా నేటికీ ఆరెవాళ్లు తమ ఇండ్లలో ఆరె భాషనే మాట్లాడుతుంటారు. ఆచార వ్యవహారాల్లో పండుగపబ్బాల్లో కొన్ని ప్రత్యేకతలు కూడ కనిపిస్తున్నాయి. ఐనా వీళ్ళు తెలుగునాట తెలుగువాళ్ళుగానే స్థిరపడి తెలుగు సంస్కృతితో విడదీయరాని విధంగా తెలుగు జీవన స్రవంతిలో విలీనమై పోయినారు. కడప దాటితేమాత్రం స్వచ్ఛమైన అచ్చమైన తెలుగు భాష మాట్లాడుతూ తెలంగాణా గ్రామీణ వ్యవస్థలో చక్కగా ఇమిడిపోయినారు. భారతదేశ జాతీయ సమగ్రత కిది అచ్చమైన మచ్చుతునక. ఇది ఉపన్యాసాల ఊరేగింపులవల్లనో వారోత్సవాల ప్రచార సంస్కృతివల్లనో అబ్బిందికాదు. జాతి రక్తంలో సహజంగానే ప్రవహిస్తున్న- ప్రవహింప వలసిన జీవలక్షణమిది. సనాతనంగా సాగుతూ వస్తున్న ఆరోగ్య ప్రదమైన ఆదర్శవంతమైన ఈ జాతి ధర్మాన్ని భ్రమపరచి కుటీల కుతంత్ర రాజకీయాలు కుల మత వర్గ ప్రాంత భాషా భేదాల్ని సృష్టించి వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. లాభసాటిగా సాగుతున్న ఈ వ్యాపారంతో కొందరు 'దేశసేవా పరాయణులు' తమ పబ్బం గడుపుకుంటున్నారు.

ఈ కథల్ని వినిపించిన కథకుడు- శ్రీ దూదాటి ఉపేందర్. ఈయన ఆరెమరాఠాలలో 'గొంధళే' తెగకు చెందినవాడు. ఈతని స్వగ్రామం వరంగల్లు జిల్లాలోని మహాలింగంపల్లి. దీన్నే సోమదేవరపల్లి

అని కూడా అంటారు  గొంధళే తెగకు చెందినవాళ్ళు ఈ ఊర్లోనే అధిక సంఖ్యలో ఉన్నారు  ఈ ఊరు కేంద్రంగా వెలసిన ' తెలంగాణా గొంధళే నాటక మండలి కి శ్రీ దూదాటి ఉపేందర్ అధ్యక్షుడు  శ్రీ అంబీరు వీరన్న వీళ్ల కులపెద్ద  ఈ ఊరును గాయికవాడి (గైక్వాడ్) వంశజులైన ఆరె ప్రభువులు ప్రతిష్ఠించినట్లు స్థానికంగా ఒకకధ వ్యాప్తిలో ఉన్నది - అంతేకాక ఈ గ్రామానికి  గొంధళీలు ఆరె ప్రభువుల కారణంగానే వలస వచ్చినట్లు కూడ చెప్పబడుతున్నది  ఈ కథల్ని గూర్చి వివరంగా మరో సందర్భంలో ప్రస్తావిస్తాను  ఈ గొంధళీలు వరంగల్లు, కరీంనగరం జిల్లాలలోని పలు గ్రామాలలో నివసిస్తున్నారు  తెలంగాణంలోని ఆరెవాళ్లను ఆశ్రియించి, ఆరె ప్రభువుల గూరి న కధలు ఆరె భాషలో గానంచేస్తూ, ఆరె భాషలోనే వీధి భాగోతాలు కూడ ప్రదర్శిస్తుండడం వీళ్లకు సనాతనంగా వస్తున్న వృత్తి ధర్మం  ఆరెవాళ్ల ఇండ్లలో జరిగే వివాహాది శుభకార్యాల్లో ఆరె పాటలు పాడుతూ, ఆరె భాషలో కధలు చెప్పుతూ ఈ మౌఖిక సాహిత్యాన్ని వీళ్ళు సంరక్షిస్తున్నారు  వీళ్ళ కూడ తమ ఇండ్లలో మాట్లాడేది ఆరె భాషే. ఐతే ఆరెవాళ్ళు శాకాహారులుకాగా గొంధళీలు మాంసాహారులు  ఆధునిక నాగర కతా-ప్రభావంవల్ల గ్రామాల్లో వెడు వీళ్ళకు ఆదరణ తగ్గిన కారణాన సాంప్ర దాయకముగా వస్తున్న ఈ కళను వదలి ఇతర వ త్తులను చేపడుతున్నారు. కొందరు వ్యవసాయాన్ని చేపట్టగా మరికొందరు ఊరూరూ తిరుగుతూ ప్రజ లకు కావలసిన వస్తువుల్ని అమ్ముతూ జీవిక సాగిస్తున్నారు

తెలుగు పాఠక లోకానికి అనుకూలంగా ఉండాలన్న ఉద్దేశంతో ఈ కథల్ని నేను శ్రీ ఉపేందర్ నుండి నేరుగా తెలుగు భాషలోనే సేకరించి తెలుగులోనే ప్రకటిస్తున్నాను. ఇక ఈ కథలకు, ఇతర కధలతో ఉన్న పోలికలూ సంబంధాల గురించి స్థూలంగా పరిశీలిస్తాను. ఇందులోని జయ్యా రాణి కధకూ, బాలనాగమ్మ కధకూ కొన్ని పోలికలు కనిపిస్తున్నాయి భారతంలోని ఘోషయాత్ర కధ, అలీబాబా కధ, బాలచంద్రుని కధలలోని కొన్ని సన్నివేశాలతోనూ పోలికలు కనిపిస్తున్నాయి  నలనీలకధలో సారంగ ధరకథలోని పోలికలున్నాయి  అసలు బాలనాగమ్మ- సారంగధర కధలు

మహారాష్ట్రంలోనే పుట్టి తెలుగు కన్నడ దేశాలకు వ్యాపించినట్లు పరిశోధకులు భావిస్తున్నారు. బాలావంతి కధ చంద్రహాసుని కధను పోలి ఉన్నది. అంతే కాక నల్లగొండ జిల్లాలో ప్రచారంలో ఉన్న బాణావతి కధకూ దీనికీ చాలా దగ్గరి పోలికలు ఉన్నాయి బాణావతి కధ ఉయ్యాలపాట రూపంలో ప్రచారంలో ఉన్న జానపద కధ. దీన్ని ఇటీవల ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ప్రచురించింది. నీలకంఠ కధకూ తెలంగాణంలో ప్రచారంలో ఉన్న రాణి మైనావతి అనే జానపద కథకూ పోలికలు కనిపిస్తున్నాయి. కాంభోజరాజు కథాచ్ఛాయలు కూడ ఇందులో ఉన్నాయి భట్టివిక్రమార్కుని కధను పోలినవి తెలుగులోనూ ఎన్నో ప్రచారంలో ఉన్నాయి. ఇవి తెలుగులో పుస్తక రూపంలో కూడ ప్రచురింపబడి బహు జనామోదాన్ని పొందుతున్నాయి. ఇందులోని సన్నివేశాలకూ శుకసప్తతి పంచతంత్రం కథల్లోని సన్నివేశాలకూ ఎన్నో పోలికలు కనిపిస్తున్నాయి రాధాబాయి- కాశోజి కథకూ హరిశ్చంద్రుని కధకూ సమానమైన పోలికలున్నాయి. అంతేకాక నలదమయంతి కధతోనూ రామాయణంలోని కొన్ని సన్నివేశాలతోనూ పోలికలున్నాయి. కలాసాపాకధ అక్కలభైరికధ కాంభోజరాజు కధల్ని పోలి ఉన్నాయి ఆత్మారాణి కధలోని ఒక సన్నివేశం అచ్చంగా కాశాపూర్ణోదయంలోని మణిహారం కధను పోలి ఉన్నది. శ్యాంసీలకథలో పంచపీరీలను ఆరాధించడం మతసామరస్యానికి నిదర్శనంగా కనిపిస్తున్నది. మహమ్మదీయుల దర్గాకు వెళ్లి హిందువులుకూడా మొక్కులు చెల్లించడం తెలుగునాట నేటికీ ఆచారంలో ఉన్నది బయ్యాబాయికధలో కథానాయిక ప్రదర్శించే గడుసతనం తత్ఫలితంగా ఆమె కష్టాలపాలు కావడం వంటి సన్నివేశాలు ఇతర కధల్లోనూ మనకు కొల్లలుగా కనిపిస్తుంటాయి కళింగమహారాజుకథలోని రజకుడు- గాడిద గూర్చిన ఉపకథ తెలుగునాట సుప్రసిద్ధమే. అంతే కాక కాంభోజరాజు కధను పోలిన సన్నివేశాలు కూడా ఇందులో కొన్ని ఉన్నాయి

ఇక మహాభారతానికి సంబంధించిన కధల్లో ఏక్‌టాంగ్‌కగ గాలా విశిష్టమైంది. ఇందులో అభిమన్యుడు ఒకేకాలు ఒకేచేయి కలిగి నిలువనా

సగం శరీరంతోనే జన్మిస్తాడు. ఇది కొంతవరకు జరాసంధుని కథను పోలి ఉన్నది. అర్జునుని వనవాసకథ విజయవిలాసం కావ్యధోరణిలో నడిచింది. చిట్టచివరిదైన అభిమన్యు స్వయంవరకథకూ శశిరేఖాపరిణయం కథకూ పెద్దతేడాలేదు. తెలుగులో సినిమాగా వచ్చిన మాయాబజారు ధోరణిలో నడిచిందిది. ఇందులో చనిపోయిన పాండవుల్ని బ్రతికించలేక పోయినట్లయితే శ్రీకృష్ణుడు కూడ వాళ్లతోపాటే కాలి-చనిపోవలసిన నియమమున్నట్లు వర్ణింపబడిన ఘట్టం తెలుగు జానపదగాథల్లోనూ కనిపిస్తున్నది.

ఇటా ఈ కథలిని చదువుతుంటే ఇంతక్రుమ్ముందే ఎప్పుడో ఎక్కడో చదివినట్లుగాన అనుభూతి కలుగుతుంటుంది. జానపదకథలో బాగా ప్రచలితంగా ఉండె మూలాంశాలు మాదిరులు సాధారణంగా ఏ భాషలోనైనా ఒకే విధంగా కనిపిస్తుంటాయి అందువల్ల దేనిప్రభావం దేనిమీద ఉన్నదో చెప్పడం కష్టం. ప్రపంచ కథలన్నింటికి మూలం భారతదేశ కథలేనన్న బెన్ఫే వాదం ఒకటున్నది. ఏది ఏమైనా మానవ సమాజాల్లో సుఖదుఃఖాలూ రాగద్వేషాలూ ప్రేమానుబంధాలూ మానవ మనః ప్రవృత్తులూ బాధలూ గాథలూ అంతటా సమంగానె ఉంటాయనడంలో సందేహం లేదు వివిధ జానపద సాహిత్యాలలోని మూలాంశాలు మాదిరులు ఒకె విధంగా ఉండడానికి ఇదే కారణమై ఉంటుంది ఇవి వివిధ ప్రాంతాలో స్వతంత్రంగానే పుట్టవచ్చు. లెదా ఒక ప్రాంతంలో ఏదేని ఒక భాషలో పుట్టిన కథ ప్రపంచ భాషల్లోకి ప్రాకనూ వచ్చు.

ఈ కథల్ని అధ్యయనం చేయడంవల్ల ఆరెవాళ్ల ఆచార వ్యవహారాలూ సాంస్కృతిక విశేషాలూ ఆలోచనా ధోరణులూ పరిశీలించడానికి వీలవుతుంది. అంతేకాక ప్రాచీన కాలంనాటి రాజ్య వ్యవస్థలు- రాచరికాన్ని హస్తగతం చేసికోవడానికో లేక కూలద్రోయడానికో జరిపే కుటిల కుతంత్రాలూ మాయోపాయాలూ విదితమవుతాయి. అన్నింటికన్న మించి భాషాభేదాల్ని ప్రాంతీయ దురభిమానాన్నీ త్యజించి ఆంధ్ర మహారాష్ట్ర ప్రజలు ఎంతటి అన్యోన్యమైన మైత్రితో సహజీవనం సాగించినారో అవగతమవుతున్నది అంతేకాక ప్రాచీన భారత వర్షంలో జాతీయ సమైక్యత ఎంతటి దృఢంగ

పాతుకొని ఉండిందో రుజువవుతున్నది ఏది ఏమైనా ఒక జాతియొక్క ప్రాచీన అవశేషాలు జాతి ఉనికిని సంరక్షించే ప్రాణవాయువులు - దాని మౌలిక లక్షణాలు అది సృష్టించుకున్న జానపద సాహిత్యంలో నిక్షిప్తమై ఉంటాయనడంలో సందేహం లేదు.

ఈ పుస్తక ప్రచురణకు అయాచితంగా ముందుకువచ్చి భూరి విరాళమిచ్చి నాపై అవ్యాజానురాగాన్ని ప్రదర్శించిన ఆప్తమిత్రులు- శ్రీ పి యస్ యన్. రాజు (రాయల్ హేచరీస్; అమీర్ పేట, హైదరాబాదు) గారికి నా హార్దిక కృతజ్ఞతాభివందనములు ఆయనకూ ఆయన కుటుంబ సభ్యులకూ భగవంతుడు చిరాయురారోగ్య ఐశ్వర్యములు ప్రసాదించుగాక !. శుభమస్తు.

ది 21-7-1986 —డా॥ పేర్వారం జగన్నాథం

# మిత్ర సమ్మతం

డా॥ అక్కిరాజు రమాపతిరావు
(మంజుశ్రీ)

నా ప్రియ మిత్రుడు ఆచార్య పేర్వారం జగన్నాథం మంచి కవి. నర్మోక్తి ప్రాగల్భ్యంగల కవిగా లోకానికి విశ్రుతుడు. మంచి సాహిత్యప్రతి విమర్శక రీతులు తెలిసినవాడు. ఇదివరలో కవితలు, సాహిత్య సమీక్షలు ప్రకటించాడు పుస్తక రూపంగా అవి అభిజనుల మెప్పునందుకున్నాయి కూడాను.

'ఆరె జానపద గాధలు'అనే యీ కథా సంపుటి యీ ప్రక్రియలో చాలా విలక్షణమైంది. ఎన్నడో తాత తాతల తాతలనాడు తెలుగుదేశానికి వచ్చి స్థిరపడిన 'ఆరె'వారు పరంపరానుశ్రుతంగా తమ పాటలను పదాలను కథలను గాధలను నిలుపుకుంటూ రావడం ముచ్చట అనిపిస్తుంది. ఆలాంటి వీ కధలు. వినోద కధలు. చిరంతన కాలంనాటి మానవుడు పగలంతా పని చేసి చల్లని వెన్నెలలో కూచుని ఉబుసు పోకకు కధలన్వేషించి ఉంటాడు. అలనాటి కాలంలో అతడికి ప్రకృతితో పూర్తిగా తాదాత్మ్యం ఉండేది. అతడికి పంచకళ్యాణి గుర్రాలు కనిపించేవి. ఊడల మర్రులు కధలు వినిపించేవి. పేదరాశి పెద్దమ్మలు పొరుగూరికి వెళ్ళగానే తటస్థపడేవాళ్ళు. ఆ ఊళ్ళోని విశేషాలు చెప్పేవాళ్ళు. పక్షులతోవాళ్ళు మాట్లాడేవాళ్ళు. జంతువులతో సహజీవనం చేసేవాళ్ళు ఆపదలలోను, సంపదలలోనూ దేవుడువచ్చి వాళ్ళ సమస్యలను పరిష్కరించేవాడు అవలీలగా వాళ్ళు సప్తసముద్రాలు దాటేసే వాళ్ళు. పులిపాలు తెచ్చేవాళ్ళు దేవలోకం పారిజాతాలు, పైడితంగేడి పూలు వాళ్ళకిట్టే లభించేవి మగ సంతులేక చనిపోయిన రాజుగారి పట్టపు టేనుగు అదృష్టవంతుడి మెళ్ళో పూలమాల వేసేది అంతటితో రాజకుమార్తెను పెళ్ళాడటం రాజ్యాన్ని పరిపాలించడం కూడా ఇట్టే జరిగిపోయేది రాక్షసులతో పోరాటం సరేసరి

ఊహ లేకపోతే ఉత్తేజనలేదు. ఉద్వేగంలేకపోతే ఉల్లాసంలేదు కదా కోరికలే గుర్రాలైతే స్వారీ చెయ్యనిదెవ్వరు? అని సూక్తి. ఊహల

పల్లకీలలో ఊరేగడం అందరికీ సరదాగానే ఉంటుంది అందువల్ల ఏ ఊహా శాలో యీ కథలు తనచుట్టూ తనవారిని చేర్చుకుని చెప్పి ఉంటాడు. ఈకథలు కాలక్రమాన అనేక సంయోగాలు ప్రస్తారాలూ చెంది ఉండవచ్చు కాని అవే కథలు. భారత దేశంలో ఏ ప్రాంతీయ పురాజానపద వృత్తాంతాలలోనైనా కాస్త చిన్నచిన్న మార్పులతో ఇవే కథలు కనపడతాయి రాజుగారి కిద్దరు భార్యలుంటే వయసుపెళ్ళాం పైన మోజు (శ్రీ మహాభాగవతంలో ధ్రువుడి కథకూడా ఇటువంటిదే కదా) సవతి మాత్సర్యాలు, దుష్టబుద్ధి అయిన మంత్రులూ, సేనాపతులూ, ఇంద్రజాల విద్యలు, చీమలు దూరని చిట్టడవులూ; కాకులు దూరని కారడవులూ, అన్ని భాషలవారి జానపద కథల్లోనూ కాన వస్తాయి ఆరె'అనే పదం ఆరక్షక శబ్దభవం అయి ఉంటుందేమో అంటే ఒకప్పుడు వీళ్ళు పౌరరక్షణోద్యోగులుగా ఉండేవారేమో వృత్తిపరంగా యీ పేరు వచ్చి ఉండవచ్చు ఇప్పటి పోలీసు డిపార్ట్‌మెంటులాగా ఆముక్త మాల్యదలో ఆరెకులకు వీళ్ళతో సంబంధంవుందో లేదో ; చారిత్రిక రాజకీయ సంక్షోభాలవల్ల, కరువుకాటకాలవల్ల, ప్రకృతి వైపరీత్యాలవల్ల, లేదా సంచార ప్రీతివల్ల సమూహాలు ఒక ప్రాంతంనుంచి ఇంకో ప్రాంతానికి జవావాసం సంభవించే అవకాశంవుంది మహారాష్ట్రులు, కన్నడులు, తెలుగువాడు ఒకే కుదురువారనీ కాలక్రమాన విభాగమై పోయినారని తిలక్ మహాశయుల అభి ప్రాయం. పంచద్రావిడులలో మహారాష్ట్రులుకూడా చేరి ఉన్నందువల్ల ఇది నిజమేనేమోననిపిస్తుంది శ్రీపాద, ఇంద్రగంటి, దాసు, గాడిచెర్ల మొద లైన కుటుంబికుల కూటస్థులంతా మహారాష్ట్రం నుంచి వచ్చి తెలుగు గడ్డపై స్థిరపడినవారే అని చరిత్ర చెవుతుంది. మధ్వసంప్రదాయం, దేశస్థశాఖ, తెలుగువారిని కన్నడులతోను, మహారాష్ట్రులతోను మమేకం చేస్తున్నాయి పునా సతారల సంపాదన తెలుగువాళ్ళకు చాలాకాలంగా తెలుసు గోదావరీ పావనోదారవాఃపూరం ఇద్దరికీ ఇద్దరీ అద్దరీ ఉండనే ఉంది

కాబట్టి ఎప్పుడో కొన్ని శతాబ్దాలకిందట (పాల్కురికి సోమనాథుడే వృషాధిప శతకంలో ప్రస్తావించాడు గదా ) ఈ ఆరె వారు తెలుగుదేశానికి వచ్చి ఉంటారు; మెట్టినదేశం తమ దేశమే అయినప్పటికీ స్వజనం నుండి

విడివద్దామన్న తలంపు - పరంపరాగతమైన భాషా సంస్కృతి నిక్షేపాలపై మమత్వాన్ని ఇనుమడింప చేసి ఉంటుంది అందుకే ఆ పద్యాలు, పాటలు, ఇవాల్టిదాకా వాళ్ళు మననం చేసుకుంటూనే ఉన్నారు. అటువంటి వాటిలో కొన్నిటిని మిత్రుడు జగన్నాథం సేకరించి వ్యాకరించి విశ్లేషించడం జరిగింది. ఈ ఆరె జానపద గాధలకూ తెలుగు జానపద లేదా పురాచారిత్రిక, చారిత్రక గాథలకూ సాదృశ్యాలున్నాయి ఇందులో అబ్బురపడాల్సిన విశేషం ఏమీ లేదు. తెలుగు వాళ్ళకు అత్యంత ప్రీతిపాత్రమైన పలనాటి వీరచారిత్రక పురుషులు హైహయ వంశీయులనీ ఉత్తర హిందూస్థానంనుంచి తరలివచ్చినారనీ చరిత్ర విమర్శకులు స్థిరీకరించారు. అది పన్నెండో శతాబ్దపు గాథ వాళ్ళ పూర్వీకులు అప్పటికి కొన్ని వందల ఏండ్లముందైనా వచ్చి ఉంటారు ఈ విధంగా భారత దేశంలో అన్ని ప్రాంతాల కథలూ అందరికీ పరిచయమే.

మిత్రుడు శ్రీ జగన్నాథం సేకరించిన యీ ఆరె జానపదగాధల సంపుటిలో మొదటీకథ జయ్యారాణికధ. అస్నావ్‌నగరం రాజుగారి ఏడుగురు కొడుకుల్లో కడగొట్టువాడైన మాన్‌సింగ్ భార్య జయ్యారాణి. ఒక మాంత్రికుడామెను అపహరించుకొని పోతాడు. ఈ జయ్యారాణి కొడుకు తారాచంద్‌ను పెత్తల్లులు పెంచుతుంటారు. ఒకనాడు తారాచంద్ విల్లు బాణాలతో ఆడుకుంటూ ఉండగా అతడి బాణం వీధిలో కడవలో నీళ్ళు తీసుకొని వెళుదున్న తమ్మళి నరసమ్మ కుండకు తగిలి నీళ్ళన్నీ కారిపోతాయి చిన్ననాడే తల్లినీ తండ్రినీ దూరం చేసుకున్న నీకు మంచి బుద్ధులెట్లా వస్తాయని ఆ నరసమ్మ తిడుతుంది. సరిగ్గా ఇటువంటి కథే పల్నాటి వీరచరిత్రలో కూడా వుంది. మేడపిలో బాలచంద్రుడు బొంగరాలాట ఆడుకుంటూ ఉండగా కడవతో నీళ్ళు తెచ్చుకుంటున్న ఒక కోమటక్క కాలికి ఆ బొంగరం తగిలి గాయమవుతుంది. అప్పుడామె నీ వాళ్ళంతా యుద్ధంలో వుంటే నీవు బొంగరాలాడుతున్నావా ! అని దెప్పిపొడుస్తుంది బాలచంద్రుడు తల్లిని వేధించి సంగతి తెలుసుకొని యుద్ధానికి వెళతాడు. ఈ కథలో తారాచంద్‌కూడా పెద్దతల్లుల ద్వారా తన తల్లి విషయం తెలుసుకొని ఆమెను సాధించుకోవటానికి వెళతాడు.

రెండో కథ నలపీల కథలో సారంగధరుడి కధ ఛాయలున్నాయి. అదేం విశేషమోకాని యీ ఆరె జానపద కథల్లో బాలురూ బాలికలూ కూడా

పన్నెండేళ్ళకే పడుచువాళ్ళుగా పరిగణితులై స్త్రీపుంసౌఖ్యయోగ సమర్థులుగా వర్ణితులవుతున్నారు బహుశా మన సమాజంలో అనాదిగాన్నా తరంరాలుగానూ సాగివస్తున్న బాల్యవివాహాలమీద ఉండే కుతుకం అందులో ధ్వనిస్తున్నదేమో ఈ కథలో రాజుగారి చిన్న భార్య తెలిసినా తెలీకున్నా సవతి కొడుకుతో సంభోగ సౌఖ్యం కోరడం సారంగధర కథావృత్తాంతం వంటిదే ఈ కథల్లో ఆయాపాత్రల, వ్యక్తుల కులప్రస్తావన తరచుగా కనపడుతుంది అంటే భారతీయ సామాజిక వ్యవస్థా స్వరూపం ఆవిష్కృత మవుతూ ఉన్నదన్న మాట

మూడవ కథ బాలావంతి కథలో చంద్రహాసుడి కథతో పోలికలున్నాయి. ఈ కథలో లాగానే ఆ కథలో కూడా మంత్రి రాజును వంచించి తానే రాజ్యాన్ని స్వాధీనం చేసుకుంటాడు. దుష్టబుద్ధి అయిన మంత్రి తన భార్యకు చంద్రహాసుడురాగానే 'విషము నిమ్ము' అని ఉత్తరం వ్రాసి పంపించగా, ఊరిబయట ఉద్యానవనంలో నిద్రిస్తున్న అతిడి అందచందాలు చూచి 'విషయ నిమ్ము' అని మార్చి వేస్తుంది మంత్రి కూతురు. ఈ బాలా వంతి కథలో కూడా లింబాజీ అనే దుష్టమంత్రి రాజుగారి కుమారుడైన రణా సింగును తన భార్య మాణిక్యావతి దగ్గరకు పంపిస్తూ తుదముట్టించాల్సిందిగా వ్రాస్తాడు. కాని అట్లా జరగదు. పార్వతీదేవికి ఆపిల్లాడి మీద జాలికలిగి కూతుర్నిచ్చి పెళ్ళిచేయాలి' అని మార్చి వేస్తుంది ఆ ఉత్తరాన్ని. మాణిక్యావతి కూతుర్ని కనకాబాయిని రణాసింగ్ పెళ్ళి చేసుకుంటాడు. అద్భుతాలు, అతిమానుషాలు, అతిలోకాలు జానపదగాథల్లో సర్వసామాన్యాలు. జైనుల మతకథల్లో కూడా ఇటువంటి కథ ఒకటి (మృగవేనధీవరకథ) పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు ప్రకటించారు.

నాలుగో కథ నీలకంఠ-కథ కూడా తెలుగు వాళ్ళకు పరిచయమైందే. కాంభోజరాజు కథ, ముగ్గురు మరాటీల కథ, తెలుగువాళ్ళకు బాగా పరిచితమైనవే. నీకకంఠ కథలో వేశ్య అనుకొని తల్లినే కవయ గోరిన తనయుడి కథ ఒక ఘట్టంలో వస్తుంది. ఈ కథా వృత్తాంతాన్ని తెలియచేసే ఒక చాటు పద్యం వుంది తెలుగులో, 'భూపతి జంపితిన్ మగడు భూరి భుజంగముచేత చచ్చె నే నాపదచెంది చెంది ఉదయార్కుని పట్టణ మేగి వేశ్యనై,

పాపము గట్టుకొంటి నృపతి వగ పేటకి చల్లచింపినన్' సరిగా నీలకంఠ కథలో జీవతావంతి అవస ఇటు వంటిదే

ఈ సంపుటంలోని కథలతో ఎన్నో పోలికలున్న కథలు మదన కామరాజు కథలు శ్రీ పాద సుబ్రహ్మణ్య శాస్త్రి వంటి గొప్ప తెలుగు కథకుడిని ఈ మదన కామరాజు కథలు ఎంతో ప్రభావితం చేసినట్లూ, అలరించినట్లూ ఆయన స్వీయచరిత్రలో ప్రస్తావించాడు. భట్టివిక్రమార్కుడి కథలు తెలుగులో కూడా ఉన్నాయి. రాథాబాయి-కాళోజి కథలో నలమహారాజు కథ, హరిశ్చంద్రుడి కథ, శ్రీరామచంద్రుడు సీతాదేవి అగ్ని పరీక్ష చేసిన వృత్తాంతమూ స్ఫురిస్తున్నాయి - కలాసాపాకథలో గోంగూర పచ్చడి ప్రసక్తి రావడం ఆరె జానపదగాథల్లో తెలుగుతనం ఎంత చొచ్చుకొని వచ్చిందో తెలియ జేస్తుంది చివరి మూడు కథలు మహాభారతగాథా సంబంధులు. మాయా బజార్ కథ తెలుగు - వాళ్ళకు సుపరిచితమే ఘటోత్కచుడి సాయంతో అభిమన్యుడు శశిరేఖను వివాహ మాడిన కథ తెలుగు వారికి చాలా అభిమాన పాత్రం - ఈ సంపుటంలో మొత్తం 15 కథలున్నాయి అతి మానుష వృత్తాంతాలతో నిండి ఉన్నాయి కనుక చిన్న కథ శిల్పం వీటికి అనువర్తింప జేసి విశ్లేషించటం సాధ్యపడదు

ఆచార్య పేర్వారం జగన్నాథం నాకు కూరు మిత్రుడు. సహాధ్యాయి పారిశేళ్ళనాడు మేము కలిసి చదువు కొన్న రోజులు నేటికీ సతత హరితంగా మా మధ్య అనుబంధాన్ని ప్రకృతి ప్రత్యక్షం చేస్తూనే ఉన్నాయి మా జగన్నాథ పండితుణ్ణి ప్రశంసించటమంటే స్వీయ ప్రశంస చేసుకోవడమన్నమాట అది ఆర్య వృత్తం కాదుకదా

ఆరె మరాటీ జానపదగాథలు సేకరించి గ్రంథస్థం చేసినందుకు నా మిత్రుణ్ణి అభినందిస్తున్నాను ఈ విషయాలపైనే కృషిచేసి నా మిత్రుడు పిహెచ్ డి పట్టం కూడా పొందటం జరిగింది. ఆ సిద్ధాంత గ్రంథాన్ని కూడా వెంటనే అచ్చు లో చదవాలని ఎంతో అభిలషిస్తున్నాను,

# కథాక్రమం బెట్టిపనగా


| | | |
|---|---|---|
| ౧ | జయ్యారాణి కధ | 1 |
| ౨. | నల నీల కధ | 8 |
| ౩. | బాలావంతి కధ | 6 |
| ౪ | నీలకంఠ కథ | 22 |
| ౫. | భట్టివిక్రమార్కుని కధ | 29 |
| ౬. | రాధాబాయి కాళోజి కధ | 38 |
| ౭. | కలాసాపా కధ | 42 |
| ౮ | అక్కులభైరి కధ | 49 |
| ౯ | ఆత్మారాణి కధ | 56 |
| ౧౦. | శ్యాంనీల కధ | 6[illegible] |
| ౧౧. | బయ్యాబాయి కధ | 71 |
| ౧౨ | కళింగ మహారాజు కధ | 78 |
| ౧౩ | ఏక్ టాంగ్ కధ | 83 |
| ౧౪. | అర్జునవనవాస కధ | 86 |
| ౧౫ | అభిమన్యు స్వయంవర కధ | 90 |

# డా॥ పేర్వారం జగన్నాథం

జననం. 23-8-1934

తల్లి : సయ్యమ్మ

తండ్రి : సంతాజి

జన్మస్థలం ఖిలాషాహపురం, తా॥ జనగామ, జి॥ వరంగల్లు (ఆం. ప్ర.)

వృత్తి : ప్రొఫెసర్ - తెలుగుశాఖ, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్లు (ఆం. ప్ర.)

ముద్రిత రచనలు

1) సాగరసంగీతం (కవితా సంపుటి)
2) వృషభ పురాణం (కవితా సంపుటి)
3) 'చేతనావర్తం' కవులలో ఒకరు
4) సాహిత్యావలోకనం (వ్యాస సంపుటి)
5) ఇంద్రద్యుమ్నీయము (ప్రౌఢ ప్రబంధము) సంపాదకత్వం

పరిశోధన. ఆరె జానపద సాహిత్యము పై తెలుగు ప్రభావము

సమీకరణ సర్వాయి పాపన్న వాఙ్మయ సర్వస్వం

## త్వ ర లో

ఆరె జానపద గేయాలు

ఆరె జానపద సాహిత్యం

గొంధళీ నాటక సంప్రదాయం

# ౧. జయ్యారాణి కథ

ఆస్నాప్ నగరాన్ని అసన్‌సేన్ అనేరాజు పరిపాలిస్తుంటాడు ఆతనిభార్యపేరు అస్తావంతి ఈతనికి ఏడుగురు కుమారులుంటారు వాళ్ల- హరిచంద్ గోపీచంద్ కుషాభాన్ మరియు మాన్‌సింగ్ మొదలైనవాళ్ల

హరిచంద్ భార్యపేరు లదేబాయి గోపీచంద్ భార్యపేరు గోదాబాయి కుషాభాన్ భార్యపేరు సయ్యాబాయి మరియు మాన్‌సింగ్ భార్యపేరు జయ్యారాణి మాన్‌సింగ్ అందరిలోకన్న చిన్నవాడు అసన్‌సేన్‌రాజు తన రాజ్యాన్ని సుఖంగా ప్రజామరంజకంగా పరిపాలిస్తుంటాడు

ఈ సమయంలోనే మరొక వైపు కాశీగిరి నగరాన్ని కాశీగిరి రాజు పరిపాలిస్తుంటాడు ఈతని భార్యపేరు గంగాసాగర్ ఈతనికి కొన్ని మంత్ర విద్యలు వస్తాయి వాటితో కొన్ని మహిమలు చేస్తుంటాడు ఈతడు పూర్వం గోసాయిగా ఉంటూ ఇటీవల కాశీనగరానికి రాజై పాలిస్తుంటాడు ఈతనికి అస్తమానమూ పాచిక లాడడం అలవాటు అదొక వ్యసనంగా మారింది ఈ అలవాటు మంచిది కాదని భార్య వారిస్తుంది. రాజు ససేమిరా పాచికలాడడం మానడు పందెంలో ఈతన్ని ఓడించి అయినా ఈ వ్యసనంనుండి మానిపించాలని గంగాసాగర్ భావిస్తుంది అందువల్ల ఒకనాడు పందెంవేసుకొని ఇద్దరూ పాచికలాడుతుంటారు రాణి ఓడిపోతే జీవితాంతం రాజుకు దాసిదిగా పడిఉండునట్లనూ రాజుగనుక ఓడిపోతే రాజ్యాన్ని త్యజించి వనవాసానికి వెళ్లిపోవునట్లునూ పందెంకాస్తారు మూడుసార్లురాజే ఓడిపోతాడు ఆతడు అధికారాన్నీ రాజ్యాన్నీ వదిలి అడవికి వెళ్లటకు సిద్ధమవుతాడు ఆతడు వెళ్లిపోతుండగా రాణి ఆతన్ని అవహేళన చేస్తూ మాట్లాడుతుంది అప్పుడు రాజు ఆగ్రహించి తానొక అందమైన స్త్రీని రాణిగా పొంది ఆమెకు గంగాసాగర్‌చేత పాదసేవ చేయిస్తానని శపథం చేస్తాడు ఐతే ఆతని అపజయానికి సూచనగా గంగాసాగర్ తన భర్త-కాశీగిరిరాజు ముఖానికి సున్నపు

బొట్లు పెట్టించి నగరంనుంచి వెడలగొడుతుంది కాశీగిరి రాజు తన రాజ్యాన్ని వదిలి దివ్యదృష్టితో పరిశీలించి అస్నావ్‌నగర్ తన కనుకూలమైందిగా భావించి అక్కడికి చేరుకుంటాడు అక్కడి రాజుగారి తోటలో హఠాత్తుగా తన మంత్రబలంతో ఒక ఆశ్రమాన్ని సృష్టించుకొని మునివేషంతో నివసిస్తుంటాడు. తమ తోటలో అర్థరాత్రి హఠాత్తుగా ఒక దివ్యమైన ఆశ్రమం వెలిసినందుకు ఆశ్చర్యపడి పన్నెండు మంది తోటమాలిలు వెళ్ళి తమ రాజుకు విన్నవిస్తారు ఈ వార్త వినగానే ఏడుగురు రాకుమారులూ గుర్రాలనధిరోహించి ఈ వింత చూడడం కోసం వస్తారు. తపస్సు చేస్తున్న ఆ ముని దివ్యరూపాన్ని దర్శించి ఆనందిస్తారు ముని దర్శనం చేసుకొని ఆరుగురు రాకుమారులు తిరిగి తమ రాజ మందిరం చేరుకుంటారు కాని చిన్నవాడైన మాన్‌సింగ్ మాత్రం అక్కడనె మునికి సేవ చేసుకుంటూ ఉండి ఆతనికి శిష్యుడుగా మారిపోతాడు

ఇంతలో అస్నావ్‌నగర్ రాజ్యంలో క్రూర మృగాలవల్ల తమకు రక్షణ లేకుండా పోయిందనీ వాటిని అంతంచేసి తమకు రక్షణ కల్పించవలసిందనీ కోరుతూ కొందరు రైతులు రాజువద్దకు వచ్చి మొరపెట్టుకుంటారు ఆరుగురు రాకుమారులూ గుర్రాల నధిరోహించి వేటకై బయలుదేరుతారు మాన్‌సింగ్‌ను కూడ తోడుగా తీసుకవెళ్లదామని భావించి ఆశ్రమంవద్దకు వస్తారు తమతో కలిసి వేటకు రావలసిందని వాళ్ల కోరగా మునికి పరిచర్యలు చేయడం ఎట్లాగని మాన్‌సింగ్ బాధపడుతుంటాడు ముని ఈతని అభిప్రాయాన్ని గమనించి వేటకు వెళ్లవలసిందిగా అనుజ్ఞనిస్తాడు తన భార్య జయ్యారాణిని మునికి పరిచర్యలు చేయడంకోసం నియమించి మాన్‌సింగ్ తన అన్నలతో కలిసి గుర్రమెక్కి వేటకు వెళ్లిపోతాడు వీళ్లంతా వేటకు వెళ్లే నాటికే జయ్యారాణికి ఒక పుత్రుడు కూడా జన్మిస్తాడు ఆతనికి తారాచంద్ అని నామకరణం చేస్తారు రాకుమారులంతా వేటకు వెళ్లిన పిదప తారాచంద్‌ను తన తోడి కోడళ్ల కప్పగించి జయ్యారాణి తనభర్త చెప్పిన ప్రకారం మునికి ఆహారం తీసుకొని ఆశ్రమానికి వస్తుంది వెంట కొందరు దాసీలుకూడ ఉంటారు దాసీలను ఆశ్రమ ద్వారంముందే నిలపెట్టి తానొక్కతే ఆశ్రమంలోనికి వెళ్లి మునికి ఆహారం అందజేస్తుంది. జయ్యారాణి సౌందర్యానికి ముని ఆకర్షితుడవుతాడు వెంటనే తన మంత్ర మహిమతో ఆశ్రమాన్ని అమాంతంగా అక్కడినుండి లేపుకొని జయ్యారాణితో సహా వచ్చి సముద్ర తీరంలో ఉన్న ధుర్యాగిరి పర్వతం చేరుకుంటాడు ఆ పర్వతంనుండి ఎప్పుడూ పొగ వెళ్లుతుంటుంది ఈ పర్వతానికి అతి సమీపంలోనే ధుర్యాగిరి అనే గ్రామంకూడ ఉన్నది ఆశ్రమాన్ని ఈ పర్వతంపైన ఒక గుహలో అమర్చి దానికొక కవాటాన్ని కూడ బిగిస్తాడు ఆ గుహలో ఆమెను నిర్బంధించి తనతో సంభోగించవలసిందిగా ప్రతి నిత్యం జయ్యారాణిని

బాధ పెడుతుంటాడు ఆమె ఈతని బాధల్ని భరించలేక తనకు పన్నెండు సంవత్సరాల వ్రతమొకటున్నదని దాని తరువాతనే అతని కోరికను తీర్చడం జరుగుతుందని చెప్పి నమ్మిస్తుంది అందు కాతడు అంగీకరిస్తాడు ఈ పన్నెండు సంవత్సరాల గడువుకోసం ఎదురు చూస్తూ ప్రతి నిత్యం ధర్మాగిరి గ్రామానికి వెళ్లి ఈ కపట ముని పాచికలాడి వస్తుంటాడు

అటు అస్నాప్ నగరంలో ఆశ్రమ ద్వారం కదవేచి ఉన్న దాసీలు ఎంతకూ తమ రాణి ఆశ్రమం నుండి ఇవతలకు రానందున లోనికి వెళ్లి చూస్తారు ఆశ్రమం కనిపించదు మునికానీ జయ్యారాణి కానీ కనిపించరు ఈ విషాద వార్తను వాళ్లు రాజమందిరానికి వెళ్లి మిగతా రాజులతో విన్నవిస్తారు జరిగిన మోసానికి అందరూ దుఃఖిస్తారు జయ్యారాణి తోడికోడళ్లు ఆమె కుమారుడైన తారాచంద్‌ను పెంచుతుంటారు ఇంతలో వేటకు వెళ్లిన ఏడుగురు రాకుమారులూ క్రూరమృగాల్ని సంహరించి రైతులకు రక్షణ కల్పించి తిరిగి తమ నగరం చేరుకుంటారు రాజ మందిరానికి వచ్చి ఈ విషాద వార్తను విని దుఃఖిస్తారు వెంటనే జయ్యారాణిని వెదికి తీసుకరావడంకోసం మళ్లీ ఏడుగురు రాకుమారులూ కలిసి గుర్రాలపై బయలుదేరుతారు తిరిగితిరిగి సముద్ర తీరానికి ఒకవైపునగల లేత మామిడి తోటలో దిగుతారు అక్కడి ఆచారం ప్రకారం అతిథులుగావచ్చిన ఈ ఏడుగురు రాకుమారులను అక్కడి తోటమాలీలు ఒక్కొక్క రాకుమారునికి ఒక్కొక్క తురాయి మరియు ఒక్కొక్క హారము చొప్పున బహూకరిస్తారు ఆరుగురు రాకుమారులు మాత్రం వాటిని తమ శరీరంపై ధరిస్తారు కాని మాన్‌సింగ్ మాత్రం భార్య గుర్చి దుఃఖిస్తూ వాటిని నలిపి కిందపడ వేస్తాడు తోట మాలీలు వెళ్లి ఈ సంగతి తమ యజమాని అయిన అంబుశెట్టి షావుకారుకు చెప్పుతారు ఈతడుండేది ఊరుపేరు రక్‌నగర్ ఈయన చాలా ఉత్తముడు. ఈతని వద్ద సముద్రంలో ఈదులాడుతూ ప్రయాణించగలిగిన గుర్రాలుంటాయి ఈ అంబుశెట్టి షావుకారు మాన్‌సింగ్‌ను పిలిపించి తామిచ్చిన తురాయిని హారాన్ని నలిపి వేసిన కారణమేమిటని అడుగుతాడు. అతడు తన దీనగాధను వివరిస్తాడు అప్పుడు అంబుశెట్టి సముద్రంలో ఈదులాడే ఏడు గుర్రాల్ని ఏడుగురి కిచ్చి జయ్యారాణిని వెతుక్కోవలసిందిగా కోరుతాడు. ఈ ఏడుగురు రాకుమారులూ తాము తెచ్చిన ఏడు గుర్రాన్ని అక్కడ వదలి అంబుశెట్టి ఇచ్చిన గుర్రాల నధిరోహించి సముద్రంలో ప్రయాణించి అవతలి తీరం చేరుకుంటారు అక్కడ వెతగ్గావెతగ్గా ఒకనాడు ఈ కపటముని కనిపిస్తాడు మాన్‌సింగ్ అతనిని గుర్తిస్తాడు వీళ్లంతా అతని కంటబడకుండా రహస్యంగా అతని ననుగమిస్తూ వెళ్లతుంటారు ఆ ముని తన గుహవద్దకువెళ్లి 'కవ్వాటు ఖోల్" (కవాటం తెరువు)అని అరుస్తాడు లోపల

ఉన్న జయ్యారాణీ మునిని తిట్టుకుంటూ వచ్చి దరువాజ తెరుస్తుంది ముని లోపలికి వెళ్ళగానే దరువాజ మూసుకుంటుంది దీన్ని ఈ రాకుమారులు గమనిస్తారు మరొక రోజు ముని గుహనుండి బయలుదేరి ధుర్యాగిరి గ్రామం వెళ్లడం గమనించి రాకుమారులు కూడ వచ్చి అదే విధంగా కవ్వాటు ఖోల్" అంటారు అప్పుడు జయ్యారాణి వచ్చి ఎప్పటి మాదిరిగానె తలుపు తెరుస్తుంది ఈ ఏడుగురు రాకుమారులు కనిపించగానే ఆమెకు ఎక్కడలేని ఆనందం కలుగుతుంది వెంటనె మాన్‌సింగ్ ఆమెను తన గుర్రంపై కూర్చుండబెట్టకోగా అందరూ కలిసి మహావేగంతో బయలుదేరి వస్తుంటారు కాని ముని తన మంత్రశక్తితో ఈ ప్రాంతాన్నంతా ప్రభావితం చేసి ఉన్నందువల్ల ఎవ్వరెంత వేగంగా ప్రయాణించినప్పటికీ సముద్ర తీరం చేరేలోగానే సాయంత్ర మవుతుంది చీకట్లో సముద్ర ప్రయాణం చెయలేక ఆగిపోతారు సరిగా ఇదే సమయంలో అటు ధుర్యాగిరి గ్రామంలో ముని పాచికలాడుతుండగా తన మెడలోని పూసల హారం తెగి క్రిందపడుతుంది ఇది దుశ్శకునంగా భావించి ఆతడు వెంటనే పరుగెత్తుకొని వచ్చి ధుర్యాగిరి పర్వతం ఎక్కిచూడగా జయ్యారాణిని తీసుకవెళ్లుతున్న రాకుమారులు కనిపిస్తారు తన మంత్రశక్తితో వాళ్లను తిరిగి వెనక్కి రప్పిస్తాడు జయ్యారాణిని తన గుహలో పడవేసి ఏడుగురు రాకుమారుల్ని ఏడు గుడ్డాల్ని శిలలుగా మార్చి గుహలోనే పడవేస్తాడు తనతో సంభోగించవలసిందిగా మళ్లీ జయ్యారాణిని వేధిస్తూ ఉంటాడు

అటు తారాచంద్ క్రమంగా పెరిగి పెద్దవాడై ఇంచుమించు పన్నెండు సంవత్సరాల బాలుడవుతాడు ఒకనాడాతడు ధనుర్బాణములతో ఆడుకుంటూ ఉండగా ఒక బాణంవెళ్లి మంచినీళ్ల తెచ్చుకుంటున్న తమ్మళినరుసమ్మ నెత్తిమీది కుండకు తగులుతుంది కుండకు చిల్లిపడి నీళ్లన్ని కారిపోతాయి ఆమె కోపానికి వచ్చి వుట్టగానె తలిదండ్రుల్ని పోగొట్టుకున్న వెధవని బాలుణ్ణి తిడుతుంది ఆ బాలుడు వెంటనె అంతఃపురంలోనికి వచ్చి తన పెత్తల్లుల్ని కలిసి తన తలిదండ్రు లెవ్వరనీ ఎక్కడికి వెళ్లినారనీ ప్రశ్నిస్తాడు అప్పుడు వాళ్ల జరిగినకథనంతా వివరిస్తారు ఒక కపటముని వల్ల ఈ అనర్థం వాటిల్లిందని తెలుపుతారు ఆ బాలుడు తన తలిదండ్రుల్ని పెత్తండ్రుల్ని వెదకడం కొసం గుర్రమెక్కి బయలు దేరుతాడు ఒక మహారణ్యంలో తన వాళ్లకోసం తిరిగి తిరిగి తారాచంద్ పూర్వం తన తండ్రులు వచ్చిన ప్రాంతానికే చేరుకుంటాడు ఆ ప్రాంతంలో ఆయనకు ఒక గోసాయి దర్శనమిస్తాడు ఈతని పేరు గంగాగిరిబాబా ఈతని నివాసం అంబుశెట్టి ఉంటున్న రక్‌నగర్‌కు సమీపంలోనె ఉంటుంది పైగా ఈతడు జయ్యారాణిని అపహరించుకపోయిన కాశిగిరి అనే మునికి సహాధ్యాయి కూడ ఇద్దరూ సహాధ్యాయులుగా ఉంటూ మంత్ర తంత్రాలనూ విద్యా

మహిమలనూ ఒకేసారి నేర్చుకుంటారు ఐతే ఈతను మిక్కిలి సజ్జనుడు ఇతని విద్యా మహిమల ప్రభావాన్ని చూసి తారాచంద్ గంగాగిరిబాబాకు సేవచేస్తూ శిష్యుడుగా మారుతాడు అతడు కూడ ఈ బాలునికి తనకు తెలిసిన విద్యలన్నీ నేర్పుతాడు ఇట్లా ఉంటూ ఉండగా ఒకనాడు తారాచంద్‌కు అంబుశెట్టి చూస్తాడు తారాచంద్ అచ్చంగా తండ్రి వలెనె ఉన్నందున అతన్ని మాన్‌సింగ్‌గా ఊహిస్తాడు తానిచ్చిన పెట్టాం పోస్తావన తెచ్చి మిగతా సోదరులంతా ఏమైపోయినారని ప్రశ్నిస్తాడు మొదట తారాచంద్‌కు ఈ మాటలేమీ అర్థంకావు కాని తరువాత అంబుశెట్టి ద్వారా విషయమంతా తెలుసుకుంటాడు అప్పుడు తారాచంద్‌కు కూడ సముద్రంలో ఈదులాడే ఒక పెట్టె తెచ్చి తన తండ్రిన్ని వెదుకవలసిందిగా అంబుశెట్టి ప్రోత్సహిస్తాడు తారాచంద తాను తెచ్చిన పెట్టెను నక్కడ ఉంచి ఈతని పెట్టెను నధిరోహించి సముద్రమును కాపలి తీరంలో ఉన్న ధుర్యాగిరి పర్వతం చేరుకుంటాడు ఇంతకు పూర్వం తన పెత్తల్లులు చెప్పిన ఆనవాళ్ల ప్రకారం మునికోసం వెతుకుతుంటాడు. ఒకనాడు అదే ముని తన గుహ ద్వారంవద్దకు వచ్చి కవ్వాటు ఖోల్ 'అని పలుకడం గమనిస్తాడు లోపలినుండి జయ్యారాణి వచ్చి తలుపు తెరుస్తుంది ముని లోపలికి వెళ్లుతాడు ఈతని ప్రవర్తన సంతా గమనించి ఈతడే తన తల్లిని అపహరించినవాడని తెలుసుకుంటాడు మరు నాడు ఎప్పటి మాదిరిగా ఆ ముని ధుర్యాగిరి గ్రామం వెళ్లడం కనిపెట్టి తారాచంద్ రహస్యంగా గుహద్వారం వద్దకు వచ్చి అదే విధంగా "కవ్వాటు ఖోల్' అంటాడు జయ్యారాణి వచ్చి తలుపు తెరుస్తుంది ఎదుట ఉన్న తారాచంద్‌లో అచ్చంగా తన భర్త రూపు రేఖలు కనిపిస్తాయి ఐనా ముని ఈ కపట వేషం ధరించి తనను మోసం చేయడానికి వచ్చినాడనుకుంటుంది కాని తారాచంద్ తన చిన్ననాటి ఉంగరాన్ని చూపించే వరకల్లా అతన్ని తన కుమారుడని జయ్యారాణి నమ్ముతుంది తన చిన్నకుమారుడు చిరకాలానికి వచ్చి కలిసికన్నందుకు ఎంతో ఆనందిస్తుంది

ఈమెను చెరనుండి విడిపించడానికి తారాచంద్ ఒక యుక్తి పన్నుతాడు ఏదో విధంగా నమ్మించి ముని ప్రాణాలెక్కడున్నవో తెలిసికోవాలంటాడు పూర్వం ఇచ్చిన వాగ్దానం ప్రకారం వ్రతం పూర్తికాగానె ఆతనితో సంభోగం జరుపడానికి సుముఖంగా ఉన్నట్లు నటించవలసిందిగా జయ్యారాణికి సలహా ఇస్తాడు తాను మాత్రం ముని కంటబడకుండా రహస్య స్థలంలో ఉంటాడు ఎప్పటి మాదిరిగానె ముని గుహలో ప్రవేశించగానె ఆరోజు జయ్యారాణి అతనిపై ఎన్నడులేని వలపు నటిస్తుంది మనసు మార్చుకున్నట్లు నటిస్తుంది ఇంకొక వారం రోజుల్లో తన వ్రతం పరిసమాప్తమవు తుంది కనుక అది పూర్తికాగానే అతని కోరిక చెల్లిస్తానని కూడ ఆశ కల్పిస్తుంది ఐతే

ముని తన ప్రాణాలెక్కడ ఉన్నదీ తెలిపితే శాశ్వతంగా తనదాన నవుతానని మాట ఇస్తుంది ముని తన ప్రాణాలున్న జాడ తెలుపడానికి సందేహిస్తాడు ముని తన కోరిక నెరవేర్చక పోతే ఆత్మహత్య చేసుకుంటానని జయ్యారాణి అలుక వహిస్తుంది తన కుడిచేతి గాజును పగలగొట్టి ఎడమ చేతి చిటికెనవ్రేలునకోసి ఆ నెత్తురును కండ్ల కద్దుకుంటె తన ప్రాణాలు పోతాయి కనుక అట్లాచేసి చనిపోతానని బెదిరిస్తుంది ఆమె చనిపోతే ఆమెతో సంభోగంకోసం ఇంతకాలం తాను పడిన శ్రమ అంతా వ్యర్థమై పోతుందని భావించి ముని తనప్రాణాలున్న రహస్య స్థలాన్ని ఈ విధంగా వెల్లడిస్తాడు- 'మహా సముద్రంలో ఒక బావి ఉంటుంది ఆ బావిలోపలికి మైదపుపిండితో చేసినమెట్లు ఉంటాయి ఆ మెట్లగుండా బావిలోనికి దిగితే ఒక మట్టిచెట్టు కనిపిస్తుంది. ఆ మట్టి చెట్టుపై ఏడు దొంతరలతో ఉట్లు కట్టి ఉంటాయి పైన ఉన్న ఉట్టిలో ఒక చిలుక ఉంటుంది మరొక ఉట్టిలో ఒక గోరువంక ఉంటుంది. చిలుకలో నా ప్రాణాలున్నా గోరువంకలో మరొక గోసాయి ప్రాణాలున్నా నిక్షిప్తం చేయబడి ఉన్నాయి" అంటూ ఆ ముని తన ప్రాణ రహస్యాల్ని వెల్లడిస్తాడు ఈతడు చెప్పింది చెప్పినట్లుగా జయ్యారాణి ఒక కాగితంపై వివరాలన్నీ వ్రాసుకుంటుంది ఇంకొక వారంరోజుల్లో తనకు జయ్యారాణితో సంభోగం చేసే అవకాశం లభిస్తుందన్న సంతోషంతో ముని వెళ్లి పోతాడు తారాచంద్ మళ్లీవచ్చి జయ్యారాణిని కలిసికోగా ఆమె ముని ప్రాణ రహస్యం వ్రాసిపెట్టిన కాగితం అతని కందిస్తుంది దాన్ని తీసుకొని నేరుగా తారాచంద్ తన గురువైన గంగాగిరిబాబావద్దకు వస్తాడు జరిగిన విషయమంతా తెలుపుతాడు ఈ చిలుకను సాధించుకరావడానికి త్రోవచూపించవలసిందిగా ప్రార్థిస్తాడు గంగాగిరి బాబా బాలునికి అక్కడికి వెళ్లే మార్గం తెలుపుతాడు అంతేకాక మరొక ఉట్టిలోని గోరువంకలో తనప్రాణాలు నిక్షిప్తమై ఉన్నాయని కూడ తెలిపి తామిద్దరూ సహాధ్యాయులమని కూడ వెల్లడిస్తాడు ఐతే సముద్రంలోని బావి మీద రాతితో చేసిన ఒక మూత ఉంటుందనీ తారాచంద్ వచ్చి ప్రార్థిస్తే మూత దానంతట అదే తెరుచుకుంటుందన్న విషయం ఆ మూతమీదనే వ్రాయబడి ఉంటుందని కూడ వివరిస్తాడు. బాబా చెప్పిన ప్రకారం తారాచంద్ కడు సాహసోపేతంగా ప్రయాణం సాగించి సముద్రంలోని బావిలో దిగి మట్టి చెట్టుకుకట్టిన ఉట్టిలోని చిలుకను సాధించి తెస్తాడు పిదప అతి రహస్యంగా తన తల్లివద్దకు వెళ్లి ఆమెను వెంటబెట్టుకొని మళ్లీగంగాగిరిబాబా వద్దకు వస్తాడు. ఎప్పుడైతే తారాచంద్ చిలుకను పట్టి తెచ్చినాడో అప్పటినుంచే అక్కడ మునికి చలి జ్వరం ప్రారంభమవుతుంది వెంటనె అతడు గుహకు పరుగెత్తుకొని వచ్చి చూస్తే అక్కడ జయ్యారాణి కనిపించదు తన దివ్య దృష్టితో చూసి జరిగిన సంగతంతా తెలుసుకుంటాడు వెంటనె ఆ ముని తన సహాధ్యాయియైన గంగాగిరి బాబావద్దకువచ్చి

తన చిలుకను తనకు ఇప్పించి తన ప్రాణాలు కాపాడవలసిందిగా ప్రార్థిస్తాడు కాని బాబా ఈ దుష్టుని కోరికను మన్నించడు ఆతడు చేసిన కిరాతక చర్యలకు అసహ్యించు కుంటాడు తన తండ్రులను మళ్లీ మానవులుగా మారిస్తే చిలుక నిస్తానని తారాచంద్ ఆశ చూపుతాడు తన ప్రాణాలు కాపాడబడుతాయన్న ఆశతో ముని అందు కంగీక రిస్తాడు మునితో కలిసి తారాచంద్ మరియు గంగాగిరిబాబా సముద్రిందాటి అవలి తీరాన ఉన్న ధుర్యాగిరి పర్వతానికి వస్తారు ముని ఏడుగురు రాకుమారులనూ వాళ్ల ఎక్కి వచ్చిన గుర్రాలనూ మళ్లీ మానవులుగా మారుస్తాడు ఇకనైనా తన చిలుక తన కివ్వవలసిందిగా మళ్లీ ముని తారాచంద్‌ను కోరుతాడు సముద్రానికి మరో తీరంలో ఉన్న రక్‌నగర్‌లోనె ఇస్తానని తారాచంద్ అంటాడు మళ్లీ అందరూ కలిసి మునితో సహ రక్‌నగర్ చేరుకుంటారు వీళ్లందరూ కలిసి ఎక్కివెళ్లిన మొత్తం ఎనమిది గుర్రా లను తిరిగి అంబుశెట్టికి అప్పగించి వాళ్ల గుర్రాలను వాళ్లు తీసుకుంటారు అంబుశెట్టిషావు కారుకు వాళ్లంతా కృతజ్ఞతలు తెలిపి అతనితో సెలవు తీసుకొని తమ అస్మాన్‌నగరానికి బయలుదేరుతారు గంగాగిరిబాబాను కూడ సముచితంగా గౌరవించి తమ వెంటతీసుక వెళ్లతారు ముని తన చిలుకను తనకిచ్చి ప్రాణభిక్ష పెట్టవలసిందిగా దీనంగా వేడుకుం టాడు ఐనా అతన్ని క్షమించక ప్రజా సమక్షంలోనె ఆతన్ని హింసించి ప్రాణాలు తీయాలన్న ఉద్దేశంతో ఆతన్నికూడ తమ వెంట తీసుకి వెళ్లతారు అందరూ కలిసి తమ అస్మాన్‌నగర్ చెరుకొని తమతమ రాణుల్ని కలిసికుంటారు తమ కుమారులంతా క్షేమంగా తిరిగి వచ్చినందుకు అసన్‌సేన్ రాజు ఎంతో ఆనందిస్తుంటాడు రాజ భవ నంలో ఉత్సవాలు జరుపుకుంటారు ప్రజలంతా ఆనందంతో పండుగ చేసుకుంటారు. ప్రజా సమక్షంలో తారాచంద్ చిలుకను చిత్రహింసలపాలు చేస్తాడు చిలుకను హింసించి నాకొద్దీ మునికి బాధ అధికమవుతుంటుంది చివరికి చిలుక ప్రాణాలు తీయగానె కాశీ గిరి ముని నేలకూలుతాడు తరువాత రాకుమారులు తమ రాజ్యాన్ని సుఖంగా పరిపాలి స్తుంటారు. అసన్‌సేన్ రాజు కుమారుల అభ్యుదయాన్ని చూస్తూ ఆనందిస్తుంటాడు.

# ౨. నల నీల కథ

ధర్మావతి అనే నగరాన్ని ధర్మాజి అనే రాజు పరిపాలిస్తుంటాడు ఈతనికి ఇద్దరు భార్యలు పెద్దభార్య పేరు మైనావతి చిన్నభార్య పేరు నైనావతి వీళ్ల ఎప్పుడూ కలహించుకుంటూ ఉంటారు అందువల్ల ప్రధాని సలహా మేరకు రాజు వాళ్లిద్దరినీ విడి విడిగా ఉంచి తాను మాత్రం చిన్న భార్యవద్ద ఉండేవాడు ఈ ఇద్దరు భార్యలవల్ల కూడా రాజుకు సంతానం కలుగలేదు అందువల్ల సంతానార్థియై రాజు తపస్సు చేయ టంకోసం అడవికి బయలుదేరి వెళ్లుతాడు అడవిలో ఒకచోట కూర్చుండి ధర్మాజి శంకరుని గురించి కఠినమైన తపస్సు చేస్తాడు కొంతకాలానికి శంకరుడు ప్రత్యక్షమై సంతానం కలుగనట్లు రాజుకు వరమిస్తాడు అందుకు ఒక ఖర్జూర ఫలమును కూడ ఇస్తాడు భార్యా భర్తలిద్దరూ స్నాన సంధ్యాదులు పూర్తిచేసి ఇల్లలికి శుభ్రపరచి దేవునికి నైవేద్యం చూపిన పిదపనే దాన్ని భుజించాలని శంకరుడు ఆజ్ఞాపిస్తాడు శంకరు డిచ్చిన ఖర్జూర ఫలాన్ని రాజు శ్రద్ధతో తీసుకొనివచ్చి తన చిన్న భార్యకే ఇస్తాడు దాన్ని ఎట్లా భుజించాలో వివరించి ఇది శంకరుని ఆజ్ఞఅనికూడ తెలుపుతాడు కాని నైనావతి అందుకు భిన్నంగా అహంకారంతో ఆ ఖర్జూర ఫలాన్ని చాలా చులకనగా చూస్తుంది స్నాన సంధ్యాదులేవీ లేకుండానె దాని రుచి చూచే నిమిత్తం కొద్దిగా చుంచి నోట్లో వేసుకుంటుంది శంకరుని మహిమతో అది ఆమెకు భరింపరాని చేదుగా మారు తుంది అదొక విషఫల మనుకొని అప్పుడామె తన భర్తనే అనుమానించి ఖర్జూర ఫలాన్ని కోపంతో మురికి కాలువలో పారవేస్తుంది

ఇది ఇట్లాఉండగా రాజు తపస్సుచేసి శంకరునివలన వరం పొంది సంతానం నిమిత్తం ఒక ఫలాన్ని తీసుకవచ్చినట్లు దాసీలవలన పెద్దరాణి అయిన మైనావతికి తెలు స్తుంది అప్పుడామె నైనావతి ఇంటికివచ్చి ఆ ఫలంలో తనకుకూడ కొంతభాగం ఇవ్వవలసిందిగా కోరుతుంది ఆ విష ఫలాన్ని కనుక మైనావతికి ఇస్తే ఈ దెబ్బతో ఆమెకు చావు తప్పదనీ ఇక తనకు తిరుగ ఉండదనీ నైనావతి లోలోన మురిసిపోతుంది

ఎన్నడూలేని ప్రేమను నటిస్తూ సైనావతి మురికి కాలువలో పడితిప్ప ఖర్జూర ఫలాన్ని వెదికి తెచ్చి మైనావతికి ఆదరంతో సమర్పిస్తుంది. మైనావతి ఆ ఫలాన్ని తన మేడకు తీసుకువెళ్ళి భర్తతో కలిసి సక్రమమైన పద్ధతిలో భుజించినందున శంకరుని మహిమతో ఆమె గర్భం ధరిస్తుంది నవమాసములు నిండిన పిదప ప్రసవించి మగ కవల పిల్లల్ని కంటుంది వాళ్లకు నల నీల అని నామకరణం చేస్తారు గొప్ప కళాకారుడైన ఒక వడ్రంగితో చక్కని ఉయ్యెల చేయించి తల్లి వాళ్లను అల్లారుముద్దుగా పెంచుతుంటుంది. పిల్లలిద్దరూ కడు చక్కదనంతోనూ అద్భుతమైన తెలివితేటలతోనూ అలరారుతుంటారు ఐతే పిల్లిద్దరినీ మైనావతి తన అంతఃపురంలోనే అతి రహస్యంగా పెంచుతుంటుంది తనకు సంతానం కలిగినట్లుగానీ వాళ్లు పెరిగి పెద్దవాళ్లవుతున్న సంగతిగానీ నగరంలో ఎవ్వరికీ తెలియకుండా జాగ్రత్త వహిస్తుంది ఒక్క రాజు మాత్రమే అప్పుడప్పుడు వస్తూ పిల్లల యోగక్షేమాల్ని చూస్తూ వాళ్ల విద్యాభ్యాసానికి తగిన ఏర్పాట్లుకూడ చేస్తుంటాడు వాళ్లు ఆడుకోవడం కోసం ఒక బంగారు బంతినీ వెండి దండమును కూడ చేయించి ఇస్తాడు వాళ్ల ధైర్య సాహసాల్ని చూసి రాజు మురిసిపోతుంటాడు ఐతే పిల్లలు రాజ ప్రాసాదం విడిచి అవతలికి వెళ్లకుండా తల్లి కట్టుదిట్టంచేస్తుంది ఎలాంటి ఆటలైనా ఇంటి ఆవరణలోనే ఆడుకోవాలి తప్ప బయటకు వెళ్లకుండా ఆమె వాళ్లను అదుపులో పెడుతుంది

ఇట్లా ఆడుకుంటూ ఉండగా ఒకనాడు బంగారు బంతి ఎగిరి కోటగోడపై నుండి అవతల పడుతుంది. అప్పుడు పెద్దవాడు వద్దంటున్నా వినక చిన్నవాడు తలుపులు బద్దలుకొట్టి బయటపడుతాడు. విధిలేక పెద్దవాడుకూడ చిన్నవాన్ని అనుసరిస్తూ వెళ్తాడు ఇట్లా పిల్లిద్దరు రాజ ప్రాసాదం నుండి బయటకువచ్చి చూసేవరకల్లా క్రొత్త ప్రపంచంలోనికి వచ్చినట్లు భావిస్తారు ఇంతవరకూ బయటి ప్రపంచాన్ని చూసి ఎరగరు. తమ ఈడుగల పిల్లలుకూడ తమవలెనే ఆడుతూ ఉండే చూసి సంతోషిస్తారు వాళ్లతో కలిసి మహోత్సాహాన్ని ప్రదర్శిస్తూ ఆడుతుంటారు ఇదే సమయంలో చిన్న రాణియైన సైనావతి తన మేడపై భాగంనుండి ఈ కవల పిల్లల్నిచూస్తుంది. అప్పుడు వాళ్లు పన్నెండు సంవత్సరాల వయస్సు కలిగి తేజోవంతులుగా ఉంటారు ఆ కవల పిల్లల్ని ఏ విధంగానైనా తనవద్దకు రప్పించుకోవాలని సైనావతి భావిస్తుంది. వాళ్ల అందచందాలను చూసి మురిసిపోతుంది వెంటనే తన దాసీలను పంపించి ఆ పిల్లలు ఆడుకునే బంగారు బంతిని తన మేడలోనికి విసిరి వేయించుకుంటుంది. బంతికోసం ఆ ఇద్దరు బాలురూ ఆమె మేడలోనికి వెళ్తారు. అప్పుడు సైనావతి ఆ బంగారు బంతిని తన చేతితో త్రిప్పుకుంటూ కూర్చుండి ఉంటుంది పిల్లవెళ్లి తమ బంతిని తమ కివ్వవల

సించిగా కోరుతారు ఆమె మొదట ఇవ్వ నిరాకరిస్తుంది కాని తన కామవాంఛ తీరిస్తే మాత్రం బంతిని ఇస్తానని శరతు విధిస్తుంది బాలురు అందుకు నిరాకరించి ఆమెను బెదరించుకుంటారు తిరిగి తమ ఇంటికి వచ్చి జరిగిన ఈ విషయాన్ని మాత్రం తల్లితో చెప్పరు ఈ బాలురు తన కోరికను మన్నించక నేరుగా తన సవతియగు మైనావతి ఇంటికి వెళ్లడాన్ని కూడ నైనావతి గమనిస్తుంది

రాజు తన ఇంటికిరాగానే నైనావతి తన కట్టు బట్టలు చింపుకొని ఏడుస్తూ ఉంటుంది రాజు కారణమేమిటని ప్రశ్నిస్తాడు ఎవరో ఇద్దరు బాలురు తనమేడ లోనికి ప్రవేశించి తనను పరాభవించినారనీ తమతో సంభోగించవలసిందిగా బలవంత పెట్టినారనీ తాను అంగీకరించనందున తన బట్టల్ని చించి అల్లరిచేసి పోయినారనీ ఒక కట్టుకథ కల్పించి భర్తతో చెప్పుతుంది అంతేకాక దాసీల చేత కూడ సాక్ష్యం పలికిస్తుంది ఆ బాలురు ఇట్లా అల్లరిచేసి మైనావతి ఇంటికి వెళ్లినారనికూడ జాడ తెలుపుతుంది. ఇదంతా రాజు నమ్ముతాడు తన కుమారులై ఉండికూడ ఇట్లా ప్రవర్తించి నందులకు వాళ్లపై ఆగ్రహం పూనుతాడు వాళ్లకు సరియైన శిక్ష విధించాలనికూడ నిర్ణయించుకుంటాడు వెంటనె తన ప్రధానిని పిలిపించి ఆ కవల పిల్లల్ని ఏదో విధంగా మాయ మాటలు చెప్పి మైనావతి ఇంటినుండి తీసుకు రావలసిందిగా ఆజ్ఞాపిస్తాడు అట్లా వాళ్లను ఇవతలికి తీసుకవచ్చిన పిదప ఒక అడవిలోనికి తీసుకవెళ్లి ఆ ఇద్దరి శిరస్సులు ఖండించి తలల్ని తీసుకవచ్చి నైనావతి కివ్వవలసిందిగా చెప్పుతాడు అట్లా చేయకపోతే ప్రధాని శిరస్సునే ఖండిస్తానని హెచ్చరిస్తాడు గత్యంతరం లేక ప్రధాని మైనావతి మేడకు వెళ్లతాడు పట్టాభిషేకం చేయడంకోసం రాజు కవలల్ని తీసుకరమ్మని ఆజ్ఞాపించినాడని ప్రధాని మైనావతికి అబద్ధాలు చెప్పి నమ్మిస్తాడు ఐనా జాగ్రత్త కోసం మైనావతి తన పిల్లల కెలాంటి కీడు తలపెట్టబోమని పెరుగుతో కలిపిన అన్నం చేతికిచ్చి ప్రధానితో ప్రమాణం చేయిస్తుంది ఆ విధంగా ప్రమాణం చేసి ప్రధాని కవలల్ని గుర్రాలపై కూర్చుండపెట్టుకొని నెరుగా ఒక అడవిలోనికి తీసుక వెళ్లతాడు అక్కడ వాళ్ల శిరస్సులు ఖండించడానికి ఉద్యుక్తుడవుతాడు అప్పుడు బాలురు తమ మనస్సులలో శంకరుని ధ్యానించుకుంటారు శంకరుని మహిమవల్ల ప్రధానికి తాను రాణివద్ద చేసిన బాస జ్ఞాపకం వస్తుంది ప్రధాని బాలురపై జాలివహించి వాళ్లు ఎక్కివచ్చిన గుర్రాలతో సహా వాళ్లను అడవిలోనే వదిలిపెట్టి వస్తాడు. కాని నగరం చేరగానే అతి రహస్యంగా గొప్ప కళాకారుడైన వడ్రంగిని పిలిపించి ఆ ఇద్దరు బాలుర తలలను పోలిన వాటిని చెక్కతో తయారు చేసి ఇవ్వవలసిందిగా ఆజ్ఞాపిస్తాడు ఆ పిల్లల్ని చిన్నతనం నుండి ఎరిగినవాడు కనుక వడ్రంగి తన కళా నైపుణ్యంతో రెండు తలలు తయారుచేసి

రంగులుకూడ వేసి ప్రధానికి సమర్పిస్తాడు వాటిని చూడగానె ప్రధాని అవి నిజమైన తలలుగానె భావిస్తాడు వడ్రంగి మోసంచేసి ఆ పిల్లల తలలు నరికి తెచ్చినాడని కూడ అతనిపై ఆగ్రహిస్తాడు కాని వడ్రంగి వాటి రంగులను వెడినీళ్లతో కడిగి చూపించగా ప్రధాని సత్యాన్ని గ్రహిస్తాడు వడ్రంగిని ఎంతో మెచ్చుకుంటాడు వడ్రంగి తిరిగి వానికి రంగులు వేసి ఇవ్వగా ప్రధాని వాటిని తీసుకొనివచ్చి సైనావతికి సమర్పిస్తాడు ఆమె వాటిని చూసి ఆనందిస్తుంది. తన కనీ కేరేట్లు ఆ తలలపై తన రెండు కాళ్లూ మోపి స్నానమాడుతుంటుంది ఈ సంగతి ఆనోటా ఆనోటా వెళ్లి పెద్దరాణికి తెలుస్తుంది ఏదో విధంగా ఆ శిరస్సులను తెప్పించి పరీక్షిస్తుంది చివరకు అవి కర్రతో చేసినవిగా తెలిసికొని మైనావతి ఆనందిస్తుంది తన కుమారులెక్కడో బ్రతికే ఉన్నట్లుగా భావించి ఈ రహస్యాన్ని ఎక్కడా చెప్పకుండా కాలం గడుపుతుంటుంది

అటు ఘోరాటవిలో ఆ కవల పిల్లలు తిరుగుతూ తిరుగుతూ చీకటిపడగానె ఒక మర్రిచెట్టు క్రింద పడుకుంటారు ఆ చెట్టుపై రెండు పగిడికంటెలు నివసిస్తుంటాయి ఒకటి మగపక్షి రెండవది ఆడపక్షి ఆ చీకారణ్యంలోని గాఢాంధకారాన్ని చూచి చిన్నవాడైన నీలుడు భయపడుతుంటాడు అప్పుడు శంకరుడు కనికరించి వాళ్లకు ధైర్యంకల్పించే ఉద్దేశంతో చిన్న మంటను సృష్టించి వెలుతురును ప్రసాదిస్తాడు మంట ఆ పోకుండా ఉండేందుకు నీలుడు చుట్టు ప్రక్కలనున్న చెత్తాచెదారమునంతా తీసుకవచ్చి అందులో వేస్తుంటాడు ఒకసారి చెత్త అధికంగా పడి మంటలు మర్రి కొమ్మలదాకా ప్రాకినందున దాని మీద కాపురం చేస్తున్న పగిడికంటెల కన్నుగ్రుడ్లు భగ్గున మాడిపోయి అవి గ్రుడ్డివై పోతాయి ఆడ పగిడికంటె తనను తిన్నవాడు పన్నెండు సంవత్సరాలు అష్ట కష్టాలు పాలవుతాడని శపిస్తూ అగ్ని జ్వాలలో దూకి మరణిస్తుంది దాని పిదప మగ పగిడికంటె కూడ తనను తిన్నవాడు వెంటనె ఒక దేశానికి రాజవుతాడని పలుకుతూ అగ్నిలో దూకి మరణిస్తుంది ఇట్లా మంటల్లోపడిన ఈరెండు పక్షుల్ని అంతవరకూ మెలకువతో ఉన్న నీలుడు చక్కగా కాల్చి బూరుతీసి ఆడపక్షిని తాను భుజిస్తాడు మగపక్షిని మాత్రం తన అన్నకోసం భద్రపరుస్తాడు నలుడు నిదుర లేవగానె మగపక్షిని అతనికిచ్చి నీలుడు నిదురపోతాడు నలుడు ఆ పక్షిని భుజించగానే దాహం వేస్తుంటుంది నిదురలో ఉన్న నీలుని అక్కడనే వదిలివేసి మంచి నీళ్లకోసం కాలినడకన నలుడు బయలుదేరుతాడు తాను వెళ్లుతున్న మార్గం గుర్తుండడం కోసం చెట్లకొమ్మలు నరుకుతూ వెళ్లుతుంటాడు అట్లా కొంతదూరం వెళ్లగా అతడు జేబంతెనగరం చేరుకుంటాడు ఆనగరాన్ని పరిపాలించే రాజు ఇటీవలనే మరణించినాడు. ఆయనకు వారసులు లేనందువల్ల పురజనులంతా ఒక ఒప్పందానికి

వస్తారు ఆ ఒప్పందం ప్రకారం ఒక ఏనుగ తొండానికి పూలహారాన్నిస్తారు అది ఎవరి మెడలో వేస్తే అతన్ని తీసుకువచ్చి రాజుగా చేయాలని నిర్ణయించుకుంటారు అట్లా ఊరేగింపుతో వస్తున్న ప్రజలకు ఈ నలుడెదురవుతాడు ఏనుగ తన తొండంతో పూలహారాన్ని ఈ బాలుని మెడలోవేసి అతన్ని తన తొండంపై కూర్చుండబెట్టుకొని నడుస్తుంటుంది ఆ పురజనులంతా తాము చేసుకున్న ఒప్పందం ప్రకారం నలున్ని బేబందినగరానికి రాజుగా చేస్తారు పిదప సుజన అనే కన్యతో వివాహంకూడ జరుపుతారు అతడు చక్కగా రాజ్యం చేస్తుంటాడు

అటు మఱ్ఱిచెట్టుక్రింద పడుకొని ఉన్న నీలుడు లేచి చూసేవరకల్లా తన అన్న కానరాడు అతన్ని వెతకడం కోసం తమ రెండు గుఱ్ఱాలనూ వెంటబెట్టుకొని బయలు దేరుతాడు నలుడు చెట్లకొమ్మల్ని నరుకుతూ వెళ్లిన దారివెంటనే నీలుడుకూడ వెళ్లుతాడు. అట్లా దారినడిచి చివరికి తన అన్న పాలించే బేబందినగరం చేరుకుంటాడు. అంతకు క్రితం రాత్రి ఆ నగరంలోని ఒక రైతుకు చెందిన రెండు గుఱ్ఱాల్ని ఎవరో దొంగిలించుక పోతారు అప్పుడే నగరంలో ప్రవేశించిన నీలునిదగ్గరకూడ వాటిపోలిన రెండు గుఱ్ఱాలున్నందున ప్రజలంతా అతనే దొంగగా భావిస్తారు వెంటనె అతన్ని బంధించి రాజువద్దకు వెళ్లి జరిగిన సంగతంతా విన్నవిస్తారు అతడు తన తమ్ముడే అన్న సంగతి నలునికి తెలియదు వెంటనే దొంగను చెరసాలలో వేయవలసిందిగా నలుడు ఆజ్ఞాపిస్తాడు. ఆ విధంగా నీలుడు తన అన్న పరిపాలించే నగరంలోనె చెరసాల పాలవుతాడు

ఇట్లా నలుడు రాజ్యంచేస్తుండగా కొంతకాలానికి అతని భార్య అయిన సుజనాబాయి తనకొక రత్నాలహారం చేయించవలసిందిగా కోరుతుంది వీళ్ల రాజ్యానికి దాపున ఉన్న లోలాటుంబా నగరంలో మంచి రత్నాల హారాలు చేస్తుంటారు ఆ నగరాన్ని లోధి అనె రాజు పరిపాలిస్తుంటాడు ఈతనికి కమలాబాయి అనే కూతురుకూడ ఉంటుంది నలుడు కొందరు బంగారం వర్తకుల్ని లోలాటుంబా నగర్‌కు పంపించి మేలైన రత్నాలహారం చేయించుకొని రావలసిందిగా ఆజ్ఞాపిస్తాడు వెంట కొంతమంది భటుల్నికూడ పంపిస్తాడు వాళ్లంతా పడవలో కూర్చుండి గంగను దాటడానికి ప్రయత్నిస్తుంటారు కాని పడవ ఎంతకూ నడువదు అప్పుడు వాళ్లు గంగను ప్రార్థించగా తనకు నరబలి కావలంటుంది. నరబలి ఇస్తేకాని పడవ సాగదని గంగ ఖచ్చితంగా పలుకుతుంది వాళ్లంతా తిరిగి వచ్చి ఈ సంగతంతా రాజుకు విన్నవిస్తారు నరబలి కోసం ఎవరిని పంపించడమా అని రాజు ఆలోచిస్తుంటాడు. చివరికి చెరసాలలో ఉన్న

పట్టాల దొంగను నీలుడు) గంగకు బలి చెయవలసిందిగా కొందరు సూచిస్తారు అందుకు రాజు అంగీకరిస్తాడు వెంటనే కారాగృహంలో ఉన్న నీలున్ని బలి ఇవ్వడం కోసం తీసుకవెళ్లతారు గంగ ఒడ్డుకు తీసుకవెళ్లి బలి ఇవ్వడానికి సిద్ధంకాగానే నీలుడు తన మనస్సులో శంకరుని ధ్యానించుకుంటాడు శంకరుని మహిమవల్ల అతని కొక ఆలోచన తట్టుతుంది తన కవకాశమిస్తే పడవను తానే నడుపుతానంటాడు పడవ గనుక నడువకపోతే రాజాజ్ఞ ప్రకారం తనను బలి ఇవ్వవచ్చునని కోరుకుంటాడు వాళ్లంతా ఆతనిపై జాలి వహించి అందుకంగీకరిస్తారు నీలుడు పడవ నడుపుతుంటే హాయిగా అది కదిలిపోతుంటుంది ఆ విధంగా వాళ్లంతా లోలాటుంబా నగరం చేరుకుంటారు వర్తకులు రత్నాల హారం తయారు చెయించుకోవడంలో నిమగ్నమై ఉంటారు తన ప్రాణాల్ని కాపాడినందువల్ల కృతజ్ఞతా భావంతో నీలుడు వాళ్లకు పరిచర్యలు చెస్తుంటాడు

ఇట్లా ఉంటూ ఉండగా లోలాటుంబా నగరాన్ని పరిపాలించే రాజు కూతురు కమలాబాయి తన వివాహం గురించి ఒక వ్రత మాచరిస్తూ ఉంటుంది ఆమె నెత్తిమీద ఎల్లప్పుడూ ఐదు వేల ఈగలు ముసురుకొని తిరుగుతుంటాయి అందులోనుంచి సగం ఈగలు విడిపోయి ఎవరి తలమీదికైతే వెళ్లి ఉంటాయో ఆతన్నే వివాహ మాడుతానని కమలాబాయి ఒక విచిత్రమైన దీక్ష వహించి ఉంటుంది ఒకనాడు రాకుమారి నెత్తి మీది ఈగలలో సగం ఈగలు వచ్చి వర్తకులకు ఊడిగం చేస్తున్న నీలుని నెత్తిమీద తిరుగుతుంటాయి ఆతడు భయకంపితుడై వాటినుండి తప్పించుకోవడం కోసం నగరంలో అటునిటూ పరుగెత్తుతుంటాడు ఆనోటా ఆనోటా పడి ఈవార్త రాకుమారి అయిన కమలాబాయికి చేరుతుంది వెంటనే ఆమె నీలున్ని తన అభిమతం ప్రకారం వివాహ మాడుతుంది

ఆరు మాసాలలో రత్నాల హారాన్ని తయారు చేయించుకొని వర్తకులు తిరిగి తమ రాజ్యానికి ప్రయాణమవుతారు వాళ్లవెంట నూతన దంపతులుగా ఉన్న నీలుడు కమలాబాయి కూడ ప్రయాణమవుతారు ఆ దేశపురాజైన లోధి తన అల్లునికి కూతురుకూ రాజలాంఛనాలతో తగిన కట్నాలు కానుకలనిచ్చి సాగనంపుతాడు గంగను దాటుటకై వాళ్లకు ప్రత్యేకంగా వేరే పడవ ఇచ్చి పంపుతాడు ఇట్లా వర్తకులంతా ఒక పడవలోనూ, నీలుడు కమలాబాయి కలిసి మరొక పడవలోనూ కూర్చుండి గంగను దాటుతుంటారు ఐతే రాజకూతురును వివాహ మాడి ధనరాసులతో వైభవంగా తిరిగి వస్తున్న నీలునిపై వర్తకులకు అసూయ కలుగుతుంది ఆతన్ని ఈ గంగలోనే ముంచి

వేయాలని కుట్రపన్నుతారు నూతన దంపతులు తమకు తమలపాకుల విడియములు కట్టి పెండ్లి విందుగా ఇవ్వవలెనని కోరుతారు నీలుడు వారి కోరికను అంగీకరించి తన భార్యతో విడియములు చేయించి తన పడవలో నిలుచుండి మరొక పడవలో ప్రయాణిస్తున్న వర్తకులకు అందివ్వబోతాడు అప్పుడీ వర్తకులు మోసంచేసి అతని చేయి పట్టి లాగి గంగలో పడవేస్తారు నీలుడు గంగలో కొట్టుకపోతాడు

ఇక వర్తకులు బేబంది నగర్ చేరుకొని రాజును సందర్శించి తాము చేయించుకొని వచ్చిన రత్నాలహారాన్ని సమర్పిస్తారు రాజూ రాణీ ఎంతో సంతోషిస్తారు అంతేకాక రత్నాల హారంతోపాటు తామొక అందమైన ఆడపిల్లను కూడ తీసుక వచ్చినామని వర్తకులు రాజుకు విన్నవిస్తారు రాజు మెప్పు పొందడం కోసం కమలాబాయిని ఆమె తెచ్చుకున్న కట్నాలతో సహా అప్పగిస్తారు కమలాబాయి అంతకుముందే తన భర్త ద్వారా నల- నీల కథ"విని ఉంటుంది ఆ విషయాన్నంతా ఒక పత్రంపై వ్రాసి రహస్యంగా రాజుకు అందజేస్తుంది రాజు విషయమంతా గ్రహించి ఈమె తన-తమ్ముని భార్యగా తెలుసుకుంటాడు ఆమెను గౌరవించి రాజభవనంలోనే ఉంచడానికి తగిన ఏర్పాట్లు చేయిస్తాడు తన తమ్ముడేమై పోయినాడో అని చింతిస్తూ కాలం గడుపుతుంటాడు ఎవరైనా నల-నీల కథ 'చెప్పేవాళ్లు తమ పట్టణంలోనికి వస్తే ఆతన్ని తన సమక్షానికి తీసుక రావలసిందిగా భటుల కాజ్ఞాపిస్తాడు

అటు గంగలో మునిగి పోయిన నీలుడు కొంత దూరం కొట్టుకపోయి నదిలో చేపలు పడుతున్న బెస్తవాళ్లకు దొరుకుతాడు వాళ్లు అతన్ని కొంతకాలం పోషిస్తారు చేపలు పట్టడంవంటి పనులను చేయిస్తుంటారు కొంత కాలానికి ఈతని ఆరోగ్యంచెడిపోతుంది ఈతనితో లాభం లేదని భావించి బెస్తవాళ్లు నీలున్ని ఒక బలిజెవానికి అమ్ముతారు నీలుడు బలిజెవానిదగ్గర సేవకుడుగా ఉంటూ ఆతని వ్యవసాయపు పనులన్నీ చేస్తుంటాడు అతనికున్న రెండు ఎద్దులకు కూడ నలుడు- నీలుడు అని నామకరణం చేస్తాడు యజమానికి అన్ని విధాలా తోడ్పడుతూ ఆతని ఆదరాభిమానాల్ని పొందుతాడు ఈతడు అడుగు పెట్టిన నాటినుంచి యజమానికి అదృష్టం కలిసివచ్చి ఐశ్వర్యవంతుడవుతాడు.

ఇట్లా కొంతకాలం సాగిన పిదప ఇక తాను యజమానికి చేయవలసినసేవ ఏదీ మిగిలిలేదని భావించి తన అన్నజాడ తెలిసికోవాలనుకుంటాడు తన వేషం మార్చి భిక్షుకుని వేషంతో ఏకతార ధరించి దేశసంచారానికి బయలు దేరుతాడు. బయలు దేరే

ముందు తాను నలుడు-నీలుడు అని ముద్దుగా పేరు పెట్టుకున్న బిడ్డకు మొక్కుతాడు ఏకతార ధరించి భిక్షకుడుగా తిరిగి తిరిగి తన అన్న పరిపాలిస్తున్న పెబంతి నగరం చేరుకుంటాడు కాని ఈతన్ని నగర పాలకులు అడ్డగించి పట్టణంలో ప్రవేశించుట కంగీకరించరు ఐతే మాటల సందర్భంలో తాను నల-నీలకథ వినిపించగలనని చెప్పగానే నగరంలో ప్రవేశించుట కాతనికి అనుమతిస్తారు ఆతడు వెంటనే వచ్చి రాజ దర్శనం చేసుకొని నల-నీలకథ వినిపిస్తాడు అప్పుడు రాజు ఆతన్ని తన తమ్మునిగా గ్రహించి వెంటనే ఆలింగనం చేసుకుంటాడు ఈ విధంగా నలుడు-నీలుడు పన్నెండు సంవత్సరాల పిదప మళ్లీ కలుసుకుంటారు నలుడు కమలాబాయిని తన తమ్మునికి అప్పగిస్తాడు

తరువాత నలుడు నీలుడు సపరివారంతో బయలుదేరి తమ తండ్రి పరిపాలిస్తున్న ధర్మావతి నగరం చేరుకుంటారు తండ్రిని మాత్రం క్షమించి సవతి తల్లి అయిన సైనావతిని హింసించి చంపిస్తారు కుమారులు తిరిగి సుఖంగా వచ్చినందుకు కన్న తల్లి మైనావతి ఎంతో ఆనందిస్తుంది హర్షామోదాలతో ఆశీర్వదిస్తుంది ఇట్లా నలుడు నీలుడు ధర్మావతి నగరాన్ని ఒకరు పెంది నగరాన్ని ఒకొకరు సుఖంగా ప్రజానరంజకంగా పరిపాలిస్తుంటారు

# ౩. బాలావంతి కథ

అమరసింగ్ అనే రాజు అంబేగాంవ్ నగరాన్ని పరిపాలిస్తూ ఉంటాడు. ఈతని భార్య పేరు బాలావంతి. రాజు ఉత్తమ గుణ సంపన్నుడుగా ఉండి ప్రజల్ని కన్నబిడ్డల్లా చూస్తూ వాళ్లకు ఎలాంటి ఆపదలు కలుగకుండా కాపాడుతూ ఉంటాడు.

రాజుకు సంతానంకలుగదు అందుకు ఎంతో పరితపిస్తుంటాడు. సంతానార్థియై తపస్సు చేయడంకోసం రాజు అడవికి బయలుదేరుతాడు అడవికి వెళ్లేముందు తన ప్రధాని లింబాజీకి రాజ్యాన్ని అప్పగించి తన పక్షాన రాజ్యం పరిపాలించవలసిందిగా కోరుతాడు. తాను తిరిగి రాజ్యానికి వచ్చేదాకా రైతులనుండి సగం శిస్తులను మాత్రమే వసూలుచేస్తూ వాళ్లకు ఏవిధమైన ఆపదలు కలుగకుండా కాపాడవలసిందని ఆదేశించి అడవికి వెళ్లి పోతాడు

లింబాజీ తన భార్య- మాణిక్యావతి దుర్బోధలను విని ప్రజల్ని పీడించడం ప్రారంభిస్తాడు రైతుల నుండి రెట్టింపు రకాలు వసూలు చేస్తుంటాడు రాజాజ్ఞను ధిక్కరించి ప్రజా పీడకుడుగా తయారవుతాడు దేశాన్ని పీల్చి పిప్పిచేస్తుంటాడు జక్కిరెడ్డి అనే ఒక రైతు ముఖ్యుణ్ని ఏలుపలుసఖేద అనే గ్రామానికి చెందిన దాదాజీ అనే మరొక రైతు ప్రముఖుణ్ని పిలిపించి రెట్టింపు శిస్తులు కట్టవలసిందిగా హింసిస్తాడు గొల్ల కొమురయ్య నుండి బలవంతంగా గొర్రెల్ని పట్టి తెప్పించుకుంటాడు రాజుకు బాల్య మిత్రులుగా ఉన్న మోతీ లాలే అనే షావుకారుల్నికూడ తారతమ్యం లేకుండా బాధ పెడుతాడు. వాళ్ల వద్దనుండికూడ రెట్టింపు పన్నులు వసూలు చేస్తాడు. ఇట్లా భార్య చెప్పుచేతలలో మెదులుతూ ఆమెకు పూర్తిగా దాసుడై లింబాజీ అంబేగాంవ్‌ను పరిపాలిస్తుంటాడు

అటు అడవికి వెళ్లిన అమరసింగ్ శంకరుని గురించి చాలా కఠోరమైన తపస్సు చేస్తుంటాడు అప్పుడు శంకరుడు ప్రత్యక్షమై రాజుకు ఒక అమృత ఫలాన్నిచ్చి

దాన్ని భార్యా భర్తలు భుజింపవలసిందిగా ఆదేశించి అంతర్ధానమై పోతాడు దాన్ని తీసుకొని అమర్‌సింగ్ తిరిగి తన అంబెగాంవ్ నగరానికి బయలుదేరి వస్తాడు నగరంలో ప్రవేశించడానికి ముందు ఊరి వెలుపలఉన్న ఒక లేత మామిడి తోటలో ప్రవేశించి రాజు విశ్రాంతి తీసుకుంటాడు ఆ తోట మాలిలను పిలిపించి తాను వచ్చిన సంగతిని తన ప్రధానికి తెలుపవసిందిగా ఆజ్ఞాపిస్తాడు వీళ్ల పట్టణంలో ప్రవేశించి ముందుగా అంకిరెడ్డి, దాదాపి గొల్ల కొమురయ్య మోతీ షావుకారు లాలే షావుకార్లకు తెలియ జేస్తారు వాళ్లంతా వెంటనే బయలుదేరి వచ్చి తోటలో ఉన్న రాజును కలిసికొని ప్రధాని దుష్ట పరిపాలన గురించి వివరిస్తారు రాజు జరిగిన దానికి చింతిస్తూ ప్రధానిపై కోపంతో ఉంటాడు. ఇంతలో రాజును నగరానికి ఆహ్వానించడం కోసం ప్రధానికూడ వస్తాడు తన ప్రజలకు జరిగిన అన్యాయాన్ని భరించలేక మరునాటి ఉదయం వరకల్లా ప్రధాని తల నరుకునట్లు రాజు శిక్ష విధిస్తాడు పిదప రాజమందిరం చేరుకొని తన భార్యకు తాను తెచ్చిన అమృత ఫలాన్నిస్తాడు ఇద్దరూ దాన్ని భుజిస్తారు ఆనాటి రాత్రి సంభోగం చేయగా అమృత ఫల మహిమతో రాణి గర్భం ధరిస్తుంది

ప్రధాని దుఃఖిస్తూ తన ఇంటికి వెళ్లి జరిగిన విషయమంతా తన భార్యకు విన్నవిస్తాడు తెల్లవారితే తనతల నరకడం ఖాయమని విలపిస్తుంటాడు ఆమె తన భర్త ప్రాణాన్ని కాపాడడం కోసం ఒక ఉపాయ మాలోచిస్తుంది ఆమె బాణామతి విద్యలో కడు నేర్పరి. తన భర్తను సర్పంగా మార్చి అర్ధరాత్రి రాజమందిరం ప్రవే శించి రాజు నిదురిస్తున్న సమయంలో కాటేసి రావలసిందిగా చెప్పి పంపిస్తుంది మాణి క్యావతి చెప్పిన విధంగానె రింబాజి సర్పరూపంలో వెళ్లి రాజును కాటేసివస్తాడు క్రమంగా రాజుకు విష మెక్కుతుంది ప్రాణం పోయే సమయం ఆసన్న మవుతుంది. అప్పుడు అమర్‌సింగ్ తన భార్య బాలావంతితో జరిగిన మోసాన్ని తెలిపి మరణిస్తాడు తరువాత రాజుకు దహన సంస్కారంచేయడానికి అంతా సిద్ధంచేస్తారు ఏమీ ఎరుగనట్లు ప్రధాని కూడ వచ్చి దుఃఖించినట్లు నటిస్తుంటాడు. కాని మోతీ లాలే అనే షావుకార్లు తమరాజు శవాన్ని దహనంచేయకుండ ఆపివేస్తారు ఒక పెద్ద బుట్టలో రాజు శవం చెడిపోకుండా మూలికలతో భద్రపరుస్తారు దాన్ని రాజుగారి తోటలో కరివేప చెట్టుకు కట్టి ప్రతి నిత్యం రాజుగారి ముఖాన్ని దర్శనంచేసుకొంటూ దుఃఖోపశమనం చేసుకుంటూ ఉంటారు అటు మాణిక్యావతి తన భర్తచేత బాలావంతిని అనేక రకాలుగా కష్టపెట్టిస్తుంది రాణికి తన తలిదండ్రులిచ్చిన విలువైన ఆభరణాన్ని బలవంతంగా తన మీదకు తెప్పించుకుంటుంది రాణివాసంలో పరిచర్యలు చేస్తున్న పన్నెండు మంది దాసీ జనం నుండి ఆరుగురిని తనకోసం నియమించుకుంటుంది. ఒకనాడు తన దాసీలచేత బాలా

వంతి గర్భవతిగా ఉన్న సంగతి తెలుసుకుంటుంది. బాలావంతి గర్భం ధరించిన కొద్ది రోజులకే మాణిక్యావతి కూడ గర్భం ధరిస్తుంది. బాలావంతి శిరస్సును ఖండించి ఆమె గర్భస్థ శిశువును కూడ ముక్కలు ముక్కలుగా నరికించాలని ఒక వ్యూహంపన్ని అందుకై తన భర్తను నియమిస్తుంది. ఈ కుట్ర బాలావంతికి తన దాసీ జనంవల్ల తెలుస్తుంది. రాణి ప్రాణాల్ని కాపాడడంకోసం ఒక దాని తన ప్రాణాల్ని కూడ త్యాగం జేయడానికి సిద్ధపడుతుంది. తత్ఫలితంగా రాణి దుస్తులు దాని ధరించి దాసిదాని దుస్తులు రాణి ధరిస్తుంది. లింబాజి అర్ధరాత్రి రాణివాసంలో ప్రవేశించి శయ్యా మందిరంలో రాణి వేషంతో నిదురిస్తున్న దాసిదాని శిరస్సును ఖండించి వెళ్లి పోతాడు. అప్పుడాతడు ఈ తొందరలో గర్భస్థ శిశువునుకూడ ముక్కలు ముక్కలుగా చేయాలన్న విషయాన్ని మరచిపోతాడు. ఇక దాసిదాని వేషంలోఉండి 'ఈడిగం' చేస్తున్నట్లు నటించిన రాణి తన రాణివాసం విడిచిపెట్టి అర్ధరాత్రి అడవుల పాలవుతుంది. శంకరుని మహిమవల్ల దాసిదాని కంఠం మళ్లీ అతుక్కపోతుంది. కాని ప్రాణం మాత్రం తిరిగిరాదు. శవం అట్లాగే అడేగవిలో పడిఉంటుంది. అడవుల పాలైన బాలావంతి తిరిగి తిరిగి వరువంటెనగర్ చేరుకుంటుంది. దాన్ని దోలాజి పరిపాలిస్తుంటాడు. ఈతనికి కూడ కొన్ని మహిమలతో కూడిన విద్యలు వస్తాయి. ఈతడు బాలావంతికి తనవద్ద ఆశ్రయం కలిపిస్తాడు.

ఇట్లా కొంతకాలం గడిచిన పిదప రాణివాసంలోని ఇద్దరు దాసీలు తమకు తమ రాణీలేని బ్రతుకెందుకని తలపోసి తాము కూడ ఆత్మహత్య చేసుకోవడానికి సిద్ధమవుతారు. ఆత్మహత్య చేసుకో బోయేముందు ప్రాణాలు కోల్పోయి పడిఉన్న రాణి గారి ముఖ దర్శనం చేసుకుందామని భావించి వాళ్ల గదిలో ప్రవేశించి చూస్తారు. హత్య చేయబడింది తమ లాటి దాసీదే కాని తమ రాణి మాత్రం కాదని గ్రహించి ఆత్మహత్యా ప్రయత్నం మానుకొని సంతోషంతో వెళ్లి పోతారు. ఈ సంతోషాన్ని పట్టలేక వీళ్ల మరికొందరు తమ తోటి దాసీలతో ఈ రహస్యం వెల్లడిస్తారు. ఇది ఆనోటా ఆనోటా పాకి చివరికి మాణిక్యావతికి తెలుస్తుంది. ఆమె మళ్లీ తన భర్త లింబాజీని పిలిచి ఆతడు చేసిన తెలివి తక్కువ పనికి ఆగ్రహించి బాలావంతి ఎక్కడున్నా సరే వెతికి పట్టుకొని ఆమెనూ గర్భస్థ శిశువునూ నరికివేయాలని ఆజ్ఞాపిస్తుంది. లింబాజి ఆమెను వెదకడంకోసం బయలుదేరుతాడు. దేశదేశాలు తిరిగి చివరికి బాలావంతి నివసిస్తున్న వరువంటె నగరం చేరుకుంటాడు. ఆతడు దోలాజికి మాయ మాటలు చెప్పి తన రాణి గారికి విధేయుడైనట్లుగా నటిస్తాడు. ఆమెను తనవెంట సొంత దేశానికి పంపించవలసిందిగా కోరుతాడు. బాలావంతి ఈతని మాయ మాటలు నమ్మక పోయినప్పటికీ దోలాజి

మాత్రిం ప్రధాని చెప్పిన మాటలు నమ్మి ఆమెను లింబాజి వెంట పంపిస్తాడు. అతడామెను వెంటబెట్టుకొని తమ అంబేగాంవ్ నగరాన్ని సమీపిస్తాడు అక్కడొక పరుపు బండపై మోసంతో ఆమె తల నరికి కాలుతో ఒక్కతోపు తోస్తాడు అప్పటికే ఆమెకు తొమ్మిది నెలలు నిండినందున ఆ దెబ్బతో ఆమె గర్భంలోని శిశువువెళ్లి గడ్డిలో పడుతుంది. గర్భంలోని శిశువును కూడ నరికి వేయాలన్న విషయాన్ని ఈసారి కూడ మరచిపోయి లింబాజి తన నగరం చేరుకుంటాడు

బాలావంతి తలనరకబడిన ప్రాంతంలో ఒక గోసాయి నివసిస్తుంటాడు అతనికి ఈ మగ శిశువు కంటబడగా అతని తేజస్సుకు సంతసించి తీసుకవచ్చి పెంచుతుంటాడు బాలావంతి మృత దేహాన్ని కూడ తీసుకవచ్చి చెడిపోకుండా వనమూలికలతో భద్రపరచి కాపాడుతుంటాడు తనకు వచ్చిన విద్యలన్నీ బాలునికి నేర్పుతాడు బాలుడు అద్భుతమైన తెలివితేటల్ని ప్రదర్శిస్తూ గురువుగారి మన్ననలను పొందుతుంటాడు అతడు అడవిలో లభించినందున అతనికి గురువు రణసింగ్ అని నామకరణంచేస్తాడు అటు మాణిక్యావతి కూడ ప్రసవించి ఆడపిల్లను కంటుంది ఆమె తన కూతురుకు తనకు వచ్చే మంత్ర తంత్రములన్నీ నేర్పుతుంది బాలిక కూడ అన్ని విద్యలూ నేర్చుకొని తన బుద్ధి కౌశలాన్ని ప్రదర్శిస్తుంటుంది. ఇట్లా కొంతకాలం సాగినాక మాణిక్యావతి వేటాడుతున్న ఒక సింహం తల నరికి తెచ్చి దాన్ని తమ మందిర ద్వారానికి కట్టాలని లింబాజీని ఆదేశిస్తుంది ఇది సాధించడం కోసం లింబాజి కొంత సైన్యాన్ని తీసుకొని గజంపై అధిరోహించి బయలుదేరుతాడు అట్లా కొంతదూరంవెళ్లి మళ్లీ బాలావంతిని నరికిన ప్రదేశానికే చేరుకుంటాడు వేటాడే సింహం తల నరికి తేవడానికి ఎవరికీ ధైర్యం చాలదు. లింబాజి దిగులుతో ఉంటాడు. అనుకోకుండా అప్పుడక్కడికి గోసాయి చేత పెంచబడుతున్న రణసింగ్ అనే బాలుడు వస్తాడు లింబాజి కోరికను గ్రహించి బాలుడు అడవిలో సింహంతో పోరి దానితల నరికి తెస్తాడు. ఈతని అద్భుతమైన సాహసానికి అందరూ అచ్చెరువొందుతారు. లింబాజి ఆ సింహాన్ని తీసుకొని తన పట్టణంచేరి మాణిక్యావతికి ఇస్తాడు. దాని భయంకరమైన ఆకారాన్ని చూసి దాన్ని తన భర్త స్వయంగా నరికి తెచ్చినాడన్న విషయాన్ని నమ్మలేక పోతుంది యదార్థం చెప్పవలసిందిగా భర్తను వేధిస్తుంది. అప్పుడు లింబాజి ఆమెతో యదార్థాన్ని చెప్పుతాడు. ఒక బాలుడు సింహం తలనరికినాడంటే అతడు తప్పనిసరిగా బాలావంతి కుమారుడే అయివుంటాడని మాణిక్యావతి ఊహిస్తుంది. అంతేకాక పూర్వం తన భర్త బాలావంతినే తప్ప శిశువును నరక లేదన్న విషయాన్ని కూడ తెలిసికుంటుంది. అందువల్ల ఆ బాలున్ని తుదముట్టించాలన్న ఉద్దేశంతో అతన్ని తీసుకవచ్చి తన కప్పగించ

వలసిందని లింబాజీని ఆదేశిస్తుంది. భార్యచేతిలో కీలుబొమ్మగా మారిన లింబాజీ ఆ బాలున్ని తీసుకరావడం కోసం మళ్లీ అడవికి వస్తాడు. నిద్రలో ఉన్న గురువుకు పాద సేవ చేస్తున్న రణాసింగ్‌ను కలిసికొని తనవెంట రాజధానికి రావలసిందిగా కోరుతాడు అతని పరాక్రమానికి ప్రజలంతా అతన్ని సందర్శించాలని ఉవ్విళ్లూరుతున్నారని కూడ అబద్ధాలు పలుకుతాడు ఐతే గురువుగారికి శుశ్రూష చేయడంలో భంగం కలుగుతుందని రణాసింగ్ సమాధానమిస్తాడు. అతనికి బదులుగా లింబాజీ గురువుగారి పాద సేవ చేస్తూ రణాసింగ్‌ను తన పట్టణం పంపిస్తాడు. బాలుడు బయలుదేరుతున్నప్పుడు లింబాజీ తన భార్యపేర ఒక ఉత్తరం వ్రాసి అతని తలమీదపాగాలో పెట్టి పంపిస్తాడు ఆ ఉత్తరంలో బాలుణ్ణి పంపుతున్నాననీ అతన్ని తన ఇష్ట ప్రకారం ఏమైనా చేయవచ్చుననీ వ్రాస్తాడు బాలుడు అంబేగావ్ నగరం బయలుదేరి వస్తుంటాడు. మార్గ మధ్యంలో పార్వతీపరమేశ్వరులు ఈ బాలున్ని చూచి అతని ప్రాణాల్ని కాపాడదలుస్తారు. పార్వతి డేగ రూపం ధరించి వచ్చి లింబాజీ వ్రాసినట్లుగానే మరొక ఉత్తరం సృష్టించి దీన్ని బాలుని రుమాలులో చెక్కి లింబాజీ వ్రాసి పెట్టిన ఉత్తరాన్ని అపహరించుకొని వెళ్లుతుంది పార్వతి పెట్టిన ఈ ఉత్తరంలో బాలునికి తమ కూతురునిచ్చి వివాహం జరిపించవలసిందిగా లింబాజీ వ్రాసినట్లుగానే వ్రాయబడి ఉంటుంది రణాసింగ్ అంబేగావ్ చేరుకొని మాణిక్యావతికి ఆ ఉత్తరం అందజేస్తాడు ఆ ఉత్తరంలో ఉన్న ప్రకారం ఆమె రణాసింగ్‌కు తన కూతురునిచ్చి వివాహం జరుపుతుంది ఆమె కూతురు పేరు కనకాబాయి ఇంతటితో ఈ బాలుని తలిదండ్రులు అనుభవించవలసి ఉన్న పన్నెండు సంవత్సరాల కష్టాలు పరిసమాప్త మవుతాయి

అక్కడ గురువుగారి శుశ్రూషలో ఉన్న లింబాజీ ఈపాటికే బాలుడు నరకి వేయబడి ఉంటాడని భావించి గురువు నిద్రలో ఉండగా చెప్పకుండా తన పట్టణం చేరుకుంటాడు. ఇంటికివెళ్లి చూడగా తాను ఊహించిన దానికి భిన్నంగా జరుగడం బాధాకర మవుతుంది కారణం తెలిసికొనగోరి మాణిక్యావతిని అడుగగా ఆమె ఉత్తరం తీసుక వచ్చి చూపుతుంది అది తాను వ్రాసిన ఉత్తరం మాదిరిగానే ఉండి తన ఉద్దేశానికి భిన్నంగా ఉండడం చూసి ఆశ్చర్యపడుతాడు. ఇందులో ఏదో మోసం జరిగిందని భార్యతో అంటాడు ఇది ఆమెకు మరీ కోపకారణ మవుతుంది. మాణిక్యావతి రణాసింగ్‌ను ఉదమట్టించడానికి మళ్లీ కుయుక్తి పన్నుతుంది అతన్ని అర్చనల నెపంతో ఆంజనేయస్వామివారి ఆలయానికి పంపించి మార్గమధ్యంలో కటికవాళ్లతో తలనరికించాలని ఎత్తుగడ వేస్తుంది. ఆమె కోరిన ప్రకారంగానే బాలుడు చీకట్లో ఆంజనేయస్వామివారి ఆలయానికి పూజ కోసం ఏకాకిగా బయలుదేరుతాడు

దారిలో ఈతనికి వైశ్యుల వివాహ బృందం ఒకటి వచ్చి కలుస్తుంది. వాళ్లు కూడ ఆంజనేయస్వామి ఆలయానికే వెళ్లతున్నందున బాలుడు ఆ బృందంలో కలిసి వెళ్లుతాడు. ఇటు కటికవాళ్లు ఒంటరిగా వచ్చే బాలున్ని హతమార్చడం కోసం ఎదురుచూస్తుంటారు. ఈపాటికే బాలుడు నరికి వేయబడి ఉంటాడన్న ఉత్సాహంతో, అతని శవాన్ని చూడడం కోసం లింబాజి చీకట్లో బయలుదేరి వస్తుంటాడు. తాము నరుకవలసిన బాలుడు వచ్చి నాడని భావించి చీకట్లో ఎటూ తెలియక కటికవాళ్లు లింబాజి తలనరికి చితిలోవేసి కాలు స్తారు. అటు ఆంజనేయస్వామివారి ఆలయంలో అర్చనలు పూర్తిచేసికొని బాలుడు సురక్షితంగా ఇల్లు చేరుకుంటాడు. మాణిక్యావతి విగ్భ్రాంతి చెంది వెంటనే వెళ్లి కటిక వాళ్లను ప్రశ్నిస్తుంది. జరిగిన పొరపాటును గ్రహించి తన భర్తే బలి అయినందుకు దుఃఖిస్తుంది. ఐనా తన కుటిల ప్రయత్నం మానుకోదు. తన మంత్రశక్తితో తానే స్వయంగా కొడివుంజుగా మారి రణాసింగ్ శయ్యాగృహంలో నిదురిస్తున్నప్పుడు వెళ్లి అతన్ని పొడిచి చంపుటకు యత్నిస్తుంది. ఆమె కూతురు కనకాబాయికి కూడ మంత్ర విద్యలు వస్తాయి కనుక ఆమె పిల్లిగామారి తన తల్లినే హతమారుస్తుంది. ఈమె శవాన్ని కూడ తన తండ్రి చితిలోనే వేయించి కాల్పిస్తుంది. ఈ విధంగా లింబాజి మరియు మాణిక్యావతి ఘోరమరణం పాలై ఒకే చితిలో దహింపబడుతారు.

ఇంతలో రణాసింగ్‌కు తన గురువు జ్ఞాపకం వస్తాడు. వెంటనే భార్యా సమేతుడై గురువుగారి వద్దకువచ్చి జరిగినదంతా వివరించి అతనిని విడిచి వెళ్లినందుకు క్షమాపణ వేడుకుంటాడు. పార్వతీ పరమేశ్వరులు కూడ ప్రత్యక్షమై గురువుగారు భద్రంగా ఉంచిన బాలావంతి శవం నోట్లో అమృతం పోసి ఆమెను బ్రతికిస్తారు. వీళ్లంతా ఇక్కడినుంచి బయలుదేరి తమ అంబేగావ్ నగరం చేరుకుంటారు. అటు కరివేప చెట్టుకు వ్రేలాడుతున్న తొట్టెలో మోతీ, లాలే అనే షావుకార్లచే సంరక్షింపబడు తున్న రాజుగారి మృతదేహాన్నికూడ పార్వతీ పరమేశ్వరులు అమృతం పోసి బ్రతికిస్తారు. మళ్లీ ప్రాణాలతో బ్రతికిన రాజు మరియు రాణి కలిసికొని, తమకోసం ప్రాణాలు వదలిన దాసీ దానిని బ్రతికించవలసిందిగా పార్వతీ పరమేశ్వరుల్ని ప్రార్థిస్తారు. పార్వతీ పరమేశ్వరులు ఆ ప్రకారంగానే రాణివాసంలో ఇంతకాలందాకా చచ్చి పడిఉన్న దాసీదానినికూడ బ్రతికించి అంతర్థాన మవుతారు. ఈ విధంగా మాణిక్యావతీ లింబాజీలు తలపెట్టిన ప్రమాదాల పరంపరల నుండి బాలావంతీ అమర్‌సింగులు పార్వతీ పరమేశ్వ రుల అనుగ్రహంతో తిరికి ప్రాణాలు పొంది, రాజ్యాన్ని తమ కుమారుడు రణాసింగ్‌కు అప్పగించి సుఖంగా జీవిస్తుంటారు.

# ౪. నీలకంఠ కథ

బ్రో రేగాఁవ్ అనే నగరాన్ని దాందహాజి అనే రాజు పరిపాలిస్తుంటాడు ఆతని భార్య పేరు గస్తూర్నాబాయి ఈతడు ప్రతి నిత్యం ముప్పది లింగాలను పూజించేవాడు ఈతని కొక కుమారుడుంటాడు ఆతని పేరు నీలకంఠుడు తలిదండ్రులు నీలకంఠుని వివాహం చేయ సంకల్పించుకుంటారు కాని అందుకు నీలకంఠుడొక శరతును విధించి అంద చందములలో తనకన్న మించిన కన్యనే వివాహ మాడుతానని తన తలిదండ్రులకు విన్న విస్తాడు రాజు తన కుమారుని చిత్రపటము నిచ్చి కొందరు భటుల్ని పంపించి అతన్ని మించిన సౌందర్యంకల కన్యకోసం వెదికిస్తాడు వాళ్ల దేశదేశాలు తిరిగి చివ రికి శాతినగర్ చేరుకుంటారు దానికి షాహాస అనేవాడు రాజుగా ఉంటాడు ఈతని భార్యపేరు మధురాబాయి వీరికొక పుత్రుకుంటుంది. ఆమె పేరు జీవతావంతి ఈమె మిక్కిలి సౌందర్యవతి రూప రేఖా విలాసాలలో నీలకంఠుని మించి ఉంటుంది నీల కంఠునికి తగిన వధువుగా భావించి భటులు ఆమె చిత్రపటాన్ని తీసుకవెళ్లి తమ దాంద హాజీరాజుకు చూపిస్తారు నీలకంఠుడామెను వివాహమాడుతాడు వివాహం జరిగిన పిదప అయిదు రోజులవరకు నూతన వధూవరులు ఒకరి ముఖం మరొకరు చూడకూడ దని జ్యోతిష్కులు చెప్పుతారు వాళ్ల చెప్పిన విధంగానే నూతన వధూవరులు నడుచు కుంటారు ఐదురోజుల పిదప నీలకంఠుడు భార్యాసమేతంగా అత్తవారి ఇంటినుంచి బయలుదేరి తన వ రేగాఁవ్ చేరుకుంటాడు దాందహాజిరాజు తన కొడుకూ కోడలు కొసం ఒక ఒంటి స్తంభం మేడ కట్టించి వాళ్ల నందులో కాపురముంచుతాడు ఇలే ఉదయం భోజనం తమవద్దకు వచ్చి చేయవలసిందిగానూ రాత్రి భోజనం మాత్రం ఒంటిస్తంభం మేడలోనే చేయవలసిందిగానూ రాజు కట్టడి చేస్తాడు నీలకంఠుడూ అతని భార్య ఈ ఒంటిస్తంభం మేడలో ఉండి పోతారు ఒకనాడు పిట్ల ఒక పిట్టల వానినుండి రాజహంసల జంటను కొనుక్కొని వాటికి రత్నాలూ ముత్యాలూ ఆహారంగా ఇస్తూ పోషిస్తూ ఉంటారు.

ఐతే నీలకంఠుడు భార్యాలోలుడై తన తండ్రి విధించిన నియమాన్ని పాటిం చలేక పోతాడు తలిదండ్రుల్ని చూడడానికి వాళ్లుండే మేడకు ఎన్నడూ వెళ్లడు

రాజుకు కోపంవచ్చి తన ప్రధానిని పంపించి నీలకంఠున్ని బలవంతంగా తన సమక్షానికి రప్పించుకుంటాడు భార్యపై ఉన్న వెర్రి వ్యామోహంనుండి ఈతని మనస్సును త్రిప్ప వలెనన్న ఉద్దేశంతో రత్నాల వ్యాపారం మిషపెట్టి రాజు సుదూర సముద్ర ప్రాంతానికి నీలకంఠున్ని పంపుతాడు నీలకంఠునికి ఇష్టంలేకున్నా తండ్రి ఆజ్ఞ ప్రకారం వెళ్లక తప్పించుకాదు తండ్రి చెప్పిన ప్రదేశానికి వెళ్లి చక్కగా రత్నాల వ్యాపారం చేస్తుంటాడు అక్కడ అతని వ్యాపారం చాలా లాభదాయకంగానే సాగుతుంటుంది

ఇటు ఒంటిస్తంభం మేడలో జీవతావంతి ఒక్కతే నివసిస్తుంటుంది ఆమె మేడలో నుండి ఇవతలికి రావడానికిగానీ ఇవతలివాళ్లు మేడలోనికి వెళ్లడానికిగానీ ఏ మాత్రం అవకాశం లేకుండా రాజు కట్టుదిట్టం చేస్తాడు బయటి ప్రపంచంతో పూర్తిగా సంబంధాలు తెగిపోతాయి. భర్తలేని జీవితం ఆమెకు దుర్భరంగా ఉంటుంది భర్త పొందుకోసం ఆమె పరితపిస్తుంటుంది ఇట్లా రెండు సంవత్సరాలు గడచిన పిదప ఒక నాడు ఆ మేడపైనుండి పార్వతీ పరమేశ్వరులు వెళ్లుతుంటారు జీవతావంతి పడుతున్న విరహవేదన చూసి పార్వతి బాధపడుతుంది ఈమెకు సత్వరమే భర్తపొందు కలిగించ వలసిందిగా పార్వతి పరమేశ్వరున్ని కోరుతుంది కాని పరమేశ్వరుడు అట్లా తనకు వీలుకాదంటాడు ఐతే ఇదే రాజు నీలకంఠుడు ఈమెకో పొందు చెయగలిగితే మాత్రం ఈమె వెంటనే గర్భం ధరించే యోగమున్నదంటాడు అంతేకాక గర్భస్థశిశువు పుడమిపై జన్మించినవాడు రత్నాలవర్షం కురుస్తుందని పుట్టిన శిశువు కెవ్వుమని ఏడ్చినప్పుడు ఐదు రత్నాలు అతని నోట్లోనుండి రాలుతాయనీ చెప్తాడు ఇట్లా సంభాషించుకుంటూ పార్వతీ పరమేశ్వరులు వెళ్లిపోతారు వాళ్ల సంభాషణనంతా మేడపైభాగంలో ఉన్న రాజహంసలు వింటాయి ఎట్లాగైనా ప్రయత్నించి ఆదేరోజున నీలకంఠుని తీసుకి రావాలని నిర్ణయించుకుంటాయి అతన్ని వెదుకడంకోసం రాజహంసలు వెంటనే ఆకాశ మార్గంలో బయలుదేరి వెళ్లుతాయి ఎక్కడో దూరంలోఉన్న నీలకంఠుని కలిసి తమ రెక్కలపై అతన్ని కూర్చుండబెట్టుకొని తీసుకవచ్చి జీవతావంతి మేడలో దించుతాయి. నీలకంఠుడు ఆ రాత్రి జీవతావంతితో సంభోగిస్తాడు తాను గర్భం ధరిస్తే లోకం అనుమానిస్తుంది కనుక ఒక చిట్టిలో వాస్తవాన్ని వ్రాసి తన కివ్వవలసిందిగా జీవతావంతి కోరుతుంది నీలకంఠుడు చీటీమీద వ్రాస్తున్న సమయంలోనే జీవతావంతి అతనివద్ద నుంచి ఆనవాలుకోసం ఒక ఉంగరమునూ ఒక బాకునుకూడ తీసుకుంటుంది ఐతే తిరిగి వెళ్లిపోయే హడావిడిలో తాను వ్రాసిన చీటీని జీవతావంతికివ్వడం మరచిపోయి నీలకంఠుడు తన జేబులోనే పెట్టుకుంటాడు మళ్లీ తెల్లవారకముందే ఆ రాజ హంసలు అతన్ని ఎక్కడినుండితీసుక వస్తాయో అక్కడనె దించివస్తాయి ఇట్లా ఐదు మాసాలు గడుస్తాయి

ఒకనాడు రాణి తన కోడలు యోగక్షేమాలు చూడడం కోసం స్వయంగా బయలుదేరి ఒంటిస్తంభం మేడకు వస్తుంది జీవతావంతికి తలంటి నీళ్లు పోస్తున్న సందర్భంలో కోడలు గర్భవతిగా ఉన్నట్లు రాణి గమనిస్తుంది వెంటనే ఎవరివల్ల గర్భం ధరించినావని కోడలును నిలదీసి అడుగుతుంది కోడలు జరిగినవాస్తవాన్ని వివరించి చెప్తుంది రాణి ఆ మాటలు నమ్మక కోడలును నిప్పుకట్టెతో వాతబాదుతూ నిజం చెప్పాల్సిందిగా వేధిస్తుంది

వెంటనే వెళ్లి ఈ విషయమంతా రాణి తన భర్తతో విన్నవిస్తుంది రాజు వచ్చి అడిగినప్పటికీ జీవతావంతి అదే సమాధానం చెప్పుతుంది చివరికి నీలకంఠుని చేతి ఉంగరాన్ని బాకునూ తీసి చూపిస్తుంది ఐనా వాళ్లు నమ్మలేక పోతారు నీలకంఠుకు వ్రాసిన లేఖను చూపుదామనుకుంటే అది తనవద్ద లేకుండా పోతుంది నీలకంఠునివల్లనే గర్భం ధరించినట్లు రుజువు చేయడానికి ఆమెవద్ద మరే విధమైన దాఖలా లుండవు అత్తమామలు కోపించి జీవతావంతిని ఆమె పుట్టినింటికి పంపిస్తారు అక్కడ కూడ ఆమె తలిదండ్రులు జీవతావంతి గర్భవతిగా ఉన్నట్లు గమనిస్తారు. పాతి వ్రత్యాన్ని భంగపరచిందన్న కోపంతో తండ్రి అయిన మహాసరాజు ఆమె తలను ఖండిం చవలసిందిగా తన జ్యేష్ఠ కుమారుడైన రామ్‌ను కోరుతాడు అతడు తన సోదరిపై జాలి వహించి అందుకు నిరాకరిస్తాడు రాజు రామ్‌ను జైలులో వేయించి తన రెండవ కుమారుడైన ఇరాగ్రామ్‌ను అదే విధంగా ఆజ్ఞాపిస్తాడు అతడుకూడ ఆమెపై కరుణించి తల నరుకుటకు నిరాకరిస్తాడు రాజు ఈతన్నికూడ జైలులో వేయిస్తాడు మూడవ వాడైన పరశురామ్ అందుకు సిద్ధమవుతాడు తల నరుకుటకై జీవతావంతిని వెంట నిడుకొని ఒక అడవికి తీసుక వెళ్లతుంటాడు మార్గ మధ్యంలో ఆమెకు దాహం వేస్తుంది దప్పి తీర్చుకోవడం కోసం ఆమె ఒక దిగుడు బావిలోకి దిగుతూ సొషవచ్చి మెట్లపైననె పడిపోతుంది జీవతావంతి దుస్థితిని చూడగా పరశురామ్‌లో దయ జాలు వారుతుంది ఆమెను వధించకుండానే అక్కడే వదిలివేసి తిరిగి తన నగరం చేరు కుంటాడు ఆమెతల నరికినట్లు తన తండ్రితో అబద్ధం చెప్పుతాడు

ఇట్లా సొషవచ్చి బావిమెట్లపై పడిఉన్న జీవతావంతిని మంచినీళ్ల కోసం వచ్చిన ఐదుగురు వేశ్యలు చూస్తారు ఆమె గర్భవతిగా ఉన్నట్లు కూడ గమనించి ఆమెను తమ నివాసానికి రావలసిందిగా కోరుతారు జీవతావంతి ఆదరంతో కూడిన వాళ్ల ఆహ్వానాన్ని అంగీకరిస్తూనే ఆమె శీలాన్ని కాపాడు కోవడంకోసం మూడు శరతు లను విధిస్తుంది అవి—

(1) ఆమెను పరపురుషుల దృష్టిలో పడకుండా కాపాడాలన్నది (2) పనీ పాటల కోసం బజారుకు పంపించకుండా ఉంచడమన్నది (3) సీపురు పట్టించి ఊడ్పించకుండా ఉండడమన్నది వేశ్యలు ఈ మూడు కోరికల్ని ఆమోదించి ఆమెను తమ దర్యావటనగర్ తీసుకవెళ్లి సకల సదుపాయాలతో సంరక్షిస్తుంటారు అప్పుడు దర్యావటినగర్‌ను మంకాజీ అనే రాజు పరిపాలిస్తుంటాడు అతని భార్య పేరు కమలావలి ఈమె కూడ గర్భవతిగా ఉంటుంది నవమాసములు నిండగానె రాణి ప్రసవించి మగ శిశువును కంటుంది అతడు కురూపిగా ఉద్భవిస్తాడు అతన్ని చూచి రాణి ఏవగించుకుంటుంది తన కలాంటి పుత్రుడు జన్మించినందులకు బాధపడుతుంది చివరికి ఆమె కొక ఆలోచన తట్టుతుంది సరిగా ఇదే సమయానికి ఎక్కడైనా అందమైన పిల్లవాడు పుడితే అతి రహస్యంగా శిశువులను మార్చి వేయవలసిందిగా రాణి మంత్రసానిని ఆజ్ఞాపిస్తుంది. ఈ సమయానికే ఇటు జీవతావంతి కూడ ప్రసవించి అందమైన మగ పిల్లవాన్ని కంటుంది పిల్లవాడు దేదీప్యమానంగా వెలిగిపోతుంటాడు పూర్వం పరమేశ్వరుడు చెప్పినట్లుగానె పిల్లవాడు పుట్టిన సమయంలో అటు పొరేగాంవ్‌లో రత్నాలవాన పడుతుంది కెవ్వుమని ఏడ్చినప్పుడు ఇటు అతని నోట్లోనుంచి ఐదు రత్నాలు రాలి పడుతుంటాయి. జీవతావంతికి కూడ అదే మంత్రసాని పురుడు పోస్తుంది కనుక ఆమె రాణి చెప్పిన ప్రకారం రహస్యంగా శిశువుల్ని మార్చి వేస్తుంది పుత్రుని నోట్లోనుంచి రాలిన రత్నాల్ని తీసుకవెళ్లి మంత్రసానె దాచుకుంటుంది శిశువుల్ని మార్చివేసిన పిదప జీవతావంతి కురూపిగా ఉన్న శిశువును చూసి అసహ్యించుకుంటుంది ఇంతటి వికారమైన వాడు తన పుత్రుడని చెప్పుకోవడానికి బాధపడి అతన్ని ఎవరికైనా ఇచ్చి వేయవలసిందిగా చెప్పుతుంది శిశువును మరెవరికో ఇవ్వడం ఇష్టంలేక జీవతావంతికి ఆశ్రయం కల్పించిన వేశ్యలే ఈ శిశువును కూడ సంరక్షిస్తుంటారు ఆ శిశువుకు అగడుభవు అని నామకరణం కూడ చేస్తారు

అటు రాణివద్ద పెరుగుతున్న బాలుడు అద్భుతమైన తెలివి తేటల్ని ప్రదర్శిస్తుంటాడు. మోహనాకారంతో విరాజిల్లుతుంటాడు రాజబంధువులంతా అతనికి రత్నసారథి అని నామకరణం చేస్తారు క్రమంగా బాలుడు పెరిగి పెద్దవాడవుతాడు అతని కిప్పుడు సుమారు పన్నెండు సంవత్సరాల వయసుంటుంది ఒకనాడతడు తన మిత్రులతో కలిసి వేటకు బయలుదేరుతాడు అతడు గుఱ్ఱంపై స్వారీచేస్తు నగర వీధుల నుండి వెళ్లుతున్న సమయంలో జీవతావంతి స్నానంచేసి కురులు విప్పుకుంటూ మేడమీద నిలుచుంటుంది. రత్నసారథి అక్కడినుండి వెళ్లుతుండగా ఆమె సౌందర్యకళ అతని ముందు ప్రకాశిస్తుంది ఆశ్చర్యంతో అతడు మేడమీదికి చూడగానే జీవతావంతి అద్భు

తమైన సౌందర్య కాంతులతో దర్శనమిస్తుంది వెంటనే వేట తలంపు మానివేసి రాకుమారుడు గృహోన్ముఖుడై వెళ్ళిపోతాడు రాజభటుల్ని పంపించి ఆమె గురించిన వివరాలు తెలుసుకుంటాడు ఆమె నివసిస్తున్న ప్రాంతం వేశ్యావాటిక అని తెలుస్తుంది అందువల్ల అక్కడి వేశ్యలను పిలిపించి ఆనాటి రాత్రి జీవతావంతితో సంభోగించునట్లు తగిన ఏర్పాట్లు చేయవలసిందిగా ఆజ్ఞాపిస్తాడు కాని అంతకుముందే పరపురుషుల కన్ను పడకుండా జీవతావంతిని కాపాడుతామని వేశ్యలు మాట ఇచ్చి ఉన్నందున అందుకు వాళ్ళ నిరాకరిస్తారు ఐనా చివరికి రాకుమారుని ఆజ్ఞను శిరసావహించక తప్పలేదు వేశ్యలు అప్పటికేదో విధంగా అంగీకరించి వచ్చి జీవతావంతితో జరిగిన విషయమంతా విన్నవిస్తారు తమ కంతకన్నా గత్యంతరం లేదనికూడ దీనంగా వేడుకుంటారు జీవతావంతి ఏమీ చేయడానికి తోచక దైవంమీద భారంవేసి ఉంటుంది ఆనాటి రాత్రి రాకుమారుడు చక్కగా శృంగారించుకొని జీవతావంతిని సంభోగించుటకు ఆమె ఉంటున్న మేడమెట్లు ఎక్కుతుంటాడు దీన్ని పార్వతీ పరమేశ్వరులు గమనించి ఈ అత్యాచారం జరుగకుండా చూడాలని నిర్ణయించుకుంటారు వెంటనే వాళ్ళు ఆవు దూడల రూపం ధరించి మేడమెట్లపై అడ్డంగా పడుకుంటారు రాకుమారుడు దూడను తొక్కుకుంటూనె మేడ ఎక్కుతుంటాడు అప్పుడు దూడ అరుస్తుంది తల్లితోనె సంభోగం కోరె మూర్ఖునికి మనమొక లెక్కా అంటూ ఆవు దూడను ఓదారుస్తుంది ఆమాటలు విన్న రాకుమారుడు అదొక అపశకునంగా భావించి ఆనాటికి తన ప్రయత్నాన్ని విరమించుకొని తిరిగి తన ఇంటికి వెళ్ళిపోతాడు పశువుల్ని విచ్చలవిడిగా తిరుగనివ్వకుండా కట్టుదిట్టం చేయాలని నిర్ణయించుకుంటాడు మరునాడు నగరంలోని రైతులందరిని పిలిపించి ఎవరి పశువుల్ని వాళ్ళ రాత్రిళ్ళ వారివారి దొడ్లలో జాగ్రత్తగా కట్టివేయాలనీ ఒక్కదాన్నికూడ బయట తిరుగనివ్వకూడదనీ ఆజ్ఞాపిస్తాడు రైతులంతా అట్లాగే రాజాజ్ఞను పాటిస్తారు ఆనాటి రాత్రి మళ్ళీ రత్నసారధ చక్కగా అలంకరించుకొని జీవతావంతి మేడకు బయలుదేరుతాడు గత రాత్రి మాదిరిగానె పార్వతీ పరమేశ్వరులు మళ్ళీ ఆవు దూడల రూపంతోవచ్చి మేడ మెట్లపై అడ్డంగా పడుకుంటారు రెండవ రోజు కూడ అదే విధంగా జరుగుతుంది కాని ఈసారి వాటి మాటలు లెక్కచేయకుండా రాకుమారుడు మేడమెట్లెక్కి జీవతావంతి గదిలో ప్రవేశిస్తాడు ఆమెను చూడగానే అప్రయత్నంగా అతని నోటినుంచి 'అమ్మా' అన్న మాట వెలువడుతుంది జీవతావంతి నోటినుంచి కూడ వెంటనే 'కుమారా' అన్న పలుకు వెలువడుతుంది. అప్పుడు రాకుమారుడు తనలో తాను వితర్కించుకుంటాడు ఆమె పుట్టుపూర్వోత్తరాల గురించి అడుగుతాడు అప్పుడామె జరిగిన కథంతా మొదటినుంచీ తెలుపుతుంది తనకు పుత్రుడు జన్మించినప్పుడు రత్నాల వర్షం కురుస్తుందనీ శిశువు ఏడ్చినప్పుడల్లా ఐదు రత్నాలు నోట్లో

నుంచి రాలతాయనీ పరమేశ్వరుని వరమున్నట్లుకూడ వివరిస్తుంది. ఇదంతా విని రాకుమారు డామెను సగౌరవంగా తీసుకొనివెళ్లి తన ప్రత్యేక సంరక్షణలో ఉంచుతాడు. దీని గూర్చి పూర్తిగా ఆరా తీయాలనుకుంటాడు.

ఇదంతా జరిగిన కాలంనాటికి అటు నీలకంఠునికి పన్నెండు సంవత్సరాలు రత్నాలవ్యాపారం చేయవలసిఉన్న గడువు పరిసమాప్తమవుతుంది. వ్యాపారం ముగించుకొని ఆతడుముందుగా తన తండ్రి పరిపాలించే బోరేగాంకు వెళ్లతాడు. తన భార్యను కలుసుకోవాలని ఉవ్విళ్లూరుతూ ఒంటిస్తంభం మేడలో ప్రవేశిస్తాడు. అక్కడ ఆతని కెవ్వరూ కనిపించరు. వెళ్లి తలిదండ్రుల్ని ప్రశ్నిస్తాడు వాళ్లు జరిగిన కథంతా కుమారునికి వినిపించి ఆమెను పుట్టినింటికి పంపినట్లు తెలుపుతారు. ఇందులో పెద్ద మోసం జరిగిందని బాధపడుతూ నీలకంఠుడు ఆమె పుట్టినింటికి వెళ్లతాడు. అక్కడ తన మామగారైన షాహూసరాజు జీవతావంతి ఒక అడవిలో వధింపబడినట్లు తెలుపుతాడు. అప్పుడు నీలకంఠు డెంతో విలపిస్తుండగా బావమరదియైన పరశురామ్ ఆమెను తాను వధించకుండా అడవిలో ఒక బావివద్ద వదలి వేసివచ్చినట్లు విన్నవిస్తాడు. వెంటనే నీలకంఠుడు జీవతావంతిని వెతుక్కుంటూ దర్యాపటనగర్ చేరుకుంటాడు. నగరంలోనికి వెళ్లకుండా ఆతన్ని నగర పాలకులు అడ్డగిస్తారు. మాటల సందర్భంలో తాను నీలకంఠ కథ వినిపించగల నని వాళ్లతో విన్నవించుకుంటాడు. ఈ విషయాన్ని రాజభటులు వెళ్లి రత్నపారథికి తెలుపుతారు. జీవతావంతి ద్వారా ఇంతకుముందే ఈ కథ కొంత విన్నవాడు కనుక వెంటనే ఆతడు నీలకంఠుని తన సభకు రప్పించుకుంటాడు. ఆ సభలో రత్నపారథిని పెంచుకున్న రాజ దంపతులూ, పురుడు పోసిన మంత్రసానీ, తల్లి అయిన జీవతావంతి మొదలైన వాళ్లంతా ఉంటారు. ఆ నిండు సభలో నీలకంఠుడు తమ వృత్తాంతాన్నంతా కథగా వినిపిస్తాడు. ఈ కథ సందర్భంలో తాను పుట్టినప్పుడు బోరేగాంలో రత్నాల వర్షం కురిసినట్లు రత్నపారథి గమనిస్తాడు. తన పుట్టుక రహస్యాన్ని ఇంకా స్పష్టంగా తెలిసికో గోరి తనకు తల్లినని చెప్పుకుంటున్న రాణిని ప్రశ్నిస్తాడు. మొదట ఆమె వాస్తవాన్ని చెప్పడానికి జంకినప్పటికినీ, చివరికి యథార్థాన్ని వెల్లడిస్తుంది. ఆమె చెప్పిందంతా నిజమేనా అని రత్నపారథి మంత్రసానిని ప్రశ్నిస్తాడు. రాణి కోరిక మేరకు తానావిధంగా చేసినట్లు మంత్రసాని అంగీకరిస్తుంది. అంతేకాక రత్నపారథి కెవ్వుమని ఏడ్చినప్పుడు ఐదు రత్నాలు ఆతని నోట్లో నుంచి రాలినట్లు కూడా తెలుపుతుంది. తాను దాచుకున్న ఐదు రత్నాలను తీసుకవచ్చి అందరికీ చూపెడుతుంది. దీనితో అందరికీ సందేహనివృత్తి కలుగుతుంది. రత్నపారథి జీవతావంతి కుమారుడే అన్న సంగతి రూఢి అవుతుంది.

కాని దీన్ని సభాజనుల ముందు రూఢి పరచాలని రత్నపారధి భావిస్తాడు జీవతావంతికి తనకూ మధ్య ఒక పరదా వేయిస్తాడు. నిజంగా ఆమె తన తల్లే కనుక అవుతే ఆమె స్తనముల నుండి పాలధారలు చిమ్మి తన నోట్లోపడాలని పరీక్ష పెడుతాడు. అప్పుడు జీవతావంతి శంకరుని ధ్యానించగా ఆ విధంగానే జరుగుతుంది అప్పుడంతా సంతోషిస్తారు రత్నపారధి తన తలి దండ్రులకు సవినయంగా మ్రొక్కుతాడు నీల కండుడు కూడ తానుపూర్వం వ్రాసిన పత్రమును చూపించి జీవతావంతిని పరిగ్రహిస్తాడు

తరువాత అగడుభవుకు ఆ రాజ్యాన్ని అప్పగించి వాళ్లంతా ముందు కాశీ నగర్‌కు వస్తారు అక్కడ బందిఖానాలో మ్రగ్గుతున్న రామ్ ఇబ్రాహిమ్ అనే తనమేన మామల్ని రత్నపారధి చెరనుండి విడిపిస్తాడు పరశరామ్‌ను అభినందిస్తాడు. అక్కడి నుండి రత్నపారధి తన తలి దండ్రులను వెంట నిడుకొని తమ బొరేగాంవ్‌నగరం చేరు కుంటాడు తనతాత నాయనమ్మలు చేసిన తప్పిదమునకు వాళ్లను మెత్తగా మందలిస్తాడు తరువాత ఆ రాజ్యానికి రాజై తలి దండ్రులతో సుఖంగా గడువుతుంటాడు

# ౫. భట్టి విక్రమార్కుని కథ

బంబెనగర్‌ను భదేజి అనేరాజు పరిపాలిస్తుంటాడు ఈతని అన్నపేరు భర్త్రాజి
భర్త్రాజి రాజ్య పరిపాలనలో ఏ మాత్రం జోక్యం చేసుకోకుండా యోగులతోనూ సన్యా
సులతోనూ సహవాసం చేస్తుంటాడు రాజ్యంనుండి వెళ్లిపోయి కొంతకాలం ఆతడు
గోసాయీలతో స్నేహంచేసి వాళ్లద్వారా కొన్ని విద్యలనూ మహిమలనూ నేర్చుకుం
టాడు ఈతడెప్పుడూ దైవచింతనలో మునిగి దేశాలు తిరుగుతుంటాడు

భదేజికి ఇద్దరు భార్యలు పెద్దభార్యపేరు తులసీబాయి చిన్నభార్యపేరు
రత్నాబాయి తులసీబాయి అంత అందమైనదికాదు రత్నాబాయి అందచందాలకు
వశుడై రాజు ఎప్పుడూ ఆమెవద్దనే ఉంటాడు తులసీబాయికి ఊరిబయట ఒక చిన్న
గుడిసె వేయించి అందులో ఉంచుతాడు ఆమెను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుంటాడు

ఇట్లా ఉంటూఉండగా భర్త్రాజి గోసాయిగా మారి తిరిగితిరిగి ఒకనాడు బంబే
నగర్‌కు వస్తాడు ఊరి బయట ఒక లేత మామిడి తోటలో మఠం నిర్మించుకొని
అక్కడ నివసిస్తుంటాడు ఈతనివద్ద కొన్ని మహిమలున్నందున నగర ప్రజలంతా
ఆయనవద్దకు వస్తూ ఆతని సేవించి వెళ్లుతుంటారు వాళ్ల కష్టసుఖాలు నివేదించు
కుంటూ ఆతనివల్ల బాగుపడుతుంటారు తులసీబాయికి కూడ ఈ సంగతి తెలుస్తుంది
ఆమె కూడ వచ్చి గోసాయిని సేవించి ఆతని అనుగ్రహం పొందగలుగుతుంది ఐతే
ఆతని నెవ్వరుకూడ భర్త్రాజీగా గుర్తించజాలరు ఇట్లా కొంతకాలం గడిచినాక తులసీ
బాయి భక్తికి మెచ్చి భర్త్రాజి ఏమికావాలో కోరుకొమ్మంటాడు తులసీబాయి తాను నివ
సించే గుడిసె అష్టైశ్వర్యాలతో కూడిన రాజభవనంగా మారాలనీ తనకు అందమైన
శరీరాన్ని ప్రసాదించాలనీ భర్త్రాజీని కోరుతుంది అట్లాగే అనుగ్రహిస్తానని ప్రకటించి
ఆతడు తులసీబాయిని తన ఇంటికి వెళ్లవలసిందిగా ఆజ్ఞాపిస్తాడు నాటి రాత్రి భర్త్రాజి
వచ్చి ఆమె గుడిసెచుట్టూ మంత్రజలం చల్లి ఆమె కోరిన విధంగానే రాజభవనంగా
మారుస్తాడు ఆమెకు మిక్కిలి అందమైన శరీరాన్ని కూడ ప్రసాదిస్తాడు

కొంతకాలం జరిగిన పిదప రాజుగారి చిన్నభార్య రత్నాబాయి ఒకనాడు స్నానంచేసి తలవెంట్రుకలు ఆరబోసుకుంటూ తన మేడపై నిలుచుండి తులసీబాయి సుందరభవనాన్ని దర్శిస్తుంది అది తన సవతియైన తులసీబాయిదని కూడ తెలిసి కుంటుంది ఆమె కీ భవనం ఎట్లా వచ్చిందోతెలిసికోవడం కోసం రత్నాబాయి వెంటనె బయలుదేరి వచ్చి తులసీబాయి భవనం చేరుకుంటుంది తన ఇంటికివచ్చిన రత్నాబాయిని తులసీబాయి ఎంతో గౌరవ మర్యాదలతో సత్కరిస్తుంది ఆమెకు తలంటి స్నానం చేయించేందుకు కూడ వేడినీళ్లు వగైరా సిద్ధం చేస్తుంది కాని నల్లగా నిగనిగలాడుతున్న తులసీబాయి కొప్పును కొంత కత్తిరించుకుందామన్న దురూహతో రత్నాబాయి ప్రేమను నటిస్తూ తులసీబాయికి తలంటి స్నానం చేయిస్తుంటుంది ఇదే సమయంలో అటు భర్తాజీకి మధ్యాహ్న భోజన సమయమవుతుంది ఎప్పటి మాదిరిగా తులసీబాయి తనకు ఆహారం తీసుకొని రానందున భర్తాజీయే స్వయంగా తులసీబాయి ఇంటికి భిక్షకోసం బయలుదేరి వస్తాడు అతడు వచ్చి ఇంటిముందు నిల్చుండి భిక్షకోరగానే తులసీబాయి తన ఏమరుపాటుకు కంగారుపడుతూ వస్త్రములు ధరించకుండానే భిక్ష తీసుకొని వెళ్లి అతని పాత్రలో వెయబోతుంది భర్తాజీ ఇది కనిపెట్టి తన ముఖం త్రిప్పుకుంటాడు తులసీబాయి తాను చేసిన పొరపాటును గ్రహించి వెంటనె లోపలికివెళ్లి వస్త్రములు ధరించి వచ్చి భిక్ష వేయగా భర్తాజీ వెళ్లిపోతాడు ఇదంతా గమనిస్తున్న రత్నాబాయి తులసీబాయి ప్రవర్తనలో ఏదో కళంకం ఉందని భావిస్తుంది వెంటనే భర్తవద్దకు వెళ్లి జరిగిన సంగతంతా వివరించి తులసీబాయికీ గోసాయికీ ఏదో అక్రమ సంబంధమున్నదని నూరిపోస్తుంది ఈమె మాటల్ని నమ్మి భటేజి ఉగ్రుడై వెంటనే తులసీబాయి మందిరానికి వస్తాడు అతడు ఆమెను కత్తితో నరుకబోగా కత్తి పూలహారమై ఆమె మెడలో పడుతుంది ఐనా రాజు ఆమె శీలాన్ని శంకిస్తుండే ఉన్నవాస్తవాన్నంతా ఆమె రాజుకు విన్నవిస్తుంది ఐతే ఈమె మాటల్ని పరీక్షించడంకోసం రాజు కూడ గోసాయిని చేరి సేవిస్తుంటాడు కొంతకాలం సాగినపిదప రాజు తనకుకొన్ని విద్యలూ మహిమలూ నేర్పవలసిందిగా గోసాయిని కోరుతాడు అతడు తనకువచ్చిన విద్యలన్నీ రాజుకు నేర్పుతాడు నిప్పు లేకుండా దీపాలు వెలిగించడంవంటి విద్యలు నేర్పినపిదప పరకాయ ప్రవేశ విద్యనుకూడ నేర్పుతుంటాడు సరిగా ఇదే సమయానికి రాజును వేటకు తీసుకపోవడం కోసం మోతాజి అనే ప్రధాని ఈ మఠానికి వస్తాడు గోసాయి రాజుకు పరకాయ ప్రవేశవిద్యను నెర్పుతున్నట్లు గమనించి మోతాజి గోడచాటుగా ఉండి రహస్యంగా పరకాయ ప్రవేశవిద్యను తానకూడ నెర్చుకుంటాడు ఈ సంగతి ఎవ్వరికీ తెలియదు తనకు వచ్చిన విద్యలన్నీ రాజుకు నేర్పడం పూర్తికాగానె గోసాయి ఇతర ప్రదేశానికి వెళ్లిపోవడానికి ప్రయాణమవుతాడు. అతడు వెళ్లిపోతూ ఆరు

మాసాలదాకా ఇంటినుండి బయటకు వెళ్లకూడదనీ వెళ్లితే ప్రమాదం వాటిల్లుతుందని రాజును హెచ్చరిస్తాడు రాజుకు గొప్పగొప్ప విద్యలు వస్తాయన్న విషయం పట్టణమంతా ప్రచారమవుతుంది ప్రజలంతా హర్షిస్తారు ఐతే ప్రధానికి ఒక్క పరకాయ ప్రవేశ విద్యమాత్రమే అబ్బింది

ఇట్లా కొంతకాలం గడిచిన పిదప రాజును ఏదో విధంగా హతమార్చి రాజ్యాన్ని హస్తగతం చేసుకోవాలని ప్రధానికి దుర్బుద్ధి పుడుతుంది రైతులకు క్రూర మృగాలవల్ల చాలా నష్టం వాటిల్లుతున్నదని రాజును నమ్మించి వేటకు బయలుదేరునట్లు ప్రోత్సహిస్తాడు అప్పటికి గోసాయి విధించిన ఆరుమాసాల గడువుకూడ పూర్తికానందున తులసిబాయి ఇల్లు వదలకూడదని వారిస్తుంది ఐనా రాజు వినక సాయంత్రం వరకల్లా తిరిగి తాను పట్టణం చేరుతానని పట్టణంలో అడుగుపెట్టగానే తన విద్యా మహిమతో పట్టణమనంతా దీపాలతో వెలిగిస్తాననీ రాజు తులసిబాయికి ధైర్యం చెప్పుతాడు రాజు మరియు ప్రధాని గుర్రాలనధిరోహించి కొంతసైన్యాన్ని కూడ వెంట తీసుకొని వేటకు బయలుదేరి వెళ్లుతారు సాయంత్రందాకా అడవిలో వేటాడి అందరూ తిరిగినగరానికి వస్తుంటారు సైన్యం ముందు నడుస్తుంటుంది ప్రధాని దురుద్దేశంతో మార్గ మధ్యంలో ఒక పొన్నచెట్టుకింద విశ్రమిద్దామని రాజును ఆపుతాడు అక్కడ వీళ్లిద్దరు మాత్రమే ఉంటారు అప్పుడు పరకాయ ప్రవేశ విద్యను ప్రదర్శించవలసిందిగా ప్రధాని రాజును కోరుతాడు రాజు మొదట అంగీకరించక పోయినప్పటికీ ప్రధాని ప్రేరణతో అందుకు సిద్ధమవుతాడు ప్రధాని ఒక చచ్చిన పామును చూపించగా రాజు పరకాయ ప్రవేశ విద్యతో అందులో ప్రవేశిస్తాడు వెంటనే పాముకు ప్రాణం వచ్చి పడగ విప్పి ఆడుతుంటుంది ఈ అదను కనిపెట్టి ప్రధానికూడ పరకాయ ప్రవేశ విద్య సహాయంతో రాజు శరీరంలో ప్రవేశించి తన శరీరాన్ని ముక్కలుముక్కలుగా ఖండించి చెల్లా చెదురుగా పారవేస్తాడు తరువాత పాము రూపంలో ఉన్న రాజును సంహరించడానికి దానివెంట బడుతాడు అది ఒక పుట్టలో దాగి ప్రాణం కాపాడుకుంటుంది ఎంత ప్రయత్నించినా దాన్ని చంపలేక రాజు శరీరాన్ని ధరించిన ప్రధాని నగరం చేరుకుంటాడు రాజు మందిరంలోనికి వెళ్లగానే అతని ప్రవర్తన మరియు మాటల తీరునుబట్టి రాణులు అతన్ని సందేహిస్తారు పైగా రాజు వేటకు వెళ్లుతూ తాను తిరిగి పట్టణం చేరగానే దీపాలతో పట్టణాన్ని వెలిగిస్తానని తన రాకకు ఆనవాలుగా చెప్పి వెళ్లి ఉండెను అట్లా జరుగనందుకు కూడా రాణులు ఏదో మోసం జరిగిందని భావిస్తారు అతడు రాణివాసం లోనికి ప్రవేశించడానికి వీలులేకుండా తలుపులు బిగించుకొని లోపలనే ఉండిపోతారు అతడు మాత్రం తానే రాజునని ప్రజల్ని మోసంచేస్తూ పరిపాలన సాగిస్తుంటాడు.

ఇట్లా పాము శరీరంలో ప్రవేశించిన భటేజి గుట్టలూ పుట్టలూ తిరుగుతూ ఎన్లలేని పింపల్‌గాంవ్ శివారులోనికి వస్తాడు ఆ ఊరిలో ఒక రైతు తన తెల్లజొన్న చేను కావలికాస్తుంటాడు ఈనిన జొన్నచేనులో గంగ రామచిలుకలు వాలి గింజలు ఎక్కతుంటాయి అతడు వడిశెలితో కొట్టగా రాయితాకి ఒక చిలుక మరణిస్తుంది ఇవి మొత్తం వంద చిలుకలు అందులో ఒకటి పోగా తొంభైతొమ్మిది రామచిలుకలు వెంటనె అక్కడినుంచి లేచి తమకు నివాసంగా ఉన్న అశోక వృక్షంపై చేరుతాయి ఆ పాము తిరుగుతూ తిరుగుతూ సరిగా ఈ సమయానికే ఇక్కడికి వస్తుంది. పాము కన్నా చిలుక శరీరం నిరపాయకరమైందని భావించి భటేజి ఆ పాము శరీరం వదిలి చనిపోయి పడిఉన్న చిలుక శరీరంలో ప్రవేశిస్తాడు. వెంటనే ఆ చిలుక ప్రాణంతో మళ్లీ లేచి ఆకాశయానంచేస్తూ వచ్చి తమ తోటి రామచిలుకలున్న అశోక వృక్షంపై వాలుతుంది చనిపోయిన రామచిలుక మళ్లీ బ్రతికి రావడం వాటికి ఆశ్చర్యంగాఉంది ఎట్లా బ్రతికి వచ్చినావని ప్రశ్నిస్తాయి తాను మరణించగానే దేవేంద్రుడు తనలోకం తీసుకవెళ్లి అక్కడ తనకు సమస్త విద్యలు నేర్పించి తిరిగి భూలోకానికి పంపించినాడని అది సమాధానం చెప్పుతుంది మిగతా రామచిలుకలన్నీ దాని మాటలు నమ్మి ఆ చిలుకనె తమ నాయకుడుగా ఎరించి అది చెప్పినట్లుగా నడుస్తూ ఉంటాయి భటేజి చిలుక రూపంతో అశోక వృక్షంపై నివసిస్తూ అప్పుడప్పుడు తన దైన్యస్థితిని గురించి విలపిస్తూ తనలో తాను బాధపడుతుంటాడు

ఇట్లా ఉంటూఉండగా ఒక పిట్టలవాని భార్య గర్భవతిగా ఉంటుంది ఒక నాడు ఆమెకు చిలుకకూర తినాలని బుద్ధి పుట్టగా ఆమె కోరికను తీర్చడంకోసం ఆమె భర్త చిలుకను వేటాడుతూవచ్చి ఈ అశోక వృక్షం వద్దకు చేరుతాడు దానిపై నివసిస్తున్న నూరు రామచిలుకల గూళ్లకు ఉచ్చులవన్నీ వెళ్లిపోతాడు ఎప్పటి మాదిరిగా రామచిలుకలు వచ్చి తమతమ గూళ్లలోనికి వెళ్లబోతుండగా అవన్నీ ఉచ్చుల్లో చిక్కుకుంటాయి జరిగిన మోసానికి వగచి వీటికి నాయకత్వం వహిస్తున్న పెద్ద చిలుకను ఉపాయమడుగుతాయి అప్పుడది- పిట్టలవాడు వచ్చినప్పుడు అవన్నీ చచ్చినట్లు నటించాలని అప్పుడు తాళ్లతో బంధించడం అవసరమని భావించి పిట్టలవాడు ఒక్కొక్క రామచిలుకను పైనుండి క్రింద పడవేస్తాడనీ ఇట్లా వడుసగా వంద చిలుకలు క్రింద పడగానె ఒక్కుమ్మడిగా అన్నీకలిసి ఎగిరిపోవాలనీ ఉపాయం చెప్పుతుంది. తమ నాయకుడు చెప్పిన విధంగానే రామచిలుకలు నటిస్తాయి పిట్టలవాడు అవన్నీ చని పోయినాయన్న భావంతో ఒక్కటొకటే కిందవేస్తుంటాడు తొంభైతొమ్మిది రామ చిలుకల్ని కిందవేసిన పిదప పొరపాటున ఆతని నడుముకున్న బాకుజారి కిందపడుతుంది

దానిని చివరి రామచిలుకగా భావించి ఆతురతతో క్రిందపడిన తొంభైతొమ్మిది రామ చిలుకలు ఆకాశంలోనికి ఎగిరి పోతాయి వెంటనే ఈ మోసాన్ని గమనించి పిట్టలవాడు ఆఖరి రామచిలుకను కింద పడవేయకుండా పట్టుకొని వలలో వేసుకుంటాడు. ఈ విధంగా ఉపాయం చెప్పిన రామచిలుకే పిట్టలవానికి చిక్కుతుంది అదే భరెజి అన్న మాట రామచిలుకలన్నీ మోసంచేసి పారిపోయినందుకు కినుకవహించి పిట్టలవాడు దీన్నికూర వండుకొవడంకోసం భార్య కిద్దామని తీసుక వెళ్లతుంటాడు దారిలో అది పిట్టలవానితో సంభాషణసాగించి తనను ఎవరికైనా అమ్మితే చాలా సొమ్ము వస్తుందనీ దానితో ఎన్ని చిలుకలనైనా పొందవచ్చుననీ ఎంత సౌఖ్యమునైనా అనుభవించవచ్చు ననీ సలహా ఇస్తుంది దాని సలహా పాటించి అతడు పింపల్‌గాంవ్‌ను పరిపాలించే సూర్యభాన్ అనె రాజుకు ఐదు వరహాలకు అమ్మివేస్తాడు ఈ పింపల్‌గాంవ్‌లో నీళ్ల లభించవు ఒకే ఒక్క మంచినీళ్ళ బావి ఉంటుంది అందువల్ల చిన్ని నీళ్లలేని పింపల్‌గాంవ్ అంటారు.

సూర్యభానుడీ రామచిలుకను ఎంతో ప్రేమతో పెంచుతుంటాడు అది ఈతని రాజకార్యములలో కూడ సహకరిస్తూ ఉచిత సలహాలిస్తుంటుంది అద్భుతమైన దాని తెలివి తేటల్నిచూసి రాజు ఆనందిస్తుంటాడు ఆ రామచిలుకకు విక్రమసేన్ అని ముద్దుగా నామకరణంకూడ చేస్తాడు ఇట్లా ఉండగా ఒకనాడు పక్షులన్నీ గుంపులు గుంపులుగా కలిసి ఆకాశమార్గంలో వెళ్లతుంటాయి అవెక్కడికి వెళ్లతున్నాయని సూర్యభానుడు ఈ రామచిలుక నడుగుతాడు అది పక్షుల భాషలో ఆ వెళ్లే పక్షుల నడిగి కారణం తెలుసుకుంటుంది దేవేంద్రుడు యజ్ఞంచేసి పక్షులన్నింటికీ అమృత ఫలాలు దానం చేస్తున్నాడనీ వాటికోసం ఈ పక్షులన్నీ దేవలోకం వెళ్లతున్నాయనీ రామచిలుక తెలుపుతుంది ఒక అమృత ఫలాన్ని తమకోసం భూలోకానికి తీసుకరావ దానికై సూర్యభాను డీ రామచిలుకనుకూడ దేవలోకం పంపిస్తాడు అమృత ఫలాలను దేవలోకంలోనే తినాలి తప్ప భూలోకం తీసుకవెళ్లకూడదని దేవేంద్రుని ఆజ్ఞ ఐనా ఈ రామచిలుక దేవలోకంలో తినగలిగినంతవరకు తిని ఒక అమృతఫలాన్ని రహస్యంగా భూలోకానికి తెస్తుంది నేరుగా రాజువద్దకు వెళ్లి ఆ అమృతఫలాన్నిచ్చి అతని మన్న నలకు పాత్రమవుతుంది రాజు అమృత ఫలాలను వృద్ధిచేయాలన్న ఉద్దేశంతో దాన్ని తన తోటలో నాటించి ప్రతి నిత్యం నీళ్ల పోయిస్తుంటాడు అది క్రమంగా వృక్షమై ఒకే ఒక్క కాయకాస్తుంది అది పండు పండి తానంతట అదే రాలేదాకా ఎవరూముట్ట కుండా ఉండేందుకు రాజు దానికి గట్టి కాపలా పెడుతాడు. అది పండి క్రిందికి రాలు తున్నప్పుడు నేలమీద పడకుండా దోసిళ్లతో దాన్ని అందుకొని తీసుకవచ్చి తనకప్పు

గించాలని రాజు కాపలాదారులకు హెచ్చరిస్తాడు  కాని అమృత ఫలం దొరగాపండి క్రింద రాలినప్పుడు కాపలాదారు నిద్ర పోతుంటాడు  ప్రక్కనే ఒక పుట్టలో నివసిస్తున్న ఒక నాగుపాము దీన్ని గమనించి వచ్చి అందులోని అమృతమునంతా త్రాగి తన విషాన్ని అందులో నింపి వెళ్లి పోతుంది.  కాపలాదారుడు నిదుర నుండి లేచి చూచి నేలమీద పండు పడడం గమనించి దాన్ని తీసుకొని వెళ్లి రాజు కిప్పగిస్తాడు  రాజు తన రాజ్యంలోని ప్రముఖులనందరిని ఆహ్వానించి అమృత ఫలాన్ని ముక్కలు ముక్కలుగా తరిగి విడియములలో పెట్టి పంచిపెడుతాడు  విడియములను నమిలి మ్రింగగానే వాళ్లంతా అక్కడికక్కడే మరణిస్తారు  ఈ అనర్థానికంతకూ ఈ రామచిలుకే కారణమని భావించి రాజు దాన్ని పంజరంలో బంధించి నానారకాలుగా బాధ పెడుతుంటాడు  సరియైన తిండి పెట్టక దాన్ని హింసిస్తుంటాడు  ఇట్లా కొంతకాలం జరిగిన పిదప ఆ పట్టణానికి బహురూపులవాళ్లు వస్తారు  వాళ్ల వేషాలు కట్టి రాజును సంతోష పెడతారు  ఏమి కావాలో కోరుకొండని రాజు వాళ్లనడుగుతాడు  రహస్యంగా అంతకు ముందే రామచిలుక చెప్పిన సలహాను పాటించి ఆ బహురూపులవాళ్లు తమకు రామచిలుక తప్ప మరేదీ వద్దంటారు.  ఆ ప్రకారంగానే రాజు వాళ్లకు చిలుకను బహూకరిస్తాడు  తరువాత బహురూపులవాళ్లు చిలుక కోరిక ప్రకారం దాన్ని తీసుకొని బంబేనగరం చేరుకుంటారు అక్కడకూడ ఈ రామచిలుక కోరిక ప్రకారంగానే బహురూపులవాళ్లు దాన్ని గంగిశెట్టి అనే ఒక షావుకారుకు పది వరహాలకు అమ్మి వేస్తారు  ఈ షావుకారు మంచి పేరు ప్రతిష్ఠలున్నవాడు.  అతని భార్య పేరు అలివేణి

ఈ చిలుకను కొన్ననాటినుండి షావుకారుకు వ్యాపారం బాగాసాగి మంచి లాభాలు వస్తుంటాయి  చిలుక అతని వ్యాపారాభివృద్ధిలో ఎంతో సహకరిస్తుంటుంది ఐతే ప్రతిరోజు సాయంత్రం కాగానే గంగిశెట్టి వందరూపాయలు తీసుకొని ఒక వేశ్య ఇంటికి వెళ్లుతుంటాడు.  ఆమెపేరు మీరాబాయి  ప్రతి నిత్యం షావుకారు వేశ్యకోసం వందరూపాయలు ఖర్చుపెట్టడం రామచిలుకకు నచ్చదు  దీన్ని మాన్పించాలని రామచిలుక భావించి అలివేణిని చక్కగా శృంగారింపజేసి వేశ్యవలెనె వేషం వేయించి షావుకారును ఆకర్షింప జేస్తుంది.  వేశ్య అనే భ్రాంతితోనే షావుకారు తన భార్యను అనుభవిస్తాడు  చివరికి నిజం తెలిసినప్పుడు తన తప్పుకు తానే సిగ్గుపడుతాడు అతడు తన భార్యను మనసారా ప్రేమిస్తూ క్రమంగా వేశ్యను మరచిపోతాడు  వరుసగా ఐదు రోజులు షావుకారు తన ఇంటికి రానందున మళ్లీ అతన్ని ఆకర్షించడం కోసం వేశ్య సంగీత వాయిద్యాలతో వచ్చి అతని ఇంటిముందు నాట్యం చేస్తుంటుంది.  షావుకారు ఇట్లా మారిపోవడానికి కారణం ఈ రామచిలుకే అనికూడ తెలిసికొంటుంది.  ఆమె

నాట్య కళాకౌశలానికి అలరి షావుకారు ఏమి కావాలో కోరుకొమ్మని మీరాబాయి నడుగుతాడు ఆమె రామచిలుకను కోరుకుంటుంది ఏమాత్రం కృతజ్ఞతా భావంలేకుండా అతడు రామచిలుకను వేశ్యకు దానం చేస్తాడు ఆమె రామచిలుకను తీసుకొని ఇంటికి వచ్చి తననుండి షావుకారును విడదీసినందుకు పగసాధించాలని భావిస్తుంది తన దాసీదానిని పిలిచి రామచిలుకను కోసి కూరవండి పెట్టవలసిందిగా ఆజ్ఞాపిస్తుంది ఆ దాసీది రామచిలుకను వంటింట్లోకి తీసుకెళ్ళి రెక్కలు మాత్రం నరికి ఒక గంపకింద దాచి పెట్టి వంటకు కావలసిన ఇతర వస్తువులు తేవడంకోసం బజారుకు వెళ్తుంది ఈ అదను కనిపెట్టి చిలుక ఎలాగో సందుచేసుకొని గంపక్రిందినుండి బయటపడుతుంది దాసీది తిరిగివచ్చి గంపకింద చిలుక లేకపోయేసరికి తన యజమాని ఆగ్రహిస్తుందని భయపడుతుంది కానీ ఇంతలో ఒక ఉపాయం తట్టగా బజారుకు వెళ్లి మరొక రామ చిలుకను కొనుక్కువచ్చి వేశ్యకి రహస్యం తెలియనివ్వకుండా కూరవండి పెడుతుంది మీరాబాయి తన కసితీర చిలుకకూర రుచి చూస్తూ భోజనం చేస్తుంది

అట్లా రెక్కలు తెగి బ్రతికి బయటపడిన రామచిలుక తనకు మళ్లీ రెక్కలు వచ్చేదాకా ఆ ఇంట్లోనె జాలారివద్ద దట్టంగా పెరిగిన గటికలో దాగి ఉంటుంది కొంత కాలానికి మళ్లీ దానికి రెక్కలు మొలుసుక వస్తాయి తరువాత అది వేశ్య మేడపైననే ఎవరికీ కనిపించకుండా నివసిస్తుంటుంది కొంతకాలం జరిగిన పిదప ఆ దేశానికి రాణిగా ఉన్న తులసీబాయి అందచందాల గురించి మీరాబాయికి తెలుస్తుంది అటువంటి శారీరక సౌందర్యం తనకుకూడ రావాలని మీరాబాయి ప్రతి నిత్యం మహాకాళి గుడికివెళ్లి పూజలు చేసి వస్తుంటుంది ఈ సంగతిని మేడమీదినుంచి చిలుక గమనించి వేశ్యకు తగిన బుద్ధి చెప్పాలని నిశ్చయించుకుంటుంది ఒకనాడు రామచిలుక రహస్యంగా మహాకాళి గుడికి వెళ్లి అమ్మవారి విగ్రహం వెనుక దాగి ఉంటుంది ఎప్పటి మాదిరిగానె వేశ్య వచ్చి దేవికి పూజలుచేసి తన కోరికను వెల్లడిస్తుంది చిలుక అమ్మవారి విగ్రహం చాటున ఉండి— శరీరానికి జీడి పూసుకొని సున్నంరాని నిప్పులతో కాపుకుంటే మహా సౌందర్యవతిగా మారుతావని పలుకుతుంది ఇది దేవి పలుకులుగానె భావించి మీరాబాయి ఇంటికి వచ్చి ఆ విధంగానె ఆచరిస్తుంది వెంటనె శరీరమంతా పెద్దపెద్ద బొబ్బలు లేచి మీరాబాయి తపీమని మరణిస్తుంది

తర్వాత రామచిలుక అక్కడినుంచి ఎగిరివచ్చి మళ్లీ షావుకారు ఇంటి మీద నివాసం ఏర్పరచుకుంటుంది రాజు శరీరంలో ప్రవేశించిన భట్టి రాజ్యాన్ని పరిపాలిస్తూ ఒకనాడు గుర్రంపై స్వారీ చేస్తూ పట్టణమంతా కలియ తిరుగుతుంటాడు అట్లా

పర్యటిస్తూ షావుకారు ఇంటిముందుకు రాగానే అతని భార్య అలివేణి చక్కగా అలంకరించుకొని గవాక్షంముందు కనిపిస్తుంది. ఆమె సౌందర్యానికి ఆకర్షింపబడి ఆమెను అనుభవించవలెనని నిశ్చయించుకుంటాడు వెంటనే ఒక కుంటెనకత్తెను పిలిపించి ఎట్లాగైనా అలివేణితో పొందుకుదిరించవలసిందని కోరతాడు అందుకు తగిన ప్రతిఫలంకూడ ఇస్తానని ఆశచూపుతాడు. ఆ కుంటెనకత్తె రెండు కుక్కపిల్లలనూ ఒక సద్దిమూటనూ తెచ్చుకొని అలివేణి ఇంటి ముందు వాకిట్లో కూర్చుంటుంది అలివేణి చూస్తుండగా కుక్క పిల్లలకు అన్నం తినిపిస్తూ ఆ కుంటెనకత్తె అదే ఎంగిలి చేతితో తానూ తింటుంటుంది ఇదిచూసి అలివేణి ఆమెను ఈసడించుకుంటుంది అప్పుడా కుంటెనకత్తె నిజంగా అవి కుక్క పిల్లలుకావనీ అవి తన కూతుర్లేననీ చెప్పుతుంది దానికి కారణం— ఈ దేశపు రాజు తన కూతుర్లతో పొందుకోరినాడనీ వాళ్లు అంగీకరించనందువల్ల అట్లా కుక్కలుగా శపించినాడనీ ఒక గాథను కల్పించి చెప్పుతుంది రాజు కోరికను మన్నించకుంటే ఎవరికైనా ఇలాంటి గతే పడుతుందని కూడ అలివేణిని భయపెడుతుంది అలివేణి ఇదంతా నమ్మి భయపడుతున్న సమయంలోనే అలివేణితో రాజు సంభోగం కోరుతున్నాడని కుంటెనకత్తె వెల్లడిస్తుంది రేపు తిరిగి వచ్చేవరకల్లా ఏ విషయమైనా తేల్చుకోవాలని హెచ్చరించి కుంటెనకత్తె ఆ నాటికి వెళ్లిపోతుంది

ఇదంతా వింటున్న రామచిలుక ప్రతిదానికి తగిన బుద్ధి చెప్పే సమయమాసన్నమైందని భావించి అలివేణి వద్దకు వచ్చి రాజుతో పొందుకు అంగీకరించవలసిందిగా సలహా ఇస్తుంది ఆమె శీలానికి ఏవిధమైన హాని కలుగకుండా కాపాడు తాననికూడ చిలుక హామీ ఇస్తుంది ఐతే చనిపోయిన ఒక కుందేలు శరీరాన్ని మాత్రం ముందే సంపాదించి తన శయ్యామందిరంలో దాచిపెట్టుమని కోరుతుంది రాజుకు పరకాయ ప్రవేశవిద్య వస్తుంది కనుక చనిపోయిన కుందేలు శరీరంలో ప్రవేశించి తనకా విద్యను ప్రదర్శించి చూపాలని కోరుకోవలసిందిగా అలివేణికి సలహా ఇస్తుంది పరకాయ ప్రవేశ విద్యను ప్రదర్శించి రాజు తన కోరికను చెల్లిస్తేనే ఆతనితో సంభోగం చేస్తానని షరతుపెట్టవలసిందని కూడ చిలుక అలివేణికి బోధిస్తుంది రామచిలుక చెప్పిన ప్రకారం చేయడానికి అలివేణి సమ్మతిస్తుంది తాను రాజుతో సంభోగం చేయడానికి సమ్మతిస్తున్నట్లు కుంటెనకత్తెతో వార్త పంపుతుంది ఈవార్త వినగానే రాజు అదే రాత్రి బయలుదేరి అలివేణి ఇంటికి వస్తాడు ముందు తనకోరిక తీరిస్తేనే అతని కోరికను తాను నెరవేరుస్తానని అలివేణి రాజుతో పలుకుతుంది. అతనికి ఇష్టంలేకున్నా ఆమె పట్టుదలకులొంగి పోతాడు. ఆమె కోరిక ప్రకారం పరకాయ ప్రవేశంచేసి తన విద్యను ప్రదర్శించుటకు సిద్ధమవుతాడు. అలివేణి చచ్చినకుందేలు

శరీరాన్ని తెచ్చి ఆతనిముందు పడవేసి అందులో ప్రవేశించవలసిందిగా కోరుతుంది. అప్పుడు రాజు శరీరాన్ని వదిలి మోతాజి చచ్చిపడుండేలు శరీరంలో ప్రవేశిస్తాడు ఈ అదనుకోసమే వేచివున్న భట్టి చిలుక శరీరం వదిలి మళ్లీ తన శరీరంలో ప్రవేశిస్తాడు వెంటనే కుందేలు శరీరంలో ఉన్న మోతాజని ఆతని కత్తితోనే ముక్కలు ముక్కలుగా నరికి వేస్తాడు షావుకారుకూ ఆతని భార్యకూ రాజు తన గాథనంతా వివరించి వాళ్లను తన తలిదండ్రులుగా సంభావిస్తాడు ఈ వింతను చూడవచ్చిన ప్రజలందరికీ తన ప్రధాని చేసిన మోసం వెల్లడి చేస్తాడు రాజు తన శరీరాన్ని తాను తిరిగి పొందినప్పటినుంచి ప్రజలాతన్ని భట్టి విక్రమార్కుడని కీర్తిస్తుంటారు తరువాత రాజు తన రాజ భవనం ప్రవేశించి తన ఇద్దరు రాణుల్ని సమంగా సమాదరిస్తూ సుఖంగా రాజ్యమేలు తుంటాడు

# ౬. రాధాబాయి – కాళోజి కథ

క్రసిలంద్ అనే నగరాన్ని కాళోజీ అనే రాజు పరిపాలిస్తుంటాడు. ఈతని భార్య పేరు రాధాబాయి ఈతనికిద్దరు కుమారులుంటారు. పెద్దవాని పేరు హరిచంద్ చిన్నవాని పేరు గోపిచంద్ ఈ రాజు మిక్కిలి ఉదారస్వభావం కలవాడు పౌరానురంజకంగా రాజ్యం చేస్తుంటాడు దానశీలి కూడ.

ఒకనాడు కాళోజీవద్దకు ఒక గోసాయి వస్తాడు గోసాయి రాగానె రాజు ఆతన్ని సగౌరవంగా ఆదరించి ఎంతో వినయ విధేయతల్ని ప్రకటిస్తాడు అట్లా సకల మర్యాదలతో మునిని సత్కరించి స్వామీ మీకేమి కావాలని రాజడుగుతాడు అడిగింది తప్పక ఇస్తానని ముందు మాట ఇవ్వవలసిందిగా ముని కోరుతాడు అట్లాగే ఇస్తానని రాజు అభయమిస్తాడు. వెంటనె గోసాయి తనకు సింహాసనం కావాలంటాడు ఇదేమంత పెద్ద కోరిక కాదని రాజు భావించి తన సింహాసనంపై గోసాయిని కూర్చుండబెట్టి తన అంతఃపురానికి వెళ్లిపోతాడు కేవలం నాలుగైదు రోజులు మాత్రమే సింహాసనంపై కూర్చుండడానికై గోసాయి కోరి ఉంటాడని రాజు భావిస్తుంటాడు కాని రాజును కష్టాలపాలుచేసి చివరిదాకా పరీక్షించవలెనని గోసాయి అభిమతమై ఉంటుంది ఐదు రోజుల తరువాత రాజు తన ప్రధానిని పిలిచి గోసాయి ఎప్పుడు వెళ్లిపోనున్నదీ తెలిసికొని రావలసిందని ఆజ్ఞాపిస్తాడు. ప్రధాని గోసాయివద్దకు వెళ్లి ఆతడెప్పుడు వెళ్లిపోనున్నదీ తెలుపవలసిందిగా కోరుతాడు దానిపై గోసాయికి కోపంవస్తుంది ఇచ్చిన రాజ్యాన్ని తిరిగి తీసుకోవడం నీచమైన పద్ధతి అంటూ రాజును దూషిస్తాడు అంతేకాక రాజు తక్షణమే రాణీ సమేతంగా బయలుదేరివచ్చి తనకు రాజ్యాన్ని శాస్త్రోక్తంగా ధారపోయాలని పట్టుపడుతాడు. ఇచ్చిన మాట నిలుపుకోవడంకోసం రాజు రాణీ సమేతంగా వచ్చి గోసాయికి రాజ్యాన్ని ధారబోస్తాడు. తమ సర్వస్వాన్ని త్యాగంచేసి కట్టుబట్టలతో రాజ్యం విడిచి భార్యాపిల్లలతో సహా అడవికి వెళ్లిపోతాడు అట్లా అడవులు దాటుతూ వెళ్లిపోతుండగా రాజును ఇంకా వేధించి పరీక్షించాలని గోసాయి భావిస్తాడు

కపట నాటకమాడి రాజును మోసగించడంకోసం గోసాయి రంగోజీబాలోజీ అనేవాన్ని రాజువద్దకు పంపిస్తాడు. అతడు రాజును దర్శించి తనభార్య నిండు గర్భంతోఉంది ప్రసవవేదన పడుతున్నదనీ ఆమెకొక స్త్రీ సహాయం కావాలనీ కడు దైన్యంతో అర్థిస్తాడు. రాజు అతని మాయమాటల్ని నమ్మి తన రాణి అయిన రాధాబాయిని బాలోజీ వెంట పంపిస్తాడు. బాలోజీ మాయ మాటలు చెప్పుతూ ఆమెను తన హల్దేవునగర్‌కు తీసుకవస్తాడు. అక్కడ తనను వివాహమాడవలసిందిగా ఆమెను అనేక రకాలుగా వేధిస్తుంటాడు. ఆమె ఎంత ప్రతిఘటించినా వినడు. ఇక గత్యంతరం లేక రాధాబాయి అందుకు అంగీకరించినట్లు నటించి పన్నెండు సంవత్సరాల గడువు కోరుతుంది. ఆ గడువు పిదప ఒక వ్రతమాచరించి తప్పక వివాహమాడుతానని రాధాబాయి గోసాయికి మాట ఇస్తుంది. అతడు అందుకంగీకరించి ఆమెను విడిగా ఒక మేడలో నిర్బంధించి ఎటూకదలనివ్వకుండా కాపలాపెట్టి ఉంటాడు.

ఇక్కడ కాళోజి ఎంతకూ తన భార్య తిరిగి రావందున ఎంతో ఆందోళన చెందుతుంటాడు. తన ఇద్దరు కుమారుల్ని వెంబడించుకొని ఆమెను వెతుకుతూ వెళ్తుంటాడు. అటు గోసాయి అంతటితో ఆగక ఈ రాజును ఇంకా కష్టాలపాలు చేయనెంచి మేఘాల్ని పంపించి దానిలో కుంభవర్షం కురిపిస్తాడు. దారికడ్డంగా ఉవ్వెత్తుగా వాగులు ప్రవహిస్తుంటాయి. ముందు చిన్నపిల్లవాన్ని వాగుదాటించి పిదప పెద్దపిల్లవాన్నికూడ దాటించవచ్చునని కాళోజి ఆలోచిస్తాడు. అదే ప్రకారంగా పెద్దవాన్ని వాగు ఒడ్డున ఆపి చిన్నవాన్ని తన భుజముపై కూర్చుండబెట్టుకొని వాగు దాటుతుంటాడు. అతడు వాగులోనికి వెళ్లగానే ఒక తోడేలువచ్చి తన పెద్ద పిల్లవాన్ని నోట కరచుకొని వెళ్లిపోతుంది. ఈ దృశ్యమును కళ్లారా చూసి కాళోజి హడలిపోయి, అప్రయత్నంగా చేతులు పైకెత్తుతాడు. అప్పుడు చిన్నవాడు కూడ పట్టుతప్పి వాగులో పడి కొట్టుకపోతాడు. విధివంచితుడైన కాళోజి ఇద్దరు కుమారుల్ని పోగొట్టుకొని ఒడ్డుకుచేరి మూర్ఛపోతాడు. కొద్దిసేపటికి మళ్లీ మూర్ఛతేరుకొని దుఃఖించుకుంటూ కాళోజి ముందుకు వెళ్లిపోతుంటాడు. చివరికి ఉదువంబెనగర్ చేరుకుంటాడు. సరిగా ఈ సమయానికే ఆదేశ ప్రజలు రాజును కోల్పోయి తగిన రాజుకోసం వెదుకుతుంటారు. ఒక ఏనుగు తొండానికి పూలహారం తొడిగి దాన్ని ఎవరమెడలో వేస్తే అతన్నే రాజుగా చేయాలని ప్రజలు తీర్మానించుకొని ఊరేగింపుతో వస్తుంటారు. వీళ్లకు కాళోజి ఎదురవుతాడు. ఏనుగు తన తొండంతో పూలహారాన్ని తెచ్చి కాళోజి కంఠంలో అలంకరిస్తుంది. ప్రజలంతా జయజయ ధ్వానాలతో కాళోజిని రాజుగా ప్రకటించుకుంటారు. కాళోజి ఆరాజ్యాన్ని ప్రజారంజకంగా పరిపాలిస్తుంటాడు.

ఇటు తోడేలు ఎత్తుకపోయిన కాళోజీ పెద్దకుమారుడు గొల్లలచే రక్షింపబడు తాడు. వాళ్లాతనిని తమవద్దనే ఉంచుకొని పెంచుతుంటారు. వాగులో కొట్టుకపోయి చిన్నపిల్లవాడు బెస్తవాళ్లకు దొరికి వాళ్లచే పెంచబడుతుంటాడు. ఇట్లా కొంతకాలం సాగిన పిదప అటు ఉదువంటెనగర్‌లో కాళోజి ఒక రాజ్యానికి రాజైనప్పటికిని భార్యా పిల్లలు లేనందున ఏకాకితనాన్ని అనుభవిస్తుంటాడు. రాజభోగములెన్ని ఉన్నా పిల్లలు లేనిలోటు దుర్భరంగా ఉంటుంది. రాజు తన ప్రధానిని పిలిపించి ఎక్కడైనా ఒక అనాథ బాలుడుంటే తన రాజమందిరానికి తీసుకరావలసిందిగా ఆజ్ఞాపిస్తాడు. ప్రధాని భటుల్ని పంపించి వెదికించగా గొల్లవాళ్లవద్ద పెరుగుతున్న పెద్ద పిల్లవాడు లభిస్తాడు. గొల్లవాళ్లకు కొంత డబ్బిచ్చి ఆ బాలున్ని తీసుకవచ్చి వాళ్లు రాజుకు అప్పగిస్తారు. రాజు ఆ బాలున్ని తన భవనంలోనే ఉంచుకొని అతనితో కాలక్షేపం చేస్తుంటాడు. మరి కొంత కాలానికి ఈ బాలునికి తోడుగా ఆడుకోవడానికి మరొక బాలుడుంటే బాగుంటుం దని రాజు భావిస్తాడు. మళ్లీ అదే విధంగా ప్రధానిని పిలిపించి మరొక బాలున్ని తీసుకరావలసిందిగా ఆదేశిస్తాడు. ప్రధాని మళ్లీ భటుల్ని పంపించి దేశమంతా వెది కింపగా, చివరికి బెస్తవాళ్లవద్ద పెరుగుతున్న చిన్న పిల్లవాడు లభిస్తాడు. బెస్తవాళ్లకు కూడ అదే విధంగా కొంత డబ్బిచ్చి ఆ బాలున్ని తీసుకవచ్చి వాళ్లు రాజుకప్పగిస్తారు. ఈ ఇద్దరు పిల్లలతో రాజుకు ఆనందంగా కాలం గడుస్తుంటుంది

ఇదంతా జరిగేనాటికి పన్నెండు సంవత్సరాలు పరిసమాప్తమవుతాయి. పూర్వం తనకిచ్చిన మాట నిలబెట్టుకోవలసిందిగా హల్దేవునగర్‌లో బాలోజి రాధాబాయిని మళ్లీ వేధిస్తుంటాడు. అప్పుడామె ఒక ఉపాయమాలోచించి దేశదేశాలకు పెండ్లి పత్రికలు పంపించి బంధుమిత్రుల సమక్షంలో వివాహ మాడవలసిందిగా కోరుతుంది. ఈలోగా తాను పూర్వం మొక్కుకున్న విధంగా వ్రతమాచరిస్తానని కూడ తెలుపుతుంది. బాలోజి అదేవిధంగా వివాహ పత్రికలు ఆయా దేశాధిపతులందరికీ పంపిస్తాడు. ఉదువంటెనగర్‌ను పరిపాలిస్తున్న కాళోజికి కూడ ఆహ్వానం వస్తుంది. కాళోజి రాచ కార్యములలో ఉన్నందున వివాహ మహోత్సవానికి తన వద్దనున్న ఇద్దరు పిల్లల్ని పంపి స్తాడు. ఈ ఇద్దరు బాలురు హల్దేవునగర్ చేరుకొని రాజ మందిరంలో బసచేస్తారు. ఇద్దరూ ప్రక్క ప్రక్కన కూర్చుండి సంభాషించుకుంటూ ఉండగా చిన్న పిల్లవాడు కునిక పాట్లు పడుతుంటాడు. అతన్ని మెలకువతో ఉంచే నిమిత్తం పెద్దపిల్లవాడు తన పూర్వచరిత్రను కథగా అల్లి కడు రమ్యంగా చెప్పుతుంటాడు. ఈ కథ విన్నపిదప చిన్నపిల్లవాడు కథ చెబుతున్న బాలున్ని తన అన్నగా గుర్తిస్తాడు. పక్క ప్రక్కగదిలోనే ఉండి ఈ కథనంతా జాగ్రత్తగా వింటున్న రాధాబాయికూడ ఈపిల్లల్ని తన కుమారులుగా

గుర్తిస్తుంది. వెంటనే పరుగెత్తుకొని వచ్చి ఆమె పిల్లల్ని ఆలింగనం చేసుకుంటుంది. చిరకాలానికి మళ్ళీ తన కుమారుల్ని కలిసికున్నందుకు ఎంతో ఆనందిస్తుంది. ఇక అక్కడ ఏ మాత్రం ఆలస్యం చేయక ముగ్గురూ కలిసి అతి రహస్యంగా పారిపోయి వచ్చి ఉదువంటునగర్ చేరుకుంటారు. అక్కడ కాళోజిని కలిసికొని ఒకరినొకరు గుర్తించుకుంటారు.

కాని కాళోజి పన్నెండు సంవత్సరాలు శత్రువు అధీనంలో ఉన్న రాధాబాయి శీలాన్ని శంకిస్తాడు. అటువంటి భార్యను స్వీకరించడం అవమానకరమని భావించి కత్తితో నరుకబోతాడు. ఆ కత్తి పూలహారమై రాధాబాయి కంఠాన్ని అలంకరిస్తుంది. ఐనా అతడు పూర్తిగా నమ్మకపోలక అగ్ని ప్రవేశంకూడ చేసి పాతివ్రత్య మహిమను ప్రదర్శించాలని కోరుతాడు. రాధాబాయి ఆ విధంగానే అగ్నిప్రవేశంకూడ చేస్తుంది. కాని అగ్ని దేవుడు ఆమెకెలాంటి హాని చేకూర్చడు. అప్పుడు కాళోజి తన భార్య పాతివ్రత్య మహిమకు ఆనందించి ఆమెను స్వీకరిస్తాడు. పిదప కాళోజి తన భార్యా పిల్లలతో సహా ప్రయాణమై హర్దేవునగర్ చేరుకుంటాడు. రంగోజి బాలోజిని హత మార్చి ఆ రాజ్యాన్ని కూడ తన వశం చేసుకొని పరిపాలిస్తుంటాడు.

అటు కసిఖండ్ రాజ్యాన్ని దానంగా పొందిన గోసాయి, చివరికి పశ్చాత్తాపం చెంది ఒకనాడు కాళోజివద్దకు వచ్చి క్షమాభిక్ష కోరుతాడు. తాను పెట్టిన బాధలన్నింటినీ తట్టుకొని నిలద్రొక్కుకోవడమే కాక, మరి రెండు రాజ్యాల్ని సాధించినందుకు కూడ కాళోజిని అభినందిస్తాడు. తిరిగి కసిఖండ్ రాజ్యాన్ని కూడ కాళోజికే అప్పగిస్తాడు. తాను చేసిన పాప పరిహారంకోసం గోసాయి కాశీయాత్రకు బయలుదేరి వెళ్లుతాడు. ఆటు పిదప కాళోజి మూడు రాజ్యాలకు అధిపతియై తన భార్యా కుమారులతో సహా సుఖంగా రాజ్యమేలుతుంటాడు.

# ౭. కలాసాపా కథ

ఉగిదేగాట్ అనేనగరాన్ని గోదాజి అనే రాజు పరిపాలిస్తుంటాడు. ఈతనికి ఇద్దరు భార్యలు. పెద్దభార్య పేరు తులసీబాయి. చిన్నభార్య పేరు గంగాబాయి. తులసీబాయి కుమారుడు అశ్వరాజు. గంగాబాయి కుమారుని పేరు బకపరాజు. గోదాజి తన ప్రధాని తానాజి సహకారంతో రాజ్యాన్ని చక్కగా పరిపాలిస్తుంటాడు.

ఇట్లా ఉంటూ ఉండగా దేవలోకంలో ఒకసారి సకల మహర్షులనూ, యోగులనూ, దేవతలనూ ఆహ్వానించి దేవేంద్రుడు ఒక యజ్ఞం చేస్తాడు. యజ్ఞానికి దేవేంద్రుని నలుగురు చెల్లెండ్రు- పద్మిని, చిత్రిణి, శంఖిణి మరియు హస్తిని అనేవాళ్లు కూడా వస్తారు. యజ్ఞానంతరం దేవేంద్రుడు రంభోర్వశుల నాట్యంకూడ ఏర్పాటు చేస్తాడు. వాళ్లిద్దరూ నాట్యం చేస్తుండగా రంభ అలిసిపోయి జారిపడుతుంది. ఇది చూచి పద్మిని నవ్వుతుంది. ఆమెనవ్వినందుకు రంభ నొచ్చుకుంటుంది. దేవేంద్రుడు కూడ తన చెల్లెలు నవ్వినందుకు బాధపడి వెంటనే భూలోకంలో అవతరించి పన్నెండు సంవత్సరాలు అక్కడే ఉండవలసిందిగా పద్మినికి శాపమిస్తాడు. పద్మిని శాపవిమోచనంకోసం దేవేంద్రుని ప్రార్థించగా దేవేంద్రుడు ఈ విధంగా శాపవిమోచన మార్గం చెబుతాడు- "పద్మిని భూలోకంలో మానవ జన్మతో అవతరించిన పిదప, ఒక పురుషుని వివాహమాడి పుత్రుని బడసి, అతని వివాహంకూడ జరిపించాలి. పిదప కోడలువచ్చి పాదాభివందనం చేయబోగా, ఆమె నుదుటికుంకుమ పద్మిని పాదములపై రాలినప్పుడు శాపవిముక్తి కలుగుతుం"దని దేవేంద్రుడు సెలవిస్తాడు. వెంటనే దేవేంద్రుడు ఆమెను పన్నెండు నెలల శిశువుగా మార్చి ఒక బంగారు పెట్టెలోపెట్టి దాన్ని భూలోకంలో ఒక అరణ్యంలోని పూలపొదలో వదలుతాడు. ఆ అరణ్యానికంతకూ హెవండా అనే ఒక గొల్లవాడు అధిపతిగా ఉంటాడు. ఈతడు మిక్కిలి స్థూలకాయుడు. రాక్షసుని మాదిరిగానే భయంకరమైన ఆకారంకలిగి ఉంటాడు. ఈ బంగారు పెట్టె అతనికి లభిస్తుంది. అందులోని శిశువు చక్కదనానికి సంతోషించి ఆమెను తండ్రివలె పోషిస్తూ ఉంటాడు బాలికకు పన్నెండు సంవత్సరాల వయస్సు వచ్చి మిక్కిలి అందకత్తెగా తయారవుతుంది.

ఇది ఇట్లా ఉండగా ఒకనాడు తన ప్రధాని అయిన తానాజీ వేటకు వెళ్లదామని గోదాజీని ప్రోత్సహిస్తాడు. రాజు వేటకు వెళ్లతానని తన భార్యలతో చెప్పడానికి అంతఃపురంలోనికి వెళ్లతాడు రాజు వేటకు వెళ్లడం మంచిది కాదని రాణులు తమ అసమ్మతిని ప్రకటిస్తారు ఐనా రాజు రాణుల సలహాను తిరస్కరించి ప్రయాణమవుతాడు. విధిలేక అందుకంగీకరించి రాణులు రాజుకు ఒక ఖడ్గం అందివ్వబోతారు అది చేయిజారి కిందపడుతుంది దీన్ని అపశకునంగా భావించి రాణులు బాధపడుతుంటారు. ఐనా రాజు లెక్క చేయక తన ప్రధానినీ కొంత పరివారాన్నీ వెంటనిడుకొని గుర్రమెక్కి వేటకు బయలుదేరి వెళ్లిపోతాడు పగ్గల పగలంతా బాగా వేటాడి అలసిపోతారు. అందరికీ దాహం వేస్తుంటుంది ఆ ప్రాంతంలో ఎక్కడా మంచి నీటి చుక్క దొరకదు నీళ్ళ సంపాదించవలసిందిగా రాజు తన ప్రధానిని ఆజ్ఞాపిస్తాడు. ప్రధాని నీళ్లకోసం వెతుకుతూ వెతుకుతూ హెడెంబా అనే గొల్లవాడు నివసించే ప్రాంతానికి వస్తాడు ఈ హెడెంబా తనకోసం ఒక మంచినీటి కొలను త్రవ్వించుకొని ఉంటాడు అతడు దాహంతో ఉన్న రాజు పరివారానికంతకూ తన కొలనులో మంచి నీళ్ల త్రాగడానికి అనుమతిస్తాడు ప్రధాని వెళ్లి అందరినీ కొలనువద్దకు తీసుకరాగా రాజుతో సహా ఆతని పరివారమంతా మంచి నీళ్ల త్రాగి సేద తీర్చుకుంటారు హెడెంబాకు కృతజ్ఞతలు తెలిపి తిరిగి వెళ్లిపోబోతున్న సమయంలో రాజుకు హెడెంబా ఎత్తుకొని ఆడిస్తున్న బాలిక కంటబడుతుంది అసాధారణమైన ఆ బాలిక సౌందర్యానికి గోదాజి వశీకృతుడవుతాడు రాజు ఆమె పుట్టుపూర్వోత్తరాల గురించి అడుగగా హెడెంబా ఆ బాలిక తనకెట్లా లభించిందీ వివరించి చెప్పుతాడు ఆమెను తనకిచ్చి వివాహం చేయవలసిందిగా రాజు కోరుతాడు అందుకు హెడెంబా అంగీకరిస్తాడు వెంటనే రాజు జ్యోతిష్కులను రప్పించి లగ్నానికి ముహూర్తం పెట్టవలసిందిగా కోరుతాడు జ్యోతిష్కులు ఈ ఇద్దరి జాతకాలనూ పరిశీలించి లగ్న నిశ్చయం చేస్తారు బాలికకు పద్మిని అని నామకరణం కూడ చేస్తారు రాజు తనతో వచ్చిన పరివారం సమక్షంలో ఆ బాలికను అదే అడవిలో వివాహ మాడుతాడు రాజు ఈమెను వెంటనిడుకొని తన్న నగరం చేరుకుంటాడు నగరానికి వెలుపలనె మరో పెద్దమేడకట్టించి పద్మినితో సహా తాను కూడ అందులోనె నివసిస్తుంటాడు కొంతకాలానికి పద్మిని గర్భం ధరించి ఒక కుమారుని కంటుంది జ్యోతిష్కులు బాలుని జాతకాన్ని పరిశీలించి ముందు ముందు ఆతడు కలాసాపా పూలు సాధించి తెస్తాడని జోస్యం చెప్పుతారు అందుకని ఆతనికి కల్హాసేన్ అని నామకరణం కూడ చేస్తారు. రాజు తన ఇద్దరు పెద్దరాణుల్ని పూర్తిగా విస్మరించి పద్మినితోనే గడుపుతుంటాడు

ఇట్లా రాజు పద్మిని వద్దనే ఉంటూ ఉండగా ఆట తులసీబాయి మరియు గంగాబాయీ రాజు తమ వద్దకు రానందుకు ఆతనిపై కోపం వహిస్తారు ఒక నాడు వాళ్లకు మందులమ్ముకునేవాడు కంటబడుతాడు. రాణులు అతన్ని లోనికి రప్పించి అతనినుండి కండ్లు పోయే మందు కొనుక్కుంటారు దాన్ని పరీక్షించడం కోసం వాళ్లు ఆ మందును ఒక పిల్లి కండ్లకు రుద్దుతారు వెంటనె దాని రెండు కండ్లూ పోయి గుడ్డి దవుతుంది పిల్లికి కోపంవచ్చి ఈ రాణుల కుమారులు పన్నెండు సంవత్సరాలు కష్టాల పాలవుతారని శపిస్తుంది పిల్లి శపించిన విషయం ఎవరికీ తెలియదు దీని తరువాత రాణులు ఏవోమాయ మాటలుచెప్పి రాజును తమ అంతఃపురానికి రప్పించుకుంటారు ఆతన్ని సమ్మించి వాళ్ల తమవద్దనున్న మందును ఆతని రెండు కండ్లకూ పూస్తారు వెంటనే రాజు కనుగుడ్లు రెండూ నెలరాలి అంధుడవుతాడు ఎటూ కదలలేని పరిస్థితిలో రాజును ఆ రాణులు తమ ఇంటి ద్వారంముందు కావలివానిలా ఉంచుకుంటారు కొంతకాలం జరిగిన పిదప ప్రధాని సహాయంతో అంధుడైన రాజు తన సభా మందిరానికి వెళ్లుతాడు. అతడు సభ తీర్చి ఉండగా కొందరు జ్యోతిష్కులు వస్తారు. తనకు పూర్వం మాదిరిగా తిరిగి కండ్లు వచ్చే మార్గం ఏదైనా ఉన్నదా అని రాజు వాళ్లనడుగుతాడు జ్యోతిష్కులు ఈ విధంగా సమాధానం చెప్పుతారు— 'సప్త సముద్రాలు దాటిన పిదప అందులో ఒక దీవి ఉంటుంది ఆ దీవిలో సింహాగఢ్ అనె మేడ నిర్మించుకొని అందు చంపామల్ అనే రాణి నివసిస్తుంటుంది ఆ మేడలో కలాసాపా అనే చెట్టు ఉంటుంది దాని ఒకే ఒక తొడిమకు ఐదుపూలు పూసి ఉంటాయి. వాటిని అక్కడ ముట్టుకుంటే ఇక్కడ రాజుకు తిరిగి కండ్లు వస్తా"యని జ్యోతిష్కులు చెప్పుతారు ఈ కష్టసాధ్యమైన పనిని ఎవరు సాధించి తెస్తారా అని రాజు ఆలోచిస్తుంటాడు ఈ సంగతి పెద్దరాణుల కుమారులైన ఆశ్వరాజు బసవరాజులకు తెలుస్తుంది. దాన్ని సాధించి తెచ్చి తండ్రి ఆదరణకు పాత్రులు కావలని ఈ ఇద్దరు రాకుమారులూ అందుకు సిద్ధమవుతారు వాళ్లు తమ తల్లుల అనుజ్ఞపొంది గుఱ్ఱాలపై ప్రయాణమై తగిన సరంజామాలతో బయలుదేరుతారు

ఈ సంగతి అటు పద్మిని కుమారుడైన కలాసేన్‌కు కూడ తెలుస్తుంది ఇప్పుడాతని వయస్సు సుమారు పన్నెండు సంవత్సరాలు ఆతడు కూడ కలాసాపా పూలను ముట్టడంకోసం తన అన్నల ననుసరిస్తూ కాలినడకన బయలుదేరుతాడు. రాజు అంధుడైనప్పటినుండి పద్మిని స్థితి చాలా దయనీయంగా మారుతుంది. కుమారునికి జొన్న రొట్టెలు గొంగూర పచ్చడి మాత్రం పెట్టి సాగనంపుతుంది. అశ్వరాజు బసవరాజులు పంచభక్ష పరమాన్నాలతోనూ సకల రాచమర్యాదలతోనూ బయలు

దేరుతారు. తమ వెంటనంటి వస్తున్న కలాసేన్‌ను ఈసడించుకుంటూ అవమానిస్తుంటారు. ఈతని చేత పరిచర్యలు కూడ చేయించుకుంటుంటారు. గుఱ్ఱాల సంరక్షణ కూడ ఈతని చేతనే చేయించుకుంటారు. ఇట్లా వీళ్లు పయనించుకుంటూ వెళ్లి సింధెగాఁవ్ చేరుకుంటారు ఆ నగరానికి చాందు అనే వేశ్య నాయకురాలుగా ఉంటుంది తన రాజ్యానికి రవికెనే జండాగా ఎగురవేసి పాలన సాగిస్తుంటుంది. ఈమె తన పట్టణం మధ్యలో ఒక నగారాను పెట్టించింది. దాన్ని మోగించిన వాడు తనతో పచ్చీసు ఆడవలసి ఉంటుందనీ ఓడిన వారు తమ సర్వస్వాన్ని గెలిచినవారి కర్పించి ఊడిగం చేయవలసి ఉంటుందనీ ఆమె షరతు విధిస్తుంది. ఈ రాకుమారులు ముగ్గురూ సింధెగాఁవ్ శివారులోనికి రాగానే– అశ్వరాజు బసవరాజులు కలాసేన్‌కు తమ గుఱ్ఱాల సంరక్షణభారం అప్పగించి కలాసాపా పూలజాడ తెలిసికొని రావడంకోసం గ్రామంలోనికి ప్రవేశిస్తారు నగరం మధ్యలో ఉన్న నగారా వీళ్ల కంటబడుతుంది దాన్ని చూడగానే ఈ ఇద్దరూ కలిసిగి నగారా మ్రోస్తారు వెంటనే భటులువచ్చి అశ్వరాజు బసవరాజులను తమ ఏలిక అయిన చాందు వద్దకు తీసుకవెళ్లతారు. తనతో పచ్చీసు ఆడవలసి ఉంటుందని ఆమె వాళ్లను ఆదేశిస్తుంది ఆ ఆట తమకు తెలియదని వాళ్లు సమాధానం చెప్తారు. పూర్వోక్త నియమం ప్రకారం వెంటనే ఆమె ఆ ఇద్దరు రాకుమారుల్ని బంధించి చెరసాలలో వేయిస్తుంది తన అగ్రజులు తిరిగి రానందున వాళ్ల రెండు గుఱ్ఱాల్ని తీసుకొని వాళ్లను వెతుకుతూ కలాసేన్ పట్టణంలోనికి వస్తాడు ఈతనికి దారిలో ఒక బ్రాహ్మణుడు కనిపిస్తాడు. అతడు కలాసేన్‌కు ఆ పట్టణాన్ని పాలించే చాందు గురించి ఆమె నగారా గురించి వివరాలు తెలిపి అతని సోదరులు చెరసాలలో బంధింపబడినారని కూడ తెలుపుతాడు వెంటనే కలాసేన్ నగారావద్దకు వచ్చి దాన్ని మోగిస్తాడు భటులువచ్చి అతన్ని చాందువద్దకు తీసుకవెళ్లతారు. ఆమె కోరిన విధంగా ఆమెతో పచ్చీసు ఆడి చాందను ఓడిస్తాడు పూర్వం విధించిన షరతు ప్రకారం ఆమె తన సర్వస్వాన్ని కలాసేన్‌కు అర్పించి తనను వివాహ మాడవలసిందిగా కూడ కోరుతుంది కాని అతడు తానొక కార్యంకోసం బయలుదేరినాననీ తిరిగి వచ్చిన పిదపనే వివాహమాడుతాననీ తెలిపి అక్కడినుండి కదలివెళ్లతాడు దారిలో అతడొక రాక్షసుడు పరిపాలించే అడవిని చేరుకుంటాడు. ఈ రాక్షసునికి కొంతకాలం క్రితం ఒక ఆడ శిశువు లభించింది. ఆమె అంద చందాలకు సంతోషించి రాక్షసుడు ఆ శిశువును భుజించకుండా పెంచి పెద్దచేసినాడు తండ్రివలె ఆమెను అన్ని విధాలుగా సంరక్షిస్తుంటాడు. ఆమె పేరు పరిమళాబాయి ఆమె కిప్పుడు సుమారు పన్నెండు సంవత్సరాల వయస్సు. ఈమె రాక్షసుని వలన కొన్ని మంత్ర తంత్రములు కూడా మహిమలనూ నేర్చుకున్నది ఈమెకు తమ అడవిలో తిరుగాడుతున్న కలాసేన్ కనిపిస్తాడు–

అతనిని రాక్షసుని కంటపడకుండా ఉంచి అతని గురించిన వివరాలన్నీ తెలుసు కుంటుంది. తాను కలాసాపా పూలను ముట్టడంకోసం బయలుదేరినట్లు రాకుమారుడు తెలుపుతాడు. ఐతే అది అంత సునాయాసంగా జరిగే పనికాదనీ తనను వివాహ మాడితే దాన్ని సాధించడం కోసం తానుకూడ సహకరిస్తాననీ ఆమె కలాసేన్‌తో చెప్తు తుంది. అందుకు కలాసేన్ అంగీకరించి వివాహ మాడుతాడు. తనకువచ్చే మంత్ర విద్యలను ప్రయోగించి పరిమళాబాయి డేగగామారుతుంది. కలాసేన్‌ను తన రెక్కలపై కూర్చుండబెట్టుకొని సప్త సముద్రాల కావల ఉన్న దీవికి తీసుక వెళ్లుతుంది. ఆదీవిలో నిర్మింపబడిఉన్న పింజాగఢ్ అనె మేడను సమీపించి తన మంత్రశక్తితో ఇసుక చల్లు తుంది. దానితో అక్కడ కాపలా కాస్తున్న రాక్షసులంతా మత్తులో మునిగిపోతారు. అప్పుడు కలాసేన్ ధైర్యంగా పింజాగఢ్‌లోనికి ప్రవేశిస్తాడు. అందులో ఒక గదిలో చంపామల్‌రాణి నిదురిస్తుంటుంది. కలాసేన్ అక్కడ పుష్పించి ఉన్న కలాసాపా పూలను చూసి వాటిని ముట్టడమే కాక కోసుక పోవాలని కూడ భావిస్తాడు. చంపా మల్‌రాణి నిదురిస్తున్న సమయంలో వాటిని దొంగచాటుగ కోసుకపోవడం వీరోచితంగా ఉండదని భావిస్తాడు. ఆమెను నిదురలేపి ఆమె చూస్తుండగా పూలు కోసుక పోవాలని నిర్ణయించుకుంటాడు. ఆరు మాసాలు నిదురించడం ఆరుమాసాలు మేల్కొని ఉండడం ఆమె స్వభావం. కలాసేన్ ఎంత ప్రయత్నించినా ఆమె నిదుర లేవదు. ఆమె చెరి ఉంగరం తీసుకుంటాడు. ఆమె గదిలోనే ఉన్న తమలపాకుల పిడియం సపరి ఆమె వక్షముపై ఉమ్మి వేస్తాడు. అది బంగారు పతకంతల హారంగా మారి ఆమె కంఠాన్ని అలంకరిస్తుంది.

ఆతరుపు తానక్కడికి వచ్చి కలాసాపా పూలుకోసుకొని వెళ్లుతున్నట్లు ఆమె కొంగుపై వ్రాసి కలాసాపా పూలు కోసుకొని బయలుదేరుతాడు. తిరిగి పరిమళా బాయిని వెంటదీసుకొని సింధేగాం చేరుకుంటాడు. అక్కడ చాందు అనే వేశ్యను వివాహమాడి ఆమెనుకూడ తీసుకొని తన ఉగదెగాంవ్‌కు బయలుదేరుతాడు. ఎప్పుడైతే ఇక్కడ కలాసేన్ కలాసాపా పూలను ముట్టినాడో అదే క్షణంలో అక్కడ గోదాజి రాజుకు రెండుకండ్లూ వచ్చి అంధత్వం తొలగిపోతుంది. అట్లాగె విర్జికివాద అంధ త్వం తొలగిపోతుంది. కలాసేన్ చెరసాలలోనున్న తన సోదరులను విడిపించుకొని చాందు పరిమళాబాయిలతో కలిసి తన ఉగదెగాంవ్ వస్తుంటాడు. మార్గ మధ్యంలో ఆశ్వరాజు ఒసవరాజులకు దుర్బుద్ధి పుడుతుంది. ఇద్దరూ కూడబలుక్కొని కలా సేన్‌ను నమ్మించి అతన్ని ఒక మామిడి చెట్టు క్రిందికి తీసుకవెళ్లి అతని తలనరికి కలాసాపా పూలు తీసుకొని వెళ్లుతుంటారు. చాందు, పరిమళాబాయిలు ముందు వెళ్ల

తున్నందున ఈ మూరాళ్ళి కనిపెట్టరు కాని ఎంతకూ కలాసేన్ రానందున వాళ్ళ వెనకకు మరలి వెతుకుతూ వస్తుంటారు. మామిడి చెట్టుకింద వాళ్ళకు అతని మృత దేహం కనిపిస్తుంది ఐతే మామిడి చెట్టు మహిమ కారణంగా అతని శిరస్సూ, మొండెమూ విరిగి కలసుకుంటాయి కాని ప్రాణం మాత్రం రాదు తనను పెంచిన రాక్షసుని వద్ద అమృతం ఉందగా పరిమళాబాయి వెళ్ళి తీసుకొని వచ్చి అతని కంఠంలో పోస్తుంది వెంటనే అతడు మళ్ళీ బ్రతుకుతాడు పిదప అందరూ కలిసి ఉగిదెగావ్ చేరుకుంటారు. నెరూ పద్మిని ఇంటికివెళ్ళి ఈ ముగ్గురూ అక్కడే ఉంటుంటారు నిజం పలుకరమీదనే వెలుస్తుందని కలాసేన్ భావిస్తాడు. అటు అశ్వరాజు బసవరాజులు ఆ కలాసాహె పూలు తామె సాధించి తెచ్చామని రాజుతో గొప్పలు చెప్పుకొని అతని మన్ననలు పొందుతారు రాజు, అతని ప్రధాని మొదలైన వాళ్ళంతా నమ్ముతారు.

ఇటు చంపామల్ రాణి కొంతకాలానికి లేచి చూసేసరికి తన చేతికందే బంగారు ఉంగరం కనిపించదు కలాసాహె పూవు కూడ కనిపించదు అందుకు మారుగా ఆమె కంఠంలో ఒక బంగారు హారం వ్రేలాడుతుంటుంది. తన కొంగుపై కలాసేన్ వ్రాసిన అక్షరాలు కనిపిస్తాయి ఆ లేఖను చదవగా ఆమెకు విషయమంతా అర్థమవుతుంది అందులో పేర్కొనిన జాడ ప్రకారం అతన్ని కలిసికోవడంకోసం బయలుదేరివస్తుంది నేరుగా చంపామల్ రాణి ఉగిదెగావ్ చేరుకుంటుంది అక్కడ ప్రజలు అనుకుంటున్న దాన్నిబట్టి కలాసాహె పూలను అశ్వరాజు బసవరాజులు తెచ్చినారని భావిస్తుంది వెంటనే వాళ్ళను పిలిపించి పూలు తెచ్చిన విధమెట్టిదని అడుగుతుంది వాళ్ళు సింధెగావ్ వరకు వెళ్ళిన కథనంతా సక్రమంగానే చెప్పుతారు కాని తరువాత కథ చెప్పలేక తికమకపడుతుంటారు నిజానికి సింధెగావ్ లోనె చాంద అనె వేశ్య వీళ్ళను బంధించి చెరసాలలో వేసింది. ఎంతకూ నిజాన్ని చెప్పలేక పోతున్నందువల్ల రాజునూ ఈ ఇద్దరు రాకుమారుల్ని రంపాలతో కోయవలసిందిగా చంపామల్ తన భటులకాజ్ఞాపిస్తుంది ఇంతలో ఈ విషయమంతా తన తల్లివద్ద ఉంటున్న కలాసేన్‌కు తెలుస్తుంది అతడు వెంటనె తన ఇద్దరు భార్యలతో సహా వచ్చి కలాసాహె పూలను తానే కోసుకొని తెచ్చినానని చంపామల్ రాణితో ధైర్యంగా చెప్పుతాడు ఆమె కొంగుపై వ్రాసిన లేఖలోని చేవ్రాలును కూడ చూపించి రుజువుచేస్తాడు అప్పుడు చంపామల్ అతని మాటల్ని విశ్వసించి కలాసేన్ తండ్రినీ సోదరులనూ చంపకుండా వదలి పెడుతుంది అతని ధైర్యసాహసాలకు మెచ్చుకొని చంపామల్ కలాసేన్‌ను వరిస్తుంది అతడు కూడ అందుకంగీకరిస్తాడు. గోదాజి రాజు జ్యోతిష్కులచేత లగ్న నిశ్చయం

చేయించి వివాహం జరిపిస్తాడు. వివాహానంతరం అత్తమామల ఆశీస్సులు పొందటం కోసం చంపామల్ ముందు గోదాజీకి పాదాభివందనం చేస్తుంది పిదప అత్తగారైన పద్మినికి కూడ పాదాభివందనం చేస్తున్న తరుణంలో చంపామల్ నుదుటి కుంకుమరాలి పద్మిని పాదాలపై పడుతుంది దీనితో పన్నెండు సంవత్సరాలు క్రింది పూర్వం దేవేంద్రుడిచ్చిన శాపంతొలగి పద్మినికి విముక్తి కలుగుతుంది ఆమె తన భర్త తోటి సవతులు కుమారులతో సెలవు తీసుకొని తిరిగి దేవేంద్ర లోకంవెళ్లి పోతుంది ఇక కలాసేన్ తన తండ్రినీ సవతి తల్లుల్నీ సోదరుల్నీ సమాదరిస్తూ ముగ్గురు భార్యలతో సుఖంగా రాజ్యం చేస్తుంటాడు

# ౮. అక్కలభైరి కథ

సోమోజి అనేరాజు సోమ్యానగర్‌ను పరిపాలిస్తుంటాడు. అతని భార్యపేరు గస్తూర్బాబాయి వీరికి ఏడుగురు కుమారులుంటారు వారిపేర్లు— అతివంతు మతిమంతు, అబుద్ధి సుబుద్ధి అపుగాల్ గోపాల్ మరియు అక్కలభైరి అక్కలభైరికి భవిష్యత్కాలంలో జరుగబోయేదంతా తెలుసుకునే విద్య వస్తుంది పశు పక్ష్యాదులు మాట్లాడుకునే భాషకూడ తెలుస్తుంది వీళ్లకందరికీ ఒకే కడుపున పుట్టిన పిల్లల్ని తెచ్చి ఒకే సారి వివాహాలు జరిపించాలని రాజు నిశ్చయించుకుంటాడు తన ప్రధాని అంబాజీని పిలిచి దేశదేశాలు వెదికి ఒకే కడుపున పుట్టిన ఏడుగురు ఆడపిల్లల జాడతీసి సంబంధాలు కుదిర్చి ఒకేసారి వివాహాలు జరిపించే ఏర్పాట్లు చేయవలసిందిగా ఆజ్ఞాపిస్తాడు ప్రధాని ఎక్కడ తిరిగినా ఒకేకడుపున పుట్టిన ఏడుగురు ఆడపిల్లలు కనిపించరు తిరిగి తిరిగి చివరికి కాలీనగర్ చేరుకుంటాడు దాన్ని భలేరావు పరిపాలిస్తుంటాడు ఆయనకు ఏడుగురు పెండ్లికాని కూతుర్లు ఉంటారు అందరికన్న చిన్న కూతురుపేరు సుజనాబాయి. ప్రధాని భలేరావుతో తాను వచ్చిన కార్యం గురించి తెలుపుతాడు భలేరావు కూడ ఇలాంటి ఉద్దేశంతోనే ఉన్నందున అందుకు అంగీకరిస్తాడు. వారివారి జాతకాలు పరిశీలించి లగ్నకోటి వేసుకుంటారు. కట్నాలు కానుకలువగైరా లాంఛనాలగురించి ప్రధానే అన్నింటినీ ఖాయపరుస్తాడు ఐతే ఏడుగురు రాకుమారులలో ఏ ఒక్కరు తక్కువున్నా ప్రధాని తల నరుకుతానని రాజు హెచ్చరిస్తారు ప్రధాని అందుకు అంగీకరించి లగ్నముహూర్తాలుకూడ నిశ్చయించుకొని తిరిగి సోమ్యానగర్ చేరుకుంటాడు. అక్కడజరిగిన మాటముచ్చట గురించి రాజుకు విన్నవిస్తాడు. సంబంధంకుదిరి వివాహాలు నిశ్చయమైనందుకు రాజూ రాణీ ఎంతో సంతోషిస్తారు. రాజు తన కుమారులనందరినీ పిలిపించి నిర్ణయించిన సుముహూర్తానికి వివాహాలు చేసుకోవలసిందిగా కోరుతాడు. పెద్దవాళ్లంతా అంగీకరిస్తారు. చిన్నవాడైన అక్కలభైరి మాత్రం వివాహానికి సుతరామూ అంగీకరించడు ఈ వివాహానికి అంగీకరించి వెళ్లితే రాబోయే కీడును అతడు ముందుగానే కనిపెడతాడు. అందుకని ముందు అగ్రజుల వివాహాలు జరిగిన పిదప వచ్చే సంవత్సరం తాను వివాహమాడుతానని సమాధానం చెబుతాడు. ఈతడు

వివాహానికి అంగీకరించి తమతో రాకుండే తన తల నరకడం ఖాయమని ప్రధాని బాధ పడుతుంటాడు అందుకని ప్రధాని ఒక ఉపాయమాలోచించి అక్కలఖైరికి బదులుగా కత్తికి బాసింగం కట్టి వివాహం జరిపించాలని నిశ్చయిస్తాడు సకల లాంఛనాలతో వివాహబృందం శాలీనగర్‌కు బయలుదేరుతుంది. రాజాజ్ఞ ప్రకారం పట్టణంలో ఇంటికొక్కడు మాత్రమే ఉండి మిగతావాళ్లంతా వివాహమహోత్సవాలను తిలకించడానికి ప్రయాణమవుతారు అక్కలఖైరి మాత్రం రెండు వందల భటులతో సోమ్యానగర్‌లోనే ఉండిపోతాడు తన ఆరుగురు కుమారుల్ని వెంటబెట్టుకొని రాజు రాణీ సమేతంగా వివాహానికి తరలివస్తుంటాడు వివాహ బృందానికి ప్రధాని నాయకత్వం వహిస్తాడు. అక్కలఖైరి పట్టణం వెలుపల ఉన్న లేతమామిడి తోటవరకూ సాగనంపుతూ వచ్చి రాత్రంతా ప్రయాణంచేయవలసిందిగానూ, పగలంతా పడుకోవలసిందిగానూ తన తండ్రికి సలహా ఇస్తాడు దీనికి భిన్నంగా జరిగితే ప్రమాదం వాటిల్లుతుందని కూడ హెచ్చరిస్తాడు అదే విధంగా వివాహ బృందమంతా రాత్రిళ్లు ప్రయాణం చేస్తూ పగలంతా విశ్రాంతి తీసుకుంటూ వచ్చి శాలీనగర్ చేరుకుంటుంది అక్కడ పట్టణ శివారులో ఉన్న లేతమామిడితోటలో విడిది చేస్తుంది భలేరావు ధైర్యసాహసాలను పరీక్షించడంకోసం ఐదువందల నగారాలను ఒకేసారి మోగించవలసిందిగా సోమోజీ ఆజ్ఞాపిస్తాడు రాజభటులు ఆ విధంగానే మోగించగా నగరంలో పెద్ద అల్లకల్లోలం బయలుదేరుతుంది దొంతులుగా పేర్చిన కుండలు కిందబడి పగిలిపోతాయి భలేరావు సింహాసనంపైనుండి క్రిందపడి పోతాడు అప్పుడాతడు వెంటనే తన భటులను పంపించి ఈ అలజడికి కారణమేమిటో తెలిసికుంటాడు తనకు కాబోయే వియ్యంకుడు పెండ్లి కుమారులతో సహా వచ్చినట్లు తెలుస్తుంది వెంటనే వారినందరిని సకలోపచారాలతో సత్కరిస్తాడు ఇరు పక్షాలవాళ్లు లగ్నముహూర్తానికి కళ్యాణ వేదిక నలంకరిస్తారు. నూతన వధూవరుల కడ్డంగా తెరకట్టి వివాహ కార్యక్రమం ప్రారంభమవుతుంది. వధూవరులు ఒకరిపై మరొకరు తలంబ్రాలు పోసుకుంటుంటారు కాని చిన్నరాకుమారి సువాబాయి తలంబ్రాలు పోసినప్పుడల్లా ఠంగు ఠంగుమని ధ్వని వస్తుంటుంది ఇదేదో మోసం జరుగుతున్నదని ఆమె మేనమామలైన వనగోజి వనగోపాల్ భావిస్తారు వరునికి బదులుగా కత్తిని కట్టిన సంగతి తెలిసికొని ఆగ్రహంతో వాళ్లపైకి దాడి చేస్తారు పెద్ద అలజడి ప్రారంభమవుతుం భలేరావు వెంటనే జోక్యంచేసుకొని వనగోజి వనగోపాల్‌లను శాంతింపజేస్తాడు ఈ మోసానికంతటికీ అసలు కారకుడైన ప్రధానిని పట్టితెచ్చి ప్రవేశపెట్టవలసిందిగా ఆజ్ఞాపిస్తాడు ఇది ఇట్లా జరుగుతుందని ముందుగానే ఊహించిన ప్రధాని వివాహస్థలానికి రాక లేతమామిడి తోటలోనే ఉండిపోతాడు రాజభటులు వచ్చి అతనిని బంధించి రాజు కడ్డకు తీసుకవెళ్ళుతారు. అప్పుడు భలేరావు

AC 96147

ఏడవ పెండ్లికుమారుడే తన ప్రధానినడుగుతాడు. చిన్న రాకుమారుడు విధిలేక సగం సంరక్షణార్థం తమ పట్టణంలోనే ఉండిపోవలసి వచ్చిందని ఆతనికి ప్రధాని నచ్చ చెపుతాడు వివాహం జరిగిన పిదప తిరిగి తమ నగరం చేరగానే ఏడవ రాకుమారుణ్ణి చూపిస్తానని హామీ ఇస్తాడు అట్లా చూపించలేకపోతే అప్పుడు తన తల నరుకవచ్చునని కూడ కోరుతాడు దీనికందరూ అంగీకరిస్తారు భేలేరావు తన ఏడుగురు కూతుర్ల వివాహాలు ఐదురోజులు కడు వైభవంగా జరిపించి తన కూతుర్లతోసహా వియ్యాలవారి నందరినీ ఆదరంతో సాగనంపుతాడు పెండ్లి బృందమంతా తిరిగి తమ సోమ్యానగర్‌కు బయలుదేరి ఆనందోత్సాహాలతో వస్తుంటుంది. ఆడపిల్లల తరవు వాళ్లంతా ఏడవ రాకుమారుణ్ని చూడాలన్న ఉత్సుకతతో ముందు వరుసలోసాగి వెళ్లుతుంటారు వెనుక మగపిల్లల తరపువాళ్లు అనుసరిస్తుంటారు

ఇట్లా త్రోవసాగుతుండగా భేలేరావు ఓటులు కొందరు మార్గమధ్యంలో ఒక పొన్నచెట్టు క్రింద విశ్రాంతి తీసుకుంటూ గంజాయి తాగుతారు గంజాయి తాగిన పిదప దానికి తాలూకు నిప్పురవ్వల్ని చెంతనున్న ఎండుగడ్డిపై ఊదివి వెళ్లిపోతారు దీనితో అగ్ని దేవుడు ప్రజ్వరిల్లి ఈ వివాహ బృందమునంతా అల్లకల్లోలం చేస్తాడు అగ్నిజ్వాలల నుండి తప్పించుకోవడంకోసం పెళ్లివాళ్లంతా గత్యంతరం లేక ఆరోజు పగలంతా ప్రయాణంచేసి సాయంత్రం వరకల్లా ఒక మహారణ్యం చేరి విశ్రాంతి తీసుకుంటారు. ఆ మహారణ్యానికి పాతాళ భుజంగరాజు అధిపతిగా ఉంటాడు ఆతడు పాతాళంలోని ఒక పెద్ద బిలంలో నివసిస్తుంటాడు ఈతడు మహాకాయుడు మహా పర్వతమెత్తు శరీరం కలిగి అతిభయంకరంగా ఉంటాడు వేలకొద్ది ఊళ్ళని ఒకసారి తనలోనికి పీల్చుకోగలిగిన సమర్థుడు ఈతనికి నాగేంద్రుడనే ఒక సోదరుడుంటాడు వీరిద్దరూ విధివశాత్తు విడిపోతారు పైడితంగేడిపూలు భుజంగరాజు దోసిట్లో పడిననాడు మళ్లీ ఈ ఇద్దరు సోదరులు కలుసుకుంటారన్న నియమమున్నది ఏపిటీలు వెలిగించుకొని నగారాలను మ్రోగిస్తూ అరణ్యంలో విడిసియున్న వివాహ బృందాన్ని భుజంగరాజు వలయాకారంతో చుట్టివేస్తాడు రాత్రంతా నిదురించి తెల్లవారి ఈ పెండ్లివాళ్లంతా మళ్లీ ప్రయాణం చేస్తుండే ఎటువెళ్లినా కోటగోడవలె భుజంగరాజు తమను చుట్టివేయడం గమనిస్తారు సోమోజి భార్యాసమేతుడై స్నానం చేసివచ్చి మంగళహారతి పట్టి భుజంగరాజును ప్రసన్నుని చేయడంకోసం అనేక రకాలుగా ప్రార్థిస్తాడు. తమకు త్రోవ వదలితే అడిగిన దానిని ఇస్తానని రాజు వాగ్దానం చేస్తాడు. సోమోజి చిన్నకుమారుడైన అక్కలంభైరిని తన కప్పగించవలసిందని భుజంగరాజు కోరుకుంటాడు సోమోజి విధిలేక బాధపడుతూనే ఇందుకు అంగీకరిస్తాడు. పదోరోజు తప్పక అక్కలంభైరిని

పంపిస్తానని రాజు మాట ఇవ్వగా-భుజంగరాజు తోవ వదలుతాడు. ఈ పెండ్లి బృంద మంతా ప్రయాణించి తిరిగి సోమ్యానగర్ చేరుకుంటుంది. ఇట్లా సుఖంగా పదిరోజులు గడిచిన పిదప అక్కలభైరిని భుజంగరాజు పెద్దకు పంపించవలసిన సమయం ఆసన్న మవుతుంది తలిదండ్రులు ఈ సంగతిని అక్కలభైరితో చెప్పలేక ఖిన్నవదనులై ఏడుస్తుంటారు ఏడుపుకు కారణమేమిటని తన తలిదండ్రుల్ని అడిగి అక్కలభైరి అసలు సంగతిని తెలిసికుంటాడు అప్పుడాతడు తన విద్యా మహిమతో జరిగిన విష యమునంతా గ్రహిస్తాడు. వివాహ బృందం తిరుగు ప్రయాణంలో తన మాటను పాటించక పగలంతా ప్రయాణించి రాత్రిళ్లు నిదురించడమే ఈ అనర్థానికి కారణమని తెలుసుకుంటాడు. ఐనా ధైర్యంతో భుజంగరాజు కడకు వెళ్లుటకు సిద్ధమవుతాడు. ఇంతవరకూ ఈయన తన భార్యను కన్నెత్తి కూడ చూడలేదు తల్లి చూపించగా తన భార్యవద్దకు వెళ్లి తాను భుజంగరాజు కడకు వెళ్లుతున్నట్లు చెప్తుతాడు. అప్పుడామె అతని ననుగమిస్తూ వస్తానంటుంది. కాని అతడు ఆమెను వారిస్తాడు. రాజ్యపాలనలో నిమగ్నమై ఉంటే ఆమె తన వియోగబాధను మరచిపోగలదన్న ఉద్దేశంతో తన తండ్రిని ప్రార్థించి రాజ్యపాలన భారాన్ని ఆమెకప్పగిస్తాడు అక్కలభైరి ధైర్య సాహసాలతో బయలుదేరి వెళ్లి భుజంగరాజు నివసిస్తున్న పాతాళ బిలంలో ప్రవేశిస్తాడు ఈ భుజంగరాజుకు ఐదుగురు భార్యలుంటారు. వాళ్లు- నాగిని హస్తిని తిడికిని భరతిని మరియు పద్మిని. వీళ్లంతా తమ నాధునికి పాదసేవ చేస్తుంటారు. ఇందులో పద్మిని సుగుణవంతురాలు. అక్కలభైరి తమ బిలంలో ప్రవేశించినందుకు తన భర్త వల్ల అతనికేవిధమైన కీడు కలుగుతుందోనని బాధపడుతుంది. భర్త తలవైపున కూర్చుండి ఆతనికి వింజామర వీస్తున్న పద్మిని అక్కలభైరిని వెళ్లిపోవలసిందిగా సంజ్ఞచేస్తుంది ఐనా అతడు సాహసంతో భుజంగరాజును సమీపిస్తాడు సోమోజీ తన మాట నిలుపుకున్నందుకు భుజంగరాజు సంతసిస్తాడు అక్కలభైరి ధైర్యసాహ సాలను పరీక్షించడంకోసం అతన్ని ఆహారంగా తీసుకుంటానంటాడు అక్కలభైరి సాహసంతో అందుకు అంగీకరిస్తాడు అంతేకాక తాను స్వయంగా భుజంగరాజునోట్లో దూకడానికి సిద్ధమవుతాడు అప్పుడు భుజంగరాజు సంతోషించి అతన్ని మింగడం తన ఉద్దేశం కాదని తెలుపుతాడు ఐతే ఒక మహాకార్యం సాధించాలని అక్కలభైరిని కోరుతాడు. అదేమంటే– 'సముద్ర తీరంలో దర్వేషు నగరంలో దేవేంద్రునికూతురు తర్వదాజాయి ఏడంతస్తుల మేడలో నివసిస్తుంటుంది. ఆమెకొన్ని నెలల తరబడి నిదురపోతుంటుంది అలాగే కొన్ని నెలల తరబడి మేల్కొని ఉంటుంది. ఆమె బరువు ఎప్పుడూ ఐదు మల్లెపూల కన్నా మించదు ఆమెచుట్టూ దిట్టమైన కాపలా ఉంటుంది ఆమె ఎప్పుడూ నవ్వదు ఆమెనవ్వితే మాత్రం నోటినుండి పావుసేరు

వైడి తంగెడు పూలురాలుతాయి అవి భూమి మీద పడకముందే జాగ్రత్తగా పైపైననే కొంగులో పోసుకొని తీసుక రావాలని భుజంగరాజు ఆజ్ఞాపిస్తాడు అవసరమైనప్పుడల్లా తగిన ఆహారం సమకూర్చే ఒక ఉంగరాన్ని కూడ అక్కలభైరి కిస్తాడు ఆకలి అయినప్పుడల్లా ఐదు వేలికిళ్ళ నీళ్లు ఒక ప్రదేశంలో చల్లి దాని మీద ఒక బట్ట కప్పితే కోరిన ఆహారం వెంటనే వస్తుందని భుజంగరాజు ఆ ఉంగరం మహిమను తెలుపుతాడు వెంటనే అక్కలభైరి వైడి తంగెడు పూలను సాధించడంకోసం బయలుదేరుతాడు. మార్గ మధ్యంలో ఆకలి అయినప్పుడల్లా భుజంగరాజు చెప్పిన విధంగానే అక్కలభైరి ఆచరిస్తుంటాడు ఆహారం సిద్ధంకాగానే భుజించి ముందుకు సాగిపోతుంటాడు దారికిరు ప్రక్కలనున్న రెండు మామిడిచెట్లు కూడ అక్కలభైరి ననుగమిస్తూ ఆతనికి నీడనిస్తూ వెళ్లుతుంటాయి

ఇక్కడ అక్కలభైరికి ఒక గోరువంక కూడ తారసిల్లుతుంది దాన్ని పూర్వం ఒక ముని పెంచుకొని కొన్ని మంత్ర తంత్రములు నేర్పి పరమపదిస్తాడు అక్కలభైరి భుజించి వదిలిపెట్టిన ఆహారాన్ని తినుకుంటూ ఆతన్ని అనుగమిస్తూ గోరువంక వెళ్లుతుంటుంది ఆతనివల్ల తనకు ఆహారం లభిస్తున్నందుకు ఆతని కేదైనా సహాయం చేయాలనికూడ భావిస్తుంది ఆతడు దేనికోసం ఎటు వెళ్తున్నదీ అడిగి తెలిసికుంటుంది గోరువంక తన మంత్ర మహిమలతో చెదలునూ నక్కలనూ ఎలుగుబంట్లనూ సృష్టిస్తుంది వాటి సహాయంతో తర్వేదాదాయి నివసించే ఏడంతస్తుల మేడలోనికి భూగర్భంనుండి మార్గం త్రవ్విస్తుంది ఆ ద్వారాన్ని మూయడానికీ తెరువడానికీ అనువైన మూతనుకూడ చేయిస్తుంది ఆ రహస్య మార్గంగుండా అక్కలభైరి మొదటి సారి వెళ్లగా తర్వేదాబాయి నిదురిస్తుంటుంది ఎంత ప్రయత్నించినా ఆమె లేవదు ఆమె చేతి వ్రేలుకున్న ఉంగరాన్ని తీసుకొని వస్తాడు జరిగిన విషయాన్ని గోరువంకకు తెలిపి దాని ప్రోత్సాహంతో మరునాడు మళ్ళీ వెళ్లుతాడు ఆనాడు కూడ ఎంత ప్రయత్నించినా ఆమె నిదుర లేవదు ఆమె దాపున ఉన్న తమలపాకులతో రెండు విడియములు కట్టి ఒకటి ఆమె కొప్పులో కుచ్చుతాడు రెండవది తాను నమిలి ఆమె వక్షస్థలముపై ఉమ్మివేస్తాడు ఆ ఉమ్మి బంగారు పతకమై ఆమె ఉరముపై ప్రకాశిస్తుంటుంది పిదప ఆతడు ఈ రహస్య మార్గంగుండానే తిరిగివచ్చి జరిగిన విషయమంతా మళ్లీ గోరువంకకు తెలుపుతాడు చాలా జాగ్రత్తగా మసలుకోవలసిందని అది అక్కలభైరిని హెచ్చరిస్తుంది ఈలోగా తర్వేదాబాయి మేల్కొని చూడగా తన వ్రేలి ఉంగరం కనిపించదు మెడలో ఇంతకుముందులేని రత్నాల పతకం ప్రకాశిస్తుంటుంది ఎవరో తన మేడలోనికి ప్రవేశించినట్లు ఊహించి ఆతన్ని పట్టుకోవాలన్న ఉద్దేశంతో

నిదురపోయినట్లు నటిస్తుంటుంది. అక్కలబైరి మూడవసారి ప్రయత్నించడం కోసం మళ్లీ రహస్య మార్గంద్వారా తర్వాదాబాయి గదిలో ప్రవేశిస్తాడు వెంటనే ఆమె కేకలువేసి భటులను పిలిపించి అతన్ని రాజు కప్పగిస్తుంది. రాజు అతన్ని కొట్టించి చెరసాలలో వేయిస్తాడు. చెదలు ద్వారా ఈ సంగతంతా గోరువంకకు తెలుస్తుంది గోరువంక వెంటనే వెళ్లి సభలో కూర్చున్న దేవేంద్రుని తొడపై వాలుతుంది. అప్పుడు దేవేంద్రుడు ఈ అక్కల బైరి ప్రవర్తన గురించే సభాసదులతో చర్చిస్తుంటాడు గోరువంక ఏమీ ఎరుగనట్లు వ ళ్లు చర్చించు కుంటున్న విషయ మేమిటని ప్రశ్నిస్తుంది మాటలు నేర్చిన గోరువంకను చూసి ఆశ్చర్యపడి దేవేంద్రుడు జరిగిన సంగతంతా దానితో వివరిస్తాడు. అప్పుడు గోరువంక ఈ అక్కలబైరి తల్లిదండ్రులు మిక్కిలి సాహస వంతులూ సత్యశీలురూ మహిమాన్వితులనీ అతన్ని కష్టపెట్టితే వాళ్లు దేవలోకాన్నే ధ్వంసంచేయగలరనీ బెదిరిస్తుంది అంతేకాక తన కూతురు గదిలోనికి మూడుసార్లు రహస్యంగా ప్రవేశించి ఆమెను స్పృశించిన వాడికే ఆమెనిచ్చి వివాహం చేయడం సముచితమని కూడ సలహా ఇస్తుంది అత్యంత చాతుర్యంతో మాట్లాడుతున్న గోరువంక మాటల్ని మన్నించి దేవేంద్రుడు అక్కలబైరికి తన కూతురునిచ్చి వివాహం జరిపిస్తాడు తరువాత కట్నాలు కానుకలిచ్చి తన కూతురును అక్కలబైరితో అత్తవారింటికి సాగనంపుతాడు.

తర్వాదాబాయిని వెంటనిడుకొని అక్కలబైరి తిరుగు ప్రయాణం చేస్తుంటాడు. వెంట గోరువంక కూడ వస్తుంటుంది భూగర్భంనుండి మార్గం త్రవ్విన చోటికి అందరూ చేరుకొని విశ్రమిస్తారు అప్పుడు మాటల సందర్భంలో తర్వాదాబాయిని పొందుటకు తాను పడిన కష్టాల్ని అక్కలబైరి ఆమెకు వివరిస్తుంటాడు తాను ఆమె గదిలో మూడుసార్లు ప్రవేశించడం చివరిసారి దొరికిపోవడం తనను రాజు బంధించి కొట్టించడం వగైరా సంఘటనలు తెలుపుతూ తన శరీరంపై పడిన దెబ్బలు కూడ ఆమెకు చూపిస్తాడు వెంటనే తర్వాదాబాయి అతని వీపుమీద దెబ్బల్నిచూచి ఫక్కున నవ్వుతుంది ఇంతకుముందు చెప్పిన విధంగానే ఆమె నోటినుంచి పావుసేరు పైడి తంగేడి పూలు రాలుతాయి. అవి క్రింద పడకుండా పై పైననే అక్కలబైరి మూట కట్టుకుంటాడు

ఈ సమయంలోనే గోరువంక ఇక తన బాధ్యత తీరిందని చెప్పి అక్కలబైరితో సెలవు తీసుకొని వెళ్లి పోతుంది తనకు దారిపొడవునా నీడనిస్తూ తనను అనుసరిస్తూ ప్రయాణించిన మామిడి చెట్లుకూడ అక్కడే ఆగి సెలవు తీసుకుంటాయి

విదప అక్కలఖైరి భార్యా సమేతుడై వచ్చి భుజంగరాజును కలిసికొని అతని దోసిట్లో పైడి తంగెడు పూలు పోస్తాడు  వెంటనే ఎక్కడినుంచో వచ్చి అతని సోదరుడైన నాగేంద్రుడు భుజంగరాజును కలిసికుంటాడు  భుజంగరాజు సంతోషించి అక్కలఖైరికి నూరేండ్ల ఆయుష్యము కలగునట్లుగా దీవిస్తాడు  కొన్ని మహిమలతో కూడిన ఒక ఉంగరాన్ని కూడ అతని చేతివేళ్లకు తొడిగిస్తాడు  ఆ ఉంగరం మహిమలు తెలిపి అది చేతులు మారకూడదనికూడ హెచ్చరిస్తాడు  విదప భుజంగరాజును వీడ్కొని అక్కలఖైరి తన భార్య తర్వాదాబాయితో కలిసి సోమ్యానగర్ చేరుకుంటాడు తన తలిదండ్రుల్నీ సోదరుల్నీ, మొదటి భార్య సుజనాబాయినీ కలిసికొని సుఖంగా ఉంటాడు  ఒకనాడు సుజనాబాయి తన భర్త చేతికున్న ఉంగరాన్ని చూసి సంభ్రమాశ్చర్యాలతో హఠాత్తుగా లాగుకొని తనచేతికి పెట్టుకుంటుంది  ఇంతకుముందే భుజంగరాజు హెచ్చరించిన ప్రకారం ఉంగరం మరొకరి చేతికి పోయినందువల్ల అది తన మహిమలను కోల్పోతుంది  ఐతే నూరేండ్ల ఆయుష్యం కలిగి ఇద్దరు భార్యలతో అక్కలఖైరి సుఖంగా రాజ్యం పరిపాలిస్తుంటాడు

# ౯. ఆత్మారాణి కథ

ప్రతిఅంకూసు అనేరాజు దరియావతి నగరాన్ని పరిపాలిస్తుంటాడు ఈతనికి దారానూరు అనే ఒక తమ్ముడుంటాడు - ఈతడు అన్నగారికి చేదోడు వాదోడుగా ఉంటూ ఇంటి వ్యవహారాలు చూస్తుంటాడు. పతిఅంకూసు భార్యపేరు కృష్ణావతి దారానూరుకు నలాబాయి నీలాబాయి రతన్‌బాయి పర్వాబాయి అనే నలుగురు భార్యలుంటారు కాని అన్నదమ్ములిద్దరికీ సంతానం కలుగలేదు పతిఅంకూసు చక్కని రాజ్యం చేస్తుండగా ఒకనాడు కొందరు రైతులు ఆందోళన చెందుతూవచ్చి క్రూర మృగాలవల్ల తమ పంటలు పాడైపోతున్నవనీ తక్షణమే వచ్చి వాటిని వధించి తమ్మ రక్షింపవలసిందనీ వేడుకుంటారు.

రైతుల కోరికను మన్నించి వెంటనే రాజు సోదర సమేతుడై వేటకు బయలుదేరుతాడు వెంట ఆతని ప్రధాని కూడా వెళ్లుతాడు వేటలో ఆరితేరిన సిపాయిలూ బాజాబంత్రీలతో కూడిన పరివారమూ వెంట వెళ్లుతుంది ఆ సోదరులిద్దరూ ఉత్సాహంతో మిట్ట మధ్యాహ్నం దాకా బాగా వేటాడి అలిసి పోతారు. పతిఅంకూసు రాజుకు దాహం వేస్తుంది. కనుక వెంటనే వేటచాలించి తిరిగి పట్టణం బయలుదేరవలసిందిగా రాజు తన పరివారాన్ని ఆజ్ఞాపిస్తాడు. రాజాజ్ఞ ప్రకారం అందరూ పట్టణానికి ప్రయాణమై తిరిగి వెళ్లుతుంటారు పతిఅంకూసు రాజు ముందు వరుసలో వెళ్లుతాడు దారానూరూ వాళ్ల ప్రధాని మాత్రం వెనుక ముచ్చటించుకుంటూ నడుస్తుంటారు దారిలో వాళ్లకు ఒక నల్లని జింక మృతదేహం కనిపిస్తుంది ముందు వెళ్లుతున్న తమవాళ్లలో ఎవరోదాన్ని వేటాడి చంపి ఉంటారని ఊహిస్తారు దాన్ని వధించిన వాళ్లకన్నా చూచిన వాళ్లకే ఎక్కువ పాపం తగులుతుందని దారానూరు భయపడుతాడు కనుక ఆపాపం తగులకుండా ఉండడంకోసం జింక శరీరాన్ని పట్టణానికి మోసుకొనివచ్చి వండుకొని తినడంకోసం ఎవ్వరికైనా దానం చేయవలసిందని ప్రధానికి ఆజ్ఞాపించి దారానూరు ముందుకుసాగి వెళ్లిపోతాడు అందుకు ప్రధాని తనలోతాను చాలా బాధపడుతాడు ఆ జింక శరీరాన్ని స్వయంగా తాను మోసుకపోవడం అవమానకరంగా భావిస్తాడు

కనుక ఏ పశువుల కాపరి చేతనో లేక గొర్లకాపరి చేతనో దాన్ని మోయించి తీసుక పోవలెనని ఆలోచించి వాళ్లకోసం అడవంతా గాలిస్తాడు కాని అతనికి ఎవరూ కని పించరు

చివరికి ఒకచోట గాఢమైన తపస్సులో మునిగి ఉన్న ఒక మహర్షి కని పిస్తాడు. చిరకాలంగా తపస్సు చేస్తున్నందువల్ల అతని తలవెంట్రుకలు పెరిగి జడలు కట్టి నేలలో పాతుక పోయి ఉంటాయి. చెవుల్లో పిట్టలు గూళ్లు పెడుతాయి ప్రధాని అతనివద్దకు వెళ్లి అతని తపోభంగం చేసి ఆ జింక శరీరాన్ని దరియావతినగర్‌కు మోసుకరావలసిందిగా ఆజ్ఞాపిస్తాడు అంతేకాక ఇది రాజాజ్ఞ అనికూడా హెచ్చరించి బలవంతంగా మహర్షి మూపుపై దాన్ని మోపి నడిపిస్తాడు. గత్యంతరం లేక అప్పటి కేమి మారుపలుకక మునిపుంగవుడు జింక మృతదేహాన్ని మోసుకొని నేరుగా రాజ మందిరానికి వెళ్లి తలుపు తట్టుతాడు అప్పుడు రాజు నిదురిస్తున్నందువల్ల అతని రాణి కృష్ణావతి వచ్చి తలుపు తీస్తుంది గాని కోపంతో ఆ జింక శరీరాన్ని ద్వారంముందు పారవేసి తన చేత ఇటువంటి పాడుపని చేయించినందుకు పన్నెండు సంవత్సరాలవ్యవ ధిలో ఎన్నడేని ఒక్క నీటిచుక్క రాజు శరీరంపై పడినట్లైతే వెంటనే రాజు క్రూర రాక్ష సుడై పోతాడని శపించి తన దారిన తాను వెళ్లిపోతాడు ఈ శాపం విన్న కృష్ణావతి ఆందోళన చెందుతూవెళ్లి తన భర్తకు తెలుపుతుంది. అనుకోకుండా జరిగిన ఈ అరి ష్టానికి ఇద్దరూ బాధపడుతారు ఇది మునిశాపం కనుక తప్పించుకోలేమని భావించి శరీరంపై నీటిచుక్క పడకుండా రాజు తగిన జాగ్రత్తతో ఉంటాడు స్నాన సంధ్యా దులు మానివేస్తాడు నీళ్లు త్రాగవలసివస్తే నేరుగా గొంతులో పోసుకొని మింగు తుంటాడు ఇట్లా కొన్ని సంవత్సరాలు గడుస్తాయి

ఒకరోజు ప్రధాని మునిశాప మహిమకు పరీక్షింపవలెనని భావిస్తాడు వేటకు వెళ్లుదామని రాజును ప్రోత్సహిస్తాడు రాజుకు ఇష్టంలేకున్నా అంగీకరింప జేస్తాడు రాజు సోదర సమేతుడై మళ్లీ వేటకు ప్రయాణమై వెళ్లుతాడు వెంట ప్రధానికూడ వెళ్లుతాడు. ఎండలో బాగా వేటాడినందువల్ల అందరూ అలిసిపోతారు ఒళ్లంతా చెమట కారుతుంటుంది. దారాసూరా, ప్రధాని కలిసి దెంతనున్న గంగకువెళ్లి స్నానం చేసి వస్తారు. ఒళ్లంతా చెమటపట్టి రాజు చికాకుతో ఉంటాడు గంగలో స్నానంచేసి రావలసిందిగా రాజును ప్రధాని ప్రోత్సహిస్తాడు ఒక విప్రుడిచ్చిన శాపం ఏమీ చేయజాలదని కూడ ధైర్యం చెప్పుతాడు. ప్రధానిప్రేరణతో రాజు సాహసించి స్నానంచేయడానికై గంగలో దిగుతాడు. అందులో మునగడమే తడవుగా రాజు

భయంకరమైన రాక్షసుడుగా మారిపోతాడు. రాక్షసుడుగా మారిన వెంటనే అతనికి ఎక్కడలేని ఆకలివేస్తుంది. అంతని భయంకరమైన ఆకారాన్ని చూసి వెంటవచ్చిన పరివారమంతా పారి పోతుంది. తన తమ్ముడు దారానూరునూ ప్రధానినీ మ్రింగి తినడం కోసం రాజు వాళ్ల మీదికి వస్తుంటాడు వాళ్లు తప్పించుకొని వెగంగా పట్టణంలోనికి పరుగెత్తుకొని వెళ్లి ద్వారాలనన్నీ మూసివేస్తారు కాని రాక్షసుడుగా మారిన పతిఅంకూసు తలుపులను పగుల గొడుతుంటాడు పట్టణంలోని ప్రజలందరూ భయపడి ఇండ్లు ఖాళీచేసి పారిపోతారు ఇక ఆలస్యం చేస్తే తాము రాక్షసునికి బలికావడం తప్పదని గ్రహించి దారానూరు తన వదినగారైన కృష్ణావతి వద్దకువెళ్లి పట్టణంవదిలి పారిపోదామని సలహా ఇస్తాడు. అప్పటికే ఆమె ఆరుమాసాల గర్భవతిగా ఉంటుంది లేకలేక చివరికి ఆమెఒక్కతికైనా గర్భం నిలిచినందులకు ఆమెను కాపాడి తమవంశం నిలబెట్టుకోవాలని దారానూరు ఎంతో తాపత్రియపడుతాడు అతడు ఎంత చెప్పినా కృష్ణావతి వినిపించుకోదు. తన భర్తకు ఆహారంగానైనా ప్రాణం త్యాగం చేయడానికి సిద్ధపడుతుంది కాని పట్టణం వదిలి వెళ్లడానికి నిరాకరిస్తుంది. ఇక చేసేదిలేక దారానూరూ, ప్రధాని రహస్యంగా మరో చోటికి పారిపోతారు అటు పతిఅంకూసు తలుపులు పగులగొట్టి రాణివాసం ప్రవేశించి కృష్ణావతిని మ్రింగి తినడానికి ప్రయత్నిస్తాడు అప్పుడామె తాను ఆరుమాసాల గర్భవతిగా ఉన్న విషయాన్ని తెలిపి ప్రసవానంతరం తనను ఆహారంగా స్వీకరించవచ్చునని వేడుకుంటుంది అందుకు పతిఅంకూసు అంగీకరిస్తాడు.

మూడు మాసాల పిదప కృష్ణావతి ప్రసవమై ఆడపిల్లను కంటుంది. ఆ పిల్లకు ఆత్మారాణి అని నామకరణంచేసి తొట్టెలో పరుండబెట్టి ఊపుతుంటుంది. అనుకున్న ప్రకారం పతిఅంకూసు వచ్చి కృష్ణావతిని ఆహారంగా భుజిస్తాడు. తాను తన భర్త కడుపులో పడేముందు కృష్ణావతి తన నగలూ వస్త్రాలూ అన్నీ తొట్టెలో తన కూతురు చెంత పెడుతుంది. కాని అంతటితో అతని ఆకలి తీరక తొట్టెలో ఉన్న పసికందునుకూడ తినడానికి సిద్ధమవుతాడు ఐతే శంకరుడు ఈమెను కాపాడి ఈ వంశాన్ని నిలబెట్టవలెనని భావిస్తాడు వెంటనే శంకరుడు తన మహిమతో విభూతిని తీసి ఆ పసిపిల్లపై చల్లుతాడు. ఒక రవరత్నాల హారాన్నికూడ ప్రసాదించి ఆమె మెడలో వేస్తాడు. శంకరుని మహిమవల్ల ఆ పిల్లను తినడానికి వెళ్లిన పతిఅంకూసుకు భరించరాని దుర్వాసన వస్తుంది. తొట్టెవద్దకు వెళ్లగానే తలబద్దలయ్యే కంపు కొడుతుంది వాంతి వచ్చినట్లవుతుంది అందువల్ల ఆ పసిపిల్లను భుజించకుండా వదిలివేస్తాడు. అంతేకాక ప్రతినిత్యం ఆహార పానీయాదులు సమకూరుస్తూ ఆ పసి

పిల్లను పోషిస్తుంటాడు. ఇట్లా ఆ పిల్లకు పన్నెండు సంవత్సరాల వయస్సువస్తుంది. ఒకనాడు ఈమె తన తల్లికి సంబంధించిన చీరలూ, నగలూ ధరించి చాలా ఆకర్షణీయంగా కనిపిస్తుంది. అప్పుడు మళ్లీ పతిఅంకూసు ఆమెను భుజించి తన ఆకలి తీర్చుకొనవలెనని ప్రయత్నిస్తాడు. కాని ఆపిల్ల హఠాత్తుగా ఇంటివెనుక తలుపులు తీసుకొని పట్టణంలోనికి వెళ్లి మూడు రోజులదాకా అక్కడే దాగి ఉంటుంది. పతిఅంకూసు పట్టణంలో జొరబడి ఆమెకోసం గాలిస్తుంటాడు. ఆమె అక్కడినుంచి వెళ్లి అడవిలో ప్రవేశించి పారిపోతుంటుంది. పతిఅంకూసు ఆమెను పట్టుకొనవలెనని వెంటనంటి పరుగెత్తుతుంటాడు. ఆమెకు దారిలో ఒక చందన వృక్షం కనిపిస్తుంది. ఆమె ఆ వృక్షాన్ని శరణు వేడుతుంది. ఆ చందన వృక్షం వెంటనే కరుణించి ఆమెను కాపాడనెంచి రెండుగా పగిలి ఆమెను తనలోపల దాచిపెట్టుకొని మళ్లీ ఎప్పటి మాదిరిగా అతుక్కుపోతుంది. పతిఅంకూసు ఆత్మారాణిని వెదుక్కుంటూవచ్చి ఆ చందన వృక్షాన్ని సమీపిస్తాడు. ఆమె పాదాలంగుర్తులు ఆ వృక్షంవరకె వచ్చి ఆగిపోయినట్లు కనిపెట్టి అందులో ఆత్మారాణి దాగిఉన్నట్లు ఊహిస్తాడు. అందువల్ల వృక్షాన్ని సమూలంగా పెరికివేసి ఆమెను అందులోనుంచి బయటకు తీయాలని ప్రయత్నిస్తుంటాడు. అతడు మహావృక్షాన్ని బలంగా పెకిలిస్తూ ఉంటే ఆత్మారాణి భయపడుతుంటుంది. అప్పుడామె కోరికపై ఆమెను రక్షించనెంచి ఆ చందనవృక్షం తనదైన ఒక పెద్దకొమ్మనువిరిచి రాక్షసునిపై పడవేస్తుంది. రాక్షసాకారంలో ఉన్న పతిఅంకూసు అక్కడికక్కడే కుప్పకూలి మరణిస్తాడు. మరికొన్ని రోజులకు దైవికంగా పెద్ద గాలిదుమారం చెలరేగి ఆ చందన వృక్షం నేల కూలుతుంది. కాని ఆత్మారాణి మాత్రం తరుకాండంలో భద్రంగానే ఉంటుంది. ఆమె కోరినప్పుడు ఇవతలికి రావడానికి, మళ్లీ లోపలికి వెళ్లి దాక్కోవడానికీ దారి ఇస్తూ తరుకాండం సహకరిస్తూ ఆమెను రక్షిస్తుంటుంది.

అటు దారానూరు తన ప్రధానితో కలిసి గంగానది ఒడ్డున మళ్లీ దరియావతీనగర్ పేరుతోనే నగరం నిర్మించుకొని పరిపాలిస్తుంటాడు. ఒకనాడు అతని నగరానికి కొందరు గోసాయీలువచ్చి ఒక పూట తమకు భోజనం పెట్టవలసిందిగా కోరుతారు. దారానూరు వెంటనే అందుకు అంగీకరించి వాళ్లకందరికీ భోజనానికి కావలసిన సామగ్రినంతా పంపుతాడు. వాళ్లు గంగానది ఒడ్డున వంటలు చేయ సంకల్పించి వంట చెరుకుల కోసం వెతుకుతుంటారు. అనుకోకుండా వాళ్లకు నేలకూలి ఉన్న ఈ చందనవృక్షం కనిపిస్తుంది. దాని కొమ్మలు కొన్ని నరుక్కొని తెచ్చి వంటచేస్తుంటారు. చందనపు కర్ర కాలుతూఉంటే దానిపొగ నగరమంతా వ్యాపించి కమ్మనివాసన గుబాళిస్తుంటుంది. ఈ పరిమళానికి అబ్బురపడి ధారానూరు వెంటనేవచ్చి అందుకుగల కారణాన్ని గోసాయీల

నుండి తెలిసికుంటారు. వాళ్ల ద్వారా చందనవృక్షం జాడ తెలిసికొని ఆ ప్రదేశానికి వెళ్లి చూసి దాని పరిమళానికి పరవశుడై పోతాడు. వెంటనే మంచి పనితనంగల వడ్రంగులనూ ఇతర పనివాండ్రనూ పిలిపించి దాన్ని విడివిడిగా కోయించి తనకు కావలసిన కర్ర సామానులు చేయించుకుంటాడు. రాజాజ్ఞ ప్రకారం వడ్రంగులు చందనం కర్రతో చక్కని సింహాసనాన్నీ, చత్రిరికోళ్ళ మంచాన్నీ సోఫాసెట్టునూ తయారుచేస్తారు. అంతే కాక తన ప్రధానిని నియోగించి అక్కడే చక్కని మందిరం కట్టించుకొని అందులో ఈ విలాసవంతమైన వస్తువులన్నీ అమర్చుకొని దారానూరు అందులోనే నివసిస్తుంటాడు. ఐతే ఆత్మారాణి దాగిఉన్న భాగంతోనే సోఫాసెట్టు చేయబడింది. ఆమె అందులోనే భద్రంగా దాగి ఉంటుంది.

దారానూరు తన రాజివాసానికి కూడా రాకుండా మహారణ్యంలో ఏకాంతంగా కట్టించుకున్న వైభవోపేతమైన ఈ మేడలోనే హాయిగా కాలంగడుపుతుంటాడు. తన రాణుల వద్దనుంచి ప్రతి నిత్యం అక్కడికే తనకు భోజనం తీసుకరావలసిందిగా ప్రధానిని ఆజ్ఞాపిస్తాడు. రాజాజ్ఞ మేరకు ప్రధాని భోజనం తెచ్చిన సమయంలో రాజు గాఢమైన నిద్రలో ఉంటాడు. నిదురిస్తున్న రాజును లేపడం భావ్యంకాదని భావించి ప్రధాని భోజనం తెచ్చిన పాత్రలను అక్కడనే ఉంచి వెళ్లిపోతాడు. చందనం కర్రలో దాగిఉన్న ఆత్మారాణి ఇది కనిపెడుతుంది. పైగా ఆమెకు చాలాకాలంనుండి ఆహారం లేనందున బాగా ఆకలితో ఉంటుంది. అందువల్ల ఆమె చందనంకర్రనుండి ఇవతలికి వచ్చి రాజుకోసం తెచ్చిన ఆహారాన్ని భుజించి మళ్లీ కర్రలో దాగిపోతుంది. రాజు నిదురనుండి మేల్కొని చూడగా ఖాళీగిన్నెలు మాత్రమే కనిపిస్తుంటాయి. రాజు ఆశ్చర్యపోతుంటాడు. ప్రధాని మొదటి ముగ్గురు పెద్ద రాణులనుండి మూడు రోజులు ఇట్లాగే భోజనం తీసుకవస్తాడు. ప్రతినిత్యం ఇట్లాగే జరుగుతుంది. రాజు లేచి చూసేవరకల్లా ఖాళీగిన్నెలు మాత్రమే మిగులుతుంటాయి. రాజు దీన్ని రహస్యంగా కనిపెట్టాలని భావిస్తాడు. వంతు ప్రకారం రాజుగారి చిన్న భార్య అయిన పర్వాబాయి నుండి ప్రధాని భోజనం తెచ్చి రోజు మాదిరిగానే నిద్రిస్తున్న రాజుగారి చెంత పెట్టి వెళ్లుతాడు. రాజుగారు మెలకువతోనే ఉండి జాగ్రత్తగా కనిపెట్టుకొని ఉంటాడు. ఎప్పటి మాదిరిగానే ఆత్మారాణి చందనం కర్రలోనుండి ఇవతలికివచ్చి భోజనం చేసి మళ్లీ అందులోకి వెళ్లబోతుంది. రాజు వెంటనేలేచి ఆమెను పట్టుకొని వధించబోతాడు. అప్పుడు ఆత్మారాణి శంకరుని మహిమతో అతడు తన చిన్నాయనగా గుర్తించి 'తండ్రీ' అని సంబోధించి తన్ను తాను పరిచయం చేసుకుంటుంది. ఆత్మారాణి తన అన్నగారి కూతురుగా తెలిసికొని దారానూరు ఎంతో ఆనందిస్తాడు. ఆమెను చేరదీసి తన

తొడలపై కూర్చుండబెట్టుకొని యోగక్షేమములు మాట్లాడుతాడు. ఇకనుండి ప్రతి నిత్యం ఇద్దరికి భోజనం తీసుకరావలసిందిగా ప్రధాని ఆజ్ఞాపిస్తాడు. అతడు వెళ్లి రాణులతో ఈ విషయం చెప్పగానే వాళ్లకు అనుమానం కలుగుతుంది. రాజు తమ్ము పూర్తిగా మరచిపోయి మరొక స్త్రీతో సంసారం చేస్తున్నాడని రాణులు ఊహిస్తారు. ఇదేదో తెలిసికోవలెనని నలుగురు రాణులూ బదులుకుంటారు. రాజును ఏదో నెపంతో ఆ మేడనుండి సుమారప్రాంతానికి తీసుకుపోవలసిందిగా ప్రధానిని కోరుతారు. ఆ ప్రకారం ప్రధాని రాజువద్దకు వచ్చి, మనోజ్ఞమైన ప్రకృతి సౌందర్యాన్ని దర్శిస్తూ వేటాడడానికి వెళ్దామని ప్రోత్సహిస్తాడు. కాని ఆత్మారాణిని వదిలిపెట్టి వెళ్లడానికి అతనికి మనస్కరించదు. పైగా ఇంతకుముందు వేటాడడానికి వెళ్లిన రెండు సందర్భాల్లోనూ తన అన్నగారికి కలిగిన కీడునుకూడా గుర్తు చేస్తాడు. ఐనా ప్రధాని మరీమరీ బతిమిలాడుతాడు. ప్రధాని కోరికను కాదనలేక ఎట్టకేలకు రాజు వేటకు బయలుదేరుతాడు. బయలుదేరేముందు ఆత్మారాణిని పిలిచి తన బంగారు ఉంగరంతో మూడుసార్లు చందనం కర్రను తట్టితే తాను వచ్చినట్లుగా గుర్తించి ఇవతలికి రావలసిందని చెప్పి వెళ్లిపోతాడు. ఇదే సమయంలో రాజుగారి నలుగురు భార్యలు— నలాబాయి, నీలాబాయి, రతన్‌బాయి, పర్వాబాయి కలిసి దారాసూరు నివసిస్తున్న మందిరాన్ని దర్శిస్తారు. అందులో ప్రవేశించి ఆ మందిర వైభవాన్ని చూడగా వాళ్ల అనుమానం మరింత దృఢమవుతుంది. వాళ్లు నలుగురూ మెచ్చుకుంటూ చందనంకర్రతో చేసిన సోఫామీద కూర్చుంటారు. అప్రయత్నంగా పర్వాబాయి తన కాలిమట్టెలతో చందనం కర్రను మూడుసార్లు తట్టుతుంది. ఇదివిని తన తండ్రి దారాసూరు వచ్చినాడని భావించి ఆత్మారాణి అందులోనుండి బయటకు వస్తుంది. ఆమెను చూడగానే వీళ్ల నలుగుర్నీ విస్తుపోతారు. ఆమెతో తమ భర్త దారాసూరు కాపురం చేస్తున్నట్లు దృఢపరచుకుంటారు. ఆమెను పట్టుకొని చితుకబాదుతారు. తమ కూతురునని ఆత్మారాణి ఎంత మొరపెట్టినా వినకుండా బాదుతారు. అప్పుడు ఆత్మారాణి వెంటనే మళ్లీ చందనం కర్రలోనికి వెళ్లి దాగిపోతుంది. ఆ నలుగురు రాణులూ తమ భర్తపై కోపంతో తిరిగి తమ పట్టణం చేరుకుంటారు. ఎట్లాగైనా ఆత్మారాణిని అంతం చేయించాలని ఆలోచిస్తుంటారు.

అటు పిదప దారాసూరువచ్చి తన ఏకాంత మందిరంలో ప్రవేశించి, బంగారు ఉంగరంతో మూడుసార్లు చందనం కర్రను తట్టుతాడు. ఈసారి మళ్లీ తన పినతల్లులే వచ్చినారన్న భయంతో ఆత్మారాణి ఇవతలికి రాదు. పైగా తన మందిరంలో వస్తువులన్నీ చిందరవందరగా పడివుండడం కూడ గమనిస్తాడు. తన భార్యలువచ్చి

ఆత్మారాణిని తమ ఇంటికి తీసుకవెళ్లి ఉంటారని ఊహిస్తాడు. వెంటనే తన రాణి వాసానికి వెళ్లి ఆత్మారాణి గురించి వాళ్లనడుగుతాడు. రాణులు కుట్రపన్ని ఆత్మారాణి శీలంపై అనుమానం కలిగే విధంగా ఒక కథ అల్లుతారు. తాము నలుగురూ వెళ్లి ఆత్మారాణితో కులాసాగా మాట్లాడుకున్న సమయంలో ఒక గట్టపు సైను వచ్చినాడనీ అతడువచ్చిన వెంటనే ఆత్మారాణి తమ్మువదిలిపెట్టి అతనితో సరస సల్లాపాలాడుకుంటూ వెళ్లి పోయిందనీ ఒక కథ కల్పించి చెప్పుతారు. ఇది వినగానే దారానూరుకు ఎక్కడ లేనికోపం వస్తుంది. తమ వంశ గౌరవాన్ని మంటగలుపుతున్న ఆత్మారాణిని వధించ వలెనని నిర్ణయించుకుంటాడు. వెంటనే తన ప్రధానిని పిలిచి తన చేతి ఉంగరం ఇచ్చి దానితో మూడుసార్లు చందనం కర్రను తట్టితే ఆత్మారాణి ఇవతలికి వస్తుంది. అట్లా ఇవతలికి వచ్చిన ఆత్మారాణిని అరణ్యంలోనికి తీసుకవెళ్లి నిర్దాక్షిణ్యంగా వధించవలెనని ఆజ్ఞాపిస్తాడు. ప్రధాని రాజాజ్ఞ ప్రకారం బయలుదేరి మేడవద్దకు వస్తాడు. అదే విధంగా ఉంగరంతో మూడుసార్లు చందనం కర్రను తట్టగానే ఆత్మారాణి ఇవతలికి వస్తుంది. ఆమెను ఏదో మభ్యపెట్టి మహారణ్యంలోనికి తీసుకవెళ్లి కత్తితో తల నరుకుట కుద్యుక్తు డవుతాడు. అప్పుడు ఆత్మారాణి అందుకు సిద్ధపడి తన తలనరికిన పిదప తిరిగి వెనక్కి చూడకుండా వెళ్లిపోవలసిందిగా ప్రధానిని కోరుతుంది. ప్రధాని ఆ విధంగానే ఆత్మారాణి తలనరికి వెనక్కి తిరిగి చూడకుండా పట్టణం చేరుకుంటాడు.

ఇటు ఆత్మారాణి తల ఆకాశంలో గిరగిర తిరిగి క్రిందపడుతుంది. శంక రుని మహిమతో దాని నెత్తుటిధారలు చిమ్మినంత దూరం వలయాకారంలో ఒక చక్కని ఉద్యాన వనం వెలుస్తుంది. అందులో ఒక మంచినీళ్లబావి దాని ప్రక్కన ఒక దివ్య భవనం కూడ వెలుస్తాయి. మళ్లీ ఆత్మారాణి బ్రతికి ఆ భవనంలో ఒక మంచంపై కూర్చుండి కాలంగడుపుతుంటుంది. ఈశ్వరుని మహిమతో ఆత్మారాణికే లోటు ఉండదు. ఇట్లా కొన్ని రోజులు గడుస్తాయి.

అటు దారానూరు తన దైనందిన కార్యకలాపాలనుండి కాస్త విశ్రాంతినికోరి తన ప్రధానిని వెంటబెట్టుకొని అరణ్యంలో విహరించడానికి బయలుదేరుతాడు. అక్కడ తిరిగి తిరిగి వాళ్లిద్దరూ ఆత్మారాణి నివసిస్తున్న ఉద్యానవనానికే వస్తారు. అక్కడికి రాగానే రాజుకు దాహం వేస్తుంది. ఆ ఉద్యానవనంలో ఉన్న బావి నీళ్ల తోడుకొని తాగవలెనని ప్రయత్నిస్తాడు. కాని అతడు నీళ్లు తాగబోతుంటే ఇటు బావేపి ఇటు ఆకాశవాణీ ఏకంగా వెంటనే ఆత్మారాణి నివసిస్తున్నట్లు పలుకుతాయి. ఆమెను చూడకుండా నీళ్లు తాగడం భావ్యంకాదని కూడ హెచ్చరిస్తాయి. ఈ అద్భుతమైన

పలుకులువిని దారానూరు హర్షించి అక్కడి భవనంలో ప్రవేశిస్తాడు. అక్కడ మంచంపై కూర్చున్న ఆత్మారాణి కనిపిస్తుంది. ఆమె తిరిగి ఎట్లా బ్రతికిందన్న సంగతి ఆమెద్వారానే తెలిసికుంటాడు. పైగా ప్రక్కనేవున్న ప్రధాని తాను స్వయంగా ఆమెతల నరికినట్లు ధృవీకరిస్తాడు. ఇది ఈశ్వరానుగ్రహంగా భావించి దారానూరు ఆమెను వెంటబెట్టుకొని తన పట్టణం చేరుతాడు. ఆమెకు వివాహంకూడ చేయనెంచి ఒక ప్రకటనకూడ చేస్తాడు. ఏ రాకుమారుడైతే ఆమె నివసిస్తూవున్న ఉద్యానవనంలోని మేడను స్వయంగా కూల్చి అందులోని బావిని కూడ్చుతాడో అతనికే ఆత్మారాణిని ఇచ్చి వివాహం జరిపిస్తానని ప్రకటన చేస్తాడు. ఈ ప్రకటన పాల్దేవ్‌నగర్‌కు చెందిన సోలాసింగ్ రాజుకు తెలుస్తుంది. వెంటనే అతడు వచ్చి హనుమంతుని ప్రార్థించి అతని వరంతో తగిన శక్తిని సంపాదించి మేడను కూల్చి బావిని కూడ్చుతాడు. అప్పుడు దారానూరు తాను ప్రకటించిన విధంగా సోలాసింగ్ రాజుకు ఆత్మారాణిని ఇచ్చి వివాహం చేయతలపెడుతాడు. ఐతే లగ్న నిశ్చయం చేయడానికి వచ్చిన బ్రాహ్మణులు వధూవరులు పన్నెండురోజులదాకా ఒకరి ముఖం మరొకరు చూసుకోకూడదనీ అట్లా చూస్తే పన్నెండు సంవత్సరాలు వనవాసం తప్పదనీ జోస్యం చెప్పుతారు. అందువల్ల రాజు వీళ్లకు ఒకరిముఖం మరొకరికి కనిపించని విధంగా వివాహం జరిపించి వేరువేరు భవనాల్లో ఉంచుతాడు. ఇట్లా పదిరోజులు గడుస్తాయి. అప్పుడు ఆత్మారాణికి తన భర్తను చూడాలన్న కోరిక బలీయమవుతుంది. మరొక రెండు రోజులు ఓపిక పట్టలేక పోతుంది. తన భర్తకు పేరుకు తగ్గట్లుగా పదహారు కొమ్ములు ఉన్నాయేమో చూడాలన్న కుతూహలం అధికమవుతుంది. తన నెవ్వరూ గుర్తు పట్టకూడదన్న ఉద్దేశంతో తన వస్త్రాలూ నగలూ ఒక దాసీదానికి తొడిగించి దాసీదాని బట్టలు తాను ధరిస్తుంది. చిన్ననాడు తాను తొట్టెలో ఉండగా రాక్షసుడుగా మారిన తన తండ్రి తనను మ్రింగడానికి వచ్చినప్పుడు, శంకరుడు ప్రసాదించిన రవరత్నాల హారాన్నికూడా దాసీదాని మెడలో వేసి వెళ్లుతుంది. ఈ హారం అత్యంత శక్తివంతమైంది. మెడలో నుండి హారం వెళ్లిపోగానే ఆత్మారాణి మూగదవుతుంది. ఐనా ఆత్మారాణి రహస్యంగా వెళ్లి నిండుసభలో దారానూరు ప్రక్కన కూర్చున్న తన భర్తను చూచి ఆనందిస్తుంది. తాను అనుమానించినట్లుగా సోలాసింగ్ రాజు పదహారు కొమ్ములు కలిగి లేక మిక్కిలి సౌందర్యవంతుడుగా ఉన్నందుకు ఎంతో సంతోషిస్తుంది. కాసేపు అట్లా తన భర్తను చూసి తిరిగివచ్చి తన వస్త్రములూ నగలూ తనకివ్వవలసిందని దాసీదానిని అడుగుతుంది. కాని దాసీది అందుకు నిరాకరించి తానే నిజమైన రాకుమారిగా నటిస్తుంది. పైగా ఒక దాసీది వచ్చి నగలు ఇవ్వవలసిందిగా తనపై దాడి చేస్తున్నదనికూడ అభాండాలు సృష్టిస్తుంది. ఈ విషయం క్రమంగా దారానూరుకు తెలుస్తుంది. అతడు నిజానిజాలు

పరిశీలించకుండానే హద్దుమీరి ప్రవర్తిస్తున్న దాసీదానిని అరణ్యంలోనికి తీసుకువెళ్ళి తల నరుకవలసిందిగా ఆజ్ఞాపిస్తాడు. రాజభటులు దాని వేషంతో ఉన్న ఆత్మారాణి తల నరుకడంకోసం ఆమెను మహారణ్యంలోనికి తీసుకువెళ్ళతారు. కాని వాళ్ళు ఆమెపై జాలివేసి వధించకుండానే వదిలివేసి తిరిగి తమ పట్టణం వస్తారు అదే సమయంలో పార్వతీ పరమేశ్వరులు ఆకాశయానం చేస్తూ ఆత్మారాణిని చూస్తారు. పార్వతీదేవి కోరికపై వెంటనే శంకరుడు విభూతిని తీసి భూమిపై చల్లుతాడు. దాని మహిమతో అక్కడ ఒక తోట. అందులో ఒక చిన్న కుటీరం వెలుస్తుంది. అందులో ఆత్మారాణి నివసిస్తుంటుంది.

ఇటు పట్టణంలో సోలాసింగ్ రాజువద్ద ఆత్మారాణి వేషంలో ఉన్న దాసీది తానే అతని భార్యగా నటిస్తూ ఉంటుంది. కాని ఆమె మోటు ప్రవర్తననుబట్టి అతనికి అనుమానం కలుగుతుంది. ఈ విషయం ఆయనకు అంతు చిక్కకుండా ఉంటుంది ఇట్లా ఉంటూఉండగా ఒకనాడు సోలాసింగ్ రాజు మానసిక ప్రశాంతతకోసం వనవిహారానికి వెళ్ళతాడు అతడు తిరిగి తిరిగి మళ్ళీ ఆత్మారాణి నివసించే ప్రాంతానికే వచ్చి ఆమెను చూస్తాడు ఆత్మారాణి అతనిని తన భర్తగా గుర్తిస్తుంది కాని మూగతనం అవలంబించినందువల్ల ఏమీ మాట్లాడజాలదు కాని చేసన్నలతో అతని ఆహ్వానించి ఆతిథ్యమిస్తుంది సోలాసింగ్ రాజు ఆమె ఆతిథ్యానికి అలరి ఆమె కోరిక ప్రకారం సంభోగమిచ్చి వెళ్ళిపోతాడు ఆత్మారాణి వెంటనే గర్భం ధరిస్తుంది. నవ మాసములు మోసి ఒక మగ శిశువును ప్రసవిస్తుంది. ఆ బాలుడు క్రమంగా పెరుగుతుంటాడు. కొన్ని మాసాల పిదప సోలాసింగ్ రాజు ఆత్మారాణిని వెతుక్కుంటూ గుర్రమెక్కి తిరిగి వస్తాడు. ఆత్మారాణికి తనవల్లనే పుత్రోదయం జరిగిందని తెలిసికొని ఆనందిస్తాడు. పిల్లవానిని దగ్గరికి తీసికొని ఆనందిస్తుంటాడు. ఆ బాలుడు అతని గుర్రం ఎక్కడానికి ఉత్సాహిస్తూ ముందుకు వంగుతాడు. రాజు పిల్లవానికోరిక ప్రకారం అతన్ని గుర్రంపై కూర్చుండబెట్టుకుంటాడు ఇంతలో బాలుడు పట్టణం వైపు త్రోవ చూపుతాడు, రాజు తన గుర్రాన్ని బాలుడు చూపించిన దిశకు నడిపిస్తూ ఆత్మారాణిగా నటిస్తున్న దాసీదాని మేడవద్దకు తీసుకువెళ్ళతాడు. అప్పుడు బాలుడు దాసీదానివైపు మొగ్గుతాడు, దాసీది గత్యంతరం లేక ఆ బాలుని ఎత్తుకుంటుంది. అప్పుడాబాలుడు ఆమె మెడలోని హారాన్ని తీసుకొని తన మెడలో వేసుకుంటాడు మొహమాటానికి దాసీది ఏమీ అభ్యంతరం చెప్పలేక పోతుంది. అప్పుడు బాలుడు మళ్ళీ గుర్రం ఎక్కడానికి సూచన చేస్తాడు. సోలాసింగ్ అతని సూచన ప్రకారం అతన్ని గుర్రంపై కూర్చుండబెట్టుకొని మళ్ళీ ఆత్మారాణి ఉంటున్న ప్రదేశానికి వస్తాడు అప్పుడాబాలుడు

తన మెడలోని హారాన్ని తీసి తన తల్లి మెడలో వేస్తాడు. దీనితో ఆత్మారాణికి మళ్లీ మాటలు వస్తాయి. ఆ రవరత్నాల హారం మహిమతో ఆమె మూగతనం తొలగిపోతుంది. అప్పుడు ఆమె జరిగిన విషయాన్నంతా తన భర్త సోలాసింగ్‌కు విన్నవిస్తుంది. అంతేకాక ఎవరు నిజమైన ఆత్మారాణో రుజువు చేయడానికి వీలుగా పట్టణంలో ఒకసభ ఏర్పాటు చేయవలసిందని కూడ చెప్పి అతన్ని సాగనంపుతుంది.

సోలాసింగ్‌రాజు ఆ ప్రకారంగానే పట్టణంవెళ్లి దారాసూర్ అనుమతితో ఒక సభను ఏర్పాటు చేస్తాడు. అక్కడికి నిజమైన ఆత్మారాణినీ ఆత్మారాణిగా నటిస్తున్న దాసీదానినీ పిలిపించి తమ వృత్తాంతాన్నంతా మొదటినుంచి వివరించవలసిందిగా కోరుతారు. దాసీది ఏమీ మాట్లాడజాలదు. పూర్వవృత్తాంతాన్ని వివరించ లేక తెల్లమొహం వేస్తుంది. కాని ఆత్మారాణి తన పూర్వవృత్తాంతాన్నంతా మొదటినుంచీ సవివరంగా విన్నవిస్తుంది. అందుకు సరియైన దాఖలాలన్నీ పదమర్చి చెప్పుతుంది. సభవారంతా ఈమెనే నిజమైన ఆత్మారాణిగా దృఢపరిచి దాసీదానికి కఠినశిక్ష విధిస్తారు. ఒక గాడిద కాళ్లకు దాసీదానిని బంధించి ఊరంతా తిప్పి చిత్రహింసల పాలుచేసి ముక్కలు ముక్కలుగా వధించవలసిందని దారాసూరు ఆజ్ఞాపిస్తాడు. ఆదే విధంగా దాసీదానిని చిత్రహింసలతో వధిస్తారు. పిదప దారాసూరు తన దరియాపటీనగర్ రాజ్యాన్ని సోలాసింగ్‌రాజుకూ ఆత్మారాణికీ అప్పగించి తాను పదవినుండి తప్పుకొంటాడు. సోలాసింగ్‌రాజు ప్రజారంజకంగా రాజ్యమేలుతుంటాడు

# ౧౦. శ్యాంనీల కథ

హాల్దీనగర్‌ను హల్దేవ్‌సేన్ అనేరాజు పరిపాలిస్తుంటాడు. ఈతని భార్యపేరు సుందరీబాయి. వీరికి చిరకాలంనుండి సంతానం కలుగదు. సంతానం కోసం కనిపించిన ప్రతి దేవుణ్ణి మొక్కుతుంటారు. ఐనా సంతానం కలుగదు. ఒకనాడు హల్దేవ్‌సేన్ గుర్రమెక్కి వేటకు బయలుదేరి వెళ్ళిపోతాడు.

మరొక వైపు ఇదే సమయంలో బేలంపినగర్‌ను బేలంపిసేన్ అనేరాజు పరిపాలిస్తుంటాడు. ఈతని భార్యపేరు సుందరీబాయి. వీరికికూడ సంతానం కలగదు. వీళ్ళుకూడ సంతానంకోసం ఎందర్నో దేవుళ్లను మొక్కుకుంటారు. ఐనా లాభంలేకుండా పోతుంది. బేలంపిసేన్‌కూడ ఒకనాడు గుర్రంపై కూర్చుండి వేటకు బయలుదేరి వెళ్తాడు.

హల్దేవ్‌సేన్ మరియు బేలంపిసేన్ అడవిలో తిరిగి తిరిగి మహమ్మదీయుల దర్గావద్ద అనుకోకుండా ఇద్దరూ కలిసికుంటారు. అక్కడ ఒకరినొకరు పరిచయం చేసుకుంటారు. వీళ్లిద్దరూ కలిసి తమకు సంతానం కలుగడంకోసం దర్గావద్ద పంచపీరీలకు మొక్కుకుంటారు. హల్దేవ్‌సేన్ తనకు సంతానం కలిగితే అక్కడనే దర్గావద్ద జీవసమాధి పొందుతానని మొక్కుతాడు. బేలంపిసేన్ తనకు సంతానం కలిగితే దర్గావద్ద పన్నెండు పుట్ల ఊదుకాలుస్తాననీ వెండి బంగారాలతో చేసిన పూలతో అర్చిస్తాననీ బంగారు కలశం దర్గాపై నిలుపుతాననీ మొక్కుకుంటాడు. అంతేకాక తమకు కడుపు పండితే గర్భస్థ శిశువులకు దర్గావద్దనే వివాహం చేస్తామని కూడ ఇద్దరూ కలిసి మొక్కులిడి ఎవరిరాజ్యానికి వాళ్ళు వెళ్లిపోతారు. కొంతకాలానికి దేవుని కృపతో ఈ ఇద్దరు రాణులూ గర్భం ధరిస్తారు. ఈ విషయాన్ని ఒకరికొకరు తెలుపుకొని తొమ్మిది మాసాలు నిండగానే దర్గావద్ద వివాహాలు జరిపించుటకు తగిన సన్నాహాలు చేసుకుంటారు. ఈ ఇద్దరు రాజులూ తమ రాణులతోసహా బయలుదేరివచ్చి దర్గావద్ద కలిసికొని గర్భస్థ శిశువులకు కడువైభవంతో వివాహం జరిపించి వెళ్లిపోతారు. కొద్ది

రోజుల్లోనే హల్దేవ్ సేన్కు కుమారుడు జన్మిస్తాడు అతనికి శ్యాంసీల అని నామకరణం చేస్తారు. పిదప హల్దేవ్ సేన్ రాజ్యాన్ని తన రాణికి ప్రధానికి అప్పగించి దర్గావద్ద జీవ సమాధిపొంది తన మొక్కు చెల్లించుకుంటాడు

అటు బేబందిసేన్కు కూడ కూతురు జన్మిస్తుంది. ఆమెకు హీరావంతి అని నామకరణం చేస్తారు. అతడు కూడ అనుకున్న ప్రకారం పంచపీరీలకు పన్నెండు పట్ల ఊదుకాల్చి వెండి బంగారాలతో చేసిన పూలు సమర్పించి దర్గాపై బంగారుకలశం ఎక్కించి తన మొక్కు చెల్లించుకుంటాడు పిల్లలు ఎవరి నగరంలో వారు పెరిగి పెద్ద వాళ్లవుతారు శ్యాంసీల పన్నెండు సంవత్సరాలవాడై సకల విద్యలను నేర్చుకొని ఉంటాడు ఆకసిలో యవ్వనం తొంగిచూస్తున్నందున తనకు వివాహం చేయవలసిందిగా తన తల్లిని కోరుతాడు తను గర్భంలో ఉండగానే మరొక గర్భస్థ శిశువుతో వివాహం జరిగినట్లునూ ఇప్పుడా కన్య బేబందినగర్లో రాకుమారిగా పెరుగుతున్నట్లునూ తెలిపి ఆమెను తీసుకవచ్చి ఏలుకోవలసిందని తల్లి కోరుతుంది వాళ్ల ప్రధాని రాకుమారుని ప్రయాణం కోసం అన్నీ సిద్ధం చేయిస్తాడు రాకుమారుడు బయలుదేరుటకు ముందు తల్లి అతన్ని దీవించి ఎప్పుడేమంచి కార్యం చేయతలపెట్టినా ముందుగా దర్గావద్దకువెళ్లి అక్కడ జీవసమాధి పొందిన తండ్రికి నమస్కరించి వెళ్లవలసిందిగా ఉపదేశిస్తుంది. తల్లితో సెలవు తీసుకొని గుఱ్ఱంమీద ప్రయాణమై రాకుమారుడు బేబందినగర్కు బయలు దేరుతాడు. అతడు ప్రయాణమై ఎళ్లి మార్గ మధ్యంలో దర్గావద్ద ఆగి సమాధి పొందిన తన తండ్రిని మనస్సులో ధ్యానించి నమస్కరిస్తాడు. అంతేగాక తన భార్యతో తిరిగి ఇక్కడికివచ్చి తన అరచేతిలో మడుము ఊదుకాల్చేదాకా భార్య మొహంచూడనని ప్రమాణం చేస్తాడు తరువాత అక్కడినుంచి కదలి బేబందినగర్ చేరుకుంటాడు బేబందిసేన్ను దర్శించి తాను అల్లుడనని కూడ పరిచయం చేసుకుంటాడు. రాజు అతన్ని సకలోపచారాలతో సత్కరిస్తారు, తన రాజభవనంలోనే కొంతకాలం ఉండేట్లు తగిన ఏర్పాట్లు చేస్తారు.

బేబందిసేన్ తన కూతురు హీరావంతికి ఒక గురువుద్వారా సకల విద్యలు నేర్పిస్తుంటాడు. ఈమెఅద్భుతమైన తెలివితేటలు కలది, అన్ని విద్యలూ అభ్యసించి ఉంటుంది: ఏ క్కలి అందకత్తె కూడ ఇక విద్యాభ్యాసం ముగిసిన పిదప గురువు ఆమెనుండి గురుదక్షిణ కోరుతాడు సద్భావంతో ఆమె గురుదక్షిణ చెల్లిస్తా నని గురువుకు వాగ్దానంచేస్తుంది. ఆమె అత్తవారింటికి వెళ్లకముందు గురు దక్షిణగా తనతో సంభోగించాలని గురువు కోరుకుంటాడు హీరావంతి పెద్ద ఇరకాటంలో పడి

పోతుంది. ఇది-భావ్యంకాదని గురువుతో వాదించి మరేదైనా కోరుకొమ్మని ప్రార్థిస్తుంది ఐనా ఎంతకూ ఆతడు వినడు. ఇక గత్యంతరం లేక అప్పటికామె అంగీకరిస్తుంది. ఆనాటి రాత్రి ఒక దాసీదానికి తనవేషం వేసి ఒక చీకటి గదిలో ఉంచగా గురువువచ్చి ఆ దాసీదానితో సంభోగంచేస్తాడు. తెల్లవారి వెళ్లిపోతుండగా వెలుతురులో ఆమె ముఖం చూసి గురువు నిజం తెలిసికుంటాడు తన శిష్యురాలు చేసిన మోసానికి ఎంతో దుఃఖిస్తాడు. దాసీ దానితో సంభోగించిన పాపం తొలగిపోవడంకోసం ఆతడు కాశీ యాత్రకు బయలుదేరి వెళ్లిపోతాడు

ఆటు శ్యాంసీల తాను దర్గావద్ద చేసిన బాసదప్పి ఇక్కడ అత్తగారి ఇంట్లో భార్యతో శృంగార క్రీడల్లో మునిగిపోతాడు భార్యాలోలుడై -పంచపీరీలను మరచి పోతాడు. ఇది గమనించి అక్కడ తురకపీరీలు ఈతడు పన్నెండు సంవత్సరాలు అడవులపాలై అష్టకష్టాలు పడునట్లు శపిస్తాయి ఈ శాపవార్త ఈతనికి తెలియదు కొంత కాలానికి శ్యాంసీల తన భార్యను తీసుకొని హబ్లీనగర్‌కు బయలుదేరుతాడు బేబందిసేన్ తగిన కట్నాలు కానుకలతో అల్లుడూ కూతురునూ సాగనంపుతాడు. భార్యాభర్తలు చెరొక గుఱ్ఱంపై కూర్చుండి ప్రయాణం చేస్తుంటారు ధనరాసులతో, కట్నాలు కానుకలతో బయలుదేరిన భార్యాభర్తలు అడవిలో కన్పించే అందమైన తరులతాదులనూ మృగ సంతతినీ వీక్షించుకుంటూ సాగిపోతుంటారు.

శ్యాంసీలుడూ హీరావంతికలిసి అడవిలో ప్రయాణం సాగిస్తుండగా మార్గ మధ్యంలో ఆరుగురు దొంగలు తారసిల్లుతారు ఈ-భార్యాభర్తలిద్దరూ కలిసి ఒక్కొ క్కరు ముగ్గురి చొప్పున ఆరుగురు దొంగల్ని కత్తులతో నరికివేస్తారు. అట్లా మళ్లీకొంత-దూరం వెళ్లగా సాయంత్రమవుతుంది. అక్కడ ఒక ముసలిదాని ఇంటికివెళ్లి ఆమె ఇంట్లో నివసిస్తారు. ఈమె ఇంతకుముందు చంపబడిన ఆరుగురు దొంగల తల్లి. ఆమెకు ఏడవ కుమారుడు కూడా ఉంటాడు. ఆతడు మరొకవైపు దొంగతనానికి వెళ్లిపోతాడు తన ఆరుగురు కుమారులు చంపబడినారన్న విషయం తెలియక వాళ్లు తొందరగా ఇంటికి తిరిగివస్తే ఈ భార్యాభర్తలవద్దనున్న సొమ్మునంతా దోచుకోవచ్చునని ముసలిది భావిస్తుంటుంది అందువల్ల వీళ్లు తొందరగా వెళ్లిపోకుండా కబుర్లుచెప్పుతూ కాలయాపన చేస్తుంటుంది. కాని ఆమె కుమారులు అంతకుముందే వీళ్లచేత చంపబడి నందున ఆ ముసలిదానికి నిరాశే మిగులుతుంది వాళ్లు చంపబడిన సంగతి ఆమెకు తెలియనే తెలియదు. పిదప శ్యాంసీలుడూ, హీరావంతీ అక్కడినుంచి కదలివెళ్లి పోతుంటారు. మార్గమధ్యంలో-ఈ ఏడవదొంగ ఎదురవుతాడు. -ఈ భార్యాభర్తల్ని

ఎదిరించడం తనకు చేతకాదని భావించి ఒక దిక్కులేనివాడుగా వాళ్లకు పరిచయమవుతాడు. తన కింత కూడు వేస్తే జీవితాంతం పరిచర్యలు చేస్తూ ఉంటానని నమ్మబలుకుతాడు. అందులకు వాళ్లు అంగీకరిస్తారు ఈ దొంగ వాళ్లవెనకాల నడుస్తూ నమ్మించి మార్గమధ్యంలో శ్యాంసీల తల నరికివేస్తాడు అప్పుడు హీరావంతి ఆ క్లిష్ట సమయంలో ఒక ఉపాయం పన్నుతుంది తన భర్త శవాన్ని ఖననం చేసి తనవద్దనున్న సంపదనంతా తీసుకపోవచ్చునని దొంగకు ఆశ చూపెడుతుంది అప్పుడా దొంగ తన వద్దనున్న ఖడ్గముతోనే శవాన్ని ఖననం చేయడం కోసం పెద్ద గోతిని త్రవ్వుతుంటాడు అతడు గోతిలో దిగి మన్ను త్రవ్వుతుండగా హీరావంతి నమ్మించి ఆతని తలనరికి వాన్ని అదే గోతిలో పూడ్చి పెడుతుంది. పిదప తురకపీరీలను మొక్కుకోగా శ్యాంసీలునికి ప్రాణం వస్తుంది భార్యాభర్తలు తిరిగి ప్రయాణమై వెళ్లుతుండగా ఒక గ్రామం వద్దకు రాగానే సాయంత్రమవుతుంది ఆ రాత్రి అక్కడే గడపడానికి నిశ్చయించుకుంటారు. వంట చేసుకోవడానికి కావలసిన సామాను కొనుక్కురావడం కోసం శ్యాంసీలుడు తన గుర్రాన్నీ, ఖడ్గాన్నీ, ఆభరణాల్నీ భార్యవద్దనే వదిలి ఊర్లోకి వెళ్లుతాడు అక్కడ మూడు దుకాణాల్లో వేరువేరు సామాన్లు ఖరీదు చేస్తాడు. తిరిగివచ్చి తానా సామాన్లు తీసుక వెళ్లుతానని చెప్పి మూటల్ని దుకాణాలలోనే ఉంచి విస్తరాకుల కోసం ఒక తమ్మళి స్త్రీ ఇంటికి వెళ్లుతాడు. ఆమె ఈతని సౌందర్యానికి వివశయై ఆతనితో సంభోగించవలెనని భావిస్తుంది. ఒక మంగమట్లను మంత్రించి ఆమె శ్యాంసీలుని తలపై గ్రుచ్చగానే ఆతడు ఒక గొర్రె పొట్టేలుగా మారిపోతాడు పగలంతా పొట్టేలు రూపంలో ఉంచుతూ రాత్రిళ్లు మనిషిగా మారుస్తూ తమ్మళిస్త్రీ శ్యాంసీలునితో సంభోగం జరుపుతుంటుంది ఇటు హీరావంతి తన భర్త కోసం చాలా కాలం ఎదురుచూసి ఎంతకూ ఆతడు తిరిగి రానందున వెదకడం కోసం బయలుదేరుతుంది తన భర్త దుస్తుల్నీ ఆభరణాల్నీ, కత్తినీ ధరించి పురుషవేషంలో గుఱ్ఱం పై కూర్చుండి వెళ్లుతుంటుంది. అట్లా ఆమె తిరిగి తిరిగి చాంద్‌గాంవ్ చేరుకుంటుంది. దాన్ని కూర్మాపతి అనె రాజు పరిపాలిస్తుంటాడు ఈతనికొక కూతురుంటుంది. ఆమె పేరు లీలాబాయి. ఈమె ఒక వాగు ఒడ్డున కూర్చుండి ఉంటుంది ఎవడైతే గుఱ్ఱంపై స్వారీచేస్తూ ఒకేగంతుతో ఆ వాగును దాటగలుగుతాడో ఆతన్నే వివాహ మాడుతానని నియమం పెట్టుకుంటుంది పురుష వేషంలో ఉండి తన భర్తను వెదకడానికై బయలుదేరిన హీరావంతి గుఱ్ఱంపై కూర్చుండి ఆ వాగును సునాయాసంగా ఒక్కగంతుతో దాటుతుంది దీన్ని గమనించి లీలావతి తన తండ్రివద్దకువెళ్లి ఈ విషయాన్నంతా వివరించి ఆతన్నే వివాహమాడుతానని విన్నవిస్తుంది. తండ్రి రాకుమారుని వేషంలో ఉన్న హీరావంతిని పిలిపించి ఆమె వద్దంటున్నా వినక తన కూతురునిచ్చి వివాహం జరిపిస్తాడు కొంతకాలందాకా అల్లుడిని తన ఇంట్లోనే ఉంచు

కుంటాడు. పురుషవేషంలో ఉన్న హీరావంతి అన్ని రాచకార్యాల్ని నిర్వహిస్తూ రాజుకు సహకరిస్తు టుంది. కాని రాకుమారితో మాత్రం కాపురం చేయటంలేదు. తన పేరు శ్యాంనీల అని భర్త పేరే పెట్టుకుంటుంది. నిజమైన తన చిత్రపటాన్నొక దానిని రాజమందిరంలో పెట్టిస్తుంది.

ఇట్లా ఉండగా ఒకనాడు పూర్వం తనకు విద్యనేర్పిన గురువు కాశీయాత్ర నుండి తిరిగి వస్తూ ఈ నగరం చేరుకుంటాడు. రాజ మందిరానికి కూడ వచ్చి మగ వేషంలో ఉన్న హీరావంతితో సంభాషిస్తుంటాడు. ఆ సమయంలో గురువుకు హీరావంతి చిత్రపటం గోడపై కనిపిస్తుంది. ఆ పటాన్ని చూసి అతడు దుఃఖిస్తుంటాడు. హీరావంతి కారణమేమిటని అడుగగా పూర్వం తానామెకు కామవాంఛ తీర్చుకొలసిందిగా కోరిన సంఘటనను వివరిస్తాడు. ఆమె ఈతడే తన గురువుగా గుర్తించి అతన్ని చెరసాలలో వేయిస్తుంది. ఇట్లా కొంతకాలం సాగిన పిదప తనకు పందెములు నిర్వహించవలెనన్న కోరిక ఉన్నదంటూ శ్యాంనీలగా చెలామణి అవుతున్న హీరావంతి రాజుతో విన్నవిస్తుంది. అల్లుని మాటల్ని కాదనలేక రాజు అంగీకరిస్తాడు. వివిధ రకాలైన జంతువులతో పందెములు నిర్వహింపబడుతుంటాయి. గుఱ్ఱం, ఎద్దు కోడివంటి జంతువులతో పందెములు నిర్వహింప బడిన పిదప పొట్టేళ్ల పందెములు కూడ ప్రారంభించబడుతాయి. రాజాజ్ఞ ప్రకారం తమ్మళిస్త్రీ కూడ తనవద్దనున్న గొట్టెపొట్టేలును పందెంకోసం తీసుక వస్తుంది. పందెంకోసం వచ్చిన అన్ని పొట్టేళ్లకన్నా ఈమె తెచ్చిన పొట్టేలు బలంగానూ ఆరోగ్యంగానూ, అందంగానూ ఉంటుంది. అప్పుడు హీరావంతి ఆ పొట్టేలును దగ్గరికి తీసి ఆదరంతో తల నిమురుతుంది. పొట్టేలు తలపై నాటబడిన మంగమల్లు ఆమె చేతికి తగులుతుంది. హీరావంతి దాన్ని ఊడదీయగానే గొట్టె పొట్టేలు మనిషిగా మారుతుంది. నేటితో శ్యాంనీలకు తురక వీరీలిచ్చిన శాపం ప్రకారం పన్నెండు సంవత్సరాలనుభవించాల్సిన కష్టాలు పరిసమాప్త మవుతాయి. హీరావంతి తన అసలురూపంతో బయటపడి తమ్మళి స్త్రీకి తగినశాస్తి చేస్తుంది. పొట్టేలు రూపంనుండి మనిషిగా మారిన వాడే తన భర్త అని అందరికి పరిచయం చేస్తుంది. ఈ సందర్భంలో తమ పూర్వ గాథనంతా వివరిస్తుంది. అందుకు దాఖలాగా చెరసాలలో ఉన్న తన గురువును రప్పించి అతనితో చెప్పించి రూఢి చేయిస్తుంది. తనతో వివాహం జరిగిన లీలాబాయి కూడా తన భర్తకు ఇకనుండి రెండవ భార్యగా ఉంటుందని విశాల హృదయంతో ప్రకటిస్తుంది. ఆదేశపురాజైన కూర్మాపతి ఈ కథనంతా విని ఆనందిస్తాడు. సకల సంపదల నిచ్చి అల్లునితో తన కూతురు లీలాబాయిని సాగనంపుతాడు. ఇట్లా శ్యాంనీల తన ఇద్దరు భార్యలతో కలిసి హల్దీనగర్ చేరుకుంటాడు. తన తల్లిని ప్రధానినీ కలిసికొని వారి ఆశీస్సులను పొంది సుఖంగా రాజ్యమేలుతుంటాడు.

# ౧౧. బయ్యాబాయి కథ

దుర్గాపన్నా నగరాన్ని భోజాజి అనే రాజు పరిపాలిస్తుంటాడు ఆతని భార్య పేరు కమలాబాయి. ఈతని రాజ్యంలో కాళోజి పర్వాజి అనే ఇద్దరు రైతు సోదరులుంటారు రాజు వీళ్లకు కొంతభూమిని ఇనాంగా ఇస్తాడు. ఆ భూమిని దున్నుకుంటూ ఆ ఇద్దరు సోదరులు జీవిస్తుంటారు కాళోజి భార్య పేరు జిజాబాయి. పర్వాజి భార్య పేరు రాధాబాయి కాళోజికి బయ్యాబాయి అనే ఒక కూతురుంటుంది.

ఎప్పటి మాదిరిగా కాళోజి పర్వాజీలు తమ ఇనాం భూమిలో తెల్లజొన్నలు అలికి చేను కావలి కాస్తుంటారు ప్రతి నిత్యం వాళ్ల భార్యలు మధ్యాహ్నం చద్దితీసుక వెళ్లతుంటారు కాని ఒక రోజు వీళ్లకు వీలుకానందున తండ్రులకు చద్ది తీసుకపోవ డానికి బయ్యాబాయి సిద్ధమవుతుంది ఆమె తన పన్నెండు మంది జీతగాళ్ల భార్యలతో కలిసి చద్ది తీసుకొని చేనువద్దకు వెళ్లతుంది బయ్యాబాయి చద్దితీసుకొని తన తండ్రుల వద్దకువెళ్లగా వాళ్ల ఆమెను చేను కావలి పెట్టి గంగకు స్నానంచేయడానికి వెళ్లతారు. చేనులో పన్నెండు మంచెలుంటాయి. నడిమిమంచెపై ఆమె కూర్చుండి కావలి కాస్తుంటుంది. ఆమె చాలా అందకత్తె కడు చాకచక్యము కలది కూడ.

సరీగా ఇదే సమయానికి ఆ దేశాన్ని పరిపాలించే భోజాజి తన ప్రధానితో సహా కొంత సైన్యాన్ని తీసుకొని వేటాడుతూ తిరిగి తిరిగి ఈ బయ్యాబాయి చేనువద్దకు వస్తాడు. ఎండలో చాలా దూరం తిరిగి నందువల్ల వాళ్లకు దప్పి వేస్తుంది. ఆ ప్రాంతంలో ఎక్కడా నీళ్ల కనిపించవు. ఎక్కడైనా పరిసర ప్రాంతాల్లో వెతికి నీళ్ల తేవలసిందిగా రాజు తన ప్రధానిని ఆదేశిస్తాడు. ప్రధాని నీళ్లకోసం వెతుక్కుంటూ బయ్యాబాయి కావలిఉన్న చేనువద్దకు వచ్చి ఆమెను నీళ్ల అడుగుతాడు అప్పుడు బయ్యాబాయి తన తండ్రులు స్నానానికై గంగకు వెళ్లినారనీ, వాళ్ల తిరిగి వస్తూ నీళ్ల తెస్తారనీ, వాళ్ల వస్తేనే నీళ్ల లభిస్తాయనీ సమాధానం చెప్పుతుంది. ఎంత వేడినా నీళ్ల ఇవ్వనందుకు ప్రధాని ఆగ్రహించి తన గుఱ్ఱంతో సహా చేనులో ప్రవేశిస్తాడు. ఎంత

చెప్పినా ప్రధాని వినిపించుకోనందున కోపంవచ్చి ఆమె వడిశెలలో రాయిపెట్టి గట్టిం తలకు తగిలే విధంగా విసిరికొడుతుంది గట్టిం గిరగిర తిరిగి క్రిందపడుతుంది దానితో ప్రధాని భయపడి రాజువద్దకు పరుగెత్తుతాడు. ఐనా తనకు జరిగిన పరాభవాన్ని గురించి ఏమాత్రం తెలుపకే జొన్న చేనువద్ద సమృద్ధిగా నీళ్లు లభిస్తాయనీ అందరూ అక్కడికి వెళ్లి త్రాగడమే అనుకూలంగా ఉంటుందనీ అబద్ధాలు పలికి రాజుతో సహా మొత్తం సైన్యాన్ని బయ్యాబాయి వద్దకు తీసుక వస్తాడు. రాజు ఆదేశానుసారం ప్రధాని ఇంతకుముందు వలెనే బయ్యాబాయిని మళ్లీ నీళ్లు అడుగుతాడు పీళ్లు పదే పదే నీళ్లు అడుగుతూ వేధిస్తున్నందున కోపం వచ్చి బయ్యాబాయి పీళ్లకు తగినశాస్తి చేయాలని భావిస్తుంది తన తండ్రులు గంగకు వెళ్లి తిరిగి వస్తూ ఇసుకతో తాడు పేనుకొని గంపలో నీళ్లు నింపుకొని కుసుమగూడు విప్పుకొని పల్లేరు గాయలు బంతి కట్టిన పిదప నీళ్లు సమృద్ధిగా ఇస్తారని సమాధానం చెప్పుతుంది. తికమక పెట్టే ఈ మాటలు ఎవరికీ అర్థం కావు

అంతటితో ఆగక చేనులో పండిన దొస పిందెలనైనా తినడానికివ్వవలసిందిగా మళ్లీ వాళ్లు బయ్యాబాయిని కోరుతారు కాని దానికి కూడ బయ్యాబాయి ఈ విధంగా సరియైన సమాధానం చెప్పుతుంది. తన తండ్రులు రేగడిదున్నుతూ విసురురాయంత పెళ్ల లేవినారనీ అందులో విత్తనాలు వేసి మొక్కలు మొలిపించి, పంచపాండవులను నిర్మించుకున్నారనీ ఆ దోస పిందెల్ని ముందుగా పంచపాండవులకు నివేదించిన పిదపనే ఇతరులకిస్తారు కానీ మీ వంటి మూర్ఖులకు మాత్రం ఇచ్చేది లేదని గడుసరిగా సమాధాన మిస్తుంది. ఇట్లా ఆమె తల బిరుసుతనంతో మాట్లాడుతున్నందున రాజుకు కోపంవస్తుంది. జొన్నచేనును నాశనం చేయవలసిందిగా తన సైన్యాన్ని ఆదేశిస్తాడు వాళ్లు చేనులో ప్రవేశించి దానినంతా తొక్కి నాశనం చేస్తుంటే బయ్యాబాయి వడిసెలలో పన్నెండు గుండ్లు పెట్టి వాళ్లమీదికి విసురుతుంది దానితో పన్నెండు మంది భటులు గాయపడి కుప్పకూలుతారు మరొక దెబ్బతో రణభేరి మోగించేవాడు కూర్చున్న ఒంటెను కూడ కొట్టగా అది పరుగెత్తి పారిపోతుంది. మరొక గుండుతో రాజు నెత్తిమీది గొడుగును ఎగురగొడుతుంది అప్పుడిక లాభంలేదని గ్రహించి రాజు వేట చాలించి, తన సైన్యాన్ని మరలించుకొని పరాభవంతో తన పట్టణం చేరుకుంటాడు.

పట్టణానికి వచ్చి భోజాజి వివరాలు తెలిసికోగా జొన్నచేను అలికిన భూమి తాను కాళోజి, పర్వాజీలకు ఇనాంగా ఇచ్చిందేననీ, దానిని కావలి కాస్తున్న కన్య కాళోజి కూతురనీ తెలుసుకుంటాడు. వెంటనే కాళోజి, పర్వాజీలను పిలిపించి బయ్యాబాయిని

తనకిచ్చి వివాహం చేయవలసిందిగా ఆదేశిస్తాడు. గత్యంతరం లేక వాళ్లు అంగీకరిస్తారు. జ్యోతిష్కులతో లగ్న నిశ్చయం కూడ చేయించి భోజాజికి బయ్యాబాయి నిచ్చి వివాహం జరిపిస్తారు. భోజాజి బయ్యాబాయి గర్వమణచి తగిన గుణపాఠం నేర్పాలని భావిస్తాడు. ముందుగా తన ప్రధానిని పంపించి ఒక భీకారణ్యంలో ఏడంతస్థుల పెద్ద భవనం నిర్మింపజేస్తాడు. అందులో బయ్యాబాయి ఒక్కర్తెనే ఉంచుతాడు. ఆమెకు కావలసిన భోజన పదార్థాలన్నీ అందులో సమృద్ధిగా పెట్టించి ఇవతలినుండి తాళం వేయిస్తాడు. భయంకరమైన మహారణ్యంలోని మేడలో బయ్యాబాయి ఏకాంతవాసం చేస్తూ మానసిక క్షోభను అనుభవిస్తుంటుంది.

ఇట్లా ఉంటూఉండగా ఈ అరణ్య ప్రాంతానికి ఒక దొమ్మరివాళ్ల మేళం వచ్చి దిగుతుంది. వాళ్లు మొత్తం వందమంది ఉంటారు. వాళ్లకు వంద గుర్రాలు, వంద గాడిదలు వంద పందులు వగైరా జంతువులన్నీ వంద సంఖ్యలో ఉంటాయి. వీళ్లకు అపుగాల్‌రావు గోపాల్‌రావు అనేవాళ్లు నాయకులుగా ఉంటారు. వాళ్లు బయ్యాబాయి నివసించే భవనాన్ని చూసి ఏదో ఒక అమ్మవారి గుడి అనుకుంటారు. గుడి కనిపించగానే వాయిద్యాలతో చప్పుళ్లుచేసి దేవికి దండాలుపెట్టి వెళ్లడం వాళ్లకు ఆచారం. ఆ ప్రకారంగానే వాళ్లు తమవాయిద్యాలతో పెద్దగా చప్పుళ్లు చేస్తారు. మేడపై భాగం నుండి బయ్యాబాయి వీళ్లను చూస్తుంది. మానవ సమాజం కనిపించగానే పట్టరాని ఆనందంతో బయ్యాబాయి వాళ్లను ఆపి ఇష్టమున్నంత కాలం వాళ్లిక్కడ ఉండవచ్చుననీ కావలసిన తిను బండారాలు తాను అందిస్తాననీ వాగ్దానం చేస్తుంది. అందుకు వాళ్లంగీకరించి ఆ అరణ్యంలోనే కొంతకాలం నివసిస్తారు. వీళ్లు తమ దొమ్మరి విద్యలను ప్రయోగించి కావలసిన ఆహార పదార్థాల్ని మేడ మీది నుంచి క్రిందికి తెచ్చుకుంటుంటారు. ఇందుకు కృతజ్ఞతా సూచకంగా దొమ్మరి వాళ్లు తమకు వచ్చే విద్యలన్నీ బయ్యాబాయికి నేర్పుతారు. కొన్నాళ్లకు వాళ్ళు తమ పట్టణం వెళ్లడానికి బయలుదేరుతారు. తానుకూడ వాళ్లవెంట వెళ్లడానికి బయ్యాబాయి సిద్ధమవుతుంది. ఆమెను వాళ్లు మేడపై భాగం నుండి దొమ్మరి విద్య సహాయంతో కిందికి దించుకుంటారు. అందరూ కలిసి నేరుగా దుర్గాపన్నా నగరం చేరుకుంటారు. అక్కడ రాజుగారి సమక్షంలో దొమ్మరి వాళ్లు తమ విద్యలను ప్రదర్శిస్తూ ప్రజామోదాన్ని పొందుతుంటారు. బయ్యాబాయి కూడ దొమ్మరి వేషంలోనే ఉండి విద్యలను ప్రదర్శించడంకోసం సభలో ప్రవేశిస్తుంది. భోజాజీకి ఎడమ చేతితో నమస్కారంచేసి తాను నేర్చిన విద్యలన్నీ ప్రదర్శించి రాజును ఆకర్షించుకుంటుంది. బయ్యాబాయిని రాజు గుర్తించలేక పోతాడు. ఆమెతో సంభోగించవలెనని భావించి దొమ్మరినాయకులను పిలిపించి తన కోరికను వెల్లడిస్తాడు.

వాళ్లు రాజు అభిమతాన్ని కాదనే ధైర్యం లేక అప్పటికి అంగీకరించివస్తారు. ఈ తుచ్ఛమైన రాజుకోరికను ఆమెతో చెప్పడానికి సందేహిస్తూ డొమ్మరినాయకులు బాధపడుతుంటారు. కాని బయ్యాబాయి దీన్ని అడిగి తెలిసికొని అందుకు సిద్ధమై ఆనాటిరాత్రి రాజు కోరికను తీర్చడానికి బయలుదేరి వెళ్ళుతుంది. ఆ రాత్రి రాజుతో సంభోగించి దానికి గుర్తుగా అతని చేతి ఉంగరాన్నీ, ఒక బాకునూ అడిగి తీసుకుంటుంది. అంతే కాక అతనితో ఒక లేఖ రాయించుకొని సంతకం కూడ తీసుకుంటుంది. మళ్లీ ఎప్పటి మాదిరిగా వచ్చి డొమ్మరి వాళ్లను కలుసుకుంటుంది. కొంత కాలానికి దొమ్మరి వాళ్ల మరొక ప్రదేశానికి వెళ్లి పోతుంటారు. బయ్యాబాయి మాత్రం మళ్లీ తన మేడలో ప్రవేశించి ఇంతకు ముందు మాదిరిగానే కాలం గడుపుతుంటుంది. రాజు తో సంభోగించినందు వల్ల ఆమె గర్భంకూడ ధరిస్తుంది. తొమ్మిదినెలలు నిండగానే శంకరుడు కరుణించి భస్మం మంత్రించి ఈమెపై చల్లగానే సుఖంగా ప్రసవిస్తుంది. మగపిల్లవాడు జన్మించి మహా తేజస్సుతో ప్రకాశిస్తుంటాడు ఈ తనికి రకాజి అని నామకరణం చేస్తుంది బాలుడు పెరిగి పెద్దవాడవుతుంటాడు. అతనికి తాను నేర్చిన విద్యలన్ని నేర్పుతుంది ఒకనాడు బాలుడు తన తండ్రి ఎక్కడున్నాడని అడుగుతాడు బయ్యాబాయి పూర్వ కథనంతా వివరించి, దుర్గాపన్నానగరాన్ని పరిపాలించే భోజాజి తన తండ్రి అని తెలుపుతుంది. బాలుడు తన తండ్రిని కలుసుకోవడం కోసం బయలు దేరుతాడు తల్లి అతని కోసం చద్దికట్టి అందులో ఆరు రత్నాలు భద్రంగా పెట్టి సాగనంపుతుంది అతడు దుర్గాపన్నానగరం చేరి దాహం తీర్చుకోవడం కోసం ఒక తమ్మళి ముసలమ్మ ఇంటికి వెళ్లుతాడు. తనకు ఆమె మంచినీళ్లు ఇచ్చి ఆదరించినందులకు కృతజ్ఞతా సూచకంగా ఒక రత్నం ఇస్తాడు. అందు కామె సంతోషించి అతనికి తన ఇంట్లోనే భోజనవసతులు కలిపిస్తుంది. అతడు ఆమె ఇంట్లోనే కొంతకాలంపాటు వుండిపోతాడు

ఒకనాడు అతనికి దూదంబా చెరువువద్ద పన్నెండు మంది దొంగలు తారసిల్లి అతని గురించిన వివరాలు అడుగుతారు. తాను మంగలినని అతడు సమాధానం చెప్పుతాడు ఐతే తమకు క్షౌరం చేయవలసిందిగా దొంగలుకోరుతారు. ప్రస్తుతం తన వద్ద మంగలికల్పి లేదని అప్పటికి తప్పించుకొని మరునాడు ఒక మంగలివానివద్దనుండి మంగలికల్పి కిరాయకు తీసుకొని రకాజి మరునాడు దొంగల వద్దకు వెళ్లుతాడు. వాళ్ల కోరిన ప్రకారం వాళ్లకు క్షౌరం చేయడానికి సిద్ధమవుతాడు ఐతే తనకత్తి మంచి నీళ్లకు తెగదుకనుక ఎవరి మూత్రంతో వాళ్లు తమ నెత్తులు తడుపుకోవలసిందిగా చెప్పుతాడు వాళ్లు అదే విధంగా చేస్తారు. అతడు ఆరుగురుదొంగలకు మంచిగా క్షౌరం చేసి మిగతా ఆరుగురు దొంగల ముక్కు చెవులు కోసేస్తాడు. వాళ్లు ఈతన్ని

కొట్టడానికి సిద్ధమవుతారు ఐతే ఆతడు మిక్కిలి చాకచక్యంతో మాట్లాడి ఆ పొరపాటుకు బాధ్యత వారి మీదనే మోపుతాడు. పైగా తనను కొడితే లాభం లేదనీ చెంతనున్న చెరువులో మిక్కిలి విలువైన రత్నాలున్నాయనీ ఆశ కలిపిస్తాడు అందుకు నిదర్శనంగా రకాజి చెరువులో మునిగి తేలి తన వద్ద నున్న ఒక రత్నాన్ని చూపించి అది చెరువులో దొరికిందని వాళ్లకు నమ్మిస్తాడు ముక్కు చెవులు కోయబడని మిగతా ఆరుగురు దొంగలు చెరువులో మునిగి రత్నాలు తెచ్చుకోవడం కోసం సిద్ధమవుతారు. ఐతే ఒక్కొక్కరు విడివిడిగా మునిగితే రత్నాలు బాగా లభించవని నమ్మించి వాళ్ల నందరిని ఏపెనారతో కట్టి ఒకేసారి మునుగవలసిందిగా చెప్పి చెరువులోనికి పంపిస్తాడు. ఏపెనారతో బంధింపబడిన ఆదొంగలు స్వేచ్ఛగాకాళ్లు చేతులు ఆడించలేక మునిగి చనిపోతారు. ఇక ముక్కు చెవులు కోయబడిన మిగతా ఆరుగురు దొంగలను కూడ హతమార్చాలని భావించి పట్టణంలోనికి వస్తాడు నేరుగా ఆ దొంగల ఇండ్లకు వెళ్లి వాళ్ల భార్యలతో, తమ భర్తలు శత్రువుల చేత చంపబడి దయ్యాలుగా మారి వస్తున్నారనీ వాళ్లకు ముక్కు చెవులుండవనీ ఆనవాళ్లు చెప్పి నమ్మిస్తాడు అనుకున్న మాదిరిగానే ఆనాటి రాత్రి ముక్కుచెవులు కోల్పోయిన ఆరుగురు దొంగలు తమ ఇండ్లకు వెళ్లి తలుపులు తట్టుతారు. వాళ్ల భార్యలు దయ్యాలు వచ్చినాయని భావించి రోకళ్లతో కొట్టి వాళ్లను చంపివేస్తారు ఈ విధంగా పన్నెండు మంది దొంగల్ని రకాజి నేర్పుతో హతమారుస్తాడు. ఇటువంటి వితూరీలు నగరంలో పెక్కు జరుగుతుంటే రకాజీని పట్టితెచ్చినవారికి బహుమానం ఇస్తానని రాజు ప్రకటిస్తాడు ఒకనాడు ఒక వేశ్య ముందుకు వచ్చి ఈతన్ని పట్టితెస్తానని రాజుతో ప్రతిజ్ఞచేసి రాత్రంతా గస్తీ తిరుగుతుంటుంది.

ఇట్లా ఉంటూ ఉండగా ఒకనాడు రకాజి దబ్బాలో గులకరాళ్లు పోసుకొని పేలాలు అమ్ముతున్నట్లుగా నటిస్తూ నగర వీథిలో తిరుగుతుంటాడు ఒక పద్మశాలి పిల్లవాడు తనకు పేలాలు కావాలని తండ్రికో మారాము చేస్తాడు. తండ్రి పేలాలు కొనడం కోసం ఇంటి కిటికీ నుంచి చేయి అవతలికి చాపుతాడు అప్పుడు రకాజి వెంటనే ఆతని చేయిని నరుక్కొని ఒక గుడ్డలో దాచుకొని వెళ్తుంటాడు. ఇట్లా మధ్యరాత్రి నగర వీధుల్లో తిరుగుతున్న రకాజిని వేశ్య ఆపి నిర్బంధిస్తుంది. ఆ రాత్రి ఆతన్ని తన ఇంటికి తీసుకువెళ్తుంది. ఆనాటి రాత్రి ఆతనితో సంభోగించి మరునాడు రాజుకు అప్పగించాలని భావిస్తుంది. ఆతనితో సంభోగం జరిగిన పిదప ఆతని చేతిని గట్టిగా పట్టుకొని వేశ్య నిదురపోతుంది. ఆమె గాఢనిద్రలో ఉండగా రకాజి తనచేతిని ఆమె చేతినుండి లాగుకొని. ఇదివరకు తాను కోసితెచ్చిన పద్మశాలివాని చేతిని ఆమెచేతిలో ఉంచి అక్కడి నుంచి పారిపోతాడు.

అటు పద్మశాలివాడు తన చేయిని ఎవరో రాత్రి నరుక్కువెళ్లినారని రాజుతో ఫిర్యాదు చేస్తాడు నరుకబడిన ఈతని చేయి ఎవరివద్ద ఉంటే వాళ్లనే దొంగగా భావించి పట్టుకరావలసిందిగా రాజు ఆజ్ఞాపిస్తాడు ఇటు వేశ్య తెల్లవారి చూసేసరికల్లా ఆమె చేతిలో నరుకబడినచేయి మాత్రమే ఉండడం గమనించి రాత్రి తనకు పట్టుబడినదొంగ తన స్వంతచేయినే నరుక్కొని పారిపోయినాడని భావిస్తుంది. అందువల్ల ఆమె కూడ రాజువద్దకువచ్చి ఎవరిచేయి నరుకబడి ఉంటుందో అతన్నే దొంగగా భావించాలని ఫిర్యాదు చేస్తుంది. ఈ ఇద్దరి ఫిర్యాదులూ పరస్పరభిన్నంగా ఉండి రాజుకు అంతుపట్టకుండా ఉంటుంది ఇదేదో పెద్దమోసం జరుగుతున్నదని భావించి రాజే స్వయంగా దొంగను పట్టుకోవడానికి సిద్ధమవుతాడు ఆనాటి రాత్రి తానే స్వయంగా గస్తీ తిరుగడం కోసం కొంతమంది సైనికుల సహాయంతో తగిన ఏర్పాట్లు చేసుకుంటాడు. ఆనాడు రకాజి ఒక చాకలివాని వద్దకువెళ్లి రెండు గాడిదలను కిరాయకు తీసుకుంటాడు వాటి మీద బట్టలమూటలు పెట్టుకొని నగరవీధుల నుండి ఊరిబయటకు వెళ్లుతుంటాడు మూడుచోట్ల నగరపాలకులు అతన్ని ఆడ్డగిస్తారు. తాను రాజుగారి బట్టలుతికే చాకలిననీ రాజుగారికి తెల్లవారేసరికి ఉతికిన బట్టలు అందివ్వవలసి ఉన్నదనీ అందుకోసమే ఈ రాత్రి చాకిరేవుకు వెళ్లవలసివస్తున్నదనీ నమ్మించి రకాజి బయటపడుతాడు. సున్నం పూసిన ఒక సొరకాయబుర్రను కూడ తీసుకొని నేరుగా చెరువువద్దకు వెళ్లుతాడు గాడిదలను ప్రక్కకు నిలబెట్టి రకాజి బట్టలు ఉతికినట్లు నటిస్తుంటాడు.

రాజు ఆనాటి రాత్రి గస్తీతిరుగుతూవచ్చి ఎవరైనా పట్టణందాటి వెలుపలికి వెళ్లినారా అని నగరపాలకులను ప్రశ్నిస్తాడు రాజుగారి చాకలినంటూ ఒకడు గాడిదలపై బట్టలువేసుకొని ఊరివెలుపలికి వెళ్లినట్లు వాళ్లురాజుగారితో విన్నవిస్తారు ఇక్కడే మోసం జరిగిందని రాజు భావించి అతన్ని పట్టుకోవడంకోసం భటులను వెంటబెట్టుకొని చెరువువద్దకు వెళ్లుతాడు. రాజు రావడం గమనించి రకాజి తనవద్దనున్న సొరకాయబుర్రను చెరువులోనికి విసిరివేసి తాను చెట్టుచాటున దాగి ఉంటాడు. రాజు ఆ సొరకాయబుర్రను చూసి దొంగ చెరువులోపడి పారిపోతున్నాడని భావిస్తాడు. వెంటనే తన ఆభరణాలనూ దుస్తులనూ విడిచి చెరువుగట్టుపై ఉంచి అతన్ని పట్టుకోవాలన్న తలంపుతో రాజు చెరువులో దూకుతాడు ఇది గమనించి చెట్టుచాటున ఉన్న రకాజి రాజుగారి ఆభరాణాల్నీ దుస్తుల్నీ తాను ధరించి రాజుగా నటిస్తాడు. దొంగ చెరువులోపడి పారిపోతున్నాడని హెచ్చరించి అతన్ని బంధించి తీసుకరావలసిందిగా భటులకాజ్ఞాపిస్తాడు చీకట్లో సరిగా కనిపించనందువల్ల భటులు ఈతని మాటల్ని నమ్ముతారు. చెరువులోపడి పారిపోతున్న వాడే దొంగగాభావించి వెంటనే చెరువులోదూకి నిజమైనరాజును బంధించి తీసుకవస్తారు.

రాజువేషంలో ఉన్న రకాజి భోజాజీని బంధించుకొని దుర్గాపన్నా నగరం చేరుతాడు. తరువాత ఒక మహారణ్యంలో ఏడంతస్తులమేడలో బంధింపబడి ఉన్న తన తల్లిని విడి పించుకుంటాడు అప్పుడు బయ్యాబాయి జరిగిన పాతవృత్తాంతాన్నంతా భోజాజీకి వివ రించి ఆతడే తన కుమారుడని రకాజీని రాజుకు పరిచయంచేస్తుంది. దానికి నిదర్శనంగా తనవద్ద భద్రంగా ఉన్న ఉంగరాన్నీ బాకునూ ఉత్తరాన్నీ చూపిస్తుంది రాజు ఈ సత్యాన్ని తెలిసికొని తనను క్షమించవలసిందిగా కోరుతాడు తాను బయ్యాబాయి ఎడల చేసిన నేరానికి ఎంతో చింతిస్తాడు తనను మించిన కుమారుడు తనకు కలిగినందులకు సంతోషిస్తాడు. పూర్వం జొన్నచేనులో బయ్యాబాయి వేసిన ప్రశ్నలకు రకాజి సాహస కృత్యాలే సరియైన సమాధానాలు. రకాజీకి రాజ్యం అప్పగించి ఆతడు రాజ్యమేలు చుండగా బయ్యాబాయితో కలిసి భోజాజి సుఖంగా జీవిస్తుంటాడు.

# ౧౨. కళింగ మహారాజు కథ

కళింగ నగరాన్ని కళింగ మహారాజు పరిపాలిస్తుంటాడు ఆతని భార్య పేరు చంపావతి ప్రధాని పేరు రాయోదా రాజు ప్రజాసంక్షేమంగా రాజ్యాన్ని పరిపాలిస్తుండగా ఈ రాజ్యాన్ని అపహరించాలని ప్రధానికి దుర్బుద్ధి పుడుతుంది. వేట నెపంతో రాజును అడవికి తీసుకవెళ్లి ఏదో ఒక కుతంత్రంతో ఆతన్ని అంతం చెయాలని యోచిస్తుంటాడు వేటకు వెళ్ళుదామని ప్రధాని రాజును పదేపదే ప్రేరేపించినందువల్ల ఒకనాడు సపరివారంతో రాజు వేటకు బయలుదేరుతాడు. ప్రధాని కూడ రాజుననుగమిస్తాడు రాజు ప్రధాని గుఱ్ఱాలనెక్కి క్రూర మృగాలతో నిండిన మహారణ్యంలో వేటాడుతూ తిరుగుతుంటారు. క్రమంగా రాజును రాక్షస సంచారంకల భయంకరమైన ప్రదేశానికి పంపించి ప్రధాని మాత్రం సురక్షితమైన ప్రదేశంలో జాగ్రత్తగా ఉంటాడు రాజు తిరిగి తిరిగి ఒక కొండ రాక్షసుడు నివసించే చోటికి వెళ్ళుతాడు. ఆతని వెంట ఆతని పరివారం కూడ వెళ్లుతుంది. ఆ రాక్షసుని పేరు హెడంబా. ఈతడు పన్నెండు కోటలు నిర్మించుకొని ఆ మహారణ్యానికి అధిపతిగా ఉంటాడు ఈతని కోటదాపున ఒక కొలను కూడ ఉంటుంది. ఎవరైనా ఈ ప్రాంతానికి కొత్తవాళ్ళువస్తే ఒక గంట దానంతట అదే మ్రోగుతుంది దానితో కొత్తవారిరాకను గుర్తించి రాక్షసుడు కోట వెలుపలికి వచ్చి వాళ్ళనుపట్టి భక్షిస్తుంటాడు తాను భక్షించగా మిగిలినవాళ్ళను తన కోటలలో నిలువచేసుకుంటాడు చాలాసేపు వేటాడి నందున కళింగ మహారాజుకు దాహం వేస్తుంది. దాహం తీర్చుకోవడం కోసం రాజు రాక్షసుని కొలనుచెంతకు వస్తాడు. ఇంతలో గంట మ్రోగగా రాక్షసుడు కోట నుండి ఇవతలికివచ్చి రాజును భక్షిస్తాడు. ఈతని పరివారంలోని వాళ్ళను కూడ తినగలిగిన మేరకు తిని మిగతావారినంతా తన కోటలో నిలువ చేసుకుంటాడు. ప్రధాని ఒక్కడు మాత్రమే ఈ ప్రమాదాన్ని ముందే పసిగట్టి రహస్యంగా కళింగ నగరం పారిపోతాడు అక్కడ రాణి చంపావతిని కలిసికొని, రాజు అడవిలో కొంత ప్రదేశాన్ని ఆక్రమించుకొని పరిపాలిస్తున్నాడనీ, తన పరివారమునంతా అక్కడే ఉంచుకున్నాడనీ, ఇక ఈ రాజ్యానికి రానన్నాడనీ అబద్ధాలు కల్పించి చెప్పుతాడు. తన భర్తను కలుసుకోవడం కోసం గర్భవతిగా ఉన్న చంపావతిరాణి ఒక్కతే అడవికి బయలుదేరి వెళ్లిపోతుంది. ఇక ప్రధాని రాజ్యాన్ని హస్తగతం చేసుకొని తానే రాజునని పరిపాలిస్తుంటాడు కాని ఈతనికి రాజ్యం చేసే సామర్థ్యంగానీ

చాతుర్యంగానీ ఏవీ ఉండవు. అవివేకంతో రాజ్యాన్ని అస్తవ్యస్తం చేస్తుంటాడు. ప్రజలకు సరియైన పరిపాలన ఇవ్వలేక పోతాడు. కనీసం వాళ్ల తగవులనుకూడ తీర్చలేక పోతాడు. ఇట్లా ఉంటూ ఉండగా ఒకనాడు ఒక రజకుడు ఒక పద్మశాలి పోట్లాడుకుంటారు. పద్మశాలి రజకుని గాడిదను నడ్డి విరిగేట్లు కొడతాడు. దానికి ప్రతీకారంగా రజకుడు పద్మశాలి భార్యను తోసి పడవేయగా ఆమెకు గర్భస్రావం జరుగుతుంది. ఈ ఇద్దరూ కలహించుకుంటూ తీర్పు చెప్పవలసిందని కోరుకూ క్రొత్తగా రాజైన రాయోబా వద్దకు వస్తారు. గాడిదకు మళ్లీ నడుము వచ్చేదాకా పద్మశాలి దానికి చికిత్స చేయించాలనీ పద్మశాలివాని భార్యకు రజకుడు మళ్లీ గర్భం నిలుపాలనీ రాయోబా తీర్పునిస్తాడు. అవివేకంతో కూడిన ఈ తీర్పును చూసి ప్రజలంతా రాయోబాను అసహ్యించుకుంటారు. క్రమంగా అతనిపై వ్యతిరేకత ప్రబలుతుంది. ప్రజలంతా ఏకమై రాయోబాను చెరసాలలో వేసి తమకు తామే రాజ్యం పరిపాలించుకుంటుంటారు.

అటు చంపావతిరాణి తన భర్త కోసం మహారణ్యంలో వెతుకుతూ వెతుకుతూ ఒక రమణీయమైన ఉద్యానవనం చేరుకుంటుంది. అందులో ఒక బావికూడ ఉంటుంది. ఈ ఉద్యానవనం రమణీయమైన చక్కని వాతావరణంతో అలరారుతుంటుంది. ఇందులోని బావిలో ముగ్గురు దేవకన్యలు కూడ నివసిస్తుంటారు. రాణి ఈ ఉద్యానవనంలో కొంతకాలం ఉండిపోవడానికి నిశ్చయించుకుంటుంది. ఈ సమయానికి రాణి తొమ్మిది మాసాల పూర్ణ గర్భవతిగా ఉంటుంది. ఇక్కడికి వచ్చిన కొద్ది రోజులకే రాణి ప్రసవ వేదన ననుభవిస్తూ ఎవరూ దిక్కులేక బాధపడుతుంటుంది. ఇది గమనించి బావిలో రహస్యంగా నివసిస్తున్న దేవకన్యలు ఆమెను ఆదుకోవడం కోసం వస్తారు. అప్పుడా ముగ్గురు దేవకన్యలు చంపావతి వద్దకువచ్చి రాణికి పురుడు పోసి మళ్లీ ఎప్పటి మాదిరిగానే బావిలోనికి వెళ్లిపోతారు. రాణికి మగపిల్లవాడు జన్మిస్తాడు. దేవకన్యలు ప్రతి నిత్యం బావిలోనుండి పైకివచ్చి బాలుని యోగక్షేమాలు చూస్తుంటారు. అతనికి గణపతి అనికూడ వాళ్లె నామకరణం చేస్తారు. బాలునికి దేవకన్యలే సకల విద్యలు నేర్పుతూ ఉంటారు. ఇట్లా బాలునికి సుమారు పన్నెండు సంవత్సరాల వయస్సు వస్తుంది. వయసుతో పాటు అతనిలో కామ వికారాలు కూడ ఉద్భవించడం దేవకన్యలు గమనిస్తారు. బాలునికి మూడు వరాలిచ్చి దేవకన్యలు వెళ్లిపోతారు. అవి—

1) చచ్చినా మళ్లీ బ్రతుకునట్లు వరం ప్రసాదిస్తారు.
2) అతనికి సకల విద్యలు అబ్బేటట్లుగా నాలుకపై వ్రాస్తారు.
3) అతని కొక కత్తినిచ్చి అది పరులచేతికి వెళ్లితే మాత్రం కీడు జరుగుతుందని హెచ్చరిస్తారు.

రణాపతి ప్రతినిత్యం అడవికివెళ్లి తన తల్లికి పండ్లు కందమూలాలు ఆహారంగా తీసుకవచ్చి ఇస్తుంటాడు ఒక నాడాతడు కొందరాక్షసుడు నివసించే ప్రాంతానికి వెళ్లి అక్కడి కొలనులో నీళ్లు తాగబోతాడు ఇంతలో గంట మోగి రాక్షసుడు కోట వెలుపలికివచ్చి రణాపతిని మ్రింగబోతాడు. రాక్షసుడు మహోన్నత కాయంకలవాడు మహాభయంకరాకారుడు కూడాను. రాక్షసుని ఎదుట రణాపతి పర్వతంముందు చీమవలె ఉంటాడు. రాక్షసుడు బాలున్ని మ్రింగబోతుంటే అతడు ఏదో సందులోనుండి దూరి తప్పించుక పోతుంటాడు. రాక్షసుని పొడవైన కేశముల ద్వారా రణాపతి అతని తలపైకి ఎక్కి రాక్షసుని కాళ్లు చేతులు ఏవెనారతో బంధించి వేస్తాడు. దినదినం హింసించి చంపాలన్న ఉద్దేశంతో రాక్షసుని ఒకకోటలో కట్టివేసి మిగతా కోటలన్నింటిని రణాపతి స్వాధీనం చేసుకుంటాడు పిదప తన తల్లివద్దకువచ్చి ఈ జరిగిన సంగతిని వివరించక దూరంలో నివాసయోగ్యమైన మంచి కోటలున్నవనీ అందులో భద్రంగా ఉండవచ్చుననీ పలికి తల్లిని వెంటబెట్టుకొని కోటలోనికి ప్రవేశిస్తాడు. రాక్షసుని బంధించి పెట్టిన గది తలుపులు మూసివేసి ఎలాంటి పరిస్థితుల్లోను అందులోనికి వెళ్లకూడదని తల్లిని హెచ్చరిస్తాడు. అందులోనికి వెళ్లితే రాక్షసునిచూసి తన తల్లి భయపడుతుందని భావించి కనీసం అందులో రాక్షసుడున్నాడన్న సంగతిని కూడ చెప్పడు బాలుడు పగలంతా ఆహారం నిమిత్తం అడవికి వెళ్లి సాయంత్రం వరకల్లా తల్లికి ఆహారం తీసుకొని తిరిగి వస్తుంటాడు

ఇట్లా కొంతకాలం సాగిన పిదప కుమారుడు లేనిసమయంలో రాక్షసుడు బంధింపబడి ఉన్న కోటలో ఏమున్నదో చూడాలన్న కుతూహలం చంపావతికి కలుగుతుంది. ఆమె కోట తలుపులు తెరిచి అందులో ప్రవేశిస్తుండగా రాక్షసు డామెను స్త్రీగా గుర్తించి ఆమెను తన వశం చేసుకోవాలని భావిస్తాడు. వెంటనే రాక్షసమాయతో ఇంతకుముందు తాను మ్రింగిన కళింగరాజు రూపం ధరిస్తాడు. చంపావతి కోట లోపల ప్రవేశించి చూచి తన భర్త బంధింపబడి ఉన్నాడని భావిస్తుంది చిరకాలానికి మళ్లీ తన భర్తను దర్శించుకోగలిగినానని కూడ సంతోషిస్తుంది ఐతే ఇట్లా బంధింపబడి ఉండడానికిగల కారణమేమిటని అతన్ని ప్రశ్నించగా, ఈ బాలుడు వచ్చి, తనను నిర్దాక్షిణ్యంగా హింసిస్తూ కోటలో బంధించి ఉంచినాడని కామరూపంతో ఉన్న రాక్షసుడు అబద్ధాలు చెప్పుతాడు. అతని మాటల్ని నమ్మి కుమారునిపై ఆగ్రహించి చంపావతి అతని కట్లు విప్పుతుంది. రాక్షసుడు కళింగరాజు రూపంతోనే ప్రతి నిత్యం రణాపతి లేని సమయంలో రహస్యంగా చంపావతితో సంభోగం చేస్తుంటాడు. బాలుడు వచ్చే సమయానికి మళ్లీ ఎప్పటి మాదిరిగానే రాక్షస రూపంతో బంధింపబడి ఉంటాడు

ఇట్లా రోజులు గడుస్తుంటాయి తన భర్తను దారుణంగా హింసిస్తూ తనను అతనితో కలియకుండా చేసినాడన్న భావంతో చంపావతికి తన కుమారునిపై దిన దినం కోపం పెరుగుతుంటుంది ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని రణాపతిని చంపివేస్తే ఇక తమకు అడ్డు ఉండదని రాక్షసుడు రాణికి దుర్బోధ చేస్తాడు అందుకు ఒక కుయుక్తి పన్నుతాడు. కుమారుడు వచ్చే సమయానికి తలనొప్పితో బాధపడుతున్నట్లు చంపావతి నటించవలెననీ గంగా తీరంలో ఉన్న నల్ల చింతచెట్టు ఆకు తెచ్చి తలకు కట్టితేనే నొప్పి తగ్గుతుందనీ నాటక మాడాల్సిందిగా రాక్షసు డామెకు బోధిస్తాడు పైగా పూర్వం కూడ ఇట్లా తలనొప్పి లేచినప్పుడల్లా ఆ విధంగానే చేయడం జరుగుతుండేదని నమ్మించాలంటాడు గంగా తీరంలోని నల్ల చింతచెట్టుపై నివసించే భయంకరమైన రాక్షసులు ఆ బాలుణ్ని మింగివేస్తారని రాక్షసుడు ఆశించి ఈ కుయుక్తి పన్నుతాడు కుమారుడు వచ్చేవరకల్లా రాణి అదే విధంగా నటిస్తుంది. రణాపతి నల్ల చింతచెట్టు ఆకు తీసుకరావడం కోసం గంగాతీరానికి వెళ్లుతాడు. అక్కడ కాపురం చేస్తున్న భయంకరమైన రాక్షసుల్ని తన ఖడ్గంతో నరికి నల్ల చింతచెట్టు ఆకు తీసుకొని తల్లివద్దకు వస్తాడు ఇతన్ని చూసి రాక్షసుడు ఆశ్చర్యపడుతాడు రాక్షసుల బారిపడకుండా ప్రాణాలతో తిరిగి వచ్చిన బాలుని ధైర్య సాహసాలకు లోలోన భయపడుతాడు కూడ.

మరి కొంతకాలం జరిగిన పిదప ఏ విధంగానైనా ఈ బాలుణ్ని హత మార్చాలని రాక్షసుడు మరొక ఉపాయ మాలోచిస్తాడు. కుమారుడు ఇంటికి వచ్చే సమయానికి కండ్లు కనిపించనట్లు నటించాలని చంపావతికి బోధిస్తాడు మళ్లీ చూపు రావాలంటే పెద్దపులి పాలు పోయడ మొక్కటే మార్గమనీ వాటిని సాధించి తీసుకరావలసిందిగా కోరాలనీ సలహా ఇస్తాడు. ఒకవేళ బాలుడు సాహసాన్ని ప్రదర్శించి పులిపాలు తెచ్చినప్పటికినీ అతన్ని సంహరించే ఉపాయాన్ని కూడ రాక్షసుడు చంపావతికి బోధిస్తాడు పులిపాలు తెచ్చినవాని కండ్లుకట్టి అతని ఖడ్గముతోనే మూడుసార్లు పులిపాలపై త్రిప్పిన పిదపనే పాలను కంటిలో పోసుకోవలసి ఉంటుందని బాలుని నమ్మించి అతని ఖడ్గంతోనే పొట్టలో పొడిచి చంపాలని రాణికి దుర్బోధ చేస్తాడు. రాణి తన కన్న కుమారుడన్న ప్రేమానురాగాల్ని కూడ వదిలిపెట్టి రాక్షసుని మాయలోపడి అందుకు సిద్ధమవుతుంది పులిపాలు తెచ్చిన బాలుణ్ని రాక్షసుడు చెప్పిన ప్రకారం ఖడ్గముతో అతని కడుపులో పొడిచి చంపివేస్తుంది. పూర్వం దేవకన్యలు ఇచ్చిన వరం ప్రకారం బాలుని ఖడ్గము పరుల చేతికి వెళ్లినందున అతనికి ప్రమాదం జరిగింది. వెంటనే రాక్షసుడు ఈతని శవాన్ని తీసుకవెళ్లి గంగలో పడవేస్తాడు. గంగలో కొట్టుకపోతున్న శవం బెస్తవాళ్లకు లభిస్తుంది. వాళ్లు ఆ శవాన్ని తీసుకొనివెళ్లి ఆ దేశాన్ని పరిపాలించే రాజుకు

అప్పగిస్తారు. ఆతని పేరు దుబ్బాసిరాజు ఆతని నగరంపేరు దుబ్బాసినగరం ఈతనికొక కూతురుంటుంది ఆమెపేరు సుందరీబాయి. అందమైన వాడెవడైనా మరణిస్తే ఆతని నోట్లో తనవద్దనున్న అమృతం పోసి బ్రతికించుకొని ఆతన్నే వివాహ మాడుతానని ఈమె ఘోరవ్రతమాచరిస్తుంటుంది. ఈ శవం కనిపించగానే ఆతన్నే వివాహమాడుతానని కోరుకుంటుంది అందుకు రాజుకూడ అంగీకరిస్తాడు అప్పుడామె తన ముక్కుపుడకకున్న ముత్యంలోని అమృతంతీసి ఆతని నోట్లో పోయగా రణాపతి తిరిగి బ్రతుకుతాడు పూర్వం దేవకన్యలు రణాపతికి చచ్చినా తిరిగి బ్రతుకునట్లు ఇచ్చిన వరంకూడ తోడవుతుంది. పిదప సుందరీబాయి రణాపతిని వివాహమాడుతుంది

సుందరీబాయి ఈ అమృతాన్ని పూర్వం కడునేర్పుతో సంపాదించి భద్రంగా ముక్కుపుడకలో దాచిపెట్టుకుంటుంది ఒకప్పుడామె దేవేంద్రుని భక్తురాలుగా ఉంటున్న సమయంలో ఒకరోజు ఆతని వంటశాలలో ప్రవేశిస్తుంది. అప్పుడక్కడ కొందరు దేవతలు అమృతాన్ని వండుతుంటారు ఈమె తన ముక్కుపుడకను అమృత పాత్రలో పడవేస్తుంది. వంటశాలలోని వాళ్లంతా ఈమెను కోపగించి ముక్కుపుడకకు అమృతం లేకుండా ఏడుసార్లు దాన్ని కడుగుతారు ఐనా ముక్కుపుడకలో కొద్దిగా అమృతం మిగిలి పోతుంది దాన్ని భద్రంగా ఒక ముత్యంలో పోసి తన ముక్కుపుడకలో అమర్చుకుంటుంది ఇట్లా సాధించుకున్న అమృతంతో సుందరీబాయి రణాపతిని బ్రతికించుకుంటుంది

వివాహానంతరం కొన్నాళ్లకు రణాపతి వేటకు వెళ్లుతాడు అడవిలో తిరుగుతూ మళ్లీ ఈ హెడంబా రాక్షసుడు నివసించే ప్రాంతానికే చేరుకుంటాడు అది పూర్వం తాను తన తల్లితో కలిసి నివసించిన ప్రాంతంగా గుర్తిస్తాడు ఎప్పటి వలెనే గంట మ్రోగగానే రాక్షసుడు ఈతన్ని మ్రింగడానికి వస్తాడు వెంటనే రణాపతి రాక్షసుని తల నరికి కోటలోనికి వెళ్లి చూస్తాడు. తనను నిర్దాక్షిణ్యంగా చంపివేసి ఆ రాక్షసుని మాయలోపడి ఆతనితో కాపురం చేస్తున్న తన తల్లి కంటబడుతుంది. వెంటనే ఆమె శిరస్సును కూడ ఖండించి వేస్తాడు పిదప దుబ్బాసినగరం చేరుకొని ఆ రాజుతో వీడ్కోలు తీసుకొని సుందరీబాయితో కలిసి తన కళింగ నగరం చేరుకుంటాడు అక్కడి ప్రజల ఆదరాభిమానాలను సంపాదించి చెరసాలలో ఉన్న ప్రధాని రాయోబా శిరస్సును ఖండించి వేస్తాడు ఇట్లా రణాపతి దుష్టశిక్షణచేసి ప్రజామోదంతో రాజ్యం పరిపాలిస్తూ సుఖంగా ఉంటాడు.

# ౧౩. ఏక్ టాంగ్ కథ

ఢిల్లీ సమీపంలోఉన్న హస్తినావురాన్ని పంచపాండవులు పరిపాలిస్తుంటారు ఢిల్లీని కౌరవులు పరిపాలిస్తుంటారు కౌరవులతో జూదంలో ఓడిపోయి పంచపాండవులు ద్రౌపదీ సమేతంగా వనవాసానికి వెళ్లిపోతారు. అప్పటికి ఆరుమాసాల గర్భంతోఉన్న సుభద్ర అత్తగారైన కుంతితో కలిసి హస్తినావురంలోనే ఉంటుంది.

ఇట్లా ఉంటూఉండగా ఒకనాడు ద్వారకలో దేవకి శ్రీకృష్ణుని పిలిచి ఉగాది పండుగకు సుభద్రను తమ ఇంటికి తీసుకరావలసిందిగా కోరుతుంది. వెంటనే శ్రీకృష్ణుడు రథముపై బయలుదేరి హస్తినావురం చేరుతాడు. కుంతి అనుమతితో సుభద్రను తన రథంపై కూర్చుండబెట్టుకొని తిరిగి ద్వారకకు బయలుదేరి వస్తుంటాడు. మార్గ మధ్యంలో కాలక్షేపం కొరకు ఏదైనా కథ చెప్పవలసిందని సుభద్ర కోరగా, శ్రీ కృష్ణుడు పద్మవ్యూహ యుద్ధ కళాకౌశలాన్ని గురించి వివరించి చెప్పుతుంటాడు. సుభద్ర వింటూ ఊ-కొడుతుంటుంది కొంతసేపటికి సుభద్ర నిదురిస్తున్నప్పటికినీ ఆమె కడుపులో ఉన్న శిశువు ఊకొట్టడాన్ని శ్రీ కృష్ణుడు గ్రహిస్తాడు. అప్పటికాతడు పద్మవ్యూహంలోనికి ప్రవేశించగలిగే కౌశలం వరకే తెలిపినాడు. శ్రీ కృష్ణుడు వెంటనే మిగతా విద్యను చెప్పడం మానివేసి తన దివ్య దృష్టితో చూస్తాడు. సుభద్ర కడుపులో పెరుగుతున్న మగ శిశువు ససాఅర్జునుడుగా పుట్టనున్నాడనీ, అతనికి పన్నెండు తలలు ఇరువైనాలుగు చేతులుంటాయనీ తెలిసికుంటాడు. అంతేగాక అతడు తనకే ప్రాణాంతకుడుగా కూడ తయారు కాగలడని గ్రహిస్తాడు కడుపులో ఉన్న శిశువును కడుపులోనే అంతంచేయాలని భావిస్తాడు. వెంటనే రథమాపి రెండు ఆకు దొప్పలు కుట్టుకొని చెంతనున్న చెరువులోనుండి నీళ్ల నింపుకొని వస్తాడు. ఒక దొప్పను సుభద్ర తల వైపుకు మరొక దొప్పను ఆమె కాళ్లవైపుకు పెట్టి తలవైపున ఉన్న దొప్పలో విషంకలిపి మళ్లీ రథం నడుపుతుంటాడు. కొంతసేపటికి సుభద్ర మేల్కొని దాహం కోసం నీళ్ల కావాలంటుంది. శ్రీ కృష్ణుడు వెంటనే ఆ రెండు దొప్పలనూ చూపించి కాళ్ల వైపునున్న దొప్పలోని నీళ్లతో ముఖం కడుక్కోవలసిందనీ తలవైపు పెట్టిన దొప్పలోని నీళ్ల తాగవలసిందనీ చెప్పుతాడు సుభద్ర అదే విధంగా చేయగా ఆమె కడుపులోని పిండము క్రమంగా కరిగి పోతుంటుంది. ఆమెకు భరింపరాని కడుపు

నొప్పి కూడ ప్రారంభమవుతుంది ఇట్లా కడుపునొప్పితో బాధపడుతున్న సుభద్రను శ్రీ కృష్ణుడు ద్వారకకు తీసుకరాగానే దేవకి చూసి భయపడుతుంది సుభద్రకు కానీ ఆమె కడుపులోనున్న శిశువుకుగానీ ఏమైనా హాని సంభవిస్తే అర్జునుడు ఆగ్రహిస్తాడు కనుక ఆమెను వెంటనే తిరిగి హస్తినాపురం చేర్చవలసిందిగా దేవకి కోరుతుంది శ్రీ కృష్ణుడు మళ్లీ సుభద్రను రథంపై కూర్చుండబెట్టుకొని హస్తినాపురం చేర్చి కుంతీ దేవికి అప్పగించి వస్తాడు. ఈ పాటికి ఆమె కడుపులోని శిశువు నిలువునా సగంవరకు కరిగిపోతుంది. అంటె ఒక కన్ను ఒక చెవ్వు ఒక చేయి ఒక కాలు- ఈ విధంగా సగం శరీరం మాత్రం మిగిలిపోతుంది సుభద్ర మళ్లీ ఇల్లు చేరగానే ఆమె దాహం తీరుటకు కుంతి తమ ధర్మబావిలోని నీళ్ల తోడి అందిస్తుంది సుభద్ర వాటిని త్రాగ గానే ఆ నీటి మహిమతో ఆమెకు కడుపులో ఉన్న మిగతా సగం శిశువు కరిగిపోకుండా మిగిలిపోతుంది ఇది ధర్మరాజు తోడించిన బావి కనుక అందులోని నీళ్ల మహిమ అలాంటిది.

కొన్నాళ్లకు సుభద్ర ప్రసవించి నిలువునా సగంభాగం మాత్రమే మిగిలి ఉన్న మగశిశువును కంటుంది. అంటే అవయవాల్లో ఒక్కొక్కటి మాత్రమే కలిగి ఒకే చేయి ఒకేకాలుతో పుడుతాడు అతన్ని చూసి సుభద్ర ఈసడించుకుంటుంది అట్లాంటి కుమారుడు పుట్టినందుకు తమ వంశ గౌరవం పాడైందని దుఃఖించి అతన్ని ఎక్కడైనా పారవేయవలసిందిగా కోరుతుంది. కాని కుంతి అట్లా చేయక ఆ శిశువుకు ఏక్‌టాంగ్ అనే పేరిడి తానే స్వయంగా పెంచుతుంటుంది. బాలుడు క్రమంగా పెరిగి పెద్దవాడవుతుంటాడు ఆటపాటల్లో విలువిద్యల్లో కడు నేర్పరిగా తయారవుతుంటాడు. తోటి పిల్లలకన్న మేటిగా రాణిస్తుంటాడు కుంతీదేవి ఈతని ఉపయోగార్థం సంద్ర కట్టెను ఆనుగా పెట్టించి తర కత్రతో ఒక ధనుస్సును చేయించి ఇస్తుంది. కాని ఏక్‌టాంగ్ శక్తికి ఆగలేక ఆ ధనుస్సు అవలీలగా విరిగి పోతుంది మళ్లీ బాలుడు ధనుస్సు కోసం మారాము చేస్తుంటాడు. కుంతీదేవి పరశురాముని ప్రార్థించి ఆతని వలన దివ్యమైన ధనుర్బాణములు పొంది బాలునికిస్తుంది. బాలుడొకనాడు వీధిలో ఆడుకుంటూ ఉండగా ఈతని వికారరూపాన్ని చూసి తోటిపిల్లలంతా గేళిచేస్తారు వాళ్ల అల్లరిని భరించలేక వెంటనే కుంతీదేవి వద్దకు వచ్చి తన వికారమైన ఆకారానికి కారణమేమిటని అడుగుతాడు. ఆమె అన్నింటికీ ఆ జగద్రక్షకుడే కారణమనీ ఈ రహస్యం శ్రీ కృష్ణ పరమాత్మునికే తెలుసుననీ సమాధానం చెప్పుతుంది వెంటనే బాలుడు శ్రీ కృష్ణ పరమాత్మను కలుసుకోవడం కోసం ద్వారకకు బయలుదేరి వస్తాడు అక్కడ ఊరవతల ఉన్న ఒక మంచినీటి బావి చెంతకుచేరి ఏవో కొన్ని అల్లరి చేష్టలు

చేసి శ్రీ కృష్ణుడు కదలివచ్చేట్లు చేయాలని భావిస్తాడు. మంచి నీళ్ల కోసం వచ్చిన ఊరి జనమంతా ఈతన్ని చూసి దయ్యమో భూతమో అనుకొని భయపడి పారిపోతారు. కాసేపటికి పదహారు-మంది గోపికలు మంచినీళ్ల కోసం కడవలు పట్టుకొని ఈ బావి వద్దకే వస్తారు సగం శరీరంతో వికారంగా కనిపిస్తున్న ఏక్‌టాంగ్‌ను చూసి వాళ్లు నవ్వులాటలతో అవహేళన చేస్తారు విదప గోపికలు కడవలలో నీళ్లు నింపుకొని వెళ్లు తుండగా బాలుడు తన ధనుర్బాణములను ప్రయోగించి, వాళ్లను అమాంతంగా లేపుక వెళ్లి శ్రీ కృష్ణునిముందు వివస్త్రలుగా పడునట్లు చేస్తాడు వాళ్లను చూసి శ్రీ కృష్ణుడు ఉగ్రుడై బెంగుతాడు. వాళ్లకు మళ్లీ కట్టుకోవడానికి బట్టలు ఇచ్చి వాళ్ల ద్వారా సంగతి తెలిసికొని బావివద్దకు బయలుదేరి వస్తాడు. తన గోపికలను అవమానించినందు లకు శ్రీ కృష్ణుడు బాలునితో యుద్ధానికి తలపడుతాడు ఇద్దరికీ ఘోరమైన యుద్ధం జరుగుతుంది బాలుడు శ్రీ కృష్ణునిపై అగ్ని బాణం వదులుతాడు శ్రీ కృష్ణుడు మేఘ బాణం వదిలి దాన్ని ఆర్పివేస్తాడు బాలుడు వాయు బాణంవదలి మేఘాల్ని చెల్లా చెదురు చేసేస్తాడు శ్రీ కృష్ణుడు సర్పబాణం వదిలి వాయువును భక్షింపజేస్తాడు. బాలుడు గరుడబాణం వదలి సర్పాన్ని మింగజేస్తాడు. గరుడుడు తనకు వాహనమే కనుక శ్రీ కృష్ణుడు ఏమీ చేయజాలక నిశ్చేష్టితుడవుతాడు ఇంతలో మళ్లీ బాలుడు శైల బాణం వదలి శ్రీ కృష్ణుని బంధించి వేస్తాడు. వెంటనే బాలుడు శ్రీ కృష్ణుని కంఠముపై కత్తిపెట్టి తనకీ వికారమైన రూపం ఎందుకు వచ్చిందో తెలుపకుంటే అతని తల నరికివేస్తానని బెదిరిస్తాడు. అప్పుడు శ్రీ కృష్ణుడు తన దివ్యదృష్టితో ఈతడు సుభద్ర కుమారుడని గ్రహించి, తన కంఠం నరకకుండా మానివేస్తే బాలునికి సుందర మైన శరీరాన్ని ప్రసాదిస్తానని వాగ్దానం చేస్తాడు. బాలుడు శ్రీ కృష్ణుని తల నరక కుండా వదిలివేస్తాడు. చేసిన వాగ్దానం ప్రకారం శ్రీ కృష్ణుడు బాలునికి సుందరమైన శరీరాన్ని ప్రసాదిస్తాడు ఏక్‌టాంగ్ అనే పేరు మార్చివేసి తన అభిమానమును కాపాడినవాడు కనుక అభిమన్యుడనే నామకరణం చేస్తాడు. కాని పద్మవ్యూహం నుండి బయటపడే విద్యను మాత్రం చెప్పకుండానే వదిలివేస్తాడు. ఈ విధంగా అభి మన్యుడు సుందరాకారుడై శ్రీ కృష్ణునితో సెలవు తీసుకొని, అతని అనుగ్రహంపొంది తిరిగి తన హస్తినాపురం చేరుకుంటాడు. తన తల్లి సుభద్రతోనూ, కుంతీదేవితోనూ కలిసి సుఖంగా ఉంటాడు.

# ౧౪. అర్జున వనవాస కథ

ద్రౌపదిని వివాహ మాడిన పిదప పంచపాండవులు హస్తినాపురానికి వచ్చి తల్లి ఆజ్ఞ ప్రకారం ఆమెను తమ ఐదుగురికీ భార్యగా స్వీకరించి రాజ్యమేలుతుంటారు వీళ్ల కొక నియమ మంటూ లేకుంటే వీళ్లలో వీళ్లకే అసూయలూ, తగాదాలూ కలుగుతాయన్న ఉద్దేశంతో నారదుడూ శ్రీ కృష్ణుడూ కలిసి వీళ్లకు కొన్ని నియమాలు ఏర్పాటు చేస్తారు ద్రౌపది ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్కరివద్ద భార్యగా ఉంటుందనీ, ఆ సమయంలో ఇతర సోదరులెవ్వరూ వారి ఏకాంత ప్రదేశానికి వెళ్లకూడదనీ అట్లా వెళ్లితే ఒక సంవత్సరం వనవాసం చేసిరావాలనీ కట్టడి చేస్తారు ఒకనాడు అర్జునుడు ఉదయమేలేచి మామూలుప్రకారం వ్యాయామంచేసి గంగకు స్నానం చేయడానికి వెళ్లతాడు గంగా తీరంలో తన ధనుర్బాణములను ఉంచి గంగలోదిగి స్నానంచేస్తుంటాడు. అప్పుడాతడు తన మదిలో ఈ ప్రపంచంలో తనకు ఎదురు నిలువగలిగిన వారెవరూ లేరనీ తనకు సకల దేశాధీశులంతా వెన్ను చూపించి పారిపోయిన వారేననీ తాను మాత్రం ఎన్నడూ ఎవ్వరికీ వెన్ను చూపించినవాడు కాదనీ గర్వపడుతుంటాడు. ఇది వెంటనే ద్వారకలో ఉన్న శ్రీ కృష్ణుడు గ్రహిస్తాడు. ఆతడు మాయను ప్రయోగించి గంగా తీరంలో ఉన్న ఆతని ధనుర్బాణములను చాలా తేలికగా మారుస్తాడు. అర్జునుడు స్నానం చేసివచ్చి తీరంపై వదిలిన తన ధనుర్బాణములను లేపగా అవి దూదికన్న తేలికగా ఉంటాయి. అందుకు ఆశ్చర్యపడి దీనికి కారణ మడుగవలెనని భావించి ధర్మరాజువద్దకు వస్తాడు అప్పుడు ధర్మరాజు ద్రౌపదితో కలిసి ఏకాంతంలో ఉంటాడు. వెంటనే అర్జునుడు తన పొరపాటును గ్రహించి తల వంచుకొని వెనుదిరిగి పోతుంటాడు. ఐనా ధర్మరాజు అర్జునుని పిలిచి ఆతని రాకకు కారణమేమిటని అడుగుతాడు అర్జునుడు జరిగిన సంగతిని వివరించగా శ్రీ కృష్ణునివద్దకు వెళ్లి సందేహనివృత్తి చేసుకోవలసిందిగా అర్జునునికి ధర్మరాజు సలహా ఇస్తాడు తన ధనుర్బాణములు తేలికగా మారడం, ధర్మరాజు ద్రౌపదితో ఏకాంతంగా ఉన్నప్పుడు వాళ్ల మందిరంలో ప్రవేశించడం ఈ రెండు వైపరీత్యాలు జరిగినందుకు అర్జునుడు దిగులుపడుతూ శ్రీ కృష్ణుని వద్దకు వెళ్లతాడు. జరిగిన రెండు సంఘటనల గురించీ వివరించి పాప నివృత్తికోసం మార్గం చూపించవలసిందిగా ప్రార్థిస్తాడు.

అప్పుడు శ్రీ కృష్ణుడు ఒక సొరకాయ బుర్రను అర్జునుని చేతికిచ్చి వనవాసం చేయవలసిందిగా ఆజ్ఞాపిస్తాడు. అతనికి దప్పి కలిగినప్పుడల్లా దానితో మాత్రమే నీళ్ల తాగాలనీ దానిలోని నీళ్లతో మాత్రమే వంట చేసుకోవాలనీ కఠినమైన నియమం విధిస్తాడు. దానిలోని నీరు తీయగా మారినప్పుడు తన పాపం పరిహరింపబడిందిగా గ్రహించి తిరిగి రావచ్చునని తెలిపి వనవాసానికి పంపిస్తాడు. ఈ బుర్రను తీసుకొని అర్జునుడు వనవాసానికి వెళ్లి శిక్షను అనుభవిస్తుంటాడు. అందులోని నీళ్ల ఎప్పుడు తాగినా భరింపరాని చేదుగా ఉంటాయి. అర్జునుడు ఆ నీళ్లను తాగలేక ఎంతో బాధ పడుతుంటాడు. నానా యాతనలు పడుతూ అడవుల్లో తిరుగుతుంటాడు. ఇట్లా ఉంటూ ఉండగా మరొకవైపు ఒక మహారణ్యంలో "గంగాచల్ని" అనే ఒక దేవతాస్త్రీ శంకరుని గురించి తపస్సు చేస్తుంది ఈమె అల్లీపుష్పంనుండి పుడుతుంది. ఈమె తపస్సుకు మెచ్చి శంకరుడు ప్రత్యక్షమై ఏమికావాలో కోరుకొమ్మంటాడు ఆమె రెండు వరాలు కోరుకుంటుంది. ఒకటి- ప్రపంచంలోఉన్న రాజాధిరాజులంతా తనకు లొంగిపోవాలనీ, రెండవది- సముద్రపు దిబ్బమీద గిరగిర తిరిగే ఒక ఎత్తైన దుర్గాన్ని నిర్మించి తన కివ్వాలనీ కోరుకుంటుంది. శంకరుడు ఈ రెండు వరాలూ ఇచ్చి ఆమెకు ఎప్పుడు కష్టాలు వచ్చినా తలచుకున్నంత మాత్రాన ప్రత్యక్ష మవుతానని చెప్పుతాడు. ఐతే ఈ ప్రపంచంలో మిక్కిలి బలవంతులైన రాజు లెవ్వరని గంగాచల్ని శంకరున్ని ప్రశ్నిస్తుంది. అలాంటి వాళ్లు ఇప్పుడు పంచపాండవులేనని శంకరుడు సమాధానమిస్తాడు. అంతేకాక వాళ్లకు ఎప్పుడూ శ్రీ కృష్ణుడు అండగా ఉంటాడని కూడ చెప్పి అంతర్ధానమవుతాడు అప్పుడు గంగాచల్ని పంచపాండవుల పేరుతో బొమ్మల్ని చేయించి తన కాళ్లకు కట్టు కుంటుంది. శ్రీ కృష్ణుని పేరుతో ఒక గంటను నడుముకు కట్టుకొని గిరగిర తిరిగే "భౌరగఢ్"అనే తన దుర్గంలో ఎదురులేని రాణిగా చలామణి అవుతూ నివసిస్తుంటుంది.

మరొకవైపు గంగాగిరి అనే అడవిలో ఒక గుడికట్టుకొని, అందులో గంగా గిరిబాబా నివసిస్తుంటాడు అతనికొక పెంపుడు కూతురుంటుంది. ఆమె పేరు గంగా బాయి. ఈమె చాలా అందగత్తె. తన పెంపుడు తండ్రికి పరిచర్యలుచేస్తూ అతని వల్ల సమస్త విద్యలూ నేర్చుకుంటుంది. వీళ్ల ఆశ్రమంలో ఒక మంచినీటి బావికూడ ఉంటుంది అటు అర్జునుడు వనవాసం చేస్తూ ఎక్కడికి వెళ్లినా సొరకాయలోని నీళ్ల తీపిగా మారనందున అతనికి జీవితం మీదనే విరక్తి కలుగుతుంది. తిరిగి తిరిగి ఈ గంగాగిరిబాబా ఉంటున్న ఆశ్రమానికి వచ్చి అక్కడి బావిలో పడి చనిపోవడానికి సిద్ధమై బావిచుట్టూ ప్రదక్షిణ చేస్తుంటాడు ఇంతలో లోపలినుండి గంగాబాయి వచ్చి చూచి బావిలో పడకుండా ఆపి అర్జునున్ని బాబావద్దకు తీసుక వెళ్లతుంది. అతడు

అర్జునుడని బాబా ఆమెకు ఎరుకపరుస్తాడు  ఆతనినే వివాహమాడుతానని ఆమె కోరగా బాబా ఆ ఇద్దరికీ వివాహం చేస్తాడు  ఆనాటి రాత్రి అర్జునుడు గంగాబాయితో సంభోగం చేసినప్పుడు గుర్తుకోసం ఆమె అర్జునుని చేతి ఉంగరాన్నీ, ఒక బాకునూ తీసుకుంటుంది  అంతేకాక అతనిచేత ఒక లేఖనుకూడ వ్రాయించుకుంటుంది. తెల్లవారి అర్జునుడు అక్కడి బావిలో మునిగి స్నానంచేసి సొరకాయ బుర్రలోని నీళ్లు తాగగా అవి తియగా మారుతాయి. అంతటితో తన శిక్షాకాలం ముగిసిందని భావించి అక్కడి నుంచి తానొక్కడే బయలుదేరి ద్వారక చేరుకుంటాడు. శ్రీ కృష్ణుని కలిసికొని జరిగిన కథనంతా తెలుపగా ఆతడు సంతసించి హస్తినాపురం సంగనంపుతాడు.

మరొక వైపు నారదుడు భూలోక సంచారం చేస్తూ గంగాచల్లి నివసించే భౌరగఢ్ చేరుకుంటాడు  అప్పుడామె నారదున్ని తగిన విధంగా సత్కరించి అర్ఘాసనంపై కూర్చుండబెడుతుంది. నారదుడు మాటల సందర్భంలో ఆమె కాళ్లకు కట్టుకున్న బొమ్మల గురించి ప్రశ్నిస్తాడు. అవి పంచపాండవుల బొమ్మలనీ నడుముకు వ్రేలాడుతున్న గంట శ్రీ కృష్ణుని సూచిస్తుందనీ ఆమె సమాధానం చెప్తుంది  వాళ్లను అట్లా అవమానించడం తగదని నారదుడు సలహాఇస్తాడు. ఆమె అహంకారంతో నారదుని మాటల్నికూడ లక్ష్యపెట్టదు. గంగాచల్లికి తగిన శాస్తి చేయాలని మనసులో భావించి నారదుడు అక్కడి నుండి బయలుదేరి ద్వారక చేరుకుంటాడు. ఆమె అహంకారం గురించి శ్రీ కృష్ణునికి వివరించి ఆమెకు గర్వభంగం చేయాలని కోరుతాడు. వెంటనే శ్రీ కృష్ణుడు హస్తినాపురానికి కబురంపి పాండవులనూ, వారి బంధుమిత్రులనూ పిలిపించుకుంటాడు. అందరూ కలిసి పెద్దఎత్తున బయలుదేరి సముద్రపు దిబ్బలోఉన్న భౌరగఢ్ చేరుకుంటారు. మొదట రావణాసురుని మనుమడు అనసోలే అనువాడు గంగాచల్లితో యుద్ధం చేస్తాడు  కాని ఆమె అతన్ని సునాయాసంగా ఓడించి తన ఇంట్లో పరిచర్యలు చేయడానికి నియమించుకుంటుంది. పిదప భీముడు యుద్ధానికి వెళ్లతాడు  దుర్గముచుట్టూ మైదాపిండితో కట్టబడిన కోట గోడల్ని కాళ్లతోనూ చేతులతోనూ కూల్చడానికి అతడు ప్రయత్నిస్తాడు, కాని భీముని కాళ్లు చేతులు మైదాపిండిలో ఇరుక్కుపోయి ఎటూ కదలలేక బొమ్మలా ఊగులాడుతుంటాడు. పిదప ఈతన్నికూడ తన ఇంట్లో పనీపాటలు చేయడంకోసం నియమించుకుంటుంది. తరువాత ఘటోత్కచుడు తాబేలు రూపం ధరించి భౌరగఢ్ కిందికి వెళ్లి తన బలంకొద్దీ దాన్ని లేపడానికి ప్రయత్నిస్తుంటాడు. అప్పుడు భౌరగఢ్ గిరగిర తిరగడం ఆగిపోతుంది. ఇది గమనించి తాబేలు రూపంలోఉన్న ఘటోత్కచున్ని గంగాచల్లి గొలుసుబాణంవేసి బంధింపజేస్తుంది అతన్ని తన ఇంట్లో ఊడిగం చేయడానికి నియమిస్తుంది. అటు పిదప బభ్రువాహనుడు

గండక తెరతో బయలుదేరుతాడు. అతడు కడు దీనంగా నటించి ఆమెను నమ్మించి, గండక తెరతో ఆమె కొప్పును కోసివేస్తాడు. అప్పుడాతని కపట నాటకాన్ని గుర్తించి అతన్నికూడ బంధించి తన ఇంట్లో పన్లు చేయ్యడానికి నియమిస్తుంది. చివరికి అర్జునుడే గంగాచల్లితో యుద్ధం చేయడానికి బయలుదేరుతాడు. కాలుకు కట్టుకున్న బొమ్మల్ని తీసివేయవలసిందిగా అర్జునుడు ఎంతచెప్పినప్పటికినీ ఆమె లక్ష్యపెట్టదు. ఇద్దరికీ ఘోర యుద్ధం జరుగుతుంది. అర్జునుడు నేల కూలినప్పుడల్లా శ్రీకృష్ణుడు రక్షిస్తుంటాడు. గంగాచల్లి నేల కూలినప్పుడల్లా శంకరుడు కాపాడుతుంటాడు. చివరికి శంకరుని సలహా ప్రకారం ఆమె వాయుబాణం వదలుతుంది. వెంటనే అర్జునుడు గిరగిర తిరుక్కుంటూ వెళ్ళి గంగాగిరిబాబా ఆశ్రమంలో కూలిపోతాడు. అప్పటికే గంగాబాయికి అర్జునుని వలన పుట్టిన కుమారుడు పెరిగి పెద్దవాడవుతాడు. అతనికి బత్తీసులక్ష్మణ అని నామకరణంచేసి గంగాగిరిబాబా సకలవిద్యలు నేర్పుతాడు. తమ ఆశ్రమ ప్రాంతంలో పడిన ఈ అర్జునుని తీసుకొని అతడు తన తల్లివద్దకు వెళ్లుతాడు ఆమె అతన్ని అర్జునునిగా గుర్తించి ఈ బాలుడు తమ కుమారుడేనని భర్తకు పరిచయం చేస్తుంది. ఇంతకుముందు గంగాబాయి ఆనవాలుకోసం తీసుకున్న ఉంగరం, బాకు, ఉత్తరం చూపించగా అర్జును డామెను తన భార్యగా విశ్వసిస్తాడు.

బాలుడు తన తల్లి దండ్రుల్ని వెంటబెట్టుకొని తన విద్యా మహిమలతో గంగాచల్లిని జయించడంకోసం బయలుదేరుతాడు ఈ బత్తీసులక్ష్మణ గంగాచల్లి వరం పొందేనాటికి పుట్టిఉండలేదు కనుక, సమస్త రాజులను జయించాలని ఆమె శంకరునివలన పొందిన వరం ఈతనికి వర్తించదు. అందువల్ల బత్తీసులక్షణ గంగాచల్లితో యుద్ధానికి దిగినప్పుడు శంకరుడిచ్చిన వరం ఎలాంటి ప్రభావాన్నీ ప్రదర్శించలేక పోతుంది. గంగాచల్లిని బత్తీసులక్ష్మణ సునాయాసంగా జయిస్తాడు. ఆమె ఇంట్లో ఊడిగంచేస్తూ పడిఉన్న పాండవుల బలగమునంతా విడిపిస్తాడు. తనతో యుద్ధంచేసి ఓడి పోయిన గంగాచల్లిని తన తల్లిగా గౌరవిస్తాడు. ఆమెకు గర్వభంగమై అర్జునుని వివాహ మాడుతుంది. అంతకుముందే అర్జునుడు గంగాచల్లితో పరాభవింపబడినందున అతని అహంకారమూ వదులుతుంది. ఇదంతా ఇట్లా జరగడానికి కారణం ఏమిటో శ్రీకృష్ణుడు వివరించి ఆశీర్వదిస్తాడు అర్జునుడు వినమ్రతతో శ్రీకృష్ణుని భజించి, తన ఇద్దరు భార్యలు- గంగాబాయి, గంగాచల్లిలతో, కుమారుడు బత్తీసులక్ష్మణతో బయలుదేరి హస్తినాపురం చేరుకుంటాడు . పిదప రాజ్యమేలుతూ- పాండవులు సుఖంగా ఉంటారు.

# ౧౫. అభిమన్యు స్వయంవర కథ

దుర్యోధనుడు తన తమ్ముళ్లతో కూడి ఢిల్లీని పరిపాలిస్తుంటాడు. పాండవులు వనవాస మనుభవిస్తుంటారు. హస్తినాపురంలో విదురునింట కుంతి, సుభద్ర, అభిమన్యుడూ ఉంటారు. ఒకనాడు నారదుడు లోకసంచారం చేస్తూ ఢిల్లీని పాలిస్తున్న కౌరవుల వద్దకు వెళ్లతాడు. ఆయనకు చాలాకాలం నుండి ఎక్కడా కలహం లభించనందున దానికోసం ఆలోచిస్తుంటాడు. దుర్యోధనాదులతో క్షేమసమాచారాలు మాట్లాడుతుండగా దుర్యోధనుని కుమారుడైన లక్ష్మణుడు నారదుని కంట బడుతాడు. అతని వివాహసంబంధం గుర్చి ప్రస్తావించగా, తనకు కాబోయే వియ్యంకుడు పొంచెకు వంద నాగళ్ల కట్టేవాడై ఉండాలని దుర్యోధను డంటాడు. అప్పుడు నారదుడు చిరునవ్వునవ్వి—కర్ణునితో కలిసి మీరు నూట ఒక్కరై ఉండి కూడా మీరుకట్టే వంద నాగళ్లను పంచితే తలకొక్క నాగలి కూడా రాదుకదా అని పరిహసిస్తాడు. ఐనా ఓపినంత వరకు అలాంటి సంబంధాన్ని వెతుకుతానని చెప్పి నారదు డక్కడినుండి బయలుదేరుతాడు కలహం సృష్టించడానికి వీలైన చోటు కోసం దివ్యదృష్టితో చూడగా నారదునికి బలరాముని కూతురు కనిపిస్తుంది. తన ఆశయం ఫలించడానికిది యోగ్యమైన ప్రదేశమని భావించి వెంటనే అతడు ద్వారక చేరుకుంటాడు. ముందుగా వ్రేపల్లెవాడకు వెళ్లి శ్రీకృష్ణుని కలిసి కుంటాడు బలరాముని కూతురు శశిరేఖను లక్ష్మణున కిచ్చి వివాహం చేస్తే సముచితంగా ఉంటుందని శ్రీకృష్ణునికి సలహా ఇస్తాడు. శ్రీకృష్ణుడు నారదుని సలహా నంగీకరించక ఆమెను అభిమన్యున కివ్వదలచినట్లు తెలుపుతాడు. పాండవులు అరణ్యంలో ఒక ప్రమాదానికి గురియై మృతి చెందినారనీ, ఇక అభిమన్యునితోటి సంబంధం ఏవిధంగానూ లాభదాయకం కాదనీ నారదుడు వాదిస్తాడు. పాండవులు మరణించినారన్న నారదుని మాటల్ని శ్రీకృష్ణుడు నమ్మజాలడు. ఎందుకంటే పాండవులు గనుక మరణిస్తే వాళ్లను తిరిగి శ్రీకృష్ణుడు బ్రతికించనైనా బ్రతికించాలి. లేదా వాళ్లతో పాటు అతడు కూడ తనువు చాలించవలసిన విధినిర్ణయమున్నది. శ్రీకృష్ణుడు పాండవుల్ని తిరిగి బ్రతికించలేని పక్షంలో—ధర్మరాజును తన రొమ్ము మీద, భీమున్ని నెత్తి మీద, అర్జునున్ని అరచేతిలో, నకులసహదేవుల్ని భుజములమీద నిలుపుకొని వాళ్లతో పాటు తాను కూడ కాలి చని పోవలసిన పూర్వనియమమున్నది.- అందు వల్ల వాస్తవాన్ని తెలిసికోవడం కోసం శ్రీకృష్ణుడు తన దివ్యదృష్టితో చూసి పాండవులు బ్రతికే ఉండి ఒక పొన్న చెట్టు కింద

విశ్రాంతి తీసుకుంటున్నట్లు గ్రహిస్తాడు. ఐతే నారదుని ఉద్దేశం గమనించి అతని మాటలు నమ్ముతున్నట్లే నటించి ఈ సంబంధానికి తన అన్నగారిని అంగీకరింప జేయ వలసిందిగా కోరుతాడు. నారదుడు బలరాముని వద్దకు వెళ్లి శ్రీకృష్ణుని తో చెప్పిన విధంగానే తన కూతురు శశిరేఖను లక్ష్మణున కివ్వవలసిందిగా కోరుతాడు. పాండవు లంతా గతించి పోయినారు కనుక ఇది శ్రీకృష్ణుని నిర్ణయమని కూడ అబద్ధాలు చెప్పి, బలరామునితో అంగీకరింప జేస్తాడు. లగ్న నిశ్చయం కూడ చేసుకొని నారదుడు తిరిగి ఢిల్లీకి వస్తాడు. అట దుర్యోధనాదులను కలిసికొని పాండవులు మృతి చెంది నారనీ, శశిరేఖను లక్ష్మణున కిచ్చి వివాహం జరిపించడానికి రామకృష్ణులు సంతోషంతో అంగీకరించినారనీ అబద్ధాలు చెప్పి వాళ్లను వివాహానికి సిద్ధం చేస్తాడు. కౌరవబలగ మంతా ద్వారకకు ప్రయాణమవుతుంది కలహబీజం నాటడానికిది తగిన సమయమని భావించి నారదుడు ఈ వివాహవార్త వెంటనే హస్తినాపురంలో ఉంటున్న అభిమన్యునికి తెలిసే మార్గం చూడాలనుకుంటాడు. తెల్లకొన్నంతో చేసిన అక్షింతల్ని పెండ్లిపిలుపుగా దుర్యోధనునిచేత విదురు నింటికి పంపిస్తాడు వెంటనే సుభద్ర, అభిమన్యుల కీ విషయం తెలుస్తుంది. సుభద్ర ఎంతో బాధపడుతుంది. అభిమన్యుడు శశిరేఖను సాధించి తీసుకరావడంకోసం సుభద్రనుకూడ తన రథంపై కూర్చుండబెట్టుకొని పౌరుషంతో ద్వారకకు బయలుదేరుతాడు. అంతకుముందే ఆ దారిలోనే కౌరవబలగమంతా వెళ్లి నందున వాళ్ల రథాలు గుర్రాల తొక్కిడికి భూమంతా కుంగిపోతుంది. గాడెములలో గుర్రాల మల మూత్రములు నిండి కంపుకొడుతుంటుంది. అందువల్ల అభిమన్యుడు తనకోసం మరొక మార్గాన్ని ఏర్పాటు చేయదలచుకొని మొదట గొడ్డలిబాణం వదలుతాడు. అది అతడు వెళ్లదలచుకున్న దారిలో ఉన్న చెట్లనన్నింటిని నరికి వేస్తుంది విదప అగ్ని బాణాన్ని వదలుతాడు. అది నరకబడిన చెట్లను కాల్చివేస్తుంది. విదప మేఘ బాణాన్ని వదలుతాడు. అది మంటల్ని ఆర్పివేస్తుంది. విదప వాయుబాణాన్ని వదలుతాడు అది ఆరిపోయిన బొగ్గుల్ని ద్వారకలో పడవేస్తుంది తరువాత అభి మన్యుడు పారబాణాన్ని వదలుతాడు. అది దారిలో ఎత్తుపల్లాలులేకుండా సమంగా చేస్తుంది. ఎప్పుడైతే ద్వారకలో బొగ్గులు పడుతాయో అప్పుడు అభిమన్యుడు శశిరేఖ కోసం బయలుదేరి వస్తున్నట్లు శ్రీ కృష్ణుడు గ్రహించి సంతోషిస్తాడు.

ఈ విధంగా అభిమన్యుడు కొత్త మార్గం నిర్మించుకొని, ఆ దారివెంట రథాన్ని తోలుకుంటూ ద్వారకకు వస్తుంటాడు. దారిలో ఘటోత్కచుడు ఏలుతున్న ప్రాంతం చేరుకుంటాడు. ఆ ప్రాంతాన్ని కాపలా కాస్తున్న 'బలి'అనే రాక్షసుని తలనరికి తన రథంపై జండావలె కట్టుకొని ముందుకు సాగిపోతుంటాడు. దారిలో ఘటోత్కచుని

ఆరుగురు రాక్షసభటులు ఎదురై అభిమన్యునితో తగవులాడుతారు. క్షత్తెరబాణం వదలి అభిమన్యుడు వాళ్ళ ముక్కు చెవుల్ని కత్తిరించి వేస్తాడు. వీళ్ళు ఘటోత్కచుని వద్దకు పారిపోతుండగా వీళ్ళ భార్యలు చూచి ఆగ్రహించి అభిమన్యుని తుదముట్టించడానికి బయలుదేరుతారు. వాళ్ళ చెరువులలోని నీళ్ళన్నీ తాగి వాటిని వరదలుగా ఈతనిపై చిమ్ముతుంటారు. అదంతా మహాప్రవాహంగా మారి అభిమన్యుగందులో కొట్టుకపోయే విధంగా జేస్తారు. అప్పుడు అభిమన్యుడు ముద్దెరబాణం వదలి రాక్షసస్త్రీల నవరంధ్రాల్ని మూసి వేస్తాడు. ఈ అల్లరి అంతా ఘటోత్కచునికి తెలుస్తుంది. అప్పుడాతడు పన్నెండు పుట్ల దూదితో నేసిన దుప్పటి కప్పుకొని, పర్వతమంతటి స్థూలకాయంకలిగి మహా భయంకరంగా ఉంటాడు. అతడు అభిమన్యుని మీదికి యుద్ధానికి బయలుదేరుతాడు. కుమారునికి ఏ ప్రమాదం వాటిల్లుతుందోనని హిడింబ భయపడుతుంది. అప్పుడు ఘటోత్కచుడు ఆమెకు ధైర్యం చెప్పి, తాను మరణిస్తే కొన్ని విపరీతాలు జరుగుతాయని ఆనవాళ్ళుకూడ వివరిస్తాడు. ఏ జిల్లేడు చెట్టుకైతే హిడింబ ఊయలం కట్టబడిందో, ఆ జిల్లేడు చెట్టు ఎండిపోతాయనీ, దాపునఉన్న చెరువులోని నీటిని హిడింబ పీల్చి వదలితే రక్తంగా ప్రవహిస్తుందనీ, ఆమె ఒక స్తనంనుండి రక్తమూ, మరొక స్తనంనుండి నీళ్ళూ ధారలు కడుతాయనీ తన మరణానికి ఆనవాళ్ళుగా చెప్పి ఘటోత్కచుడు వెళ్ళిపోతాడు. పిదప అభిమన్యునికి ఘటోత్కచునికీ ఘోర యుద్ధం జరుగుతుంది. అభిమన్యుడు నేలకూలుతాడు. సుభద్ర పుత్రశోకంతో శ్రీకృష్ణ పరమాత్ముని ధ్యానించుకుంటుంది. శ్రీకృష్ణుడు వాయుదేవునితో అమృతంపంపిస్తాడు. వాయుదేవుడు అభిమన్యుని నోట్లో అమృతం పోస్తున్నప్పుడు గాలికి ఎగిరివచ్చి కొంత సుభద్ర కండ్లలోకూడ పడుతుంది. అభిమన్యుడు వెంటనే లేచి ఒక చెట్టుకింద విశ్రమిస్తున్న ఘటోత్కచునితో మళ్ళీ తలపడుతాడు. ఘటోత్కచుని ముందు అభిమన్యుడు ఒక చీమవలె ఉండి అతనికి దొరకకుండా సందుల్లోనుంచిదూరి తప్పించుక పోతుంటాడు. అభిమన్యుడు చాకచక్యంతో ఘటోత్కచుని కేశములు పట్టుకొని పైకిప్రాకి అతనితలపై బలంగా కొట్టగా ఘటోత్కచుడు నేలకూలి మరణిస్తాడు. అతనికోసం విలపిస్తూ వచ్చే బంధువు లెవరైఉంటారో చూద్దామని సుభద్ర అభిమన్యులు రథంపై కూర్చుండి కుతూహలంతో చూస్తుంటారు. ఇంతలో అక్కడ హిడింబకు ఇదివరకు తెలిపిన ఆనవాళ్ళన్నీ నిజమవుతాయి. ఆమె తన కుమారుని కేదో కీడుమూడిందని గ్రహించి, పరుగెత్తుకొని వచ్చి కుమారుని మృతదేహంపైబడి పాండవుల్ని భీమున్ని తలచుకుంటూ విలపిస్తుంది. పాండవుల ప్రస్తావన విన్నంతనే సుభద్ర అభిమన్యులు ఆశ్చర్యంతో పరుగు పరుగున వచ్చి హిడింబను కలిసికుంటారు. వాస్తవాన్ని అడిగి తెలిసికొని ఆమెను హిడింబగానూ, అతన్ని ఘటోత్కచునిగానూ గ్రహించి, జరిగినదానికి విచారిస్తుంటారు. కాని ఇంతకు

ముందే వాయుదేవుని ప్రభావంతో సుభద్ర కంటిలోపడిన అమృతంతో ఘటోత్కచుని బ్రతికించుకుంటారు. అనుకోకుండా ఆత్మీయులు కలిసికున్నందుకు సంతోషిస్తారు. శశిరేఖను సాధించడం కోసం అభిమన్యునికి సహాయం చేయడానికి ఘటోత్కచుడుకూడా తన రాక్షస బలగంతో బయలుదేరుతాడు. అంతా కలిసి ద్వారక చేరి తూర్పువైపున ఉన్న ఒక లేతమామిడి తోటలో దిగుతారు. అంతకుముందే కౌరవులంతా ద్వారక చేరి పడమటి వైపు తోటలో విడిదిచేస్తారు. ఘటోత్కచుడు మాయాబలంతో తన రాక్షసులందరినీ అందమైన ఆభరణాలుగా, ఆయుధాలుగా రథగజ తురగాలుగా మారుస్తాడు. కౌరవులంతా తమతమ పాత వస్తువులన్నీ ఇచ్చి, ఆకర్షణీయంగా కనిపించే ఈ కొత్త వస్తువుల్ని కొనుక్కపోతారు. అంటే కౌరవుల ఆభరణాలూ ఆయుధాలూ, వాహనాలన్నీ అభిమన్యుని శిబిరం చేరుకుంటాయి. ఘటోత్కచుని రాక్షసులంతా అందమైన ఆభరణాలూ, ఆయుదాలూ, వాహనాల రూపంలో కౌరవుల విడిది చేరుకుంటారు.

మరొకవైపు ఘటోత్కచుడు తన మాయాబలంతో దాసీదాని వేషంవేసుకొని బలరాముని భార్య రేవతి వద్దకు వెళ్లుతాడు. దుర్యోధనుని భార్య అయిన భానుమతి శశిరేఖను చూడదలచి ఆమెను తీసుకరావలసిందిగా తననిక్కడికి పంపించిందని నమ్మబలుకుతాడు. ఈ మాటలు నమ్మి రేవతి దాసీవేషంలో ఉన్న ఘటోత్కచునివెంట శశిరేఖను పంపిస్తుంది. ఘటోత్కచుడు శశిరేఖను తీసుకవెళ్లి అభిమన్యున కప్పగిస్తాడు. తానేమో శశిరేఖ రూపం ధరించివచ్చి రేవతిని కలిసి అంతఃపురంలో ఉంటాడు. ముహూర్త మాసన్నం కాగానే మాయా శశిరేఖను కళ్యాణమంటపానికి తీసుకవస్తారు. వివాహవేదికపై లగ్నం జరుగుతుంటుంది. వధూవరులు ఒకరిపైనొకరు తలంబ్రాలు పోసుకునే సమయంలో శశిరేఖ రూపంలో ఉన్న ఘటోత్కచుడు లక్ష్మణునిపై తలంబ్రాలకు మారుగా పలుగు రాళ్లు పోస్తుంటాడు. లక్ష్మణుడు బాధతో అరుస్తాడు. ఐనా అక్కడ ఉన్నవాళ్లందరికి పలుగురాళ్లు తలంబ్రాలుగానే కనిపిస్తుంటాయి. కనుక పెండ్లికుమారున కేదో దుష్టగ్రహం సోకిందని కౌరవులంతా భావిస్తారు. తొందరగా వివాహం ముగించుకొని తమ విడిది చేరుకుంటారు.

ఈ వివాహ మహోత్సవానికి హాజరై తమాషా చూద్దామని వచ్చిన నారదునికి ఘటోత్కచుని మహిమలేవీ తెలియక, తానాశించినట్లుగా కలహం పుట్టనందుకు విచారిస్తూ- "కుక్కకునేయి ఇముడదనుకుంటే ఇముడేకాలం వచ్చిందికదా" అని బాధపడుతుంటాడు. ఇది ఘటోత్కచుడు వింటాడు. వెంటనే ఆతడు నారదునిపై కోపంతో చేయి విసరగా ఆ దెబ్బతో నారదుడు ఊరవతల ఒక మడుగులో పడుతాడు. అప్పుడు నారదుడు

ఈతదెవ్వడా అని ఆశ్చర్యపడి తన దివ్యదృష్టితో జరిగినదంతా తెలిసికొని సంతసిస్తాడు. తరువాత ఘటోత్కచుడు కౌరవుల విడిదిలో విలువైన వస్తువుల రూపంలో ఉన్న తన రాక్షసబలగాన్నంతా ఎప్పటి మాదిరిగా మార్చివేస్తాడు. తక్షణమే వాళ్లు తమ నిజరూపాలు ధరించి కౌరవ సైన్యాన్నంతా మింగివేస్తారు. ఐతే కౌరవుల్ని కనుక హతమారుస్తే ఈ వివాహ శుభ సమయంలో పాండవులకు సూతకం వస్తుందన్న ఉద్దేశంతో వాళ్లను వదలివేయవలసిందగా ఘటోత్కచుడు ఆజ్ఞాపిస్తాడు. అప్పుడు అభిమన్యుడు వాయు బాణం వదలగా కౌరవులంతా ఢిల్లీలో విసిరి వేయబడుతారు.

పిదప అభిమన్యుడు శ్రీ కృష్ణుని అభిమతంతో శశిరేఖను వివాహమాడి బల రామ కృష్ణుల ఆశీస్సులు పొందుతాడు. ఘటోత్కచుడు తోడురాగా సుభద్ర, శశిరేఖలతో అభిమన్యుడు హస్తినాపురం చేరి సుఖంగా ఉంటాడు.

ACC. 96147



SRI P. S. N. RAJU

DR. PERVARAM JAGANNADHAM

# Aare Janapada Gathalu

Compiled & Edited by

**DR. PERVARAM JAGANNADHAM**

**Price Rs. 40/-**